సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 6.50

సంపుటి: 18
సంచిక: 209

సోమవారం 20-10-2025

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



'నేను కలలుగన్న మరో ప్రపంచానికి మహిళలే మూలస్తంభాలు'

నా చిరునవ్వే అమ్మకు వెలుగు

లవ్.. లైట్స్.. డైరెక్షన్

- వివరాలు IIలో

సన్నిధి



గోరంత దీపం జగమంత వెలుగు

భారతీయులందరూ అత్యంత ఆనందోత్సాహాలతో జరుపుకునే ముఖ్యమైన పండుగలలో ఒకటి దీపావళి.

మన మహర్షులు ఏర్పరచిన పండుగలన్నీ ఆధ్యాత్మిక, సాంస్కృతిక విలువలు కలిగి, ఆచార వ్యవహారాలతో కలిసి ఉంటాయి. ఈ పండుగల వెనుక అపారమైన శాస్త్రీయత, సమాజానికి హితకరమైన అంశాలు అనేకం దాగి ఉంటాయి. కాలంలో వచ్చే మార్పులతోపాటు, ఖగోళంలో వచ్చే మార్పులను కూడా ఆధారంగా చేసుకుని మన మహర్షులు మనకు ప్రతి నెలలోనూ పండుగలను నిర్దేశించారు. అలా మన సంస్కృతికి, సంప్రదాయాలకు, నాగరికతకు, మానవతా విలువలకు ప్రతీకగా మారింది దీపావళి పండుగ. నేటి కాలంలో ప్రపంచ దేశాలలో ఎందరో దీపావళి పండుగను జరుపుకుంటున్నారు. అమెరికాలో వైట్‌హౌస్‌లో కూడా దీపావళి నాడు దీపాలు వెలిగిస్తున్నారు.

ధనత్రయోదశి, నరక చతుర్దశి, దీపావళి, బలి పాడ్యమి, భగినీ హస్త భోజనం అని, తరువాత నాగుల చవితి, నాగ పంచమి అని – ఇన్ని రోజులు పండుగ చేసుకుంటాము.

దీపావళి పండుగనాడు సూర్యోదయానికి ముందే అభ్యంగన స్నానమాచరించి, పితృ తర్పణాలివ్వటం, దానం చెయ్యటం, వత్తులు వేసి, నూనె దీపాలను వెలిగించటం, ఆకాశ దీపం పెట్టటం చేస్తాం. ఆకాశదీపం పెట్టడం వల్ల దూరప్రాంతాల వారికి కూడా ఈ దీప దర్శనమవుతుంది. దాని వెలుగు మార్గ దర్శనం చేస్తుంది.

మనం ప్రతిరోజు ఉభయ సంధ్యలలోను మన ఇంట్లో దీపం వెలిగిస్తాము. దీపాన్ని, దీప జ్యోతిని ఆరాధిస్తాం. ఏ శుభకార్యాలు చేసినా, ఏ వేడుకలు జరిగేటప్పుడు అయినా ముందుగా దీప ప్రజ్వలన చేసి, అప్పుడు ఆ కార్యక్రమాన్ని ప్రారంభిస్తాము. వివాహాలు కూడా అగ్నిసాక్షిగా చేసుకుంటాం, అంటే దీపం, దీపంలో ఉన్న దేవతలు మన ప్రతి కర్మకు సాక్షిభూతులుగా ఉంటారన్నమాట. వారు మనల్ని అనుగ్రహిస్తారు. కనుక దీపం వెలిగించటం అన్నది అత్యంత ప్రధానమైనదని అందరికీ తెలియజేయటానికి, అందరూ దీపాలు వెలిగించేలా చేయడానికి దీపావళి పండగను మన మహర్షులు ఏర్పాటు చేశారు.

దీపం సాక్షాత్తూ పరబ్రహ్మ స్వరూపం

ఆశ్వయుజ బహుళ అమావాస్యకు ముందు మూడు రోజుల నుంచి ఇంటి ముందు దీపాలు పెట్టటం ప్రారంభిస్తాం. అలా వెలిగించడం ప్రారంభించిన ఈ దీపాలను కార్తీక మాసమంతా వెలిగిస్తాం

దీపాల కథ

పూర్వం హిరణ్యాక్షుడనే రాక్షసుడు దేవతలను, ధర్మాత్ములైన మానవులను హింసిస్తూ, యావద్భూమండలాన్ని క్షోభిల్లజేస్తుంటే, శ్రీమన్నారాయణుడు వరాహావతారంలో వచ్చి హిరణ్యాక్షుడిని సంహరించాడు, భూమాతను రక్షించాడు. ఆ సమయంలో భూదేవి తనకొక కుమారుడిని ప్రసాదించమని స్వామిని ప్రార్థిస్తుంది. వారి సంతానమే నరకాసురుడు. స్వామి రాక్షస సంహారం కోసం అవతరించిన తరుణంలో భూమాతకి కలిగిన పుత్రుడు కనుక, నరకుడు తమోగుణ భరితుడై రాక్షసుడయ్యాడు. అతడు బ్రహ్మదేవుని గురించి ఘోరమైన తపస్సు చేసి, మరణం లేకుండా వరం కోరాడు. బ్రహ్మదేవుడు అది సాధ్యం కాదని అంటే, 'కన్నతల్లి బిడ్డలను పారపాటున కూడా చంపదు కదా' అని ఆలోచించి, 'నాకు మా అమ్మ చేతిలో తప్ప మరణం లేకుండా వరం ఇవ్వండి' అని కోరాడు. బ్రహ్మదేవుడు తథాస్తు అన్నాడు. ఇంక తనకు చావే లేదనే భ్రమతో నరకుడు లోకకంటకుడై వేద సంస్కృతిని వ్యతిరేకిస్తూ, యజ్ఞయాగాదులు జరగకుండా అడ్డుకుంటూ, బ్రాహ్మణులను బాధిస్తూ రావణాసురుని వలె పరస్త్రీ వ్యామోహంతో 16 వేల మంది స్త్రీలను బంధించాడు. దుష్ట శిక్షణ కోసం పరమాత్మ శ్రీ కృష్ణునిగా అవతరించాడు. భూదేవి సత్యభామగా అవతరించింది. తన తల్లి అయిన సత్యభామ వదిలిన బాణాహతితో నరకుడు మృతి చెందాడు. శ్రీకృష్ణ పరమాత్మ నరకుని స్మృతిగా ఆ అమావాస్య నాడు దీపాలను వెలిగించి పండుగ చేసుకోవాలని నిర్దేశించాడు. నరకుని చెరలో ఉన్న 16,000 మంది స్త్రీలను విడిపించటమే కాక, నరకుని హస్తగతమైన ధనలక్ష్మిని విడిపించి, తన పాంచజన్య శంఖంతో, కామధేను క్షీరంతో, చతుస్సాగర జలాలతో ధనలక్ష్మికి ఈ రోజునే సామ్రాజ్య పట్టాభిషేకం చేశాడు. కనుకనే దీపావళి రోజున ప్రదోషకాలంలో లక్ష్మీపూజ చేయాలి అని శాస్త్రం చెప్తోంది. నరకుడు చనిపోయిన రోజును నరక చతుర్దశిగాను, ఆ మరునాడు అమావాస్యను దీపావళి గాను పండుగ చేసుకుంటున్నాము. నరకాసురుడి పీడ వదలగానే ప్రజలందరూ మంగళ వాద్యాలు మోగించి సత్యభామా శ్రీ కృష్ణులకు స్వాగతం చెప్పారు. ఆ మంగళ ధ్వనులే నేటికీ బాణసంచా రూపంలో ప్రతిధ్వనిస్తున్నాయి.

కొన్ని ప్రాంతాలలో బాణసంచా కాల్చి ఇంట్లోకి వచ్చాక, ఆడవాళ్ళందరూ కలిసి చేటలు, పళ్ళాలు వాయిస్తారు. అది దరిద్ర దేవతను తరిమి వేయటమన్న మాట. దీనిని 'అలక్ష్మీ నిస్సరణము' అంటారు.

శ్రీమహావిష్ణువు వామనావతారంలో బలి చక్రవర్తిని పాతాళ లోకానికి అణగ దొక్కి సుతల రాజ్యాధిపతిని చేసినందుకుగాను ఈ అమావాస్యను దీపావళిగా జరుపుకుంటారనీ, శ్రీరామచంద్రుడు రావణాసురుడిని వధించి శ్రీ సీతాలక్ష్మణ ఆంజనేయాదులతో అయోధ్యకేతెంచి, పట్టాభిషిక్తుడైనదీవేళే కనుక ఈ రోజును దీపావళిగా జరుపుకుంటారని, శ్రీ కృష్ణుడు సత్యభామా సమేతుడై నరకుని వధించిన సందర్భంగా ప్రజలు దీపావళి జరుపుకుంటున్నారని, కృతయుగం, త్రేతాయుగం, ద్వాపర యుగాలకు సంబంధించిన కథలు ప్రచారంలో ఉన్నాయి. ఇంకా, పంచపాండవులు వనవాస, అజ్ఞాతవాసాలు పూర్తి చేసుకుని విజయవంతులై తిరిగి వచ్చినందుకు ఆనందంతో ప్రజలు దీపావళి జరుపుతున్నారని కూడా ప్రచారంలో ఉంది. ఆదిపరాశక్తి శుంభ నిశుంభులనే రాక్షసులను సంహరించినందుకు ఆనందంతో వెలిగించిన జ్యోతులే దీపావళి అని కూడా ప్రచారంలో ఉంది. ఇవేకాక, క్షీరసాగర సముద్భూత అయిన శ్రీ మహాలక్ష్మి శ్రీమన్నారాయణుడిని వరించినందుకు దేవతలు, మానవులు, అందరూ ఆనందోత్సాహాలతో దీపావళిని జరుపుకుంటున్నారు అని కూడా చెప్తారు.

ఎలా జరుపు కోవాలంటే..?

దీపావళి నాడు పితృదేవతలు సాయం సంధ్యా సమయాన ఆకాశంలో దక్షిణ దిక్కుగా వచ్చి, తమ సంతానాల గృహాలను సందర్శిస్తారట. వారికి దారి కనిపించటం కోసమే దివ్వెలు కొట్టే సంప్రదాయం ఏర్పడింది. ఇంట్లోని పెద్దవారు పిల్లలతో ఈ దివిటీలను కొట్టిస్తారు. పొడుగాటి గోగు కాడలకు నూనెతో తడిపిన బట్ట వత్తులు కట్టి, వాటిని పిల్లల చేతులకిచ్చి, వారిని వీధి గుమ్మం ముందు నిలబెట్టి దివిటీలను వెలిగించి, ఆకాశంలో దక్షిణం వైపుకి చూపిస్తూ గుండ్రంగా మూడుసార్లు తిప్పి, నేలకు వేసి కొట్టిస్తూ, 'దుబ్బు దుబ్బు దీపావళి, మళ్ళీ వచ్చే నాగుల చవితి' అని అనిపిస్తారు. ఆ తరువాత ఆ కాడలను ఒకపక్కగా పడేస్తారు. పిల్లల కాళ్లు చేతులు కడిగి, కళ్ళు తడిచేతితో తుడిచి, నోరు పుక్కిలించి శుభ్రం చేసుకోమని, తరువాత ఆ పిల్లలచేత మిఠాయిలు తినిపిస్తారు.

తరువాత ఇంటిల్లిపాది టపాకాయలు కాల్చడం ప్రారంభిస్తారు. బాణసంచా కాల్చటం లాంటి సంబరాలు పూర్తయ్యాక, అర్ధ రాత్రి దాటాక, ఇళ్ళు వాకిళ్ళను తుడిపించుకోవాలని ధర్మ శాస్త్రం చెప్తోంది.

– డా. సోమంచి (తంగిరాల) విశాలాక్షి,
విశ్రాంత సంస్కృతాచార్య

ఈసారి రికార్డ్ బ్రేక్ కావాల్సిందే!

గత సంవత్సరం అక్టోబర్‌లో అయోధ్యలో 25.12 లక్షల దీపాలను వెలిగించి ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం గిన్నిస్ వరల్డ్ రికార్డ్‌ను సెట్ చేసింది. తాజాగా...28 లక్షల దీపాలను వెలిగించి తన రికార్డ్‌ను తానే బ్రేక్ చేయాలనుకుంటోంది.

వారణాసిలో దేవతల దీపావళి

దీపావళి తరువాత పదిహేను రోజులకు వారణాసిలో దేవ దీపావళిని జరుపుకుంటారు. కార్తిక పూర్ణిమ రాత్రి గంగానది వెంబడి ఉన్న ఘాట్లు లక్షలాది దీపాలతో వెలుగుతాయి. ఆ వెలుగుల ప్రతిబింబాలు నదిలో అందమైన చిత్రాలను ఆవిష్కరిస్తాయి. గంగానదిలో స్నానం చేయడానికి దేవతలు భూమి మీదికి దిగి వచ్చిన రోజుగా ఈ రోజును జరుపుకుంటారు.

దీపావళి పూట... శివాజీ కోట!

దీపావళి సీజన్‌లో మహారాష్ట్రలోని చాలా ప్రాంతాల్లో శివాజీ పాలించిన కోటకు ప్రతిరూపంగా మట్టికోటలను తయారుచేయడం అనేది ఆచారం. ఈ కోటను నిర్మించే క్రమంలో బురదలో విత్తనాలు నాటుతారు. కోట చుట్టూ పచ్చదనం ఉండేలా చేస్తారు. రాత్రివేళల్లో ఈ మట్టి కోటపై చిన్న చిన్న దీపాలను వెలిగిస్తారు.

దేవతలకు స్వాగతం

జార్ఖండ్‌లో దీపావళి పండగ సందర్భంగా సోహ్రై వేడుకను జరుపుకుంటారు. ఈ వేడుకలో భాగంగా దేవతలను స్వాగతించడానికి ఘరోండాలు (మట్టి బొమ్మల ఇళ్ళు) తయారుచేస్తారు. లక్ష్మీ దేవిని స్వాగతించడానికి అగరువత్తులు కాల్చుతారు. సోహ్రై వేడుకలలో పశువులకు స్నానం చేయించి పూజలు చేస్తారు.

పేడ పూసుకుని వేడుక చేసుకుంటారు!

కర్నాటక, తమిళనాడు సరిహద్దులలోని గుమతాపుర గ్రామంలో దీపావళి ముగింపును పురస్కరించుకొని 'గోరెహబ్బ' వేడుక జరుపుకుంటారు. ఈ వేడుకలో భాగంగా మగవాళ్లు ఆవు పేడను ఒకరిపై ఒకరు విసురుకుంటారు. ఆడవాళ్లు ఒంటికి రాసుకుంటారు. ఆవుపేడలో ఔషధగుణాలు ఉన్నాయనే నమ్మకంతో ఏర్పడిన శతాబ్దాల నాటి సంప్రదాయం ఇది.

ఆత్మలకు దారిచూపే వెలుగు

ఒడిశాలో దీపావళి రోజు పూర్వీకులను గౌరవించే ఒక ప్రత్యేకమైన ఆచారాన్ని పాటిస్తారు. పండగ రోజు కుటుంబ సభ్యులందరూ ఒక చోట చేరి 'బడా బడువా దకా' అనే ఆచారాన్ని పాటిస్తారు. ఈ ఆచారంలో భాగంగా కర్రలను వెలిగిస్తారు. మండుతున్న కర్రల నుంచి వచ్చే కాంతికి ప్రత్యేకత ఉన్నట్లుగా భావిస్తారు. తమ కుటుంబాన్ని కలవడానికి బయలుదేరిన ఆత్మలకు ఈ కాంతి దారి చూపుతుందని నమ్ముతారు.



లవ్... లైట్స్... డైరెక్షన్

– వరలక్ష్మి శరత్‌కుమార్

"దీపావళి అంటే దీపాలు... రంగు రంగుల ముగ్గులు... లక్ష్మీ పూజ. టపాసులకు మాత్రం నేను దూరం" అంటున్నారు వరలక్ష్మి శరత్‌కుమార్. అది మాత్రమే కాదు... తన జీవితంలో వెలుగులు నింపిన వ్యక్తి ఎవరో కూడా చెప్పారు. ఈ విశేషాలతో పాటు దీపావళి ముచ్చట్లను 'సాక్షి'తో వరలక్ష్మి ప్రత్యేకంగా పంచుకున్నారు.

- నా చిన్నప్పటి దీపావళి పండగలన్నీ నాకు తీపి గుర్తులే. పండగ అంటే నాకు ముఖ్యంగా నచ్చేది కుటుంబ సభ్యులందరం కలవడం. ఇక దీపావళి అంటే మాకు పిండి వంటలు మాత్రమే కాదు... బిర్యానీ కూడా. టపాసులు, బిర్యానీ... ఈ రెండూ ఉంటేనే నాకు పరిపూర్ణంగా పండగ జరుపుకున్నట్లు ఉంటుంది. నేను టపాసులు కాల్చను... జస్ట్ చూడడం వరకే. ఇప్పుడు ఈ దీపావళికి బిర్యానీ లాగించడానికి రెడీ అయిపోయాను (నవ్వుతూ).
- మా ఫ్యామిలీలో ఎవరు ఎంత బిజీగా ఉన్నా పండగల సమయంలో అందరం ఇంట్లో ఉండాలనే నియమం పెట్టుకున్నాం. నేను వేరే షూటింగ్స్‌తో బిజీగా ఉన్నప్పటికీ బ్రేక్ తీసుకుని, చెన్నై వెళ్లాను. నా పుట్టింటి వాళ్లు, అత్తింటివాళ్లు, స్నేహితులు... ఇలా అందరం కలుసుకునేలా ఏర్పాట్లు చేసుకున్నాం. మాకు అత్తింటిల్లో దీపావళి పండగకి ప్రత్యేకంగా ఆచరించాల్సిన నియమాలు ఏమీ లేవు. సో... చిన్నప్పట్నుంచి మా ఇంట్లో జరుపుకున్నట్లే అత్తింటికి వెళ్లిన తర్వాత కూడా జరుపుకుంటున్నాను.
- దీపావళి అంటే రంగు రంగుల లైట్లు... బోలెడన్ని పువ్వులు. చాలా చక్కగా అలంకరిస్తాం. ఉదయం లక్ష్మీ పూజ చేయడం నుంచి సాయంత్రం దీపాలు పెట్టడం వరకూ ఇంట్లో ఉన్న అందరం కలిసి అన్నీ చేస్తాం. చిన్నప్పట్నుంచి నేను క్రాకర్స్‌కి కాస్త దూరం అని చెప్పాను కదా... నా హజ్బెండ్ (నికొలయ్ సచ్‌దేవ్) కూడా క్రాకర్స్‌కి దూరమే. కుటుంబం అంతా పండగపూట కలిసి ఉండటం ఆయనకు ఇష్టం. ఇక టపాసులు కాల్చాలనే మా సరదా పర్యావరణానికి హాని కలిగించేదిగా ఉండకూడదన్నది మా ఇద్దరి ఒపీనియన్.
- నా జీవితంలో వెలుగులు నింపిన వ్యక్తి అంటే మా ఆయనే. ఎందుకంటే నిక్ నన్ను బాగా అర్థం చేసుకున్నారు. సపోర్టివ్‌గా ఉంటారు. డైరెక్షన్ చేయాలనే నా ఇష్టం తెలిసి, చేయమని ఆయనే ఎంకరేజ్ చేశారు. నిక్ నన్ను ప్రేమించడంతో పాటు నా మాటలకు విలువ ఇస్తారు. భార్యాభర్తల మధ్య ప్రేమతో పాటు ఒకరంటే మరొకరికి గౌరవం ఉండాలి. అప్పుడే ఆ బంధం బాగుంటుంది.

దీపావళి స్పెషల్ డైరెక్షన్

ఈ దీపావళికి నా కెరీర్ పరంగా స్పెషల్ అంటే 'డైరెక్షన్'. దర్శకురాలిగా మారాలనే ఆలోచన ఎప్పట్నుంచో ఉంది. అయితే టైమ్ కుదరాలి. ఇప్పుడు సెట్ అయింది. దోస డైరీస్ బేనర్‌పై నా డైరెక్షన్‌లో 'సరస్వతి' టైటిల్‌తో రానున్న ఈ సినిమాని నా సోదరి పూజా శరత్‌కుమార్ నిర్మిస్తారు. ఈ సినిమాలో నేను నటిస్తాను కూడా. థ్రిల్లర్ మూవీగా 'సరస్వతి' ఉంటుంది. త్వరలో షూటింగ్ ఆరంభిస్తాం.

నా చిరునవ్వే 'అమ్మ'కు వెలుగు

– వైష్ణవీ చైతన్య



"పర్యావరణం బాగుంటే మన పరిసరాలన్నీ బాగుంటాయి. అందుకే 'ఎకో ఫ్రెండ్లీ' దీపావళికి ప్రాధాన్యం ఇస్తాను" అంటున్నారు 'బేబీ' మూవీ ఫేమ్ వైష్ణవీ చైతన్య. అంతేకాదు... దీపావళి అంటే తన 'పెట్' సౌకర్యం కూడా ఆలోచిస్తారీ బ్యూటీ. బుజ్జి కుక్కపిల్ల గురించి, ఇంకా తమ ఇంటి దీపావళి పండగ విశేషాల గురించి అచ్చ తెలుగు కథానాయిక వైష్ణవీ చైతన్య 'సాక్షి'తో ప్రత్యేకంగా పంచుకున్న విశేషాలు.

- మా ఇంట్లో వారం రోజుల ముందే పండగ సందడి మొదలైపోయింది. హాల్‌లో ఎలాంటి దీపాలు పెట్టాలి... బాల్కనీని ఎలా అలంకరించాలని నేను, మా అమ్మ రకరకాల ప్లాన్స్ చేసుకున్నాం. మార్కెట్‌కి వెళ్లి స్వయంగా దీపాలు, పువ్వులు కొనడం నాకు చాలా ఇష్టం. కానీ ఈ సంవత్సరం కుదరలేదు. అయితే మా అమ్మ వెళ్లి, అన్నీ తీసుకొచ్చింది కాబట్టి హ్యాపీ. దీపావళి రోజు బంధువులకు, స్నేహితులకు ఇవ్వడానికి గిఫ్ట్స్ రెడీ చేయడం కూడా వారం రోజులు ముందే మొదలుపెట్టాం.
- మేం లక్ష్మీదేవి పూజ బాగా చేసుకుంటాం. పొద్దున్నుంచీ సాయంత్రం వరకూ చాలా హడావిడిగా ఉంటుంది. మాది లేట్ నైట్ పూజ. రాత్రి దాదాపు పదకొండు గంటలకు పూజ పూర్తవుతుంది. ఆ తర్వాత ఇంటి బయటికొచ్చి, దీపావళి సెలబ్రేట్ చేస్తాం.
- మా ఇంట్లో ఒక పెట్ ఉంది. ప్రతి దీపావళిని మేం గ్రాండ్‌గా జరుపుకుంటున్నా మరోవైపు మనసులో మా పెట్ గురించి ఆలోచించుకుని, కొంచెం ఫీల్ అవుతాం. ఎందుకంటే వాడికి (పెట్‌ని ఉద్దేశించి) క్రాకర్స్ స్మెల్ పడదు... పైగా సౌండ్స్ అంటే భయం. పండగ టైమ్‌లో సిక్ అయిపోతాడు. అందుకే మేం సింపుల్ క్రాకర్స్ కాలుస్తాం. పైగా పర్యావరణం కలుషితం కాకూడదనే ఫీల్ కూడా ఉండటంతో 'ఎకో ఫ్రెండ్లీ' దీపావళిని ప్రిఫర్ చేస్తాం.
- దీపావళి అవుట్‌ఫిట్ అంటే... చీర లేదా చుడీదార్. అయితే ఎక్కువగా చీర కట్టుకుంటాను. డెకరేషన్ చేస్తున్నప్పటి నుంచి పూజ వరకూ దాదాపు చీరలోనే ఉంటాను. క్రాకర్స్ కాలుస్తున్నప్పుడు చీర అంత సౌకర్యంగా ఉండదు కాబట్టి షరారా లేకపోతే చుడీదార్ వేసుకుంటాను.
- నా జీవితంలో వెలుగు తెచ్చిన వ్యక్తి అంటే మా 'అమ్మ'. నా బలం, స్ఫూర్తి, శక్తి అన్నీ తననుంచే నాకు వచ్చాయి. ఇంకా నా మొత్తం ఫ్యామిలీ. అమ్మా, నాన్న, బ్రదర్స్, ఇంకా నా చిన్ని పెట్... నా జీవితానికి వీళ్లంతా చాలా ముఖ్యం. నా ముఖంలో కనిపించే చిరునవ్వే వారికి వెలుగు. అయితే నీ జీవితానికి వెలుగు ఎవరు అంటే... మా 'అమ్మ'ని చెబుతాను. ఇవాళ నేను ఇంత మోటివేటెడ్‌గా ఉన్నానంటే తనే కారణం.
- నా లైఫ్‌లో ఇప్పటివరకూ బిగ్గెస్ట్ దీపావళి అంటే ప్రత్యేకంగా ఒకటని చెప్పలేను. అన్ని పండగల్లో కల్లా మా ఫ్యామిలీకి దీపావళి చాలా ముఖ్యం. ఆ రోజు 'నోము' అని ఒక పూజ చేస్తుంటాం. సత్యనారాయణ వ్రతం కూడా చేస్తాం. మా అమ్మా నాన్న ఉపవాసం ఉంటారు. ఇయర్‌లో ఇదే పెద్ద ఫెస్టివల్ అన్నట్లుగా జరుపుకుంటాం. బంధువులను కూడా పూజకు పిలుస్తాం. అందుకే దీపావళి మా కుటుంబానికి ఓ అందమైన పండగ.
- ఊహ తెలిశాక దీపావళి పండగను ఎంజాయ్ చేయడం మొదలుపెట్టాను. నేను, అమ్మ మార్కెట్‌కి బోలెడన్ని పువ్వులు, ఇంకా డెకరేషన్‌కి కావల్సినవి చాలా కొనేవాళ్లం. ఇన్నిన్ని ఎందుకు కొంటారు? అని డాడీ సరదాగా అంటుంటారు. మూడు రోజుల పాటు డెకరేషన్ అలానే ఉంచుతాం. దీపావళి రోజు సాయంత్రం చేసే పూజ కోసం పొద్దున్నుంచే పనులు మొదలు పెట్టేస్తాం. చివరికి అలసిపోతుంటాం (నవ్వేస్తూ).
- ఇప్పటివరకూ మూవీ సెట్స్‌లో దీపావళి పండగ చేసుకోలేదు. అయితే ఆ అవకాశం రావాలని కోరుకుంటున్నాను. ఎందుకంటే సెట్స్‌లో చాలా మంది ఉంటారు. అందరితో సరదాగా మాట్లాడుకుంటూ, స్వీట్స్ షేర్ చేసుకుంటూ, ఫొటోలు దిగుతూ పండగ చేసుకుంటే ఆ హ్యాపీనెస్ వేరుగా ఉంటుంది.

దీపావళి... తీపి గుర్తు

నాకు చిన్నప్పుడు దీపావళి అంటే ఫుల్ భయం. టపాసుల సౌండ్‌కి భయపడి దాక్కోవడమే (నవ్వుతూ). సో... మా అమ్మా నాన్న బ్రదర్స్... ఇలా ఫ్యామిలీ మెంబర్స్ అందరూ దగ్గరుండి నాకు ధైర్యం చెప్పి, కాకర పువ్వొత్తులు వంటివి కాల్పించేవారు. దీపావళికి సంబంధించి నాకు అదో తీపి గుర్తు.

గులాబ్ జామ్.. పులిహోర... క్రాకర్స్

– ఫర్జానా

"ఉదయం పూజ, ఆ తర్వాత గుడికి వెళ్లడం, సాయంత్రం క్రాకర్స్ కాల్చడం... ఇలా దీపావళి రోజంతా సందడి సందడిగా సాగిపోతుంది" అంటున్నారు ఫర్జానా. 'సలార్'లో గిరిజన బాలిక సురభి పాత్ర చేసిన ఫర్జానా దీపావళి సందర్భంగా పంచుకున్న విశేషాలు.



- అన్ని పండగల్లోనూ నాకు దీపావళి ఇష్టమైన పండగ. ఎందుకంటే నేను, నా తమ్ముడు ఫుల్‌గా ఎంజాయ్ చేస్తాం. అమ్మా, నాన్న, నేను, తమ్ముడు ఉదయమే నిద్ర లేచేసి, స్నానం చేసి, ఇల్లంతా డెకరేట్ చేస్తాం. ఇంట్లో లక్ష్మీ దేవి పూజ చేసుకున్నాక గుడికి వెళ్లి, అక్కడ కూడా దీపాలు పెడతాం.
- మా అమ్మమ్మ, తాతయ్య... ఇలా అందరూ మా ఇంటికి వస్తారు. అమ్మమ్మ, అమ్మ పూజలు బాగా చేస్తారు. అలా నాకూ అలవాటైంది. దీపావళికి పులిహోర, గులాబ్ జామ్ చేస్తాం. నాకూ గులాబ్ జామ్ చేయడం వచ్చు. ఈవినింగ్ దీపాలు పెట్టి, ఆ తర్వాత క్రాకర్స్ కాల్చడం మొదలు పెడతాం. ఈ ఇయర్ దీపావళి అవుట్‌ఫిట్ అంటే... షరారా కొనుక్కున్నాను. మా ఇంట్లో పెట్టే లైట్స్‌కి మ్యాచ్ అయ్యేట్లు ఎల్లో కలర్ షరారాని సెలక్ట్ చేసుకున్నాను.
- క్రాకర్స్‌లో నాకు ఫ్లవర్ పాట్స్, కాకర పువ్వొత్తులు, భూ చక్రాలు ఇష్టం. బాంబ్స్‌కి దూరం (నవ్వుతూ). మేం క్రాకర్స్ కాల్చడం పూర్తయ్యేసరికి రాత్రి రెండు, మూడు అవుతుంది. మా ఎనర్జీ లెవల్స్ తగ్గే వరకూ కాల్చుతూనే ఉంటాం. మా దీపావళి 'షాట్స్' కాల్చడంతో పూర్తవుతుంది. 25 షాట్స్‌తో ఎండ్ చేస్తాం. అది లేకపోతే మాకు దీపావళి ఇన్‌కంప్లీట్‌గా అనిపిస్తుంది. నేను మమ్మీ, డాడీ, తమ్ముడు కలిసి షాట్స్ కాలుస్తాం.
- ఈ దీపావళి స్పెషల్ ఏంటంటే... ఒక సినిమాలో టీనేజ్ హీరోయిన్‌గా చేస్తున్నాను. ఇంకా ఎక్కడా రివీల్ చేయలేదు. నా కెరీర్‌కి సంబంధించి స్పెషల్ అంటే 'హీరోయిన్'గా చేయడమే.

సలార్... అదో తీయని జ్ఞాపకం

'సలార్' సినిమా షూటింగ్ అప్పుడు దీపావళి వచ్చింది. ఆ రోజు షూటింగ్‌కి క్రాకర్స్ తీసుకెళ్లాం. స్టూడియో బయటకు వచ్చి, మేం చైల్డ్ ఆర్టిస్ట్‌లు, ఇంకా టీమ్ మొత్తం కాల్చాం. ఆ దీపావళి షెడ్యూల్‌లో ప్రభాస్‌గారి సీన్స్ లేవు. మాపై సీన్స్ తీశారు. మేం పిల్లలం క్రాకర్స్ కాల్చాం. 'సలార్'కి సంబంధించిన తీయని జ్ఞాపకాల్లో ఇదొకటి.

– ఇంటర్వ్యూలు: డి.జి. భవాని


'గ్రామాల్లో సంపద పెరగాలి. పెరిగిన సంపద గ్రామీణ ప్రజలకే చెందాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

సంపుటి: 18
సంచిక: 209
పేజీలు: 16
వెల: ₹ 6.50

సోమవారం 20-10-2025

పాఠకులు, ఏజెంట్లు, ప్రకటనకర్తలు, శ్రేయోభిలాషులకు
సాక్షి దీపావళి శుభాకాంక్షలు

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

న్యూస్‌రీల్

లా కోర్సుల్లో ప్రవేశాలకు షెడ్యూల్ విడుదల



ఏపీ లాసెట్, పీజీఎల్ సెట్–2025లో అర్హత సాధించిన అభ్యర్థులు ఈ నెల 21, 22 తేదీల్లో రిజిస్ట్రేషన్ చేసుకుని వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవాలని.. 25న సీట్లు కేటాయించనున్నట్లు ఉన్నత విద్యామండలి తెలిపింది.

వివరాలు 2లో ▸

190 కిలోమీటర్లు.. రూ.24,790 కోట్లు



హైదరాబాద్ ఓఆర్ఆర్ కంటే పెద్దగా అమరావతి ఓఆర్ఆర్ నిర్మించాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. 190 కి.మీ. మేర 140 మీటర్ల వెడల్పుతో భూ సేకరణకు సిద్ధమవుతోంది. రాష్ట్ర ప్రభుత్వ ప్రణాళిక మేరకు రూ.24,790 కోట్లతో చేపట్టే ఈ ప్రాజెక్టు కోసం ఎన్‌హెచ్ఏఐ సమగ్ర ప్రాజెక్టు నివేదికను సమర్పించింది.

వివరాలు 11లో ▸

తన్వీ శర్మకు రజతం



భారత యువ షట్లర్ తన్వీ శర్మ ప్రపంచ జూనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో రజత పతకం కైవసం చేసుకుంది. మహిళల సింగిల్స్ ఫైనల్లో తన్వీ 7–15, 12–15తో రెండో సీడ్ అన్యాపత్ (థాయ్‌లాండ్) చేతిలో ఓడింది.

వివరాలు 12లో ▸

సెలవు

దీపావళి సందర్భంగా నేడు సాక్షి కార్యాలయానికి సెలవు. మంగళవారం సంచిక వెలువడదు. పునర్దర్శనం బుధవారం.

నేటి గుడ్లు & చికెన్ విజయవాడ జోన్ ధరలు

12 గుడ్ల ట్రేడ్ ధర ₹72	ఫారం దగ్గర లైవ్ బర్డ్ 126 కిలో	డ్రెస్డ్ స్కిన్‌తో 222 కిలో
	రిటైల్ లైవ్ బర్డ్ 153 కిలో	స్కిన్ లెస్ 252 కిలో

వినియోగదారుల శ్రేయస్సు దృష్ట్యా జారీచేయడమైనది

Conditions Apply

ఇదండీ సంగతి



పల్లెలపై బాబు బాంబు

తాగునీటికీ బాదుడే!



నిన్న ఉద్యోగులకు వాత.. నేడు గ్రామాలపై కూటమి సర్కారు మోత

తాగునీటి పథకాల నిర్వహణ పాలసీ పేరుతో ఇక యూజర్ చార్జీలు వసూలు

గ్రామీణ ప్రజలపై ఏటా రూ.1,036.97 కోట్ల వడ్డన

- రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చేది దాదాపు రూ.140 కోట్లే.. మిగతా ఏడు రెట్లకుపైగా భారం జనం నెత్తినే
- ఇప్పటికే మంత్రివర్గం పచ్చజెండా.. జీవో విడుదల
- తాగునీటి చార్జీల వసూలు బాధ్యత పంచాయతీలు, కమిటీలదే
- తాగునీటి పథకాల మోటర్ల కరెంటు బిల్లులు, సిబ్బంది వేతనాలు, మరమ్మతులు లాంటి నిర్వహణ వ్యయాలు.. కేంద్రం నుంచి నిధుల విడుదల తగ్గితే ప్రజలపై మరింత అదనపు భారం
- ఇప్పటికే ప్రజలపై రూ.17 వేల కోట్లకు పైగా విద్యుత్తు చార్జీల బాదుడు.. సిబ్బందికి టార్గెట్లు పెట్టి మరీ ఇంటి పన్నులు వసూలు చేయిస్తున్న సర్కారు

2లో

Analysis of sufficiency of Funds:

SNO	Description	O&M of SVS	O&M of MVS
1	Estimated amount required for O&M	Rs. 1031.42 Crores (29,469 SVS @ Rs.3.50lakh for O&M of each SVS)	Rs.648.87 crores (including satyasai schemes Rs.130.18 Cr)
2	Expected revenue from user charges	Rs. 548.97 crores	Rs.488 crores
3	Gap of Funds	Rs. 1031.42 – 548.97 : Rs.482.45crores	Rs. 648.87-488.00 : Rs.160.87 crores

ప్రజల నుంచి వసూలు చేయనున్న యూజర్ చార్జీల వివరాలు

ఒక్క డీఏతో 'పండుగ' చేసుకోమంటారా?



- మిగతా మూడు డీఏల సంగతేంటి?
- ఐఆర్, పీఆర్సీ, సీపీఎస్ హామీలన్నీ బుట్టదాఖలు
- పెండింగ్ బకాయిలు రూ.34,125 కోట్ల ఊసే లేదు
- చంద్రబాబు వంచనపై ఉద్యోగుల ఆవేదన
- వెట్టిచాకిరీ చేయించుకుంటూనే గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులపై వ్యతిరేకత
- ఉద్యోగులంటే చంద్రబాబుకు ఎప్పుడూ అలుసేనన్న అభిప్రాయం
- ఐదేళ్లలో 11 డీఏలు ఇచ్చిన వైఎస్ జగన్

2లో

ఉద్యోగులకు ఇచ్చిన హామీలు ఏమయ్యాయి?



- ఇచ్చిన 9 హామీల్లో ఒక్క దాని గురించి కూడా సీఎం మాట్లాడలేదు.. పీఆర్సీ మీద ప్రకటన చేస్తారని ఉద్యోగులు ఆశగా చూశారు
- చర్చలకు వెళ్లిన సంఘాల నాయకులు హామీల గురించి ప్రశ్నించకపోవడం బాధాకరం
- గవర్నమెంట్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ అధ్యక్షుడు కె.వెంకట్రామిరెడ్డి

2లో

జేఈఈ మెయిన్ షెడ్యూల్ విడుదల

- జనవరిలో మొదటి సెషన్ పరీక్షలు
- ఈ నెలలో దరఖాస్తుల ప్రక్రియ మొదలు
- ఏప్రిల్‌లో రెండో సెషన్
- జనవరి చివరి వారం నుంచి దరఖాస్తుల ప్రక్రియ మొదలు అవుతుందని ఎన్‌టీఏ వెల్లడి

సాక్షి, అమరావతి: జేఈఈ మెయిన్–2026 నిర్వహణ కోసం నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) ఆదివారం షెడ్యూల్ విడుదల చేసింది. మెయిన్–1 సెషన్ పరీక్షలు జనవరి 21 నుంచి 30 మధ్య నిర్వహించనున్నట్లు తెలిపింది. ఈ పరీక్షలకు సంబంధించి ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రక్రియ ఈ నెలలోనే ప్రారంభమవుతుందని పేర్కొంది. కానీ కచ్చితమైన తేదీని ప్రకటించలేదు. అలాగే, జేఈఈ మెయిన్–2 సెషన్ ఏప్రిల్ 1 నుంచి 10 మధ్య నిర్వహించనున్నట్లు ప్రకటించింది. మెయిన్–2కు జనవరి చివరి వారం నుంచి దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమవుతుందని తెలిపింది. దివ్యాంగ అభ్యర్థుల అవసరాలకు అనుగుణంగా పలు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు ఎన్‌టీఏ వెల్లడించింది. అలాగే, పరీక్ష రాసే అభ్యర్థులు దేశవ్యాప్తంగా పెరుగుతున్న నేపథ్యంలో నిర్వహణ నగరాల సంఖ్యను సైతం పెంచుతున్నట్లు పేర్కొంది.





ఆరోగ్యశ్రీ చరిత్రలో చీకటి అధ్యాయం

- బిల్లుల కోసం ధర్నాకు సిద్ధమైన నెట్‌వర్క్ ఆస్పత్రులు
- అనుమతి ఇవ్వాలని విజయవాడ పోలీస్ కమిషనర్‌కు లేఖ
- రూ.3 వేల కోట్లకు పైగా బకాయి పెట్టిన చంద్రబాబు
- సేవలు నిలిపేసినా పట్టించుకోని సర్కారు
- దీంతో వీధి పోరాటానికి ఆస్పత్రుల యజమానులు
- బిల్లుల కోసం ధర్నా.. రాష్ట్ర చరిత్రలో ఇదే తొలిసారి

5లో

ముమ్మాటికీ ప్రైవేటీకరణే..

ప్రభుత్వ కొత్త వైద్య కళాశాలల్లో ఆలిండియా కోటా ఎత్తివేత

- తమవారి ఆదాయం పెంపునకు 110 ఎంబీబీఎస్ సీట్లు యాజమాన్య కోటాగా మార్పు
- పీపీపీ పేరిట ఫీజుల దోపిడీకి చంద్రబాబు సర్కారు కొత్త ఎత్తుగడ
- ప్రస్తుత విధానంలో ఆలిండియా కోటా 22, స్టేట్ కోటా 64 చొప్పున 86 ప్రభుత్వ కోటా సీట్లు
- ప్రైవేటీకరిస్తున్న ఒక్కో వైద్య కళాశాలలో 11 చొప్పున సీట్లు యాజమాన్య కోటాకు మళ్లింపు
- ప్రతి కళాశాలలో ప్రభుత్వ కోటాలోని 8 సీట్లు బీ కేటగిరీ, 3 సీట్లు ఎన్ఆర్ఐ కోటాకు మళ్లింపు

11లో



దేశంలో కొత్తగా 10,650 ఎంబీబీఎస్ సీట్లు

41 నూతన వైద్య కళాశాలలు

ఆమోదం తెలియజేసిన జాతీయ మెడికల్ కమిషన్

6లో

అయోధ్యలో దీప శోభ..



రికార్డుల దీపోత్సవం

ఒకేసారి 26.17 లక్షల ప్రమిదలు వెలిగించిన అయోధ్యవాసులు

- ఏకకాలంలో హారతి పట్టిన 2,128 మంది భక్తులు.. 56 ఘాట్‌లలో దీపకాంతులతో అయోధ్య రామాలయానికి కొత్త శోభ
- సరయూ నదీతీరంలో రెండు సరికొత్త గిన్నిస్ రికార్డులు నమోదు
- యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్‌కు ధ్రువీకరణ పత్రాలు అందించిన గిన్నిస్ నిర్వాహకులు

- వివరాలు 6లో

న్యూయార్క్‌లోని టైమ్స్ స్క్వేర్ వద్ద..



ట్రంప్ రాజు కాదు

అధ్యక్షుడికి వ్యతిరేకంగా అమెరికాలో వెల్లువెత్తిన నిరసనలు

- నిరంకుశ పాలన వద్దంటూ నినాదాలు
- దేశవ్యాప్తంగా వేలాది ప్రదర్శనలు, ర్యాలీలు
- అసలైన ప్రజాస్వామ్యం కావాలని ప్రజల డిమాండ్
- నిరసనలను పట్టించుకోకుండా ఉల్లాసంగా గోల్ఫ్ ఆడుకున్న ట్రంప్
- 'నో కింగ్స్' నినాదాన్ని హేళన చేస్తూ సోషల్ మీడియాలో ఏఐ వీడియో పోస్ట్ చేసిన వైనం

- వివరాలు 6లో

రేపు బంగాళాఖాతంలో అల్పపీడనం

- ఉపరితల ఆవర్తనం ప్రభావంతో ఈనెల 21న బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. రెండు రోజుల్లో వాయుగుండంగా బలపడుతుందని పేర్కొంది. దీని ప్రభావంతో రానున్న నాలుగు రోజులపాటు రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది.

10లో



క్లుప్తంగా...

ప్రతి ఇంటా ఆనంద కాంతులు నింపాలి

మాజీ సీఎం వైఎస్ జగన్ దీపావళి శుభాకాంక్షలు



సాక్షి, అమరావతి: వెలుగుల పండుగ దీపావళి తెలుగు వారి జీవితాల్లో వేల కాంతులు నింపాలని మాజీ సీఎం, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆకాంక్షించారు. రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలకు, ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు వారందరికీ ఆయన దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు. దీపావళి అంటే కాంతి, వెలుగుతో పాటు.. చీకటిపై వెలుగు, చెడుపై మంచి, అజ్ఞానంపై జ్ఞానం, దుష్టశక్తులపై దైవశక్తి సాధించిన విజయాలకు ప్రతీకగా జరుపుకునే పండుగ అని వైఎస్ జగన్ పేర్కొన్నారు. ఈ దీపావళి పండుగ ప్రతి ఇంటా ప్రజలందరి జీవితాల్లో ఆనంద కాంతులు నింపాలని ఆకాంక్షించారు. తెలుగు ప్రజలందరికీ సకల శుభాలు, సంపదలు, సౌభాగ్యాలు, విజయాలు కలగాలని.. దివ్వెల వెలుగులలో ప్రతి కుటుంబం సుఖ సంతోషాలతో విరాజిల్లాలని వైఎస్ జగన్ అభిలషించారు.

లా కోర్సుల్లో ప్రవేశాలకు షెడ్యూల్ విడుదల

- 21, 22 తేదీల్లో యూజీ, పీజీ కోర్సులకు రిజిస్ట్రేషన్లు
- 25న సీట్ల కేటాయింపు

సాక్షి, అమరావతి: న్యాయ విద్య కోర్సుల్లో ప్రవేశాలకు రాష్ట్ర ఉన్నత విద్యా మండలి షెడ్యూల్ విడుదల చేసింది. ఏపీ లాసెట్, పీజీఎల్ సెట్-2025లో అర్హత సాధించిన అభ్యర్థులు ఈ నెల 21, 22 తేదీల్లో సంబంధిత కోర్సులకు రిజిస్ట్రేషన్ చేసుకుని వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవాలని, 25న సీట్లు కేటాయిస్తారని ఉన్నత విద్యామండలి కార్యదర్శి బి.తిరుపతిరావు తెలిపారు. సీట్లు పొందిన అభ్యర్థులు ఈ నెల 27 నుంచి 29 మధ్య ఆయా కాలేజీల్లో రిపోర్టు చేయాలన్నారు. అయితే, ఈ నెల 27 నుంచే తరగతులు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. కాగా, చిత్తూరులోని రాయలసీమ లా కాలేజీ, కేఎంఆర్ లా కాలేజీలకు బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా(బీసీఐ) ఆమోదం, యూనివర్సిటీ గుర్తింపు లేనందున వీటిలో ప్రవేశాలు కోర్టు తీర్పునకు లోబడి జరుగుతాయని తెలిపారు. అనంతపురంలోని బెస్ట్ యూనివర్సిటీకి బీసీఐ ఆమోదం లేదని, శ్రీకాకుళంలోని ఎంపీఆర్ లా కాలేజీకి సైతం బీసీఐ ఆమోదంతోపాటు యూనివర్సిటీ గుర్తింపు కూడా లేదని వివరించారు. ఆయా విద్యాసంస్థల్లో అడ్మిషన్లకు ఆప్షన్లు ఇచ్చే అభ్యర్థులు ఈ అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు.

● పల్లెలపై బాబు బాంబు!

తాగునీటికీ బాదుడే!

నిన్న ఉద్యోగులకు వాత..
నేడు గ్రామాలపై కూటమి సర్కారు మోత
తాగునీటి పథకాల నిర్వహణ పాలసీ పేరుతో ఇక యూజర్ చార్జీలు వసూలు
గ్రామీణ ప్రజలపై ఏటా రూ.1,036.97 కోట్ల వడ్డన..



సాక్షి, అమరావతి: ఉద్యోగులు, ఉపాధ్యాయులకు గట్టి షాక్ ఇచ్చి ఒకరోజు గడవక ముందే పండగ పూట చంద్రబాబు సర్కారు మరో బాదుడుకు తెర తీసింది! కాకపోతే ఈసారి ఆయన సంధించిన బాంబు పల్లెల్లో పేలనుంది! గ్రామాల్లో తాగునీటి చార్జీల మోత మోగనుంది! దీపావళి కానుకగా.. గ్రామీణ ప్రాంత ప్రజల నుంచి ఏటా రూ.వెయ్యి కోట్లకుపైగా తాగునీటి చార్జీల వసూలుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నద్ధమైంది. సూపర్ సిక్స్, సెవెన్ పేరుతో మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేయకపోగా.. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి విద్యుత్తు చార్జీలు, భూముల విలువ పెంపు ద్వారా రిజిస్ట్రేషన్ చార్జీల మోత, ముక్కు పిండి ఆస్తి పన్ను వసూలుతో తమ నడ్డి విరుస్తోందని ప్రజలు మండిపడుతున్నారు. అటు ఎన్నికల హామీలను నెరవేర్చకుండా.. ఇటు ఎడాపెడా బాదుడుతో చంద్రబాబు తన ట్రేడ్‌మార్కు మోసాలను కొనసాగిస్తున్నారని అన్ని వర్గాలు ఆక్రోశిస్తున్నాయి. వైఎస్ జగన్ ఇచ్చిన వాటితోపాటు ఇంకా ఎక్కువ సంక్షేమాన్ని అందిస్తామని ఎన్నికల ముందు నమ్మబలికిన చంద్రబాబు తమను దగా చేశారని సర్వత్రా చర్చ జరుగుతోంది.

బాధ్యత వదిలించుకుని బాదుడు..!

రక్షిత తాగునీటి పథకాల ద్వారా గ్రామీణ ప్రజలకు అందించే మంచినీటిపైనా యూజర్ చార్జీలు వసూలు చేయాలని టీడీపీ కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో రక్షిత మంచినీటి పథకాలు, బోర్ల నిర్వహణ, మరమ్మతులకు ఏటా రూ.1,680.29 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేయగా ఏకంగా రూ.1,036.97 కోట్లు ప్రజల నుంచి యూజర్ చార్జీల రూపంలో వసూలు చేసేందుకు ప్రభుత్వం సన్నద్ధమైంది. ఇప్పటిదాకా గ్రామీణ ప్రాంతాల్లో రక్షిత మంచినీటి పథకాల నిర్వహణ వ్యయాన్ని ఆయా గ్రామ పంచాయతీలు, జిల్లా పరిషత్‌లకు కేంద్రమిచ్చే ఆర్థిక సంఘం నిధుల నుంచి లేదంటే రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తూ వస్తుండగా.. ఇప్పుడు చంద్రబాబు సర్కారు ఆ బాధ్యత వదిలించుకుని యూజర్ చార్జీల రూపంలో ప్రజలపై భారం మోపడానికి సిద్ధపడింది.

మంత్రివర్గం ఆమోదం.. జీవో జారీ

తాగునీటిపై యూజర్ చార్జీల వసూలుకు రెండు నెలల క్రితమే మంత్రివర్గం ఆమోదం తెలుపగా ఇటీవల ఆంధ్రప్రదేశ్ గ్రామీణ తాగునీటి సరఫరా పథకాల నిర్వహణ పాలసీ నోటిఫికేషన్ జారీ అయింది. దీని ప్రకారం గ్రామీణ ప్రాంతాల్లో నివసించే వారి నుంచి యూజర్ చార్జీలు వసూలును లెక్క గట్టారు. రెండు కంటే ఎక్కువ గ్రామాలకు ఒకే రక్షిత మంచినీటి పథకం ద్వారా నీటి సరఫరా జరిగే చోట్ల ప్రతి వ్యక్తిపై సగటున ఏడాదికి రూ. 320 చొప్పున వసూలు చేయనుండగా, గ్రామ పరిధిలో అంతర్గతంగా రక్షిత తాగునీటి పథకం ఉన్నచోట్ల ఏటా రూ.240 చొప్పున యూజర్ చార్జీల భారం పడనుంది. దీనికి సంబంధించి ఇప్పటికే జీవో రూపంలో ఆదేశాలు వెలువడ్డ నేపథ్యంలో ఇక ఏ క్షణమైనా యూజర్ చార్జీలు వసూలు చేసే అవకాశం ఉందని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

ప్రజల నుంచి రూ.1,036.97 కోట్లు వసూలు..

గ్రామీణ ప్రాంతాల్లోని మొత్తం 3.81 కోట్ల జనాభాలో 60 శాతం మందికి చిన్న తరహా రక్షిత మంచినీటి పథకాలు, బోర్ల ద్వారానే తాగునీటి సరఫరా జరుగుతున్నట్లు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ పరిధిలోని గ్రామీణ నీటి సరఫరా, పారిశుధ్య (ఆర్‌డబ్ల్యూఎస్) గణాంకాలు వెల్లడిస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో 549 సమగ్ర రక్షిత మంచినీటి పథకాలకు నిర్వహణకు ఏటా రూ.518.69 కోట్లు వ్యయం కానుండగా, 29,469 చిన్న తరహా రక్షిత మంచినీటి పథకాల నిర్వహణకు రూ.1,031.42 కోట్లు, సత్యసాయి ట్రస్టు ఆధ్వర్యంలో నడిచే పథకాలకు మరో రూ.130.18 కోట్లు ఖర్చవుతుందని ప్రభుత్వం అంచనాలు వేస్తోంది. ఈ నేపథ్యంలో వీటి నిర్వహణకయ్యే మొత్తం ఖర్చు రూ.1,680.29 కోట్లలో కేంద్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీలు, జిల్లా పరిషత్‌లకు ఇచ్చే 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి రూ.503.67 కోట్లు వ్యయం చేయనున్నట్లు పాలసీ ప్రణాళికలో పేర్కొన్నారు. మిగిలిన రూ.1,176.62 కోట్లలో రూ.1,036.97 కోట్లు ఆయా గ్రామాల్లో నివసించే ప్రజల నుంచి యూజర్ చార్జీల రూపంలో వసూలు చేయనుండగా కేవలం రూ.139.65 కోట్లు మాత్రమే రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుందని పాలసీ ప్రణాళికలో పేర్కొన్నారు.

నిర్వహణ ఖర్చులు పెరిగితే అదనపు భారం..

రక్షిత మంచినీటి పథకాల పరిధిలో పనిచేసే సిబ్బంది నెలవారీ జీతభత్యాలతోపాటు మోటర్ల విద్యుత్ చార్జీలు, బ్లీచింగ్ పౌడర్, నీటి శుద్ధిపై నాణ్యత పరీక్షలు లాంటివి నిర్వహణ వ్యయంలో ఉంటాయని ప్రభుత్వం పాలసీలో పేర్కొంది. పైపులైన్ లీకేజీలు, మోటర్ల మరమ్మతులు, విడిభాగాల కొనుగోలు దీనికి అదనం. భవిష్యత్‌లో సిబ్బంది వేతనాలు పెరిగినా.. విద్యుత్ చార్జీలు పెరిగినా ఆ మేరకు నిర్వహణ కూడా పెరుగుతుంది. అందుకు అనుగుణంగా యూజర్ చార్జీల భారం ప్రజలపై పడే అవకాశం ఉంది.

కేంద్రం వాటా తగ్గితే మరిన్ని తిప్పలు..!

ప్రస్తుతం అమలులో ఉన్న 15వ ఆర్థిక సంఘం సిఫార్సులకు అనుగుణంగా ఈ ఏడాది రూ.2,099 కోట్లు రాష్ట్రంలో గ్రామీణ స్థానిక సంస్థలకు కేంద్రం నుంచి నిధులు అందుతాయి. 15వ ఆర్థిక సంఘం గడువు 2026 మార్చి నెలాఖరుతో ముగియనుంది. 2026 ఏప్రిల్ నుంచి 16 ఆర్థిక సంఘం సిఫార్సులు అమలులోకి వస్తాయి. 16వ ఆర్థిక సంఘం సిఫార్సుల అనంతరం గ్రామీణ స్థానిక సంస్థలకు కేంద్రం విడుదల చేసే మొత్తం ఒకవేళ తగ్గినా.. లేదంటే ఆ నిధులను ప్రత్యేక అవసరాలకు మాత్రమే వినియోగించాలని ఏవైనా నిబంధనలు విధించినా.. ఆ మేరకు రక్షిత మంచినీటి పథకాలపై కేంద్రం వాటాకు గండి పడుతుంది. ఆ రకంగా చూసినా ప్రజలపై యూజర్ చార్జీల భారం మరింత పెరిగే వీలుంది.

వసూలు బాధ్యత కమిటీలకు..

గ్రామ స్థాయిలో రక్షిత మంచినీటి పథకాల నిర్వహణకు ప్రత్యేకంగా కమిటీలు ఏర్పాటు చేయనున్నట్టు రాష్ట్ర ప్రభుత్వం ఇందుకోసం రూపొందించిన పాలసీలో పేర్కొంది. తాగునీటి పథకం నిర్వహణ వ్యయం ఆధారంగా ఎప్పటికప్పుడు యూజర్ చార్జీలను నిర్ణయించడం, వసూలు చేసే బాధ్యత ఆయా గ్రామ పంచాయతీలు, నిర్వహణ కమిటీలదేనని ప్రభుత్వం పేర్కొంది. రెండు కంటే ఎక్కువ గ్రామాలకు నీటిని సరఫరా చేసే 549 సీపీడబ్ల్యూఎస్ స్కీంల పరిధిలో యూజర్ చార్జీల నిర్ణయం, వసూలు బాధ్యత ఆయా జిల్లా పరిషత్‌లకు చెందిన ప్రత్యేక స్టాండింగ్ కమిటీకి ఉంటుందని పాలసీ ప్రణాళికలో పేర్కొన్నారు. నూతన పాలసీపై ఇప్పటికే ఎస్ఈ, ఈఈ, డిప్యూటీ ఎంపీడీవోలు, ఏఈ స్థాయి వరకు శిక్షణ పూర్తి అయింది. గ్రామ స్థాయి సిబ్బందికి నవంబర్, డిసెంబర్‌లో శిక్షణ ఇచ్చేలా ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది.

GOVERNMENT OF ANDHRA PRADESH
ABSTRACT

Rural Water Supply & Sanitation Department- "Operation and Maintenance of Drinking Water Supply Schemes (Rural) in Andhra Pradesh" formulated in accordance with the guidelines of NJJM- Notification of Policy- Orders -Issued-Reg.

PANCHAYAT RAJ AND RURAL DEVELOPMENT (RWS.II) DEPARTMENT

G.O.Ms.No.83 Dated:22-09-2025.
Read the following:

1. G.O.Rt.No.2290, PR&RD (RWS.I) Department, dated:20.12.2012.
2. G.O.Rt.No.1292, PR&RD (RWS.I) Department, dated:06.08.2013.
3. From the Engineer-in-Chief, RWS&S, Vijayawada, e-file bearing Computer No. 2766113, Dated: 06.05.2025.

2. Financial plan:
Out of the total rural population of 381.24 lakh, the population covered under MVS is 40% (152.50 lakh) and SVS is 60% (228.74 lakh). It is presumed that the user charges per person per year for MVS and SVS fixed @ Rs.320 and Rs.240 will amount a cost recovery of Rs.488 crores and Rs.548.97 crores respectively.

పంచాయతీల్లో రక్షిత మంచినీటి పథకాల నిర్వహణ పాలసీలో యూజర్ చార్జీల గురించి పేర్కొన్న వివరాలు

కేంద్రం ఊరట.. బాబు బాదుడు!

ఒకవైపు కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ భారాన్ని తగ్గించి ఊరటనిస్తే.. రాష్ట్రంలో మాత్రం కూటమి సర్కారు ప్రజలపై పన్నుల భారం మోపుతోంది. ప్రధాని మోదీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం దసరా, దీపావళి వేళ చాలా వరకు నిత్యావసరాలపై జీఎస్టీ పూర్తిగా మినహాయింపు లేదంటే తగ్గింపు ద్వారా ప్రజలపై ఆర్థిక భారం పడకుండా చర్యలు చేపడితే.. చంద్రబాబు సర్కారు మాత్రం పండుగ సమయంలో జీవనాధారమైన తాగునీటిపై యూజర్ చార్జీల వసూలు పాలసీని ప్రకటించడం గమనార్హం. వివిధ వస్తువులపై జీఎస్టీని తగ్గించిన కేంద్రం ఆ నిర్ణయాన్ని సెప్టెంబరు 22వ తేదీ నుంచి అమలులోకి తీసుకురాగా.. చంద్రబాబు ప్రభుత్వం అదే రోజు యూజర్ చార్జీల వసూలుకు సంబంధించి "ఆంధ్రప్రదేశ్ గ్రామీణ తాగునీటి సరఫరా పథకాల నిర్వహణ' పాలసీ జీవో విడుదల చేసింది. అయితే జీవో నెంబరు 83 వెంటనే ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచకుండా ఆలస్యంగా వెలుగులోకి తెచ్చింది. గ్రామాల్లో ఇంటి పన్ను రూపంలో వసూలు చేసే మొత్తం కంటే నీటిపై ప్రతిపాదిత యూజర్ చార్జీలు చాలా ఎక్కువగా ఉండడం గమనార్హం.

షాకులే షాకులు..

- విద్యుత్తు చార్జీల వాత..
- ఆస్తి పన్ను మోత

☛ టీడీపీ కూటమి ప్రభుత్వం ఏడాదిన్నర పాలనలో భారీగా పెరిగిన విద్యుత్ బిల్లులు వినియోగదారులకు చుక్కలు చూపిస్తున్నాయి. ఓట్లేసి గెలిపించండి.. కరెంటు చార్జీలు ఇంకా తగ్గిస్తామని ఎన్నికల ముందు నమ్మబలికిన చంద్రబాబు అధికారంలోకి రాగానే ప్రజలపై ఏకంగా రూ.17,348.64 కోట్లు విద్యుత్ చార్జీల భారం వేశారు.

☛ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విద్యుత్ బిల్లులు రెట్టింపు అయ్యాయి. ఇప్పటికే వసూలు చేస్తున్న చార్జీలకు తోడు మరో పిడుగు కూడా సిద్ధంగా ఉంది. మూడు విద్యుత్ పంపిణీ సంస్థలు (డిస్కమ్స్) 4వ నియంత్రణ కాలానికి వాస్తవ ఆదాయ, ఖర్చుల వ్యత్యాసాన్ని రూ.12,771.96 కోట్లుగా లెక్కించాయి. ఈ మొత్తాన్ని విద్యుత్ బిల్లుల్లో కలిపి వసూలు చేసుకునేందుకు అనుమతించాలని ఇటీవల కమిషన్‌ను కోరాయి. దీన్ని రాష్ట్ర ప్రభుత్వం భరించకపోతే ప్రజలపైనే భారీగా బండ పడుతుంది.

భారమైన పన్నులు..

ఆస్తి ఉందన్న ఆనందాన్ని కూడా చంద్రబాబు ప్రభుత్వం మధ్య తరగతి ప్రజలకు మిగలనివ్వడం లేదు. కూటమి ప్రభుత్వంలో ఆస్తి పన్నులు భారీగా పెరిగాయి. ప్రజల నుంచి ముక్కుపిండి వసూలు చేయాలంటూ సచివాలయ సిబ్బందికి ప్రభుత్వం లక్ష్యాలు నిర్దేశించింది. రోజూ ఆస్తిపన్ను వసూళ్లపై సమీక్షలు చేస్తూ తీవ్ర ఒత్తిడి పెంచుతోంది. ఆస్తి పన్ను వసూలు లక్ష్యాలను చేరుకోలేకపోతే చర్యలు తీసుకుంటామంటూ వారిని హెచ్చరిస్తోంది. పాత బకాయిలు ఉన్నాయంటూ నోటీసులు జారీ చేస్తూ, అన్నీ కలిపి ఒకేసారి కట్టాల్సిందేనంటూ పెను భారం మోపుతోంది. గ్రామీణ ప్రాంతాల్లో గతంలో స్థానిక పరిస్థితులను బట్టి పంచాయతీలు ఇంటి పన్ను వసూలు చేసే పరిస్థితులు ఉండగా ఇప్పుడు ప్రతి చోటా వంద శాతం పన్ను వసూలు చేయాలంటూ క్షేత్రస్థాయి సిబ్బందికి టీడీపీ కూటమి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఇక భూముల క్రయ విక్రయాల సమయంలో రిజిస్ట్రేషన్ చార్జీలు నిర్ధారించే భూముల విలువను ఈ ఏడాది ఫిబ్రవరిలో 40 నుంచి 50 శాతం దాకా పెంచారు. దీనివల్ల కొనుగోలుదారులపై చార్జీల భారం అదనంగా పడింది.

ఒక్క డీఏతో 'పండుగ' చేసుకోమంటారా?

సాక్షి, అమరావతి: చంద్రబాబు తమకు ఇచ్చిన హామీలన్నింటినీ గాలికి వదిలేసి దీపావళి కానుక అంటూ ఒక్క డీఏ ఇచ్చి సరిపెట్టడంపై ప్రభుత్వ ఉద్యోగుల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. తమకు రావాల్సిన నాలుగు డీఏల్లో ఒక దాన్ని.. అది కూడా 16 నెలల తర్వాత ఇవ్వడాన్ని గొప్పగా చెప్పుకోవడంపై వారంతా మండిపడుతున్నారు. వాట్సప్ గ్రూపుల్లో చంద్రబాబును దుమ్మెత్తిపోస్తున్నారు. వైఎస్ జగన్ 2019లో అధికారంలోకి రాగానే 10 రోజుల్లోనే ఇచ్చిన హామీ మేరకు 27% ఐఆర్ ఇస్తే, చంద్రబాబు 2024 ఎన్నికల్లో అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక వాటిని అటకెక్కించారనే చర్చ ఉద్యోగ వర్గాల్లో పెద్దఎత్తున జరుగుతోంది.

ఐదేళ్లలో 11 డీఏలు ఇచ్చిన జగన్

ఏ ప్రభుత్వం ఉన్నా ఏడాదికి రెండుసార్లు డీఏ ఇస్తుంది. కానీ నాలుగు డీఏలు పెండింగ్‌లో ఉంటే చంద్రబాబు ఇప్పుడు ఒకటి ఇవ్వడానికే పెద్ద హడావుడి చేయడం ఉద్యోగ వర్గాలను తీవ్ర ఆగ్రహానికి గురిచేస్తోంది. ఉద్యోగ సంఘాల నాయకులతో మంత్రివర్గ ఉపసంఘం సుదీర్ఘ సమావేశం నిర్వహించడం, ఆ తర్వాత సీఎం చంద్రబాబు వారితో సమావేశమవడం వంటి పరిణామాలను చూసి, ఐఆర్, పీఆర్సీసహా తమ డిమాండ్ల పరిష్కారం దిశలో కీలకమైన నిర్ణయాలు తీసుకుంటారని ఉద్యోగులు ఎదురు చూశారు. కానీ అంత కసరత్తు తర్వాత డీఏ తప్ప ఇతర ఏ ముఖ్యమైన ప్రకటనా లేకపోవడంతో లక్షలాది మంది ఉద్యోగులు హతాశులయ్యారు. వైఎస్ జగన్ 2019–24 మధ్య ఐదేళ్లలో 11 డీఏలు ఇచ్చారని, చంద్రబాబు 2014–19 మధ్య ఏడు డీఏలు మాత్రమే ఇచ్చారని చర్చించుకుంటున్నారు. చంద్రబాబు ఎప్పుడు అధికారంలో ఉన్నా డీఏల కోసం పోరాటం తప్పని పరిస్థితి నెలకొందనేది ఉద్యోగ సంఘాల ఆవేదనగా ఉంది. అధికారంలోకి వచ్చిన తర్వాత 16 నెలలుగా ఐఆర్ విషయాన్ని పట్టించుకోకపోవడంపై నిరాశ చెందుతున్నారు.

పీఆర్సీ ఇచ్చే ఉద్దేశమే లేదా?

వెసులుబాటు ఉన్నప్పుడు పీఆర్సీ ఇస్తామనడం, దాని గురించి అడగవద్దనడం ఏమిటని ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పీఆర్సీ రెండు, మూడేళ్ల తర్వాతైనా ఇచ్చే ఉద్దేశం ఉంటే కనీసం కమిషన్‌ను నియమించేవారని ఉద్యోగులు చర్చించుకుంటున్నారు. ప్రస్తుతం 12వ పీఆర్సీ కమిషన్ ఉనికిలో లేదు. చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తర్వాత ఆయన కోటరీ ఒత్తిడితో పీఆర్సీ కమిషనర్ అనూహ్యంగా రాజీనామా చేశారు. ఆయన స్థానంలో చంద్రబాబు మరొకరిని నియమించలేదు. పీఆర్సీ ఇచ్చే ఉద్దేశం ఉంటే కనీసం కమిషనర్‌ను నియమించడానికి అంగీకరించేవారు. కమిషన్ ఏర్పాటైతే పరిశీలన, అధ్యయనం తర్వాత ఏడాదికో, రెండేళ్లకో నివేదిక ఇచ్చేది. ఆ తర్వాత దానిపై ఉద్యోగ సంఘాలతో చర్చలు, ప్రభుత్వం సమాలోచనలు జరిపి ఒక ఏడాది తర్వాతైనా ఆ నివేదికనో, అందులోని కొన్ని అంశాలనో ఆమోదించి, పీఆర్సీ ఇవ్వడానికి వీలవుతుంది. అయితే పరిస్థితి చూస్తుంటే, 2029 ఎన్నికల్లోపు పీఆర్సీ ఇచ్చే ఉద్దేశం ప్రభుత్వానికి లేదని స్పష్టమవుతోందని ఉద్యోగులు ఆవేదన చెందుతున్నారు.

బకాయిలపైనా మోసమే

ఉద్యోగులకు రావాల్సిన పెండింగ్ బకాయిలు రూ.34,125 కోట్లు ఎప్పుడు ఎంత ఇస్తారో కూడా చెప్పకపోవడాన్ని బట్టి ఉద్యోగులు ఆ విషయంలోనూ మోసపోయినట్లేనని భావిస్తున్నారు. ఈ బకాయిల్లో పోలీసులకు సంబంధించి ఇవ్వాల్సిన రెండు ఎర్న్‌డ్ లీవుల్లో ఒకటి ఇవ్వడానికి అంగీకరించారు. దాని విలువ రూ.210 కోట్లు. ఆ మొత్తాన్ని రెండు విడతలుగా నవంబర్, డిసెంబర్‌లో ఇస్తామని చెప్పారు. అంటే రూ.34 వేల కోట్లకుపైగా బకాయిల్లో రూ.210 కోట్ల బకాయిలను జనవరికి విడుదల చేసేందుకు ఒప్పుకున్నారు. మిగిలిన రూ.33,915 కోట్ల బకాయిలు ఎప్పటికి వస్తాయో ఆ దేవుడికే తెలియాలనేలా పరిస్థితి ఉందని ఉద్యోగులు వాపోతున్నారు. పోలీసులకు ఇస్తామన్న ఎర్న్‌డ్ లీవులపైనా చంద్రబాబు ట్విస్ట్ ఇచ్చారు. రెండు ఎర్న్‌డ్ లీవ్‌లు ఇవ్వడానికి గతంలోనే ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ఒప్పుకున్నారు. గత సంక్రాంతికే వాటిని ఇస్తామని చెప్పారు. కానీ ఇవ్వలేదు. ఇప్పుడు చంద్రబాబు ఇస్తానన్న రెండింటిలో ఒక దానికి ఎగనామం పెట్టి ఒకటి ఇవ్వడానికి తలూపడంతో పోలీసులు నివ్వెరపోతున్నారు.

సీపీఎస్‌పైనా కప్పదాటు వైఖరి

కూటమి ఎన్నికల మేనిఫెస్టోలో సీపీఎస్, జీపీఎస్ విధానాలను సమీక్షించి జీపీఎస్ కంటే మెరుగైన అందరికీ ఆమోదయోగ్యమైన విధానాన్ని తెస్తామని ప్రకటించారు. కానీ ఇప్పటివరకూ ఆ ఊసే ఎత్తలేదు. కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తూ వైఎస్ జగన్ ప్రభుత్వం చట్టం చేయగా చంద్రబాబు దాన్ని తుంగలో తొక్కారు. మరోవైపు అవుట్‌సోర్సింగ్ ఉద్యోగాలపై మళ్లీ పాత విధానం తెచ్చేందుకు ప్రయత్నిస్తూ ఆప్కాస్‌ను ఎత్తివేయడానికి సిద్ధమవుతుండడంతో వారు లబోదిబోమంటున్నారు.

సచివాలయాల ఉద్యోగుల ఆవేదన

సచివాలయ వ్యవస్థను చంద్రబాబు ప్రభుత్వం నిర్వీర్యం చేయడం పట్ల ఉద్యోగుల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. తమను వాలంటీర్లుగా మార్పించన్లు, సర్వేలు వంటి పనులు చేయించుకుంటూనే, ఆ వ్యవస్థ పట్ల సీఎం చంద్రబాబు తక్కువగా మాట్లాడటం వారిని బాధిస్తోంది. పరిపాలనా వ్యవస్థను గడపగడపకూ తీసుకెళ్లేందుకు గత జగన్ ప్రభుత్వం ఈ వ్యవస్థ ద్వారా 1.26 లక్షల మందిని నియమించి చక్కటి ఫలితాలు సాధించగా, ప్రస్తుతం తమకు తగిన సౌకర్యాలు కల్పించకపోవడమే కాకుండా, అవమానకరంగా వ్యవహరిస్తున్నారని ఉద్యోగులు విమర్శిస్తున్నారు. ఇదే సమయంలో విద్యుత్ ఉద్యోగుల సమస్యలపై కూడా ప్రభుత్వం స్పందించకపోవడం ఆందోళనకు దారితీస్తోంది.

చంద్రబాబు వంచనపై ఉద్యోగుల ఆవేదన



ఉద్యోగస్తులు, పెన్షనర్స్

- సీపీయస్/జీపీయస్ విధానాన్ని పునఃసమీక్షించి ఆమోదయోగ్యమైన పరిష్కారానికి కృషి చేస్తాం
- ఉద్యోగులకు మెరుగైన పీఆర్సీ అమలు చేస్తాం. అలవెన్స్ పేమెంట్స్ పైన కూడా పునఃపరిశీలన చేస్తాం. ప్రభుత్వ ఉద్యోగులకు కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే ఐఆర్ ప్రకటిస్తాం
- రాష్ట్రంలోని ఉద్యోగులకు, పెన్షనర్స్‌కు ప్రతి నెలా 1వ తారీఖున జీతాలు, పెన్షన్‌లు చెల్లిస్తాం. వీరికి రావాల్సిన బకాయిలు కూడా చెల్లించే ఏర్పాటు చేయబడుతుంది. పెన్షనర్స్ కార్పొరేషన్ ఏర్పాటు దిశగా చర్యలు.
- తక్కువ జీతాలు పొందే అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్టు, కన్సాలిడేటెడ్ ఉద్యోగులకు ప్రభుత్వ పథకాలు వర్తింపు
- వాలంటీర్ల గౌరవ వేతనం రూ.5 వేల నుంచి రూ.10 వేలకు పెంపు

గత ఎన్నికల సమయంలో టీడీపీ మేనిఫెస్టోలో ఉద్యోగులకు ఇచ్చిన హామీలు

ఉద్యోగులంటే చంద్రబాబుకు అలుసా..!

ఉద్యోగులపై పెడుతున్న వ్యయాన్ని వైఎస్ జగన్ అనవసరంగా పెంచేశారన్న బాధ ముఖ్యమంత్రిలో స్పష్టంగా కనిపిస్తోందని ఉద్యోగ సంఘాల నేతలు పేర్కొంటున్నారు. మనసులో వారి పట్ల వ్యతిరేకతను నింపుకునే ఎన్నికల్లో ఓట్ల కోసం ఇష్టం వచ్చినట్లు హామీలు గుప్పించారని, ఇప్పుడు మాత్రం తన అసలు స్వరూపాన్ని బయటపెట్టుకున్నారని ఉద్యోగులు విమర్శిస్తున్నారు. అనుద్పాతక వ్యయం పెరిగిపోతుందని చెబుతున్న ఆయన, ఎన్నికల మేనిఫెస్టోలో ఉద్యోగులకు అలవికాని హామీలు ఎందుకు ఇచ్చారని, తద్వారా వారిని ఎందుకు మోసం చేశారని ఉద్యోగ సంఘాలు ప్రశ్నిస్తున్నాయి. తమకు చంద్రబాబు చేసిన ద్రోహం తీరనిదని, నమ్మించి గొంతు కోయడంలో ఆయన దిట్టన్న విషయం మరోసారి రుజువైందని ఉద్యోగులు వాపోతున్నారు.

ఉద్యోగులకు ఇచ్చిన హామీలు ఏమయ్యాయి?

- ఉద్యోగులకు ఇచ్చిన 9 హామీల్లో ఒక్క దాని గురించి కూడా సీఎం మాట్లాడలేదు
- పీఆర్సీ మీద ప్రకటన చేస్తారని ఉద్యోగులు ఆశగా ఎదురు చూశారు
- చర్చలకు వెళ్లిన సంఘాల నాయకులు హామీల గురించి ప్రశ్నించకపోవడం బాధాకరం
- గవర్నమెంట్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ అధ్యక్షుడు కె.వెంకట్రామిరెడ్డి



సాక్షి, అమరావతి : ఎన్నికల్లో ఉద్యోగులకు ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా అమలు చేయకుండా పెండింగ్ డీఏల్లో ఒక్కటే ఇస్తూ దాన్నే గొప్పగా ప్రభుత్వం ప్రచారం చేసుకోవడం బాధాకరమని గవర్నమెంట్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ అధ్యక్షుడు కె. వెంకట్రామిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. తమకిచ్చిన 9 హామీలు అమలు చేస్తారని ఉద్యోగులు ఆశగా ఎదురుచూస్తుంటే అవి వదిలేసి రెగ్యులర్‌గా ఇవ్వాల్సిన డీఏల్లో ఒక్కటి ఇవ్వడానికి ప్రభుత్వం అంత హడావుడి చేయడం ఏమిటని ప్రశ్నించారు. తాడేపల్లిలోని తమ సంఘ కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. గత ప్రభుత్వాలన్నీ ఏడాదికి రెండు డీఏలు ఇచ్చాయని, ఇప్పుడు ఒక్క పెండింగ్ డీఏ కోసం ఇంత హడావుడి చేయడాన్ని ఉద్యోగులు ఎప్పుడూ చూడలేదన్నారు. 16 నెలలపాటు ఉద్యోగులను పట్టించుకోకుండా డీఏ ఇవ్వడమే గొప్ప విషయమని చెప్పడానికే హంగామా చేసినట్లు కనబడుతోందని చెప్పారు. ఎన్నికల్లో ఉద్యోగులకు ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా ప్రభుత్వం అమలు చేయలేదని విమర్శించారు. ఆ హామీల్లో డీఏ లేదని అది రెగ్యులర్‌గా వచ్చేదేనని తెలిపారు. గత సంక్రాంతికి పోలీసులకు రెండు ఎస్ఎల్‌లు ఇస్తామని ఆర్థిక మంత్రి చెప్పారని, కానీ ఇప్పుడు సీఎం మాత్రం ఒక్కటి మాత్రమే ఇస్తామని అది కూడా రెండు విడతలుగా ఇస్తామని చెప్పారని అన్నారు. ఉద్యోగులకు ఇచ్చిన హామీల్లో ఐఆర్ ఒకటని దాని గురించి తమ సంఘాల నాయకులు అడిగారో లేదో తెలియదని పేర్కొన్నారు.

ఉద్యోగుల వైపు చూసేందుకే 16నెలలు

ఉద్యోగుల వైపు చూడ్డానికే సీఎంకు 16 నెలలు పట్టిందని ఇక పీఆర్సీ ఎప్పుడు ఇస్తారని వెంకట్రామిరెడ్డి ప్రశ్నించారు. ఉద్యోగులంతా పీఆర్సీపై ప్రకటన వస్తుందని ఎదురు చూశారని, కనీసం పీఆర్సీ కమిషన్‌ను నియమిస్తారని ఆశించారని, కానీ దాన్నే నియమించకపోతే ఇక పీఆర్సీ ఎలా ఇస్తారని ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. ఉద్యోగులకు ఇవ్వాల్సిన పెండింగ్ బకాయిలు ఎప్పుడు విడుదల చేస్తారో కూడా చెప్పలేదన్నారు. ఉద్యోగులు తమ బకాయిలను మరచిపోవాల్సిందేనా అని ప్రశ్నించారు. ప్రభుత్వానికి ఉద్యోగుల పట్ల చిత్తశుద్ధి ఎక్కడ ఉందని ప్రశ్నించిన ఆయన సమావేశానికి హాజరైన తమ సంఘాల నాయకులు ఎందుకు సైలెంట్‌గా ఉన్నారో అర్థం కావడం లేదన్నారు. సీపీఎస్ హామీపైనా మాట్లాడకపోవడం విచారకరమని పేర్కొన్నారు. కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులను ప్రభుత్వం మోసం చేసిందన్నారు. కరోనా వంటి ఏదైనా ఉపద్రవం వస్తే ఉద్యోగులు అర్థం చేసుకుంటారని కానీ ఇప్పుడు అలాంటి పరిస్థితి ఏదీ లేకపోయినా ఉద్యోగులకు ఇస్తామన్న వాటిని ఇవ్వడంలేదని విమర్శించారు. ఒక్క డీఏ ఇవ్వడానికి సంవత్సరన్నర పడితే మిగతా సమస్యలు ఎప్పుడు పరిష్కరిస్తారని ప్రశ్నించారు. ఉద్యోగ సంఘాలను భయపెట్టి ఒప్పించినా ఉద్యోగులు ఊరుకోరని అన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా ఉద్యోగుల ఆవేదనను అర్థం చేసుకోవాలన్నారు. గ్రామ/వార్డు సచివాలయ ఉద్యోగులు 1.26 లక్షల మంది కలిశారు కాబట్టే గ్రామస్థాయిలో సేవలు బాగున్నాయని, వాళ్ల జీతాలు చాలా తక్కువని వెంకట్రామిరెడ్డి పేర్కొన్నారు.

మంత్రివర్గ కమిటీ అంటే మోసం చేయడమే..

వైఎస్సార్‌టీఏ రాష్ట్ర ట్రెజరర్ వి.రెడ్డి శేఖర్‌రెడ్డి

సాక్షి, అమరావతి : రాష్ట్ర ప్రభుత్వోద్యోగులకు చట్ట ప్రకారం రావాల్సిన ఆర్థిక ప్రయోజనాలు ఇచ్చేందుకు టీడీపీ కూటమి ప్రభుత్వం మంత్రివర్గ కమిటీ ఏర్పాటుచేయడమంటే మోసం చేయడమేనని వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ (వైఎస్సార్టీఏ) రాష్ట్ర ట్రెజరర్ వి.రెడ్డి శేఖర్‌రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో విమర్శించారు. మంత్రివర్గ ఉప సంఘంతో ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఒరిగేదేమీలేదన్నారు. ఆర్థిక ఇబ్బందులు ప్రభుత్వానికే కాదని, ఉద్యోగులకు కూడా ఉన్నాయన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక పండుగల వేళ ఉద్యోగుల కుటుంబాల్లో సంతోషంలేదని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయులపట్ల ముఖ్యమంత్రికి సానుకూల వైఖరి ఉంటే తక్షణమే 12వ పీఆర్సీకి చైర్మన్‌ని నియమించి మధ్యంతర భృతి 30 శాతం ప్రకటించాలని డిమాండ్ చేశారు.


పరీక్షల్లో ప్రభుత్వం ఫెయిల్!


ఈ ఏడాది అన్ని పరీక్షలకు ఒకే అసెస్‌మెంట్ పుస్తకం

రూ.75 కోట్లు ఖర్చు చేసి 1.50 కోట్ల పుస్తకాల ముద్రణ

- అవగాహన కల్పించకుండా విద్యార్థులకు పంపిణీ
- ముగిసిన ఎఫ్‌ఏ-1 జవాబులు ఎఫ్‌ఏ-2లో రాసిన వైనం
- ఉపాధ్యాయులకూ తప్పని తిప్పలు

సాక్షి, అమరావతి: ప్రభుత్వ పాఠశాలల్లో పరీక్షల నిర్వహణకు 2025–26 విద్యా సంవత్సరానికి అందుబాటులోకి తెచ్చిన కొత్త విధానం అమలులో కూటమి ప్రభుత్వం విఫలమైంది. కనీస అవగాహన కల్పించకుండా తెచ్చిన అసెస్‌మెంట్ పుస్తకాలు అటు విద్యార్థులకు ఇటు ఉపాధ్యాయులకు పరీక్ష పెడుతున్నాయి. రెండు నెలల క్రితం జరిగిన ఫార్మెటివ్ అసెస్‌మెంట్ (ఎఫ్‌ఏ 1) జవాబులను విద్యార్థులు ఫార్మెటివ్ అసెస్‌మెంట్ (ఎఫ్‌ఏ 2)లో రాశారు. దీంతో ప్రస్తుతం జరుగుతున్న ఎఫ్‌ఏ-2 పరీక్షల జవాబులు ఎక్కడ రాయించాలో తెలియక ఉపాధ్యాయులు తలలు పట్టుకుంటున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో 1 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న సుమారు 32 లక్షల మంది విద్యార్థుల కోసం రూ.75 కోట్లు ఖర్చు చేసి 1.50 కోట్ల అసెస్‌మెంట్ పుస్తకాలను ముద్రించారు. ఈ పుస్తకాల్లో పరీక్షలు రాయడంలో విద్యార్థులు తికమక పడుతున్నా విద్యాశాఖ దిద్దుబాటు చర్యలు చేపట్టడం లేదు.





విద్యార్థులు పరీక్షల రాసిన ఆన్సర్ బుక్‌లెట్ పేజీలు (ఫైల్)

ఆరు పరీక్షలకు ఒక్కటే పుస్తకం..

గతంలో సంప్రదాయ పరీక్షా విధానంలో ప్రశ్నాపత్రం ఇచ్చి పేపర్‌పై జవాబులు రాయించేవారు. జవాబు పత్రాలను ఉపాధ్యాయులు సులభంగా మూల్యాంకనం చేసేందుకు వీలుండేది. కూటమి ప్రభుత్వం పరీక్షల కోసం ఈ ఏడాది కొత్తగా అసెస్‌మెంట్ పుస్తకం విధానాన్ని తెచ్చింది. విద్యార్థులు మొత్తం ఆరు పరీక్షలను ఇదే పుస్తకంలో రాయాలి. అయితే చాలా మంది విద్యార్థులకు దీనిపై అవగాహన లేక ముగిసిన ఎఫ్‌ఏ-1 పరీక్షల జవాబులను ఎఫ్‌ఏ-2, ఎస్‌ఏ-1 (అర్ధవార్షిక పరీక్ష)లో రాశారు. దీంతో ఇప్పుడు జరుగుతున్న ఎఫ్‌ఏ-2 జవాబులు ఎక్కడ రాయాలో తెలియని పరిస్థితి నెలకొంది.

టీచర్లకు తలకు మించిన భారం..

పాత విధానంలో సమాధానానికి తగినట్లుగా ఉపాధ్యాయులే మార్కులు వేసేవారు. కానీ కొత్త విధానంలో మార్కులను ఉపాధ్యాయులు బబ్లింగ్ చేయాలి. వ్యాసరూప ప్రశ్నలకు 8 మార్కులు అనుకుంటే విద్యార్థి రాసిన జవాబుకు 0 – 8 మార్కులు కేటాయిస్తారు. ఆ మార్కులను నంబర్ రూపంలో కాకుండా ఓఎంఆర్ షీట్‌పై టీచర్ బబుల్ చేయాలి. అసెస్‌మెంట్ బుక్‌లో ప్రతి విద్యార్థికి ఉపాధ్యాయుడి నివేదిక రాత రూపంలో కచ్చితంగా చూపించాలి. దీంతోపాటు విద్యార్థులు రాసిన జవాబు పత్రాల ఓఎంఆర్ షీట్లను స్కాన్ చేసి లీప్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. ప్రాథమిక తరగతుల్లో నాలుగు చొప్పున, ఉన్నత తరగతుల్లో ఆరు పరీక్షలకు సంబంధించిన పత్రాలను స్కాన్ చేయాలి. ఇది ఉపాధ్యాయులకు తలకు మించిన భారమని వాపోతున్నారు. ఎఫ్‌ఏ-1 పరీక్షల జవాబులు మూల్యాంకనం చేసేందుకు ఉపాధ్యాయులు నానా కష్టాలు పడ్డారు. ఈ క్రమంలో పరీక్షలంటేనే హడలిపోతున్నారు.

రూ.75 కోట్లు వృథా ఖర్చు!

విద్యార్థులకు ఉచితంగా అందించే పాఠ్య పుస్తకాల ముద్రణలో రూ.30 కోట్లు ఆదా చేసినట్టు గొప్పలు చెప్పుకుంటున్న కూటమి ప్రభుత్వం.. అసెస్‌మెంట్ పుస్తకాలకు రూ.75 కోట్లు వ్యయం చేసినట్లు తెలుస్తోంది. తమకు కావాల్సిన ప్రింటర్లకు కాంట్రాక్టులు కట్టబెట్టి భారీగా లబ్ధి పొందినట్లు ఆరోపణలున్నాయి. ఇంత పెద్ద మొత్తంలో ప్రజాధనాన్ని వెచ్చించి విఫల విధానాన్ని బలవంతంగా అమలు చేస్తోందని ఉపాధ్యాయులే విమర్శిస్తున్నారు. ప్రభుత్వ విధానాలపై ఇప్పటికే ఉపాధ్యాయులు 'యాప్ డౌన్' విధానాన్ని ప్రకటించారు. హాజరు, మధ్యాహ్న భోజనం యాప్‌లు మినహా మిగతా ఆన్‌లైన్ సర్వీసులు నిర్వహించబోమని ప్రకటించారు. ప్రస్తుతం జరుగుతున్న పరీక్షల మూల్యాంకనం సైతం యాప్‌లో నమోదు చేసే పరిస్థితి కనిపించడం లేదు.

ఎస్వీ జూపార్క్‌లో పెద్దపులి మృతి




తిరుపతి (అన్నమయ్య సర్కిల్): శ్రీ వేంకటేశ్వర జియోలాజికల్ పార్కు (ఎస్వీ జూపార్క్)లో వైట్ టైగర్ సమీర్ (పెద్దపులి) వృద్ధాప్యం కారణంగా మృతి చెందినట్లు పార్క్ అధికారులు తెలిపారు. 19 ఏళ్ల ఈ పెద్ద పులి ఆదివారం తెల్లవారు జామున తుది శ్వాస విడిచినట్లు చెప్పారు. శవపరీక్ష నివేదికలో మూత్రపిండాల్లో నీటి నిల్వ, వృద్ధాప్యం వల్ల మరణం సంభవించినట్లు తేలిందని చెప్పారు. సమీర్ అనే ఈ పులి 2011లో హైదరాబాద్‌లోని నెహ్రూ జూలాజికల్ పార్క్ నుంచి తిరుపతి జూలాజికల్ పార్క్‌కు వచ్చినట్లు తెలిపారు.

ఏపీని ఏఐకి చిరునామాగా మారుద్దాం: సీఎం చంద్రబాబు

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌ను ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ)కు చిరునామాగా మారుద్దామని సీఎం చంద్రబాబు అన్నారు. నవంబర్ 14, 15 తేదీల్లో విశాఖలో నిర్వహించనున్న భాగస్వామ్య సదస్సులో పెట్టుబడులతో పాటు వివిధ అంశాలపై నాలెడ్జ్ షేరింగ్ జరిగేలా కార్యాచరణ చేపట్టాలని ఆదేశించారు. ఆదివారం తన క్యాంపు కార్యాలయంలో సీఎం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దావోస్ తరహాలోనే విశాఖ సదస్సులో కూడా పెట్టుబడిదారులు, పాలసీమేకర్ల మధ్య చర్చలు జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఏఐ ఫర్ గుడ్, సెమీ కండక్టర్స్, ఆరోగ్యం, ఇన్నోవేషన్, స్పేస్, డ్రోన్, ఎలక్ట్రానిక్స్, మెడ్‌టెక్ వంటి అంశాలపై సదస్సులో చర్చించాలన్నారు. ప్రస్తుతం అమలు చేస్తున్న పారిశ్రామిక విధానాల వల్ల ప్రముఖ కంపెనీలు పెట్టుబడులతో ముందుకు వస్తున్నాయని చెప్పారు. గూగుల్ విశాఖలో డేటా హబ్ ఏర్పాటు చేస్తోందన్నారు. మానవ వనరులే మనకు ఉన్న అతిపెద్ద మూలధనమన్నారు. పరిశ్రమలకు అవసరమైన మానవ వనరుల అభివృద్ధి నిరంతర ప్రక్రియగా జరగాలని సూచించారు.

ఒక్క డీఏతో దీపావళి చేసుకోవాలా?

- చంద్రబాబు ప్రచారార్భాటం తప్ప ఏమీ లేదు
- వైఎస్సార్‌సీపీ నేత, మాజీ మంత్రి కురసాల కన్నబాబు



కాకినాడ రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఒక్క డీఏతో ఉద్యోగులు దీపావళి పండగ చేసుకోవాలా అని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర జిల్లాల రీజినల్ కో ఆర్డినేటర్ కురసాల కన్నబాబు ప్రశ్నించారు. కాకినాడలో ఆదివారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. టీడీపీ అనుకూల పత్రికలు చూస్తే ఈ ప్రభుత్వం ఉద్యోగులకు దీపావళి ధమాకా, దీపావళి కానుక ఇచ్చినట్లు రాశాయని, వాస్తవానికి ఉద్యోగులకు నాలుగు డీఏలు ఇవ్వాల్సి ఉందని పేర్కొన్నారు. సీఎం చంద్రబాబు ప్రచారార్భాటం తప్ప ఒక్క డీఏతో ఉద్యోగులకు ఒనగూరేదేమీ లేదన్నారు. ఉద్యోగులకు ఈ ప్రభుత్వం రూ.31 వేల కోట్ల మేర బకాయి పడిందని పేర్కొన్నారు. సీపీఎస్, ఓపీఎస్‌ను పునస్సమీక్షిస్తామని, న్యాయమైన పరిష్కారం చూపిస్తామని హామీ ఇచ్చి సుప్రీంకోర్టు పేరుతో అటకెక్కించారని విమర్శించారు. పీఆర్‌సీ ఊసే ఎత్తడం లేదని ధ్వజమెత్తారు. ఉద్యోగ సంఘాల నేతలను శనివారం హడావుడిగా పిలిపించి, కేబినెట్ సబ్‌కమిటీ ఏర్పాటు చేసి, కేవలం ఒక్క డీఏ ఇస్తామని మమ అనిపించారని పేర్కొన్నారు. ఆ డీఏతో ఉద్యోగులు సంబరపడిపోతున్నారని అనుకుంటే అది మీ ఫెయిల్యూర్ అవుతుందని కన్నబాబు చంద్రబాబు సర్కారును హెచ్చరించారు. వైఎస్ జగన్ 2.66 లక్షల మంది వలంటీర్లను నియమిస్తే వారికి ఎన్నికల ముందు రూ.10 వేల గౌరవ వేతనం ఇస్తామని నమ్మించి మోసం చేసిన చంద్రబాబు ఇప్పుడు ఆ వ్యవస్థ దండగంటున్నారని కన్నబాబు మండిపడ్డారు. సచివాలయాల్లో 1.26 లక్షల మంది ఉద్యోగులను జగన్ నియమిస్తే వారిని కుదించే యత్నం చంద్రబాబు చేస్తున్నారని కన్నబాబు ధ్వజమెత్తారు.



చీకటిని చీకటి తరిమి కొట్టలేదు. వెలుగు మాత్రమే ఆ పని చేయగలదు. ద్వేషాన్ని ద్వేషం రూపుమాపలేదు. ప్రేమకు మాత్రమే ఆ శక్తి ఉంటుంది.

– మార్టిన్ లూథర్ కింగ్ జూనియర్

సాక్షి

సోమవారం, 20 అక్టోబర్ 2025

చీకటి వెలుగుల రంగేళి

భాషలో అదో విచిత్రం. వ్యతిరేక పదాలు పక్కపక్కనే ఉంటాయి, జంటగా సాగుతూ ఉంటాయి; మంచి–చెడు, పాపం–పుణ్యం, కీర్తి–అపకీర్తి; అలాగే, వెలుగు–చీకటి! అసలు జగత్తులో ఉన్నదంతా చీకటే, వెలుగు రాగానే అది మాయమవుతుంది. వెలుగు నిచ్చేది దీపం. ప్రకృతి వెలిగించిన అతిపెద్ద దీపం సూర్యుడు. ఆయన సంచారానికి వెడుతూ వెడుతూ తన కాంతిని నింపి ఆకాశపు నట్టింట ఉంచే చిన్నా, పెద్దా ప్రమిదలే నక్షత్రాలూ, చంద్రుడూ. తెలతెల్లని సూర్యుడు ఉదయించగానే, నల్లని పెనుచీకటులన్నీ కాకుల్లా ఎగిరిపోయాయంటాడు ఓ కవి. మనిషి జీవితంతో పడుగూ పేకలా అల్లుకుపోయిన ఉపమానం 'చీకటి వెలుగు'లను మించి మరొకటి లేదు. అందుకే, 'చీకటి వెలుగుల రంగేళి, జీవితమే ఒక దీపావళి' అంటాడొక సినీకవి. 'దీపాలు బాగుంటాయి, పాపల్లాంటి దీపాలు, కనుపాపల్లాంటి దీపాలు, దీపం ఆసరాతో చీకటి నైజాన్ని తెలుసుకో, పాపం ఆసరాతో మానవుడి నైజాన్ని తెలుసుకో' అంటాడు – కవి తిలక్. దీపోపమానం మహాకవి కాళిదాసుకు ఏకంగా దీపశిఖ అనే బిరుదునే తెచ్చిపెట్టింది. విదర్భ రాకుమారి ఇందుమతీదేవి స్వయంవర సభలో వరమాల పుచ్చుకుని ఒక్కొక్క రాజునే దాటివెడుతున్నప్పుడు అచ్చం దీపశిఖలా ఉందని తన రఘు వంశ కావ్యంలో వర్ణిస్తాడాయన. ఆమె తనను సమీపించగానే ఆశతో వెలిగిపోయిన రాజుల ముఖాలు, తమను దాటిపోగానే నిరాశతో నల్లబడిపోయాయంటాడు. రఘు మహారాజు కొడుకు అజుడు – ఒక దీపం వెలిగించిన మరో దీపంలా – రూపంలో, శౌర్యంలో, ఔన్నత్యంలో ముమ్మూర్తులా తండ్రి పోలికేనంటాడు. అంటుకున్న అడవి దీపాలతో రాత్రిళ్ళు చీకటిని జయించే తొలిపాఠాలు మనిషికి నేర్పింది కూడా ప్రకృతే. అప్పటినుంచి సంస్కృతీ, నాగరికతల మీదుగా మనిషి వెలుగుల ప్రస్థానం బహుముఖ దీపతోరణాలతో ముందుకు సాగుతూ జీవితాన్ని నిత్య దీపావళిగా మలుస్తూనే ఉంది.

'ఆరని ఎర్రని దీపంగా, నిరంతర జీవన తాపంగా, తనను తాను కాల్చుకుని భస్మమయే మోహన శాపం'గా కూడా తిలక్ అభివర్ణించిన దీపం, దేశ కాల మత భేదాలకు అతీతంగా సర్వత్రా మనిషికి దారిదీపమవుతూనే ఉంది. దీపాల వరుసలతో ఇళ్ళు, గుళ్ళు, రహదారులతో సహా సమస్త పరిసరాలనూ సముజ్జ్వలం చేయడం పితృదేవతాహ్వానంలో భాగంగానే మొదలైందంటారు. మెక్సికోతో మొదలుపెట్టి, కంబోడియా, బర్మా, చైనా, జపాన్, ఈజిప్టు, రోమ్ సహా దాదాపు ప్రపంచ వ్యాప్తంగా ఏదో ఒక రూపంలో దివ్వెల పండుగ జరుపుకోవడం పరిపాటిగా వస్తోంది. మన దగ్గర దీపావళి పండుగ మూలాలు అతిప్రాచీన కాలంలోనే ఉన్నాయనీ, 'ఉల్కాదానం' పేరిట అది మన పురాణాలకు ఎక్కిందనీ, దీపాలు వెలిగించడంతోపాటు, సూరేకారం వంటివి ఉపయోగించి పేలుళ్లను సృష్టించడం కూడా అప్పటినుంచీ ఉందని అంటున్నవారూ ఉన్నారు. నింగీనేలా దద్దరిల్లే పెను శబ్దాలతో, ఆకసాన చిత్రవిచిత్ర కాంతులతో రంగుల రంగవల్లులు తీర్చే బాణాసంచా వాడకం మాత్రం మనకు పదిహేనవ శతాబ్దిలోనే పరిచయమైందనీ, బహుశా అది చైనా నుంచి వ్యాపించిందనీ, తుపాకీ మందు కనిపెట్టడం దానికి ప్రారంభమనీ అంటున్నారు. ఆ విధంగా తుపాకీ మందుతో జమిలిగా అల్లుకున్న బాణాసంచా రాజులకు యుద్ధ, వినోదాలు రెంటిటోనూ అలరిస్తూ వచ్చిందనీ, పోర్చుగీసు వర్తకుల ద్వారా తమకు పరిచయమైన బాణాసంచా ధగధగలను, ఫెళఫెళలను విజయనగర రాజులు నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ఆస్వాదించేవారనీ చరిత్ర.

అయితే, 'చీకటి వెలుగుల' మధ్య ఎడం లేకపోవడం భాషావైచిత్రే కాక, ప్రకృతి వైచిత్రి కూడా! పెద్ద ఎత్తున బాణసంచా జోడింపుతో రానురాను దీపావళి వెలుగులు పర్యావరణ, ప్రజారోగ్యపరమైన సమస్యల చీకట్లనూ వెంటబెట్టుకుని వస్తున్నాయి. సమస్య తీవ్రరూపం ధరించడంతో, ఢిల్లీలో బాణసంచా వాడకంపై పూర్తి నిషేధం విధించిన సుప్రీంకోర్టు తాజాగా కొన్ని ఆంక్షలూ, హెచ్చరికలతో ఆ నిషేధాన్ని సడలించింది. కాలుష్యాన్ని తగ్గించే బాణసంచా రకాల వాడకంతోపాటు నిర్దిష్ట సమయాల్లో, నిర్దిష్ట కాల పరిమితుల్లో మాత్రమే బాణసంచా వినియోగించాలని ప్రభుత్వాలూ చెవినిల్లు కట్టుకుని చెబుతున్నాయి. బాణసంచా కాల్పులకు ప్రత్యేక స్థలాలను కేటాయించడం ద్వారా అమెరికా లాంటి కొన్ని దేశాలు ఈ సమస్యను ఉభయతారకంగా పరిష్కరించుకున్నాయి. ఆ ఒరవడిని ఇప్పటికిప్పుడు మనం పూర్తిగా అనుసరించలేమనుకున్నా, ఇతోధిక జాగ్రత్తలు అత్యవసరం. కాటుక, కన్నే పోగొట్టకూడదు; వెలుగుల విస్ఫోటం చీకటి వాకిట మనల్ని నిలబెట్టకూడదు. అతి అనర్థం, మితిలోనే అందం, ఆనందం.

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజ మాసం, **తిథి:** బ.చతుర్దశి ప.2.38 వరకు, తదుపరి అమావాస్య, **నక్షత్రం:** హస్త రా.8.12 వరకు, తదుపరి చిత్త, **వర్జ్యం:** తె.4.55 నుండి 6.39 వరకు (తెల్లవారితే మంగళవారం), **దుర్ముహూర్తం:** ప.12.09 నుండి 12.55 వరకు, తదుపరి ప.2.28 నుండి 3.14 వరకు, **అమృత ఘడియలు:** ప.1.51 నుండి 3.32 వరకు, **దీపావళి అమావాస్య, ధనలక్ష్మి పూజలు.**

సూర్యోదయం : 5.57
సూర్యాస్తమయం: 5.34
రాహుకాలం : ఉ.7.30 నుండి 9.00 వరకు
యమగండం : ఉ.10.30 నుండి 12.00 వరకు

సోషల్ టాక్

మనో మందిరం



ప్రతి వ్యక్తీ ధ్యానం ద్వారా అంతర్గత శాంతిని పొంది, అందరి పట్ల ప్రేమను పెంపొందించుకుంటే, మన గ్రహం మీద శాంతి నెలకొనడానికి ఎక్కువ కాలం పట్టదు. ధ్యానం మనకు అంతర్గత ప్రశాంతతను కనుగొనడంలో సహాయపడి దానిని బాహ్య ప్రపంచానికి ప్రసరింప చేస్తుంది.

– సంత్ రాజీందర్ సింగ్, ఆధ్యాత్మిక వేత్త

ఊరుమ్మడి కష్టం



మనం విడివిడి మనుషులుగా పైకి కనిపిస్తూ ఉండొచ్చు, కానీ లోలోపల అందరం అనుసంధానం అయి ఉంటాం. కష్టకాలం వచ్చినప్పుడు మనం ఒకరికొకరం చేయందించుకోవాలని అర్థం చేసుకోండి. మనిషికొచ్చే కష్టం మానవాళికి వచ్చిన కష్టం అన్నట్లుండాలి.

– మిషెల్ యో, మలేషియా నటి

ఎన్ని సాధించినా!



నా కెరీర్‌లో నేను గెలిచినవి, సాధించినవి ఎన్నో ఉన్నాయి. కానీ నా అత్యుత్తమ విజయాలు... నా పిల్లలు, నా కుటుంబం, వారితో మంచి తండ్రిగా, మంచి భర్తగా ఉండటం! అంతకంటే అత్యుత్తమమైన విజయం లేదని నేను నమ్ముతాను.

– డేవిడ్ బెక్‌హామ్, ఇంగ్లిష్ ఫుట్‌బాలర్

ఒత్తిడి వద్దు!



నేను తగినంత వ్యాయామం చేయను. కానీ నన్ను ఫిట్‌గా ఉంచేది ఆరోగ్యకరమైన శరీరంతో పాటుగా ఆహ్లాదకరమైన మనస్సు కూడా! ఏరోజుకారోజు జీవితాన్ని గడపటం వల్ల నిన్నటి ఒత్తిడి, రేపటి ఒత్తిడి లేకుంటే మనసు ఆరోగ్యంగానే కదా ఉంటుంది!

– నవోమీ క్యాంప్‌బెల్, బ్రిటిష్ మోడల్

ఎలాంటి వాళ్లైనా...



ఎవరినైనా ఒక మాట అనే ముందు, లేదా ఒకరి గురించి మాట్లాడే ముందు కాస్త వారి వైపు నుంచీ ఆలోచించండి. వారి పరిస్థితులు ఎలాంటివో, వారు అలా ఎందుకు ఉన్నారో మనకు తెలీదు. 'వాళ్లు అలాంటి వాళ్లు' అనేసే మాట... మనం ఎలాంటి వాళ్లమో కూడా చెబుతుంది.

– పరేశ్ రావల్, నటుడు

రెండూ మంచివే!



ఒక సమూహంలో ఉండటంలోని మంచి విషయం... మీరు ఏదీ కూడా ఒంటరిగా చేయనవసరం లేదు. ఒంటరిగా ఉండటంలోని అత్యుత్తమమైన విషయం... మీరు ఎవరికీ సమాధానం చెప్పాల్సిన అవసరం లేదు. మీకు కావలసిందే మీరు చేస్తారు.

– జస్టిన్ టింబర్లేక్, నట – గాయకుడు

చైనా డ్యామ్‌తో మహా విపత్తు

విశ్లేషణ



బ్రహ్మ చెలానీ

ప్రపంచ జల సంతులనాన్ని తలకిందులు చేసే పనికి చైనా ఒడిగడుతోంది. దాని పర్యవసానాలు వాతావరణ మార్పు అంశమంతటి తీవ్ర ప్రభావం చూపబోతున్నాయి. చైనా 168 బిలియన్ డాలర్లతో హిమాలయ సూపర్–డ్యామ్ నిర్మిస్తోంది. ఇది ప్రపంచంలో అత్యంత ఖర్చుతో కూడిన మౌలిక వసతి ప్రాజెక్టు మాత్రమే కాక, అంతర్జాతీయంగా అత్యంత ముప్పుతో కూడుకున్నది కావడం వల్ల భయాలు వ్యక్తమవుతున్నాయి. బీజింగ్ దీన్ని ఇంజినీరింగ్ అద్భుతంగా వర్ణిస్తోంది కానీ, నిజానికి దాన్ని ముంచుకొస్తున్న జీవావరణ మహా విపత్తుగా పేర్కొనాలి.

యాలంగ్ జంగ్పో నది మలుపు తిరిగి భారతదేశంలోకి ప్రవేశిస్తున్న చోటుకు కొద్ది వెనుకగా ఈ ఆనకట్టను నిర్మిస్తున్నారు. దీన్ని మనం బ్రహ్మపుత్ర నదిగా పిలుచుకుంటాం. చైనా ప్రధాని లీ చాంగ్ గత జూలైలో ఈ ఆనకట్టకు శంకుస్థాపన చేసి ప్రాజెక్టు గురించి అధికారికంగా ప్రకటించారు. కానీ, ఆనకట్ట నిర్మాణ పనులు కొంతకాలంగా సాగుతున్నాయని ఉపగ్రహ ఛాయాచిత్రాలు వెల్లడిస్తున్నాయి.

రహస్య నిర్మాణం

చైనా నాయకుడు ఒకరు ఒక ఆనకట్టకు శంకుస్థాపన చేయడం చివరిసారిగా 1994లో జరిగింది. యాంగ్ ‌చి నదిపై నిర్మించిన త్రీ గార్జెస్ డ్యామ్‌కు అప్పటి ప్రధాని లి పెంగ్ శంకుస్థాపన చేశారు. దాని కన్నా కూడా బ్రహ్మపుత్ర మెగా డ్యామ్ పరిమాణంలో చాలా పెద్దది. ఈ ప్రతీకాత్మకత మారుతున్న ప్రపంచంలో పెరుగుతున్న చైనా ఆశలతోపాటు, పెద్ద గండాన్ని సూచిస్తోంది.

త్రీ గార్జెస్ డ్యామ్‌ను మొదట్లో ఆధునిక వింతగా కీర్తించారు. ఇపుడు దాన్ని పర్యావరణ, సామాజికపరమైన వైపరీత్యంగా గుర్తిస్తున్నారు. దానివల్ల పది లక్షల మందికి పైగా నిర్వాసితులయ్యారు. ఈ డ్యామ్ తరచూ కొండచరియలు విరిగిపడటానికి కారణమవుతోంది. భూగోళ కంపన సుస్థిరత దెబ్బతింది. దాని బ్రహ్మాండ జలాశయం చివరకు భూ భ్రమణాన్ని కూడా కొద్దిగా మందగింప జేసింది.

చైనా చేపట్టిన నూతన ప్రాజెక్టు స్థితిగతులు మరింత ప్రమాదకరంగా ఉన్నాయి. ప్రపంచంలో భూకంపాలకు ఎక్కువ అవకాశాలున్న ప్రాంతాల్లోని ఒకదానిలో దాన్ని నిర్మిస్తున్నారు. సైనిక దళాలు పెద్ద యెత్తున మోహరించి ఉండే సరిహద్దు ప్రాంతానికి దగ్గరలో అది ఉంది. భారతదేశపు విశాలమైన అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్రాన్ని చైనా 'దక్షిణ టిబెట్'గా పరిగణిస్తోంది. నిర్మాణంలో బలహీనత వల్లగానీ లేదా జలాశయం పురికొల్పగల భూగర్భ ఫలకాల చలనం వల్లగానీ డ్యామ్ కుప్పకూలితే, భారతదేశపు ఈశాన్య ప్రాంతం, బంగ్లాదేశ్ మహా విధ్వంసాన్ని చవిచూడవలసి రావచ్చు.

త్రీ గార్జెస్ డ్యామ్ కన్నా దాదాపు మూడింతల ఎక్కువ విద్యుదుత్పాదనకు వీలుగా రూపకల్పన చేసిన ఈ డ్యామ్‌కు నేషనల్ పీపుల్స్ కాంగ్రెస్ 2021లో ఆమోదం తెలిపింది. అంతర్జాతీయ నదుల పొడవునా పెద్ద పెద్ద ప్రాజెక్టులను రహస్యంగా నిర్మిస్తూ పోవడం చైనాకు రివాజుగా మారింది.



బ్రహ్మపుత్ర నది మీద చైనా నిర్మించ తలపెట్టిన మెగా డ్యామ్

◆ వచ్చిన చిక్కేమిటంటే, నీటిని బీజింగ్ వనరుగాకాక, ఒక శక్తి సముపార్జన సాధనంగా చూస్తోంది. బ్రహ్మపుత్ర నది టిబెట్‌ను విడిచిపెట్టే చోట మెగా–డ్యామ్‌ను నిర్మించడం ద్వారా, దిగువ ప్రవాహ ప్రాంతాలలో నివసించే కోట్లాది మందికి ఇష్టముంటే నీరు ఇవ్వగల, లేకపోతే నీటిబొట్టు కూడా అందకుండా చేయగల వెసులుబాటును సమీకరించుకోవాలని చూస్తోంది.

జలం ఆధిపత్య సాధనం

బ్రహ్మపుత్ర, మిగిలిన నదుల లాంటిది కాదు. హిమాలయ ఉత్తుంగ శిఖరాల నుంచి కిందకు దూకుతూ ప్రపంచంలోని అత్యంత నిటారైన, లోతైన లోయను సృష్టిస్తోంది. అమెరికాలోని గ్రాండ్ కాన్యన్ కన్నా ఇది రెండింతల లోతైనది. సాటిలేని నదీమ శక్తి కేంద్రీకృతమవుతున్న చోట డ్యామ్‌ను చైనా నిర్మిస్తోంది.

టిబెట్‌లోని పర్వతాలపైన నీటి బుగ్గల నుంచి పుడుతున్న బ్రహ్మపుత్ర, ప్రపంచంలోని ఎత్తయిన ప్రాంతాల నుంచి ప్రవహించే ప్రధాన నదులలో ఒకటి. భారత్, బంగ్లాదేశ్ గుండా ప్రవహించే ఈ నది వ్యవసాయానికి, మత్స్యసంపదకు ఆలంబనగా ఉంటూ, జన సాంద్రత ఎక్కువగా ఉన్న ప్రాంతాలకు మనుగడ కల్పిస్తోంది. బ్రహ్మపుత్రకు ఏటా వచ్చే వరదలు విధ్వంసకరమైనవే అయినప్పటికీ, అవి విష పదార్థాలను తోసుకుపోతాయి. భూగర్భ జలాల మట్టాన్ని పెంచుతాయి. సేద్యానికి ఎంతో ముఖ్యమైన పోషక విలువ ఉన్న అవక్షేపాలను పొలాలకు చేకూర్చుతాయి. కానీ సూపర్–డ్యామ్ ఈ గతిని తలకిందులు చేస్తుంది. ఒండ్రుమట్టికి అడ్డుకట్ట వేస్తుంది. పెరుగుతున్న సముద్ర మట్టాలతో ఇప్పటికే సంకటంలోనున్న బంగ్లాదేశ్ డెల్టా కుంచించుకుపోతుంది. భారతీయ రైతులను సహజ ఫలదీకరణ ఆవృత్తాలకు దూరం చేస్తుంది. ఉప్పు నీరు చేరిపోవడం, వరదలు మరింత పరిపాటిగా మారతాయి.

వచ్చిన చిక్కేమిటంటే, నీటిని వనరుగాకాక, ఒక శక్తి సముపార్జన సాధనంగా చైనా చూస్తోంది. నది టిబెట్‌ను విడిచిపెట్టే చోట మెగా–డ్యామ్ నిర్మించడం ద్వారా, దిగువ ప్రవాహ ప్రాంతాలలో నివసించే కోట్లమందికి ఇష్టముంటే నీరు ఇవ్వగలగాలని, లేకపోతే నీటిబొట్టు కూడా అందకుండా చేయగలగాలని చూస్తోంది.

ఒకప్పుడు చమురుపై ఆధిపత్యం ప్రపంచ శక్తిని నిర్ణయించేది. ఈ 21వ శతాబ్దంలో, సరిహద్దులను దాటి ప్రవహించే నదులపై నియంత్రణ అంతే నిర్ణాయక శక్తిగా పరిణమించవచ్చు. ఈ డ్యామ్ ద్వారా చైనా, ఒక్క తూటా కూడా పేల్చనవసరం లేకుండా, నీటిని ఆయుధంగా మలచుకోగలుగుతుంది. 'చమురు ఉత్పాదన, ఎగుమతి దేశాల కూటమి' (ఒపెక్) చమురుపై ఒకప్పుడు ఎలాంటి వ్యూహాత్మక పట్టును అనుభవించిందో, నీటిపై అదే రకమైన శక్తిని చైనాకు ఈ డ్యామ్ కట్టబెట్టవచ్చు.

ప్రమాదంలో జల భద్రత

నిజానికి, ప్రపంచంలోని మిగిలిన దేశాలన్నీ కలిపి నిర్మించిన డ్యామ్‌లకన్నా కూడా ఎక్కువ సంఖ్యలో పెద్ద డ్యామ్‌లను చైనా నిర్మించింది. అదే ఊపులో, అది 1990ల నుంచి అంతర్జాతీయ నదులపై దృష్టి పెట్టింది. మికాంగ్ నదిపై అది కట్టిన 11 పెద్ద డ్యామ్‌లు దిగువ ప్రవాహ ప్రాంతాలను ఇప్పటికే అతలాకుతలం చేస్తున్నాయి. దుర్భిక్షాలు తీవ్రమవుతున్నాయి. థాయిలాండ్, లావోస్, కంబోడియా, వియత్నామ్‌లలో జీవనోపాధులకు ఎసరు పెడుతున్నాయి.

ఏ రూపంలో నీటి పంపకానికైనా ససేమిరా అనడాన్ని బీజింగ్ కొనసాగిస్తోంది. పొరుగునున్న దేశాలతో నీటి పంపక ఒప్పందాలు వేటిపైనా అది సంతకం చేయలేదు. ఐక్యరాజ్య సమితి 1997లో చేసిన జలవనరుల ఒడంబడికలోనూ అది చేరలేదు. తన సరిహద్దుల లోపలనున్న జలాలన్నింటిపైన 'నిర్ద్వంద్వ సార్వభౌమాధికారం' చాటుకునేందుకు ప్రాధాన్యం ఇస్తోంది.

ఆసియాను మించి ప్రయోజనాలు ఇక్కడ పణంగా ఉన్నాయి. అంతర్జాతీయ సగటుకన్నా వేగంగా టిబెట్ వేడెక్కుతోంది. పీఠభూమి హైడ్రాలజీని తారుమారు చేయడం ప్రాంతీయ జూదం మాత్రమే కాక, మొత్తం భూగోళానికి ముప్పు తేవడమే అవుతుంది. టిబెట్ నుంచి నదీ ప్రవాహాల గతులు మారుతున్న ప్రభావ ప్రకంపనాలు, ఆసియాను దాటి, బాహ్య వాతావరణ వ్యవస్థలు, ఆహార భద్రత, వలసల తీరుతెన్నులపైన కూడా కనిపిస్తాయి.

దేశ సరిహద్దులను దాటి వెళ్ళే నదులపై ఏకఛత్రాధిపత్యం వహించడంలో బీజింగ్ సఫలమైతే, ఇతర దేశాలు కూడా అదే బాట పట్టవచ్చు. అది ఇతరత్రా బలహీనంగా ఉన్న సహకార నియమ నిబంధనలను నీరుగార్చవచ్చు. నైలు నదీ పరీవాహక ప్రాంతం నుంచి టైగ్రిస్–యూఫ్రటీస్ వరకు అదే పరిస్థితి నెలకొంటుంది. ఆ విధంగా, మెగా–డ్యామ్ ఒక్క ఆసియా సమస్య మాత్రమే కాదు, మొత్తం ప్రపంచానిది. అందుకే అంతర్జాతీయ జల నిబంధనలను గౌరవించేట్లుగా అంతర్జాతీయ సమాజం చైనాపై ఒత్తిడి తేవాలి.

వ్యాసకర్త న్యూఢిల్లీలోని 'సెంటర్ ఫర్ పాలసీ రిసెర్చ్'లో వ్యూహాత్మక అధ్యయనాల ప్రొఫెసర్

('ద గ్లోబ్ అండ్ మెయిల్' సౌజన్యంతో)

విత్తన సార్వభౌమాధికారం రైతులకే ఉండాలి!

దాదాపు రెండు దశాబ్దాల క్రితం జరిగిన అంతర్జాతీయ విత్తన ఒడంబడికకు చేయాల్సిన సవరణ ముసాయిదాపై ఈ ఏడాది నవంబర్‌లో (24 నుంచి 29 వరకు) పెరూ రాజధాని 'లీమా'లో చర్చ జరగనుంది. ఈ ప్రయత్నాన్ని ప్రపంచంలోని అనేక రైతు సంఘాలు వ్యతిరేకిస్తున్నాయి.

ఒక దేశం వ్యవసాయ వారసత్వాన్ని లేదా జన్యుపరమైన వనరులను ఇతర దేశాలకు ఇచ్చిపుచ్చుకోవటానికి ఎటువంటి నియమ నిబంధనలు పాటించాలో నిర్ణయించేందుకు ఐక్యరాజ్య సమితికి చెందిన ఆహార వ్యవసాయ సంస్థ (ఎఫ్ఏఓ) అంతర్జాతీయ ఒడంబడికను 2002లో కుదిర్చింది. దాని పేరే 'యునైటెడ్ నేషన్స్ ఇంటర్నేషనల్ ట్రీటీ ఆన్ ప్లాంట్ జెనెటిక్ రిసోర్సెస్ ఫర్ ఫుడ్ అండ్ అగ్రికల్చర్.' ఈ ఒడంబడికపై భారత్ సహా 154 దేశాలు సంతకాలు చేశాయి. 2004 నుంచి ఈ ఒడంబడిక అమల్లోకి వచ్చింది. 64 రకాల విత్తనాలు, మొక్కలు, వంగడాలు దీని పరిధిలోకి వస్తాయి. ప్రపంచంలో 70 లక్షలకు పైగా విత్తనాల నమూనాలు అంతర్జాతీయ స్థాయిలో విత్తన నిధుల్లో అందుబాటులోకి వచ్చాయి. ఈ విత్తనాలను ఉపయోగించుకుని సరికొత్త వంగడాల తయారీపై 28 వేలకు పైగా విత్తన సంస్థలు పరిశోధనలు చేస్తున్నాయి.

ఐక్యరాజ్యసమితిలో పెట్టుబడిదారీ దేశాల ఆధిపత్యమే కొనసాగుతున్నది. అమెరికా, యూరోపియన్ దేశాలు ఐక్యరాజ్యసమితిని శాసిస్తున్నాయి. ఫలితంగా అది తీసుకునే నిర్ణయాలు పెట్టుబడిదారీ దేశాల ప్రయోజనాలకు అనుగుణంగా ఉంటున్నాయి. దాని నేతృత్వంలో కుదిరిన విత్తన ఒడంబడిక కూడా అందుకు మినహాయింపు కాదు. వెనకబడిన దేశాల విత్తన జన్యువులను సేకరించి తమ వద్ద ఉన్న టెక్నాలజీతో అభివృద్ధి చేసిన విత్తనంపై బహుళ జాతి సంస్థలు



పేటెంట్ హక్కులు పొందుతున్నాయి. అటువంటి సంస్థలు తమ అనుమతి లేనిదే ఇతర దేశాల రైతులు ఉపయోగించడం నేరంగా పేర్కొంటున్నాయి. వేరే దేశాల్లో ఈ సంస్థల పెట్టుబడులను స్వాధీనం చేసుకున్నా, జాతీయం చేసినా లేదా ఆశించిన లాభాలు ప్రమాదంలో పడినా బహుళ జాతి విత్తన సంస్థలు పెట్టుబడి ఉన్న దేశాలపై కోర్టులో దావా వేయవచ్చు. దీన్ని గమనిస్తే అంతర్జాతీయ విత్తన ఒడంబడిక బహుళజాతి సంస్థల ప్రయోజనాల కోసమే అన్న వాస్తవం వెల్లడవుతోంది.

ఒడంబడిక జరిగి 20 సంవత్సరాలు గడిచిన తర్వాత ఇప్పుడు సవరణల ప్రతిపాదనలు జరుగుతున్నాయి. ఈ సవరణ ప్రతిపాదనలు రైతాంగ హక్కులకు భంగం కలిగించేవిగా ఉన్నాయని ప్రపంచ వ్యాప్తంగా రైతు సంఘాలు వ్యతిరేకిస్తున్నాయి. ప్రస్తుతం ఉన్న 64 విత్తనాలతో పాటు ఇతర మొక్కల జన్యువులను కూడా చేర్చాలన్న ప్రతిపాదన సవరణల ముసాయిదాలో ఉందని రైతు సంఘాలు విమర్శిస్తున్నాయి. విత్తన ఒడంబడికలో మార్పుల ప్రతిపాదనలు ఆమోదం పొందితే, వేలాది సంవత్సరాలుగా విత్తనాలపై సార్వభౌమాధికారం కలిగిన దేశాలు, రైతులు ఆ విత్తనాలపై హక్కును కోల్పోతారు. అందుకే రైతుల విత్తన హక్కులను హరించే అంతర్జాతీయ విత్తన ఒడంబడికలను, దానికి తలపెట్టిన సవరణలను ఉపసంహరించాలి.

– బొల్లిముంత సాంబశివరావు; రైతు కూలీ సంఘం (ఆం.ప్ర.) రాష్ట్ర కార్యవర్గ సభ్యులు । 98859 83526

అజ్ఞాన తిమిరానికి అంతం



'నరకుడు' అనగా దుష్ట నరుడు అని అర్థం. సజ్జనుడు అంధకారాన్ని ప్రకాశవంతం చేస్తే... దుష్టులు ప్రకాశాన్ని అంధకారం చేస్తారు. చీకటి వెలుగుగా మారాలంటే 'సుదర్శనం' కావాలి. సుదర్శనం అనగా మంచి చూపు, లేదా మంచి జ్ఞానం. అనగా... వెలుగు. వెలుగుతో చీకటిని రూపుమాపడం, సంతోషంతో దుఃఖాన్ని తొలగించడం, జ్ఞానంతో అజ్ఞానాన్ని నిర్మూలించడం. ఇదే నరకాసురుని సంహారంలోని పరమార్థం. మనిషిలోని అసూయ, కామం, భయం, హింస, అన్యాయం వంటివి చీకట్లు. అవి జ్ఞానం ద్వారా నాశనం అవుతాయని చెప్పడానికి దీపం సంకేతం.

కాగా ద్వాపర యుగంలో... నరకాసుర వధతో నరకాసురుని పీడ వదిలించి, లోకుల శోకాలను బాపిన శ్రీకృష్ణ, సత్యభామలకు ప్రజలు ఘన నీరాజనాలు పలుకుతూ ఇంటింటా దీపాలు వెలిగించి వైభవోపేతంగా పండుగ జరుపుకొన్నారు. అలా మొదలైన ఆ పండుగను 'దీపావళి' పేరుతో ప్రతి ఏటా ప్రజలు జరుపుకొంటున్నారని ప్రతీతి. అందుకే దీపావళిని గొప్ప సనాతన పండుగ అని భావిస్తారు

– తాళ్లపల్లి యాదగిరి గౌడ్

దివ్య మంగళ దీపావళి

సృష్టికి మూలమైన స్త్రీలపై
అకృత్యపు వేటలు ఆగినప్పుడే
లోకాసమస్తానికి అసలైన
దివ్య మంగళ దీపావళి!

దేశాల మధ్య యుద్ధాలు
జరగనప్పుడే...
శాంతియే కాంతి పుంజాలుగా
వెలిగినప్పుడే నిజమైన
దివ్య మంగళ దీపావళి!

అన్నమో రామచంద్రా
అన్న పిలుపు విననప్పుడే
అభాగ్యులు భాగ్యులైనప్పుడే
దివ్య మంగళ దీపావళి!


పర్యావరణం పచ్చగా
సమస్త మానవాళి హాయిగా
పుడమితల్లి పులకించగా జరిపేదే
దివ్య మంగళ దీపావళి!

– బోనగిరి పాండురంగ

డేటా పాయింట్

రూ.50 లక్షలకు పైగా ఆదాయం!

మన దేశంలో ఏటా ఆదాయపు పన్ను చెల్లించేవారిలో రూ.50 లక్షల కంటే ఎక్కువ ఆదాయం ఉన్నవారి సంఖ్య 2013–14లో కేవలం 1.92 లక్షలు. అది 2023–24 నాటికి దాదాపు 5 రెట్లు పెరిగి 9.39 లక్షలకు చేరింది.



సంవత్సరాల వారీగా	పన్ను చెల్లించినవారి సంఖ్య
2018-19	4,25,886
2019-20	4,97,762
2020-21	5,30,733
2021-22	5,69,786
2022-23	7,88,237
2023-24	9,39,891

ఆధారం: సీఎమ్ఐఈ అవుట్‌లుక్

ఇన్ బాక్స్

జన రక్షకులు

ప్రపంచమంతా నిద్రపోయినా మేల్కొని ఉండే ఒకే ఒక్కడు... పోలీస్! ఎండ, వాన, పగలు, రాత్రి అనే తేడా లేకుండా కుటుంబంతో కలిసి జరుపుకొనే పండగ, పబ్బాల్ని కూడా త్యజించి, ప్రజల కోసం జీవించి, మరణించిన పోలీసు అమరవీరులు ఎందరో! ప్రజల కోసం ప్రాణాలను పణంగా పెట్టిన పోలీసులకు సానుభూతి, గౌరవం చూపించడం మనందరి బాధ్యత. అందుకు పోలీసు 'అమర వీరుల సంస్మరణ దినం' (అక్టోబర్ 21) మంచి సందర్భం. 1959 అక్టోబర్ 21న లద్దాఖ్ సరిహద్దులో కాపలాగా ఉన్న పదిమంది సీఆర్‌పీఎఫ్ జవాన్లు చైనా సైన్యంతో వీరోచితంగా పోరాడి ప్రాణాలర్పించారు. వారి స్మృతి చిహ్నంగా జరుపుకొంటున్నదే ఈ అమరవీరుల సంస్మరణ దినోత్సవం.



ఎటువంటి అల్లర్లు, దోపిడీలు జరిగినా పోలీసు వారు వస్తున్నారంటే కొండంత ధైర్యం ఉంటుంది. గతంలో ప్రపంచాన్ని అంతా అతలాకుతలం చేసిన కరోనా గత్తర కాలంలో పోలీసుల సేవలు మరువలేం. పోలీసు విధి నిర్వహణ చాలా శ్రమతో కూడుకున్నది. ఇతర ఉద్యోగుల్లా కొన్ని గంటలకు మాత్రమే పరిమితమయింది కాదు. పోలీసులు లేని సమాజాన్ని ఊహించుకోలేం. ప్రతి ఒక్కరూ ఏ ఆపదకైనా ఆశ్రయించేది పోలీసులనే! సంపన్నుడు మొదలు సామాన్యుడి వరకు ప్రతి ఒక్కరూ ప్రతీ అవసరానికీ సాయం కోరేది పోలీసులనే! దండెత్తి వచ్చే శత్రువుల నుంచి దేశాన్ని కాపాడేవారు సైనిక జవానులైతే, అంతర్గత శత్రువుల నుంచి ప్రజలను కాపాడి, భద్రతకు భరోసా ఇచ్చేది పోలీసులే. అనేక సమస్యలు, ఒత్తిళ్లు ఎన్ని ఎదురైనా సమాజమనే కుటుంబాన్ని రక్షించడానికి నిరంతరం సూర్యునిలా కృషి చేస్తున్న పోలీసులకు కృతజ్ఞతలు.

– సంపత్ గద్దం

(అక్టోబర్ 21న అమర వీరుల సంస్మరణ దినం)

బకాయిలు రూ.10,000 కోట్లు... ప్రోత్సాహకాలకూ ఎగనామం

పారిశ్రామిక ప్రోత్సాహకాలు విడుదల చేస్తున్నట్లు ప్రకటించిన సీఎం

- ఇందుకోసం రూ.2వేల కోట్ల రుణం...
- దానిలోనూ రూ.500 కోట్లు దారిమళ్లింపు?
- ప్రభుత్వంపై భగ్గుమంటున్న పారిశ్రామికవేత్తలు
- ఇదేనా స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ అంటే.. అని ఆగ్రహం



సాక్షి, అమరావతి: పారిశ్రామిక ప్రోత్సాహకాల విడుదలలో కూటమి ప్రభుత్వం నమ్మించి మోసం చేసింది. 'ఏ ఏడాది పారిశ్రామిక ప్రోత్సాహకాలు అదే ఏడాది ఇచ్చేస్తాం. ఇందుకోసం ప్రత్యేకంగా ఎస్క్రో అకౌంట్ తెరిచి మరీ బకాయిలు లేకుండా చెల్లిస్తాం..' అంటూ చేసిన వాగ్దానాన్ని నిలబెట్టుకోవడంలో ఘోరంగా విఫలమైంది. పారిశ్రామిక వేత్తలకు రూ.10,000 కోట్లకు పైగా ప్రోత్సాహకాలను బకాయిపడిన చంద్రబాబు ప్రభుత్వం... కేవలం రూ.1,500 కోట్లు విడుదల చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా ఆదివారం 'ఎక్స్'లో పోస్టు చేశారు. 'దీపావళి వేళ మరో తీపి కబురు అందిస్తున్నాం. పరిశ్రమలకు ఎప్పటి నుంచో పెండింగ్‌లో ఉన్న ఇండస్ట్రియల్ ఇన్సెంటివ్స్ తొలి విడతగా రూ.1,500 కోట్లు విడుదల చేస్తున్నాం' అని సీఎం తెలిపారు.

అప్పు చేసిన మొత్తం కూడా చెల్లించరా..?

పారిశ్రామిక ప్రోత్సాహకాల విడుదల కోసం చంద్రబాబు ప్రభుత్వం బ్యాంకుల నుంచి రూ.2,000 కోట్లు రుణం తీసుకుంది. దీనిలో కేవలం రూ1,500 కోట్లు మాత్రమే పారిశ్రామిక ప్రోత్సాహకాల కోసం విడుదల చేస్తున్నట్లు ప్రకటించింది. మిగతా రూ.500 కోట్లు దారి మళ్లించిందని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు బకాయి ఉన్న మొత్తంలో తొలి విడతగా 30శాతం మాత్రమే చెల్లించనున్నట్లు పరిశ్రమల శాఖ అధికారులు తెలిపారు. వైఎస్సార్ బడుగు వికాసం కింద గత ప్రభుత్వ హయాంలో యూనిట్లు ప్రారంభించిన ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలకే రూ.3,000కోట్లకుపైగా ఈ ప్రభుత్వం బకాయిలు చెల్లించాల్సి ఉందని తెలిసింది. తనకు ప్రోత్సాహకాల కింద రూ.20లక్షలు రావాల్సి ఉండగా, ఇప్పుడు రూ.5లక్షల నుంచి రూ.6లక్షలు మాత్రమే విడుదల చేస్తామని అధికారులు చెబుతున్నారని ఓ పారిశ్రామికవేత్త ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ప్రోత్సాహకాల కోసం బ్యాంకు నుంచి రుణం తీసుకుని ఆ మొత్తాన్ని కూడా దారిమళ్లిస్తున్నారని ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

విశాఖ సదస్సు కోసమేనా?

ప్రోత్సాహకాల విడుదలలో తీవ్ర జాప్యంపై పారిశ్రామిక వేత్తలు ఆగ్రహంతో ఉన్నారు. దీంతో నవంబర్ 14, 15 తేదీల్లో విశాఖపట్నంలో జరిగే పెట్టుబడుల సదస్సుపై ప్రతికూల ప్రభావం పడుతుందన్న ఉద్దేశంతో కంటితుడుపు చర్యగా రూ.1,500 కోట్లు విడుదల చేస్తున్నట్లు ప్రకటించారని పలువురు పారిశ్రామికవేత్తలు అభిప్రాయపడుతున్నారు. చిన్న పరిశ్రమలకు బకాయి ఉన్న ప్రోత్సాహకాలనే విడుదల చేయలేని ప్రభుత్వం... భారీ పరిశ్రమలకు ప్రకటిస్తున్న వేల కోట్ల రూపాయల ప్రోత్సాహకాలను ఎలా చెల్లిస్తుందని... ఇదేనా స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ అంటే.. అని ప్రశ్నిస్తున్నారు.

క్లుప్తంగా...

పీహెచ్‌సీ వైద్యుల వినూత్న నిరసన



లబ్బీపేట (విజయవాడతూర్పు): తమ డిమాండ్ల సాధనకు పీహెచ్‌సీ వైద్యులు చేపట్టిన రిలే దీక్షలు 15వ రోజు ఆదివారం కొనసాగాయి. ఈ సందర్భంగా దీక్షా శిబిరం వద్ద వైద్యులంతా వినూత్నంగా నిరసన తెలిపారు. అందులో భాగంగా ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసి, అటుగా రాకపోకలు సాగించే వారికి ఉచితంగా వైద్య పరీక్షలు చేశారు. పీహెచ్‌సీ వైద్యుల విషయంలో ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తోందని, చర్చల పేరుతో పిలిచి, తమ సమస్యలను పట్టించుకోకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. తమ డిమాండ్ల ఆమోదంపై స్పష్టమైన హామీ ఇచ్చే వరకూ ఆందోళన కొనసాగిస్తామని తేల్చిచెప్పారు.

ఈ-పంట నమోదుకు గడువు పొడిగింపు

సాక్షి, అమరావతి: ఈ-పంట నమోదును ఈ నెల 30వ తేదీ వరకు పొడిగించామని రాష్ట్ర వ్యవసాయ సంచాలకులు మంజీర్ జిలానీ సమూన్ తెలిపారు. గడువును రెండవసారి పొడిగిస్తూ, సవరించిన మార్గదర్శకాలను ఆదివారం విడుదల చేశారు. సర్వే చేయడానికి వీలులేని కాలువలు, రోడ్లు, భవనాల కమతాలు తదితర ఆక్వా-వ్యవసాయేతర భూములను ఈ-పంట నమోదు నుంచి మినహాయింపునిచ్చారు. డిజిటల్ పంటల సర్వేలో భాగంగా జూలైలో కేంద్రం ఇచ్చిన మార్గదర్శకాలను అనుసరించి రాష్ట్ర వ్యవసాయ శాఖ 2.92 కోట్ల భూ కమతాలను రైతు సేవా కేంద్రం వారీగా డౌన్‌లోడ్ చేసినట్టు తెలిపారు. జూలై 15 నుంచి ఈ-పంట యాప్ ద్వారా ఇప్పటివరకు 1.59 కోట్ల భూ కమతాలను నమోదు చేసినట్టు పేర్కొన్నారు.

లక్ష్మీనాయుడు కుటుంబానికి సాయంపై.. సీఎంకు నివేదిక ఇస్తాం

హోంమంత్రి అనిత

కందుకూరు/పెదకాకాని: శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా గుడ్లూరు మండలం దారకానిపాడు గ్రామంలో దారుణ హత్యకు గురైన కాపు యువకుడు తిరుమలశెట్టి లక్ష్మీనాయుడు కుటుంబాన్ని ఏవిధంగా ఆదుకోవాలనే దానిపై సమగ్రంగా చర్చించి సీఎం చంద్రబాబుకు నివేదిక అందజేస్తామని హోంమంత్రి వంగలపూడి అనిత తెలిపారు. దారకానిపాడులో ఆదివారం ఆమె లక్ష్మీనాయుడు కుటుంబాన్ని మంత్రి పొంగూరు నారాయణతో కలిసి పరామర్శించారు. అక్కడి నుంచే చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ లక్ష్మీనాయుడు భార్య సుజాతతో మాట్లాడి భరోసా ఇచ్చారని తెలిపారు. ఈ కేసును మరింత సమగ్రంగా విచారించి హత్య కేసులో మిగిలిన నిందితులపై కూడా చర్యలు తీసుకుని అందరికీ శిక్షపడేలా చేస్తామని ఆమె చెప్పారు. లక్ష్మీనాయుడు, నిందితుడి మధ్య ఆర్థిక లావాదేవీల కారణంగానే హత్య జరిగిందని.. లక్ష్మీనాయుడు భార్య సుజాతను కూడా హరిచంద్రప్రసాద్ లైంగికంగా వేధించాడని చెప్పారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న లక్ష్మీనాయుడు సోదరులైన పవన్, భార్గవనాయుడు చికిత్సకు అయ్యే ఖర్చులను ప్రభుత్వం భరిస్తుందని హామీ ఇచ్చారు.

పోతే రూ.10 వేలు.. వస్తే నాలుగెకరాలు


తెలంగాణ

భీమిని: తెలంగాణలోని మంచిర్యాల జిల్లా కన్నెపల్లి మండలానికి చెందిన ఓ రైతు తనకున్న భూమిని అమ్మడానికి లక్కీ డ్రా పెట్టడం చర్చనీయాంశంగా మారింది. మండలంలోని జన్కాపూర్ గ్రామానికి చెందిన ఓ రైతు టీకులపల్లి శివారులో తనకున్న నాలుగు ఎకరాల భూమికి లక్కీ డ్రా పెట్టాడు. రూ.10 వేల నగదు చెల్లించి టోకెన్ పొందాలని పేర్కొన్నాడు. 1,500 మంది కాగానే అందరి సమక్షంలో లక్కీ డ్రా తీస్తామంటూ తన చేనుకు వెళ్లే దారిలో పెద్ద ఫ్లెక్సీ ఏర్పాటు చేశాడు. ఇది సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఫ్లెక్సీలో సర్వే నంబర్లతోపాటు రూట్‌మ్యాప్, పూర్తి వివరాలు పొందుపర్చాడు. లక్కీడ్రా ద్వారా మార్కెట్ ధర కంటే అధికంగా లాభం వస్తుందని పలువురు చర్చించుకుంటున్నారు. డ్రా కోసం ఫోన్‌పే, గూగుల్‌పే ద్వారా కూడా చెల్లించవచ్చని తన ఫోన్ నంబర్ కూడా పేర్కొన్నాడు.

ఆరోగ్యశ్రీ చరిత్రలో చీకటి అధ్యాయం

బిల్లుల కోసం ధర్నాకు సిద్ధమైన నెట్‌వర్క్ ఆస్పత్రులు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని 1.42 కోట్ల మంది ప్రజలకు సంజీవని అయిన ఆరోగ్యశ్రీ పథకం చరిత్రలోనే చీకటి అధ్యాయానికి చంద్రబాబు తెరతీశారు. పేద, మధ్యతరగతి ప్రజలకు ఉచిత చికిత్సలు అందించిన ప్రైవేట్ నెట్‌వర్క్ ఆస్పత్రులు బిల్లుల కోసం ఏకంగా ధర్నాకు దిగాల్సిన దుస్థితి తీసుకొచ్చారు. బకాయిల విడుదల డిమాండ్‌తో ఈ నెల 23/24 తేదీల్లో విజయవాడ ధర్నా చౌక్‌లో భారీ ధర్నా చేయడానికి ఏపీ స్పెషాలిటీ హాస్పిటల్స్ అసోసియేషన్ (ఆశ) సిద్ధమైంది. నెట్‌వర్క్ ఆస్పత్రుల యజమానులు, వైద్యులు, ఇతర సహాయ సిబ్బంది పెద్దసంఖ్యలో ధర్నాలో పాల్గొనాలని నిర్ణయించుకున్నారు. ఈ నేపథ్యంలో ధర్నాకు అనుమతి కోరుతూ విజయవాడ పోలీస్ కమిషనర్‌కు ఆశ లేఖ రాసింది. గత నెల 15 నుంచి ఆశ సమ్మె బాట పట్టింది. అదేరోజు నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఆస్పత్రుల్లో ఉచిత ఓపీ, రోగనిర్ధారణ సేవలను ఆపేశారు. అయినా ప్రభుత్వం దిగిరాకపోవడంతో గత నెల 24 నుంచి ఏకంగా అన్నిరకాల వైద్యసేవలను పూర్తిస్థాయిలో నిలిపేసి సమ్మెను ఉధృతం చేశారు. సేవలన్నీ నిలిపేసి 10 రోజులైనా ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవడంతో ఆస్పత్రుల యజమానులు ఏకంగా వీధి పోరాటానికి సిద్ధమయ్యారు. పేదప్రజలకు ఉచితంగా కార్పొరేట్ వైద్యసేవల కల్పన లక్ష్యంతో 2007లో అప్పటి సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రవేశపెట్టారు. అనంతరం ఈ పథకం దేశానికి రోల్‌మోడల్‌గా నిలిచింది. దేశంలోని పేదప్రజలకు ఉచిత వైద్యసేవల కల్పనకు దిక్సూచిగా నిలిచిన ఈ మహోన్నత పథకాన్ని చంద్రబాబు కేవలం 17 నెలల పాలనలోనే అంపశయ్య ఎక్కించేశారు. పథకాన్ని కనుమరుగు చేయడంలో భాగంగా గద్దెనెక్కిన వెంటనే బీమా విధానం ప్రవేశపెడుతున్నట్టు ప్రకటించారు. పథకం అమలును గాలికి వదిలేసి, ఆస్పత్రులకు సకాలంలో బిల్లులు చెల్లించటం మానేశారు.


ANDHRA PRADESH SPECIALITY HOSPITAL ASSOCIATION (ASHA)
(Society Registration No. 358 of 2014)
Deepika Residency, Flat No : G-8, Near Tenali Bypass Road, Mangalagiri-522503.
Guntur Dist. Andhra Pradesh

PRESIDENT:
Dr. K. Vijay Kumar
9010899955

VICE PRESIDENT:
Dr. S.V.L. Narayana Rao
9989277667
Mr. T. Chandra Mouliswara Rao
9618283789

SECRETARY:
Dr. Ch. Avinash
9652774407

TREASURER:

Date : 18-10-2025.

To,
The Commissioner of Police,
Vijayawada,
Andhrapradesh.

Through Proper Channel

Subject: Request for Permission to Conduct a Peaceful Procession at Dharna Chowk

Respected Sir,

We, the representatives of the Andhra Pradesh Speciality Hospitals Association (ASHA), wish to bring to your kind notice that the network hospitals empanelled under the NTR YSR Seva Scheme have been on strike due to long-pending payment dues and unresolved operational issues. Despite several communications and representations made to the NTR YSR Seva Trust, the Ministry of Health, and the Health Secretary, the issues remain unaddressed.

విజయవాడ ధర్నా చౌక్‌లో ధర్నాకు అనుమతి కోరుతూ విజయవాడ సీపీకి ఆశ రాసిన లేఖ

ముందు రూ.670 కోట్లు చెల్లించమని అడిగినా..

నెట్‌వర్క్ ఆస్పత్రులకు చికిత్సలు చేసిన 40 రోజుల్లో బిల్లు చెల్లించాల్సి ఉంది. అయితే చంద్రబాబు ప్రభుత్వం ఏర్పాటయిన నాటినుంచి ఆస్పత్రుల క్లెయిమ్‌లను కనీసం ప్రాసెస్ కూడా చేయకుండా ట్రస్ట్‌స్థాయిలోనే తొక్కిపెట్టడం మొదలుపెట్టారు. దీంతో ఏకంగా రూ.3 వేలకోట్లకు పైగా బిల్లులు నెట్‌వర్క్ ఆస్పత్రులకు నిలిచిపోయాయి. పెద్ద ఎత్తున బిల్లులు ఆగిపోవడంతో ఆస్పత్రులు కూడా నిర్వహించలేని దయనీయ పరిస్థితుల్లోకి యజమానులు వెళ్లిపోయారు. చేసిన అప్పులకు వడ్డీలు, ఈఎంఐలు కట్టకపోవడంతో కొత్తగా బ్యాంకులతోపాటు ప్రైవేట్‌గాను అప్పులు పుట్టని దుస్థితి నెలకొందని వారు పలుమార్లు ఆవేదన వ్యక్తం చేశారు. తమ దయనీయ పరిస్థితిపై పదేపదే ప్రభుత్వానికి లేఖలు రాసినా పట్టించుకోకపోవడంతో ఆరునెలల వ్యవధిలో రెండుసార్లు సమ్మెకు పిలుపు ఇచ్చారు. తొలిసారి సమ్మె చేసినప్పుడు సీఎం దగ్గర చర్చలు జరిగాయి. బిల్లులు ఇస్తామని సీఎం హామీ ఇవ్వడంతో వారు వెనక్కి తగ్గారు. అనంతరం పరిస్థితుల్లో మార్పు రాకపోవడంతో ఇప్పుడు ప్రభుత్వంతో తాడోపేడో తేల్చుకోవడానికి సిద్ధమయ్యారు. వాస్తవానికి మొత్తం బకాయిల్లో రూ.670 కోట్లు వెంటనే చెల్లించి, మిగిలిన నిధుల విడుదలపై స్పష్టమైన హామీ ఇవ్వాలని ఇప్పటివరకు ఆస్పత్రుల యజమానులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ వచ్చారు. ఆ డిమాండ్‌ను ప్రభుత్వ పెద్దలు కనీసం పరిగణనలోకి కూడా తీసుకోలేదు. నెలరోజులకుపైగా సమ్మె చేస్తున్న వారిని వైద్యశాఖ మంత్రి, సీఎం స్థాయి వ్యక్తులు చర్చకు కూడా పిలవలేదు. సేవలు పూర్తిస్థాయిలో నిలిచిపోయి అనారోగ్య బాధితులు చికిత్స కోసం తీవ్ర అగచాట్లు పడుతున్నారు. ఇదిలా ఉండగా ఈవెంట్స్ మేనేజ్‌మెంట్‌పై పెట్టిన శ్రద్ధలో ఒకటో వంతు కూడా ప్రభుత్వ పెద్దలు ప్రజారోగ్యంపై పెట్టడం లేదు.

సవాలు చేసినా సర్కారులో చలనంలేదు

లై డిటెక్టర్ టెస్టుకైనా సిద్ధమని ఎప్పుడో చెప్పా

- చంద్రబాబు ఇంటికొచ్చి ప్రమాణం చేయడానికీ సిద్ధం
- అద్దేపల్లి జనార్దనరావును అడ్డంపెట్టి టీడీపీ డ్రామా
- జయచంద్రారెడ్డికి ఇంతవరకు నోటీసులు ఇవ్వలేదు
- నిందితులను పట్టుకుని శిక్షించే ఆలోచన ప్రభుత్వానికి లేదు
- మాజీమంత్రి, వైఎస్సార్‌సీపీ నేత జోగి రమేష్ ఫైర్



సాక్షి, అమరావతి: నకిలీ లిక్కర్ వ్యవహారంలో తన పాత్రలేదని, అవసరమైతే లై డిటెక్టర్ టెస్టుకై నా సిద్ధమని తాను సవాలు చేసినా ప్రభుత్వంలో చలనంలేదని.. ఇప్పుడు చంద్రబాబు ఇంటికొచ్చి భగవద్గీత మీద ప్రమాణం చేయడానికై నా సిద్ధమని వైఎస్సార్‌సీపీ నేత, మాజీమంత్రి జోగి రమేష్ స్పష్టంచేశారు. హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. నకిలీ మద్యం కేసులో టీడీపీ నాయకుల పాత్ర ఉందని స్పష్టంగా బయటపడడంతో దాని నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే అద్దేపల్లి జనార్దనరావుతో తన పేరు చెప్పించి డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని మండిపడ్డారు. ఈ కేసులో నిజాయితీగా విచారణ జరిపి నిందితులను అరెస్టుచేసి శిక్షించాలన్న ఆలోచన చేయకుండా వైఎస్సార్‌సీపీ మీదకు ఎలా నెట్టాలనే కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. అందుకే ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న జయచంద్రారెడ్డికి ఇప్పటివరకు నోటీసులు కూడా ఇవ్వలేదన్నారు. జోగి రమేష్ ఇంకా ఏమన్నారంటే..

డైవర్షన్ కోసమే నా పేరు ఇరికించారు..

టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ములకలచెరువు, ఇబ్రహీంపట్నం, అనకాపల్లి, తెనాలి, ఏలూరు.. ఇలా రాష్ట్ర వ్యాప్తంగా నకిలీ మద్యం ఫ్యాక్టరీలు ఏర్పాటుచేసి బెల్ట్ షాపులు, పర్మిట్ రూములు, బార్లు, మద్యం షాపుల ద్వారా ఆ మద్యాన్ని ప్రజలతో విచ్చలవిడిగా తాగిస్తున్నారు. ఈ బాగోతం వెలుగులోకి వచ్చి 16 రోజులవుతున్నా నిందితులను పట్టుకుని కఠినంగా శిక్షించే కార్యక్రమంగానీ, మద్యం షాపుల్లో తనిఖీలుగానీ నిర్వహించలేదు. నకిలీ మద్యం మాఫియాలో నిందితులంతా టీడీపీ నాయకులే కావడంతో వాస్తవాలు ప్రజలకు చెప్పాలన్న ఆలోచన ప్రభుత్వం చేయడం లేదు. ఇక జనార్దనరావు రిమాండ్ రిపోర్టులో వైఎస్సార్‌సీపీ నేతల పేర్లు లేకపోయినా, అతడు కోర్టులో జడ్జి ఎదుట కూడా ఆ విషయాలు చెప్పకపోయినా డైవర్షన్ పాలిటిక్స్‌లో భాగంగా నన్ను ఈ అక్రమ కేసులో ఇరికించారు.

ఫోన్ పోతే వీడియోలు, చాటింగ్ ఎలా?

నకిలీ మద్యం ఎప్పటి నుంచి తయారుచేస్తున్నారు? దీని వెనుక ఎవరెవరున్నారు? ఎక్కడెక్కడికి సరఫరా జరుగుతోంది అనే దిశగా దర్యాప్తుచేసి నిందితులను పట్టుకోవడంలేదు. ములకలచెరువు దందాలో దొరికిన తంబళ్లపల్లె టీడీపీ ఇన్‌చార్జి జయచంద్రారెడ్డికి ఇంతవరకు నోటీసులు ఇవ్వకపోగా విచారణ కూడా చేయలేదు. పైగా ఆయన పీఏ, ఆయన బావమరిదిని కూడా అరెస్టుచేయలేదు. ఇంకోపక్క.. అద్దేపల్లి జనార్దనరావు, జయచంద్రారెడ్డి కలిసి నకిలీ మద్యం దందా నడుపుతున్నారని ఎక్సైజ్ పోలీసులే చెబుతున్నారు.

జనార్దనరావుకు రాచమర్యాదలు..

ఈ కేసులో అద్దేపల్లి జనార్దనరావుని అరెస్టుచేసి రాచమర్యాదలు చేస్తున్నారు. ఆయన ఫోన్‌ని స్వాధీనం చేసుకున్నారా అని ప్రశ్నిస్తే జనార్దనరావు ఫోన్ ముంబైలో పోయిందని చెబుతున్నారు. కానీ, అదే ఫోన్ నుంచి నేను చేసిన వాట్సాప్ చాట్ లీకైనట్లు ఎల్లో మీడియాలో కథనాలు ప్రచురిస్తున్నారు.

పీపీపీ పేరిట ప్రజారోగ్యాన్ని పణంగా పెట్టొద్దు

వైద్య కళాశాలలను ప్రైవేటుపరం చేయొద్దు
జీఓ 590ను తక్షణమే ఉపసంహరించుకోవాలి

- పది మెడికల్ కాలేజీలు ప్రజల సొత్తు
- వీటిని ప్రభుత్వమే పూర్తిచేసి నిర్వహించాలి
- పీపీపీ వ్యతిరేక పోరాట రాష్ట్ర సదస్సులో వక్తలు డిమాండ్



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

కృష్ణలంక (విజయవాడతూర్పు): ప్రభుత్వ వైద్య కళాశాలలను పీపీపీ విధానంలో కొనసాగించాలని జారీ చేసిన జీఓ 590ను వెంటనే ఉపసంహరించుకోవాలని పలువురు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పది మెడికల్ కాలేజీలు ప్రజల సొత్తని, వీటి నిర్మాణాలను ప్రభుత్వమే పూర్తి చేసి వాటిని నిర్వహించాలని కోరారు. పీపీపీ పేరిట ప్రజా ఆరోగ్యాన్ని పణంగా పెట్టొద్దని స్పష్టంచేశారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడలో ప్రభుత్వ మెడికల్ కళాశాలల పీపీపీ వ్యతిరేక పోరాట రాష్ట్ర సదస్సు ఆదివారం జరిగింది. ఏపీ మెడికోస్ పేరెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వి.లక్ష్మణరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో విశ్రాంత ఐఏఎస్ అధికారి డాక్టర్ పి.వి.రమేష్, మాజీ ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు, రైతు ఉద్యమ నేత వడ్డే శోభనాద్రీశ్వరరావు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, ఏపీ మెడికోస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు డాక్టర్ ఎన్.తులసీరెడ్డి, జై భీమ్ భారత్ పార్టీ అధ్యక్షుడు జడ శ్రావణ్‌కుమార్, సామాజిక కార్యకర్త డాక్టర్ కుర్రా వసుంధర, విశ్రాంత ఐపీఎస్ అధికారి డాక్టర్ జె.పూర్ణచంద్రరావు, ప్రజా ఆరోగ్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎం.వి.రమణయ్య తదితరులు మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రాష్ట్రంలో ప్రభుత్వ ఆరోగ్య రంగం క్షీణ దశలో ఉందన్నారు. ప్రజలకు జీవించే హక్కును రాజ్యాంగం కల్పిస్తే కూటమి ప్రభుత్వం దానిని హరించేందుకు పీపీపీ విధానం ప్రవేశపెట్టిందని విమర్శించారు. నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ వైద్య కళాశాలలన్నీ వెనుకబడిన ప్రాంతాలలోనే ఉన్నాయని పేర్కొన్నారు. ప్రజారోగ్యానికి, ప్రజా సంక్షేమానికి ఖర్చు పెట్టేందుకు నిధులు లేవని చెప్పడం ప్రభుత్వ బాధ్యతారాహిత్యమని అన్నారు. పీపీపీ విధానం కూటమి ప్రభుత్వ పతనానికి భస్మాసురహస్తంగా మారబోతుందని హెచ్చరించారు. విద్య, వైద్య రంగాలను మొత్తం డబ్బు చుట్టూ తిప్పుతూ దానినే అభివృద్ధిగా చిత్రీకరించడం ప్రజలను మోసగించడమేనన్నారు. గూగుల్ డేటా సెంటర్‌కు కల్పిస్తున్న రాయితీల్లో నాలుగో వంతు వైద్య రంగానికి ఖర్చు చేస్తే, అంతకంటే ఎక్కువ ఉద్యోగాలతో పాటు పరోక్షంగా ఎందరికో ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు.

లక్ష్మీనాయుడు హత్యలో మొదటి ముద్దాయి పవన్‌కళ్యాణే



పవన్‌నాయుడును పరామర్శిస్తున్న జక్కంపూడి రాజా, అంబటి రాంబాబు


మాట్లాడుతున్న వంగవీటి నరేంద్ర

టీడీపీ పాలనలో కాపుల హత్యలు పరిపాటిగా మారాయి

- సీఎం చంద్రబాబు, లోకేశ్‌లను ఏ2, ఏ3గా చేర్చాలి
- వైఎస్సార్‌సీపీ నేతల ధ్వజం
- లక్ష్మీనాయుడు కుటుంబానికి, ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులకు వేర్వేరుగా పరామర్శ

కందుకూరు/పెదకాకాని/గుంటూరు మెడికల్ : కాపు యువకుడు తిరుమలశెట్టి లక్ష్మీనాయుడు హత్య కేసులో మొదటి ముద్దాయి ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అవుతారని వైఎస్సార్‌సీపీ నేతలు స్పష్టం చేశారు. చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయాలన్న ఏకైక లక్ష్యంతో ఎన్నికలకు ముందు కాపులను టీడీపీకి ఓట్లు వేసేలా ప్రోత్సహించి.. చివరికి టీడీపీ అధికారంలోకి రాగానే అదే కాపులను ఘోరంగా చంపుతుంటే కనీసం ప్రశ్నించలేని స్థితిలో పవన్‌కళ్యాణ్ ఉండిపోయారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కేసులో నిందితులకు కొమ్ముకాస్తూ కేసును నీరుగార్చేలా ఆదేశాలిస్తున్న సీఎం చంద్రబాబు, ఆయన తనయుడు లోకేశ్‌లను ఏ2, ఏ3లుగా చేర్చాలని డిమాండ్ చేశారు. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా గుడ్లూరు మండలం దారకానిపాడులో ఇటీవల దారుణ హత్యకు గురైన లక్ష్మీనాయుడు కుటుంబాన్ని జక్కంపూడి రాజా, వంగవీటి నరేంద్రలు వేర్వేరుగా పరామర్శించారు. అలాగే, ఇదే ఘటనలో తీవ్రగాయాలపాలైన లక్ష్మీనాయుడు తమ్ముడు పవన్‌నాయుడు, బాబాయి కుమారుడు భార్గవ్‌నాయుడులను గుంటూరు ఉదయ్ ఆస్పత్రిలో జక్కంపూడితో పాటు, అంబటి రాంబాబు పరామర్శించారు. ఈ సందర్భంగా వారు వేర్వేరుగా మీడియాతో మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం ఎప్పుడు అధికారంలోకి వచ్చినా కాపులను హత్యచేయడం పరిపాటిగా మారిందని ధ్వజమెత్తారు. వంగవీటి రంగా హత్యతో పాటు కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం, ఆయన కుటుంబంపై ఎలాంటి భాషను ఉపయోగించి ఇబ్బంది పెట్టారో అందరికీ తెలుసన్నారు. తాజాగా ఈ నెల 2న తిరుమలశెట్టి లక్ష్మీనాయుడు హత్య జరిగితే ప్రభుత్వం స్పందించడం లేదని.. పవన్‌కళ్యాణ్‌కు బాధిత కుటుంబాన్ని పరామర్శించే తీరిక కూడా లేదా.. అని ప్రశ్నించారు. ఏం చేసినా పైనుంచి కాపాడే ఓ అధికార వ్యవస్థ ఉందన్న ధైర్యంతోనే హరిచంద్రప్రసాద్ లాంటి మృగాలు రెచ్చిపోతున్నాయన్నారు. హత్యకేసులో ప్రమేయం ఉన్న మిగిలిన నిందితులపై కేసు నమోదు చేయకపోవడం దారుణమని, కూటమి పెద్దల అండదండలతో వారిని తప్పించేందుకు కుట్ర జరుగుతోందన్నారు. నిందితులకు శిక్ష పడేవరకు బాధితుల తరఫున పోరాడతామని వారు స్పష్టం చేశారు.

వాటర్ ప్లాంట్ సామగ్రి దొంగిలించిన టీడీపీ నేత

- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో బిగించిన వాటర్ ప్లాంట్
- దౌర్జన్యంగా కిటికీ పగులగొట్టి మరీ దొంగిలించిన వైనం

రాజుపాలెం: ప్రభుత్వం మనదే... ఏం చేసినా పర్లేదనుకుంటున్నారు టీడీపీ నాయకులు. ఎవరూ అడగరనే ధీమా ప్రదర్శిస్తున్నారు. తాజాగా పల్నాడు జిల్లా రాజుపాలెం మండలం న్యూ బోధనం (చౌటపాపాయపాలెం పులిచింతల నిర్వాసిత కేంద్రం) గ్రామంలో గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్ సామగ్రిని ఓ టీడీపీ నేత దొంగిలించి తన ఇంట్లో బిగించుకున్నాడు. ఇదేంటని నిలదీసిన గ్రామస్తులపై బెదిరింపులకు దిగాడు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఏర్పాటు

రాజుపాలెం మండలం న్యూ బోధనంలోని కమ్యూనిటీ హాలులో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రూ.3 లక్షల ఎంపీ నిధులు వెచ్చించి గ్రామస్తుల ఆమోదం, పంచాయతీ తీర్మానంతో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేశారు. నెల క్రితం వరకు పంచాయతీ అనుమతితో ఓ వ్యక్తి ప్లాంట్‌ను నిర్వహిస్తున్నాడు. ఇది జీర్ణించుకోలేని గ్రామంలోని ఓ టీడీపీ నేత ఎవరూ లేని సమయంలో కమ్యూనిటీ హాలు కిటికీ పగులగొట్టి ప్లాంట్‌కు సంబంధించిన మోటర్, ట్యాంకు, ఫిల్టర్ బ్లేడ్‌లను చోరీ చేశాడు. పరికరాలను తన సొంతింట్లో బిగించుకున్నాడు. సర్పంచ్ పాశం మహాలక్ష్మమ్మ దీని గురించి ప్రశ్నించగా.. పొంతనలేని సమాధానం చెప్పడంతో మిన్నకుండిపోయారు. ఈ విషయమై గ్రామస్తులు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు.


వాటర్ ప్లాంట్ బిగించిన కమ్యూనిటీ హాలు

ముగిసిన కట్టా సురేంద్రనాయుడు కస్టడీ

మదనపల్లె: అన్నమయ్య జిల్లా ములకలచెరువులో నకిలీమద్యం తయారీ కేసులో టీడీపీ నేత కట్టా సురేంద్రనాయుడు మూడురోజుల పోలీసు కస్టడీ ముగిసింది. ఆయనకు ఆదివారం సాయంత్రం వైద్య పరీక్షలు చేయించిన అనంతరం మదనపల్లె సబ్ జైలుకు తరలించారు. సిట్ విచారణలో నకిలీ మద్యం తయారీ, వాటిని బెల్టు షాపులకు తరలింపు, ఇందులో భాగస్వాములు, వారు నిర్వహించిన కార్యకలాపాలపై సురేంద్రనాయుడు వెల్లడించినట్టు తెలిసింది. తాను అనారోగ్యంతో ఉన్నందువల్ల తన పేరిట వచ్చిన మద్యం దుకాణం నిర్వహణ బాధ్యతలను మరొకరు తీసుకున్నారని సురేంద్రనాయుడు చెప్పినట్టు సమాచారం.

ఐదో తేదీనే వెళ్లిపోయేవాళ్లం?

ఈ కేసులో నిందితులైన తొమ్మిది మంది కూలీలను సిట్ అధికారులు శుక్ర, శనివారాల్లో విచారించిన సమయంలో పలు ముఖ్య విషయాలు వెల్లడించినట్లు తెలిసింది. ఒడిశా, తమిళనాడుకు చెందిన తమను వాటర్‌ప్లాంట్‌లో పనుల కోసమని పిలిపించి నకిలీ మద్యం తయారీ పనులు చేయించారని చెప్పినట్లు సమాచారం. నకిలీ మద్యం తయారీ పనులు చేయలేమని సొంతూళ్లకు వెళ్లిపోతామని నిర్వాహకులను కోరగా, 'అక్టోబర్ ఐదో తేదీన జీతాలు సెటిల్ చేస్తాం... వెళ్లిపోదురు..' అని చెప్పినట్టు కూలీలు వెల్లడించినట్లు తెలిసింది. సరిగ్గా ఐదో తేదీకి రెండు రోజుల ముందు అక్టోబర్ 3న ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు నకిలీ మద్యం తయారీ ప్లాంట్‌పై దాడులు నిర్వహించారు. ఆ రోజు దాడి జరగకపోతే కూలీలు వెళ్లిపోయేవారని తెలిసింది.

ట్రంప్ రాజు కాదు

- అధ్యక్షుడికి వ్యతిరేకంగా అమెరికాలో వెల్లువెత్తిన నిరసనలు
- నిరంకుశ పాలన వద్దంటూ నినాదాలు
- దేశవ్యాప్తంగా వేలాది ప్రదర్శనలు, ర్యాలీలు
- అసలైన ప్రజాస్వామ్యం కావాలని జనం డిమాండ్

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నిరంకుశ పరిపాలనకు వ్యతిరేకంగా జనం తిరుగుబాటు ప్రారంభించారు. 'నో కింగ్స్' పేరిట శనివారం దేశవ్యాప్తంగా వేర్వేరు నగరాల్లో నిరసన ప్రదర్శనలు, ర్యాలీలు నిర్వహించారు. లక్షల మంది ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ట్రంప్‌కు వ్యతిరేకంగా గళమెత్తారు. ట్రంప్ రాజు కాదని, ఇక్కడ రాజులెవరూ లేరని, నిరంకుశ పరిపాలన ఆపాలని పెద్ద ఎత్తున నినదించారు. ప్లకార్డులు ప్రదర్శించారు. దేశాన్ని నాశనం చేయొద్దని డిమాండ్ చేశారు. నియంతృత్వ పరిపాలనను ప్రతిఘటించడం, నిరసన తెలపడమే అసలైన దేశభక్తి అని ప్రజలు తేల్చిచెప్పారు. న్యూయార్క్‌లోని ప్రఖ్యాత టైమ్స్ స్క్వేర్‌తోపాటు బోస్టన్, అట్లాంటా, షికాగో తదితర నగరాల్లో నిరసనకారులు కదం తొక్కారు. వాషింగ్టన్, లాస్ ఏంజెలెస్ సహా వివిధ నగరాల్లో వేలాది ప్రదర్శనలు జరిగాయి. ట్రంప్ తీరును తీవ్రంగా వ్యతిరేకిస్తూ జనం వీధుల్లోకి వచ్చారు. గాలితో నింపిన దుస్తుల్లాంటివి ధరించారు. అమెరికా రాజ్యాంగ ప్రవేశికను ముద్రించిన బ్యానర్లపై సంతకాలు చేశారు. తాము ముమ్మాటికీ అసలైన ప్రజాస్వామ్యాన్ని కోరుకుంటున్నామని తేల్చిచెప్పారు.

నియంతగా మారుతున్న ట్రంప్

నిరసన ప్రదర్శనలపై అధికార రిపబ్లికన్ పార్టీ అభ్యంతరం వ్యక్తంచేసింది. అవన్నీ 'అమెరికాను ద్వేషించే' ర్యాలీలు అంటూ ఆరోపించింది. ట్రంప్ మద్దతుదారులు సైతం ఈ ర్యాలీలను తప్పుపట్టారు. ట్రంప్‌కు వ్యతిరేకంగా కుట్రలు జరుగుతున్నాయని మండిపడ్డారు. ట్రంప్ రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ఆయనకు వ్యతిరేకంగా జనం సామూహికంగా నిరసన తెలపడం ఇది మూడోసారి కావడం గమనార్హం. కొన్నిరోజుల క్రితం అమెరికాలో షట్‌డౌన్ ప్రకటించిన సంగతి తెలిసిందే. ప్రభుత్వ సేవలు, ఇతర ముఖ్యమైన కార్యక్రమాలు నిలిచిపోయాయి. ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ట్రంప్ నిర్వాకం వల్లే తమకు ఈ కష్టాలు వచ్చాయని వారు మండిపడ్డారు. అమెరికా కాంగ్రెస్ నిర్ణయాలను తప్పుపట్టారు. నిరంకుశ అధికారం చెల్లబోదని తేల్చిచెప్పారు. ట్రంప్ విధానాలు తమకు ఎంతమాత్రం నచ్చడం లేదని ఇరాక్ యుద్ధంలో పాల్గొన్న మాజీ సైనికురాలు షాన్ హోవార్డ్ చెప్పారు. తాను గతంలో ఎన్నడూ నిరసన కార్యక్రమాల్లో పాల్గొనలేదని, ఇదే మొదటిసారి అని తెలిపారు. ట్రంప్ ప్రభుత్వం చట్టవిరుద్ధంగా ముందుకెళ్తోందని, వలసదారులను అక్రమంగా నిర్బంధించడం ఏమిటని మండిపడ్డారు. ప్రధాన నగరాల్లో సైన్యాన్ని మోహరించడం సరైంది కాదన్నారు. ఇదంతా 'అన్-అమెరికన్' అని విమర్శించారు. దేశంలో ప్రజాస్వామ్యం ధ్వంసమవుతున్న సూచనలు కనిపిస్తున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. తమ అధ్యక్షుడు ట్రంప్ నియంతగా మారిపోతున్నారని మరో నిరసనకారుడు ధ్వజమెత్తారు. ఇదిలా ఉండగా, నిరసన కార్యక్రమాల విషయంలో ఎవరినీ అరెస్టు చేయలేదని పోలీసులు తెలియజేశారు.

జెట్ విమానంలో 'కింగ్ ట్రంప్'



తనకు వ్యతిరేకంగా దేశమంతటా నిరసన కార్యక్రమాలు జరుగుతున్న సమయంలో ట్రంప్ గోల్ఫ్ ఆడుతూ ఉల్లాసంగా గడిపారు. 'నో కింగ్స్' నినాదాన్ని హేళన చేస్తూ కింగ్ ట్రంప్ పేరిట ఒక కృత్రిమ మేధ వీడియోను సోషల్ మీడియాలో పోస్టు చేశారు. ఇందులో కిరీటం ధరించిన ట్రంప్ జెట్ విమానంలో కూర్చొని దూసుకెళ్తున్నారు. బాంబుల తరహాలో ఈ విమానం బురదను చిమ్ముతోంది. ఆ బురదంతా అమెరికాలో నగరాల్లోని నిరసనకారులను కమ్మేస్తోంది. ట్రంప్ తనను తాను బలమైన రాజుగా పరోక్షంగా ప్రకటించుకున్నారు. నిరసన ర్యాలీలను లెక్కచేయబోనని, బురదతో సన్మానిస్తానని సంకేతాలు పంపించారు.



రికార్డుల దీపోత్సవం

- ఒకేసారి 26.17 లక్షల ప్రమిదలు వెలిగించిన అయోధ్యవాసులు
- ఒకేసారి హారతి పట్టిన 2,128 మంది భక్తులు

అయోధ్య: దీపావళి వేళ భారతదేశమంతటా టపాసుల మోత మోగుతుంటే ఆధ్యాత్మిక నగరి అయోధ్య ఒక్కసారిగా గిన్నిస్ రికార్డుల మోత మోగించింది. ఇందుకు సరయూ నదీతీర ఘాట్‌లు వేదికగా నిలిచాయి. దీపావళి సందర్భంగా ప్రతిఏటా నిర్వహించే దీపోత్సవంలో భాగంగా ఈ సారి మరిన్ని ఎక్కువ ప్రమిదలను వెలిగించి కొత్త గిన్నిస్ ప్రపంచరికార్డ్‌ను అయోధ్యవాసులు సృష్టించారు. ఒకేసారి 26,17,215 దీపపు ప్రమిదలను ఆదివారం రాత్రి సరయూ నదీ ఘాట్‌ల వెంట వెలిగించారు. డ్రోన్ల సాయంతో ప్రమిదలను లెక్కించి గిన్నిస్ పుస్తక ప్రతినిధులు ప్రపంచ రికార్డ్‌ను ధ్రువీకరించారు. 2,128 మంది ఒకేసారి హారతి పట్టి మరో గిన్నిస్ ప్రపంచ రికార్డ్‌ను నెలకొల్పారు. యూపీ పర్యాటక శాఖ, అయోధ్య పాలనా యంత్రాంగం, రామ్‌మనోహర్ లోహియా అవధ్ విశ్వవిద్యాలయం సమష్టిగా ఒకేసారి 26 లక్షలకుపైగా దీపం ప్రమిదలను వెలిగించి ఈ కొత్త రికార్డ్‌ను సృష్టించారు. హారతి కార్యక్రమాన్ని పర్యాటక శాఖ, జిల్లా యంత్రాంగం, సరయూ హారతి సమితులు సంయుక్తంగా చేపట్టాయి. సరయూ వెంట 56 ఘాట్‌లలో దీపాలు వెలిగించారు. ముఖ్యంగా 10వ నంబర్ ఘాట్‌లో 80,000 ప్రమిదలతో చేసిన స్వస్తిక్ గుర్తు డ్రోన్ నుంచి చూస్తే ఎంతగానో ఆకట్టుకుంటోంది.

అయోధ్యకు పోటెత్తిన అశేష భక్తజనం

ఈ ఏడాది జనవరి నుంచి జూన్‌కాలంలో ఏకంగా 23.82 కోట్ల మంది భక్తులు అయోధ్య నగరం, అయోధ్య భవ్య రామమందిరాన్ని దర్శించుకున్నారని యూపీ ప్రభుత్వం ప్రకటించింది. దీపోత్సవం సందర్భంగా ఇటీవల దేశ, విదేశీ పర్యాటకుల తాకిడి మరింత ఎక్కువైందని ప్రభుత్వం ఒక ప్రకటనలో పేర్కొంది.

22న లద్దాఖ్ ప్రతినిధులతో
కేంద్రం భేటీ

లేహ్: ఈ నెల 22వ తేదీన కేంద్ర ప్రభుత్వం లద్దాఖ్ ప్రతినిధులతో చర్చలు జరపనుంది. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి నిత్యానంద్ రాయ్ సారథ్యంలో ఏర్పాటైన ఉప సంఘం ఢిల్లీలో లేహ్ అపెక్స్ బాడీ(ఎల్ఏబీ), కార్గిల్ డెమోక్రాటిక్ అలయెన్స్(కేడీఏ) ప్రతినిధులతోపాటు లద్దాఖ్ ఎంపీ మహ్మద్ హనీఫా జాన్‌తో సమావేశం కానుందని ఎల్ఏబీ సహాధ్యక్షుడు చెరింగ్ డోర్జె లక్రుక్ ఆదివారం వెల్లడించారు. లద్దాఖ్‌కు రాష్ట్ర హోదా కల్పించడం, రాజ్యాంగంలోని ఆరో షెడ్యూల్‌లో చేర్చడంపైనే ప్రధానంగా చర్చలు జరుగుతాయని లక్రుక్ మీడియాకు వివరించారు. తమను కేంద్రం చర్చలకు ఆహ్వానించడాన్ని ఆయన స్వాగతించారు. చర్చలతో సానుకూల ఫలితం వస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. లద్దాఖ్‌కు రాష్ట్ర హోదా, రాజ్యాంగంలోని ఆరో షెడ్యూల్‌లో చేర్చాలనే డిమాండ్‌తో ఎల్ఏబీ సెప్టెంబర్ 24వ చేపట్టిన బంద్ హింసాత్మకంగా మారడం, ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్‌ను అధికారులు జాతీయ భద్రతా చట్టం కింద అరెస్ట్ చేయడం తెల్సిందే. కాగా, తనతోపాటు ఎల్ఏబీ లీగల్ అడ్వైజర్, అంజుమన్ ఇమామియా అధ్యక్షుడు అష్రాఫ్ అలీ బర్చా, కేడీఏ తరఫున మరో ముగ్గురు చర్చల్లో పాల్గొంటారని లక్రుక్ వివరించారు.

రష్యా గ్యాస్ ప్లాంట్‌పై
ఉక్రెయిన్ డ్రోన్ దాడి

కీవ్: కజఖ్‌స్తాన్ సరిహద్దుల్లో ఉన్న రష్యాకు చెందిన గ్యాస్ ప్రాసెసింగ్ ప్లాంట్‌పై శనివారం రాత్రి ఉక్రెయిన్ డ్రోన్లతో దాడి చేసింది. భారీ పేలుళ్లు సంభవించడంతోపాటు పెద్ద ఎత్తున మంటలు ఎగసిపడ్డాయి. దీంతో, ప్లాంట్‌ను మూసివేసినట్లు రష్యా, కజకిస్తాన్ అధికారులు తెలిపారు. ప్రభుత్వ ఆధ్వర్యంలోని గాజ్‌ప్రోమ్ సంస్థకు చెందిన ఒరెన్‌బర్గ్ ప్లాంట్‌లో కజఖ్‌స్తాన్ నుంచి వచ్చే గ్యాస్‌ను ప్రాసెసింగ్ చేస్తారు. ప్రపంచంలోనే అతిపెద్దదైన ఒరెన్‌బర్గ్ ప్లాంట్ వార్షిక సామర్థ్యం 45 బిలియన్ క్యూబిక్ మీటర్లు. డ్రోన్ దాడి కారణంగా ఈ ప్లాంట్‌లోని వర్క్‌షాప్ తీవ్రంగా దెబ్బతిందని అధికారులు తెలిపారు. ప్లాంట్‌లో తాత్కాలికంగా గ్యాస్ ప్రాసెసింగ్‌ను నిలిపివేశామన్నారు. రష్యా తమపై సాగిస్తున్న యుద్ధానికి ఇంధన వనరులే కీలకమని భావిస్తున్న ఉక్రెయిన్ తరచూ ఆయిల్, గ్యాస్ రిఫైనరీలపై డ్రోన్ దాడులకు తెగబడుతోంది. మరో డ్రోన్ దాడితో ఒరెన్‌బర్గ్ సమీపంలో నొవొకుయి బిషెవ్‌స్క్ ఆయిల్ రిఫైనరీ ప్రధాన శుద్ధి విభాగం దెబ్బతిందని ఉక్రెయిన్ ప్రకటించింది. ఇలా ఉండగా, రష్యా ఆధునీకరించిన గ్లైడ్ బాంబును ఖర్కీవ్‌లోని లొజావా నగరంపై శనివారం మధ్యాహ్నం ప్రయోగించిందని వెల్లడించింది. యూఎంపీబీ-5 ఆర్ అని పిలిచే రాకెట్ అమర్చిన ఈ రకం బాంబులు 130 కిలోమీటర్ల దూరం వరకు ప్రయాణించిన తర్వాత సంభవించే పేలుడుతో తీవ్ర విధ్వంసం సంభవిస్తుంది.

పండగ సీజన్‌లో
స్వదేశీ ఉత్పత్తులనే కొనండి

ప్రజలకు ప్రధాని మోదీ సూచన

న్యూఢిల్లీ: పర్వదినాల సందర్భంగా స్వదేశీ వస్తువులను కొనుగోలుచేయాలని ప్రధాని నరేంద్ర మోదీ ప్రజలకు సూచించారు. ఈ మేరకు ప్రధాని మోదీ తన సామాజిక మాధ్యమ 'ఎక్స్' ఖాతాలో ఆదివారం ఒక పోస్ట్ పెట్టారు. '' 140 కోట్ల మంది భారతీయుల కృషి, సృజనాత్మక వస్తువులైన స్వదేశీ ఉత్పత్తులను కొనుగోలు చేయడం ద్వారా ఈ పండగ సీజన్‌ను ఆనందాలతో గడపండి. భారతీయ ఉత్పత్తులను కొనండి. మేం కొన్నది స్వదేశీ ఉత్పత్తి అని గర్వంతో చెప్పండి. పండగ సీజన్‌లో ఏఏ స్వదేశీ ఉత్పత్తులను కొన్నారో వాటి వివరాలను మీమీ సొంత సామాజికమాధ్యమ ఖాతాల్లో పోస్ట్‌చేసి అందరితో షేర్ చేసుకోండి. స్వదేశీ ఉత్పత్తులను, వాటి కొనుగోళ్లను ప్రోత్సహించండి. కొన్నవి అన్నీ సోషల్ మీడియాలో పెట్టండి. ఇలా మీరు ఇంకొకరిలో స్ఫూర్తిని రగిలించగలరు'' అని మోదీ హితవు పలికారు.

నమ్మక ద్రోహుల ఓట్లు
నాకు అక్కర్లేదు

మైనారిటీలపై వివాదాస్పద వ్యాఖ్యలుచేసిన కేంద్ర మంత్రి గిరిరాజ్‌సింగ్

పట్నా: తరచూ వివాదాస్పద వ్యాఖ్యలుచేసే కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్ మరోసారి మైనారిటీలపై అనుచితంగా మాట్లాడారు. బిహార్‌లో ఎన్నికల ర్యాలీలో భాగంగా ఆదివారం అర్వాల్ జిల్లాలో గిరిరాజ్ మాట్లాడారు. ''ఒకసారి నేను మౌల్వి(ముస్లిం మతాధికారి)ని ఒక ప్రశ్న వేశా. మీకు కేంద్ర ప్రభుత్వ పథకమైన ఆయుష్మాన్ భారత్ ఆరోగ్యకార్డ్ ఉందా? అని అడిగితే ఉంది అని చెప్పారు. హిందూ-ముస్లిం ప్రాతిపదికన మాత్రమే ప్రభుత్వం ఈ కార్డ్‌లు ఇచ్చిందని భావిస్తున్నారా? అని అడిగితే లేదు అని సమాధానం చెప్పారు. మీకు నాకు ఓటేశారా? అంటే అవునన్నారు. మరి ఖుదా (దైవం) మీద ప్రమాణంచేసి నిజం చెప్పండి అంటే ఆయన చెప్పలేదు. ముస్లింలు కేంద్ర ప్రభుత్వ పథకాలన్నింటినీ వాడుకుంటారు. వాటి ప్రయోజనాలు, లబ్ధి పొందుతారు. కానీ ఓటు మాత్రం మాకు వేయరు. ఇలాంటి వాళ్లనే నమ్మకద్రోహులు అంటారు. మీలాంటి వాళ్ల ఓటు నాకు వద్దు అని ఆయన ముఖం మీదనే చెప్పేశా'' అని ర్యాలీలో గిరిరాజ్‌సింగ్ వెల్లడించారు. ''బిహార్‌లో మొత్తం మౌలికసదుపాయాల కల్పనకు ఎన్‌డీఏ ప్రభుత్వం ఎంతో చేసింది. బిహార్‌లో రోడ్లు కేవలం ఎన్‌డీఏ నేతల కోసం వేయలేదు. మొత్తం ప్రజల కోసం వేశారు. ఇప్పుడు బిహార్ ఎంతో మారింది. సమాజంలోని ప్రతి వర్గం కోసం ఎన్‌డీఏ ప్రభుత్వం పనిచేస్తోంది. అయినాసరే ముస్లింలు బీజేపీకి ఓటు వేయట్లేరు'' అని ఆయన అన్నారు.

పాక్, అఫ్గాన్ కాల్పుల విరమణ

దోహాలో ఇరుపక్షాల మధ్య చర్చలు సఫలం

ఇస్లామాబాద్: పాకిస్తాన్, అఫ్గానిస్తాన్ మధ్య శాంతి దిశగా ముందడుగు పడింది. తక్షణమే కాల్పుల విరమణ పాటించాలని ఇరుపక్షాలు ఆదివారం అంగీకారానికి వచ్చాయి. రెండు దేశాల మధ్య సుదీర్ఘకాలం శాంతియుత పరిస్థితులు, స్థిరత్వం నెలకొనేలా చర్యలు తీసుకోవడానికి ప్రత్యేక యంత్రాంగాన్ని ఏర్పాటు చేసుకోవాలని నిర్ణయించుకున్నాయి. పాక్-అఫ్గాన్ సరిహద్దుల్లో కొన్ని రోజులుగా దాడులు, కాల్పులు, ఘర్షణలు జరుగుతున్న సంగతి తెలిసిందే. ఇరుదేశాల్లో పలువురు సైనికులు, సామాన్య ప్రజలు, ఉగ్రవాదులు మరణించారు. కాల్పుల విరమణ కోసం పాకిస్తాన్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్, అఫ్గాన్ రక్షణ మంత్రి ముల్లా యాకూబ్ మధ్య ఖతార్ రాజధాని దోహాలో సుదీర్ఘంగా చర్చలు జరిగాయి. ఈ చర్చల కోసం ఖతార్, తుర్కియే దేశాలు చొరవ తీసుకున్నాయి. కాల్పులు వెంటనే ఆపేయాలని పాక్, అఫ్గాన్ అంగీకారానికి వచ్చినట్లు ఖతార్ విదేశాంగ శాఖ ఒక ప్రకటనలో వెల్లడించింది. అలాగే రాబోయే రోజుల్లో తరచుగా సమావేశం కావాలని, శాంతి ప్రక్రియను ముందుకు తీసుకెళ్లాలని, భద్రత, స్థిరత్వానికి కట్టుబడి ఉండాలని రెండు దేశాలు నిర్ణయించుకున్నట్లు తెలియజేసింది.

ఫ్రాన్స్‌లో భారీ చోరీ

- మ్యూజియం నుంచి వెలకట్టలేని పురాతన వజ్రాభరణాలను ఎత్తుకెళ్లిన దొంగలు
- లౌరీ మ్యూజియంలో 4 నిమిషాల్లో చోరీచేసి పారిపోయిన చోర శిఖామణులు
- నెపోలియన్, రాణి సేకరించిన ఆభరణాలు మాయం

పారిస్: ఫ్రెంచ్ ఫ్రైస్ దుంపల వేపుడును తినాలన్నా ఏడెనిమిది నిమిషాలు పడుతుంది. అంతకంటే తక్కువగా అంటే కేవలం నాలుగు నిమిషాల్లోనే చోరశిఖామణులు వెలకట్టలేని చారిత్రక వజ్రాభరణాలను దొంగలించిన ఉదంతం ఫ్రాన్స్‌లో జరిగింది. పారిస్ నగరంలో ప్రపంచ ప్రఖ్యాత లౌరీ మ్యూజియంలో ఆదివారం ఉదయం భారీ చోరీ చోటుచేసుకుంది. నెపోలియన్ చక్రవర్తి, రాణి సేకరించిన అరుదైన, పురాతన వజ్రాభరణాలను దొంగలు అలవోకగా కాజేసి ఎంచక్కా బైక్‌లపై ఉడాయించిన ఉదంతం ఇప్పుడు ఫ్రాన్స్‌సహా యూరప్ దేశాల్లో చర్చనీయాంశమైంది. విశ్వవిఖ్యాత లియోనార్డో డావిన్సీ 'మోనాలిసా' చిత్రరాజం సైతం ఇదే మ్యూజియంలో కొలువై రోజూ వేలాది మంది ప్రపంచపర్యాటకులను ఆకర్షిస్తున్న విషయం తెల్సిందే. వందేళ్ల క్రితం ఇదే మ్యూజియంలో ఇదే మోనాలిసా పెయింటింగ్ సైతం చోరీకి గురై రెండేళ్ల తర్వాత ఎట్టకేలకు దొరికింది. ఇప్పుడు ఆదివారం చోరీకి గురైన అత్యంత విలువైన వజ్రాభరణాలు ఎప్పుడు దొరుకుతాయో, అసలు దొరుకుతాయో లేదోనన్న చర్చ ఇప్పుడు ఫ్రాన్స్‌లో ఎక్కువైంది. మ్యూజియం తలుపులు తెరచిన అరగంట తర్వాత ఈ చోరీ జరగడం గమనార్హం. అపోలో గ్యాలరీలోకి ఇంకా ఎవరూ రాకముందే ఈ చోరీ జరిగినట్లు తెలుస్తోంది.

బాస్కెట్ లిఫ్ట్‌తో వచ్చి, కట్టర్‌తో కత్తిరించి..

దొంగలు పక్కా ప్రణాళికతో వచ్చి దొంగతనం చేసినట్లు స్పష్టమవుతోంది. ఎక్కడా ఎలాంటి అనుమానం రాకుండా చడీచప్పుడులేకుండా తమ పని కానిచ్చేశారు. ఫ్రెంచ్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ముగ్గురు లేదా నలుగురు ముసుగు ధరించిన వ్యక్తులు ఈ చోరీ చేశారు. మ్యూజియంకు కుడివైపున 'సీన్' నది ప్రవహిస్తోంది. అటువైపు మ్యూజియం గోడ వద్ద మరమ్మతులు జరుగుతున్నాయి. అదే ప్రాంతాన్ని దొంగలు తమకు అనువుగా మలచుకున్నారు. వీధుల్లో ఎత్తయిన వీధిలైట్లను మార్చేందుకు వాడే 'బాస్కెట్' హైడ్రాలిక్ లిఫ్ట్ సాయంతో పైకి వచ్చి ఉదయం 9.30 గంటలప్పుడు మ్యూజియం భారీ కిటికీ వద్దకు చేరుకున్నారు. వెంట తెచ్చుకున్న పదునైన రంపపు కోత మెషీన్లతో దానిని పరపరా కోసేశారు. తర్వాత నేరుగా డెనన్ వింగ్ విభాగం హాల్‌లో ఉన్న అపోలో గ్యాలరీలోకి ప్రవేశించారు. ఈ గ్యాలరీలో సాధారణంగా ఫ్రాన్స్ చక్రవర్తుల సంబంధిత 23 కిరీటాలు, ఆభరణాలను ప్రదర్శనకు ఉంచుతారు. అందులోనే నెపోలియన్-3 రాజు, రాణిలకు సంబంధించిన వజ్రాభరణాలు ఉన్నాయి. ప్రదర్శన పేటికలను బద్దలు కొట్టి వీటిల్లో తొమ్మిదింటిని దొంగలు ఎత్తుకెళ్లారు. అయితే వాటిల్లో రాణి యుజెనీకి చెందిన ఒక కిరీటంలోంచి విరిగిపడిన కొన్ని ముక్కలు మాత్రం మ్యూజియం ఆవరణలో కనిపించాయి. వీటిని పోలీసులు స్వాధీనంచేసుకున్నారు. మ్యూజియం వెబ్‌సైట్‌లో పేర్కొన్న ప్రకారం ఈ స్వర్ణకిరీటంలో 1,354 చిన్న వజ్రాలు, 56 మరకతమణులు పొదిగి ఉన్నాయి.

ఇంటిదొంగల పనా?

మ్యూజియంలోని ఉద్యోగుల పాత్ర ఏదైనా ఉందా అనే కోణంలోనూ దర్యాప్తు జరుగుతోంది. దొంగలు ఉపయోగించిన బాస్కెట్ లిఫ్ట్‌ను పారిస్‌లో సర్వసాధారణంగా వాడతారు. అపార్ట్‌మెంట్‌లలో మూడు, నాలుగు అంతస్తుల ఫ్లాట్‌లలోకి ఫర్నీచర్‌ను తరలించేందుకు దీనినే వాడతారు. ఈ హైడ్రాలిక్ నిచ్చెనను చెర్రీ పికర్ అని కూడా పిలుస్తారు. ఇది అక్కడ ఉండటంతో అటుగా వెళ్లేవాళ్లకు ఎలాంటి అనుమానం రాలేదని తెలుస్తోంది. అపోలో గ్యాలరీలో అత్యంత విలువైన రీజెంట్, సాన్సీ, హోర్టెన్సియా వజ్రాలను సైతం ప్రదర్శనకు ఉంచారు. ఇవి చోరీకి గురయ్యాయో లేదో తెలియరాలేదు. ఇది మాత్రమేకాదు ఫ్రాన్స్‌లో మ్యూజియంలలో చోరీలు ఇటీవల కాలంలో ఎక్కువయ్యాయి. అంతర్జాతీయ మార్కెట్లో పురాతన వస్తువులకు విపరీతమైన డిమాండ్ పెరగడంతో వాటి కోసం దొంగలు మ్యూజియంలపై పడుతున్నారు.



ప్రపంచంలో అతిపెద్ద మ్యూజియం

విస్తీర్ణంపరంగా లౌరీ మ్యూజియం ప్రపంచంలోనే అతిపెద్దది. 73,000 చదరపు మీటర్ల విస్తీర్ణంలో అంటే ఏకంగా 10 ఫుట్‌బాల్ స్టేడియాల విస్తీర్ణంలో ఈ మ్యూజియం ఉంటుంది. ఏకంగా 35,000 పురాతన వస్తువులను ఇందులో ప్రదర్శిస్తారు. ప్రపంచంలో అత్యంత సందర్శకుల రద్దీ ఉన్న మ్యూజియం కూడా ఇదే.

కర్నాటకలో ఆర్ఎస్ఎస్ మార్చ్‌కి నో

కలబురిగి: కర్నాటకలో రాష్ట్రీయ స్వయం సేవక్(ఆర్ఎస్ఎస్) తలపెట్టిన ర్యాలీకి అధికారులు అనుమతి నిరాకరించారు. మంత్రి ప్రియాంక్ ఖర్గే సొంత నియోజకవర్గం చిట్టాపూర్‌లో ఆదివారం ఆర్ఎస్ఎస్ 'రూట్ మార్చ్' నిర్వహించాలని భావించింది. ఈ మేరకు తహశీల్దార్‌కు దరఖాస్తు చేసుకుంది. అయితే, శాంతిభద్రతలకు భంగం కలిగే అవకాశముందంటూ తహశీల్దార్ అనుమతి నిరాకరించారు. ఆ దరఖాస్తును తిరస్కరించారు. కలబురిగి జిల్లా చిట్టాపూర్ పట్టణంలో అక్టోబర్ 19వ తేదీన ఆర్ఎస్ మార్చ్ నిర్వహణకు అనుమతి కోరిందని తహశీల్దార్ చెప్పారు. భీమ్ ఆర్మీ, ఇండియన్ దళిత్ పాంథర్స్ కూడా అదే రోజు ర్యాలీలు జరుపుతామని దరఖాస్తు చేసుకున్నాయన్నారు. వీటితో శాంతిభద్రతలకు విఘాతం కలిగే అవకాశాలున్నాయంటూ పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టర్ నుంచి అందిన నివేదిక మేరకు ఆర్ఎస్ఎస్ ర్యాలీకి నో చెప్పామన్నారు. అదేవిధంగా, ర్యాలీకి అనుమతివ్వక మునుపే ఏర్పాటు చేశారంటూ పట్టణ ప్రధాన రహదారిపైని ఆర్ఎస్ఎస్ కటౌట్లు, బ్యానర్లను శనివారం భారీ పోలీసు బందోబస్తు నడుమ మున్సిపల్ సిబ్బంది తొలగించి వేశారు. ప్రభుత్వ ప్రాంగణాలు, భవనాల్లో అనుమతి లేకుండా ఏ సంస్థలు గానీ వ్యక్తులు గానీ ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించరాదంటూ శనివారం రాష్ట్ర ప్రభుత్వం సైతం ఉత్తర్వులు జారీ చేయడం గమనార్హం.

దీపాలపై డబ్బులు తగలేయొద్దు

- విద్యుత్ దీపాలతో దీపావళి నిర్వహించుకోవాలి
- క్రిస్మస్‌ను చూసి నేర్చుకోవాలి: అఖిలేశ్ యాదవ్

లక్నో: దీపావళి వేడుకలపై సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు, ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి అఖిలేశ్ యాదవ్ చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదంగా మారాయి. దీపాలు, కొవ్వొత్తులపై అనవసరంగా డబ్బులు తగలేయడం ఎందుకని ఆయన ప్రశ్నించారు. దీపాలు వెలిగించడానికి ప్రజల సొమ్ము వృథా చేయొద్దని ఉత్తరప్రదేశ్ ప్రభుత్వానికి సూచించారు. తాజాగా ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ''సలహాలు ఇవ్వాలన్న ఉద్దేశం నాకు లేదు. కానీ, రాముడి పేరిట ఒక సలహా ఇవ్వాలనుకుంటున్నా. క్రిస్మస్ పర్వదినం సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా అన్ని నగరాల్లో ఘనంగా వేడుకలు నిర్వహిస్తారు. కొన్ని నెలలపాటు ఈ ఉత్సవాలు జరుగుతాయి. నగరాలు, ఇళ్లను విద్యుత్ దీపాలతో అందంగా అలంకరిస్తారు. మనం కూడా అలా ఎందుకు చేయకూడదు? క్రిస్మస్ నుంచి మనం ఎందుకు నేర్చుకోకూడదు. దీపాలు, కొవ్వొత్తుల కోసం డబ్బులు ఖర్చు పెట్టాల్సిన అవసరం ఏమొచ్చింది. ఈ విషయం అందరూ ఆలోచించాలి. డబ్బులు వృథా చేయొద్దు. ప్రభుత్వం నుంచి మనం కోరుకొనేది ఆదే. విద్యుత్ దీపాలతో దీపావళి వేడుకలు చేసుకుందాం'' అని ప్రజలకు అఖిలేశ్ యాదవ్ సూచించారు.

ఆ దుర్గతి హిందువులకు పట్టలేదు: వీహెచ్‌పీ

అఖిలేష్ యాదవ్ వ్యాఖ్యలపై విశ్వ హిందూ పరిషత్ (వీహెచ్‌పీ) జాతీయ అధికార ప్రతినిధి వినోద్ బన్సల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మాజీ ముఖ్యమంత్రి దీపావళి సందర్భంగా క్రిస్మస్‌ను ప్రశంసిస్తున్నాడని, ఈ విషయం ప్రజలు గమనించాలని కోరారు. వరుస దీరిన దీపాలు అఖిలేశ్ హృదయాన్ని కాల్చేస్తున్నాయని చెప్పారు. అందుకే దీపాలపై డబ్బులు ఖర్చు చేయొద్దని చెబుతున్నాడని, క్రిస్మస్‌ను చూసి నేర్చుకోవాలని చెబుతున్నాడని విమర్శించారు. అఖిలేశ్ వ్యాఖ్యలను ఖండిస్తున్నట్లు స్పష్టంచేశారు.

ఆయన ఆంటోనీ లేదా అక్బర్: బీజేపీ

అఖిలేశ్ యాదవ్‌పై మధ్యప్రదేశ్ కేబినెట్ మంత్రి, బీజేపీ నాయకుడు విశ్వాస్ సారంగ్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. అఖిలేశ్‌ను ఆంటోనీ లేదా అక్బర్ అని పిలవాలని అన్నారు. ఆయన మతం మారినట్లు కనిపిస్తోందని చెప్పారు. ప్రమిదలు తయారు చేసి, మన ఇళ్లల్లో వెలుగులు నింపే పేద కార్మికులను అవమానిస్తారా? అని విశ్వాస్ సారంగ్ నిప్పులు చెరిగారు.

గాజాకు సాయం సరఫరా
ఆపేశాం: ఇజ్రాయెల్

టెల్ అవీవ్: గాజాలోకి మానవతా సాయం సరఫరాను నిలిపివేసినట్లు ఇజ్రాయెల్ భద్రతాధికారి ఒకరు ఆదివారం తెలిపారు. తదుపరి ప్రకటన వెలువడే వరకు అనుమతించబోమన్నారు. హమాస్ కాల్పుల విరమణ ఒప్పందం ఉల్లంఘనకు పాల్పడి నట్లు ఆరోపించిన ఇజ్రాయెల్, అనంతరం ఈ మేరకు ప్రకటన చేయడం గమనార్హం. అమెరికా సారథ్యంలో రెండేళ్ల యుద్ధానికి ముగింపు పలుకుతూ కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందం అనంతరం కనీసం వారం పాటు కూడా మానవతా సాయం సరఫరా కొనసాగకముందే ఈ పరిణామం చోటుచేసుకుంది. ఆదివారం తమ బలగాలపైకి హమాస్ శ్రేణులు కాల్పులకు పాల్పడ్డాయంటూ ఇజ్రాయెల్ గాజాలోని పలుప్రాంతాలపై దాడులకు దిగింది. పాలస్తీనియన్ల కోసం ఆహారం, మందులు, దుప్పట్లు, టెంట్లు తదితర అత్యవసరాలను తీసుకువస్తున్న ట్రక్కులు ఈజిప్టు నుంచి రఫా క్రాసింగ్ ద్వారా గాజాలోకి ప్రవేశిస్తుండటం తెలిసిందే.

కొత్తగా 10,650 ఎంబీబీఎస్ సీట్లు

- 2024-25లో 41 నూతన వైద్య కళాశాలలు
- ఆమోదం తెలియజేసిన జాతీయ మెడికల్ కమిషన్

న్యూఢిల్లీ: వైద్య విద్య అభ్యసించాలని కోరుకొనే ఔత్సాహికులకు శుభవార్త. దేశంలో 2024-25 విద్యా సంవత్సరంలో కొత్తగా 10,650 ఎంబీబీఎస్ సీట్లకు జాతీయ మెడికల్ కమిషన్(ఎన్ఎంసీ) ఆమోదం తెలియజేసింది. అలాగే కొత్తగా 41 వైద్య కళాశాలలు కూడా రాబోతున్నాయి. దీంతో దేశవ్యాప్తంగా మెడికల్ కాలేజీల సంఖ్య 816కి చేరుకోనుంది. రాబోయే ఐదేళ్లలో కొత్తగా 75 వేల ఎంబీబీఎస్ సీట్లకు అనుమతి ఇవ్వనున్నట్లు 2024లో స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటించిన సంగతి తెలిసిందే. వైద్య విద్యను ప్రజలకు మరింత అందుబాటులోకి తీసుకురావాలని కేంద్ర ప్రభుత్వం సంకల్పించింది. ఈ నేపథ్యంలోనే 10,650 సీట్లకు తాజాగా ఆమోదం లభించింది.

మరో 5,000 పీజీ మెడికల్ సీట్లు

అండర్‌గ్రాడ్యుయేట్(యూజీ) మెడికల్ సీట్ల విస్తరణకు వైద్య కళాశాలల నుంచి 170 దరఖాస్తులు వచ్చాయని ఎన్ఎంసీ చైర్‌పర్సన్ డాక్టర్ అభిజాత్ సేఠ్ చెప్పారు. ఇందులో 41 దరఖాస్తులు ప్రభుత్వ కాలేజీల నుంచి, 129 దరఖాస్తులు ప్రైవేట్ కాలేజీల నుంచి వచ్చినట్లు తెలిపారు. కొత్తగా 10,650 సీట్ల రాకతో 2024-25లో మొత్తం ఎంబీబీఎస్ సీట్ల సంఖ్య 1,37,600కు చేరుకోనున్నట్లు వెల్లడించారు. ఇక పోస్టుగాడ్యుయేట్ సీట్ల విషయంలో 3,500 దరఖాస్తులు వచ్చాయన్నారు. ఈసారి మరో 5,000 పీజీ మెడికల్ సీట్లకు అనుమతి ఇచ్చే అవకాశం ఉందని పేర్కొన్నారు. దీంతో దేశమంతటా మొత్తం పీజీ సీట్ల సంఖ్య 67,000కు చేరుతుందని స్పష్టంచేశారు. ఈ ఏడాది మొత్తంగా 15,000 యూజీ, పీజీ సీట్లు కొత్తగా అందుబాటులోకి రాబోతున్నట్లు చెప్పారు.

ఐసీఎంఆర్‌తో వైద్య విద్య అనుసంధానం

యూజీ, పీజీ సీట్లకు తుది అనుమతి, కౌన్సెలింగ్ ప్రక్రియ కొంత ఆలస్యమయ్యే పరిస్థితి కనిపిస్తోంది. అయితే, నిర్దేశిత గడువులోగానే ఈ ప్రక్రియ పూర్తవుతుందని, అభ్యర్థులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అధికారులు చెబుతున్నారు. అక్రెడిటేషన్, పరీక్షలు, సీట్ల ఆమోదానికి త్వరలో బ్లూప్రింట్‌ను ప్రచురించబోతున్నారు. 2025-26లో దరఖాస్తులకు పోర్టల్ వచ్చే నెలలో ప్రారంభమవుతుందని అధికారులు వివరించారు. వైద్య విద్యలో నాణ్యతను పెంచడంపై ప్రత్యేకంగా దృష్టి పెట్టామని డాక్టర్ అభిజాత్ సేఠ్ తెలిపారు. మెడికల్ పాఠ్య ప్రణాళిక(కరిక్యులమ్)లో క్లినికల్ రీసెర్చ్‌ను అంతర్భాగంగా చేర్చబోతున్నట్లు స్పష్టంచేశారు.

న్యూస్‌రీల్

వేంకటేశ్వరుని సన్నిధిలో భక్తుల రద్దీ



గుడ్లవల్లేరు: డోకిపర్రు భూ సమేత శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో ఆదివారం స్వామివారి దర్శనానికి భక్తుల తాకిడి అధికమైంది. మెయిల్ అధినేత, దేవస్థాన వ్యవస్థాపక ధర్మకర్తలు పురిటిపాటి వెంకట కృష్ణారెడ్డి, సుధారెడ్డి ఆధ్వర్యంలో వేద మంత్రోచ్చరణ నడుమ పూజలను వేద పండితులు నిర్వహించారు. ఈ సందర్భంగా భారీ అన్నసమారాధనను నిర్వహించారు. ఈ పూజల్లో అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

ఐఎంఏ నూతన కార్యవర్గం ఎంపిక



లబ్బీపేట(విజయవాడతూర్పు): ఇండియన్ మెడికల్ అసోసియేషన్ విజయవాడశాఖ 2025–26 సంవత్సరానికి గాను నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గవర్నర్‌పేటలోని ఐఎంఏ హాలులో ఆదివారం జరిగిన సర్వసభ్య సమావేశంలో ఈ కమిటీని ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గంలో అధ్యక్షుడిగా డాక్టర్ వీఎస్ వరప్రసాద్, ఉపాధ్యక్షుడిగా డాక్టర్ ఉప్పులేటి తారకప్రసాద్, డాక్టర్ బోడేపూడి చౌదరి, కార్యదర్శిగా డాక్టర్ అనురూప్ తోట, సంయుక్త కార్యదర్శులుగా డాక్టర్ ఏఎస్ రావు, డాక్టర్ పూజిత, కోశాధికారిగా డాక్టర్ కె. వంశీకృష్ణలను ఎన్నుకున్నారు. వీరితో పాటు మరో 20 మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు.

రేపటి నుంచి రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలు

విజయవాడరూరల్: ఏపీ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 21 నుంచి 23వ తేదీ వరకు అండర్–19 రెజ్లింగ్ బాలికల (ఫ్రీ స్టైల్), బాలుర (గ్రీకో–రోమన్) రెజ్లింగ్ స్టేట్ మీట్ జరుగుతుందని నున్న జిల్లా పరిషత్ హైస్కూల్ పీడీ టి.విజయవర్మ ఓ ప్రకటనలో తెలిపారు. విజయవాడ రూరల్ మండలం నున్న గ్రామంలోని అశోక్ ఫంక్షన్ హాలులో నిర్వహించే ఈ పోటీలకు రాష్ట్రంలోని 12 జిల్లాల నుంచి 250టీంల క్రీడాకారులు పాల్గొనే అవకాశం ఉందని చెప్పారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ పోటీలను ప్రారంభిస్తారని పేర్కొన్నారు.

నిత్యాన్నదానానికి విరాళం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మ సన్నిధిలో నిత్యాన్నదానానికి కొండపల్లికి చెందిన బి. ప్రసాద్, బి. నాగసాయి యోక్షిత పేరిట రూ. 2,00,116 విరాళాన్ని ఆదివారం ఆలయ అధికారులకు అందజేశారు. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితుల ఆశీర్వచనం అనంతరం దాతలకు ఆలయ పర్యవేక్షకులు చందు శ్రీనివాస్ అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను బహూకరించారు.



దివ్వెల దీపావళి.. విజయవాడలో ముగ్గు వేసి, ప్రమిదలు వెలిగించి ముందస్తు వేడుకలు చేస్తున్న చిన్నారులు

కొనుగోలుదారులతో కిటకిట.. విజయవాడ ఘంటసాల మ్యూజిక్ కళాశాల ప్రాంగణంలో దుకాణాల వద్ద రద్దీ





దీపోత్సవానికి వేళాయె

చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా నిర్వహించే వేడుక దీపావళికి ఉమ్మడి జిల్లా సిద్ధమైంది. హిందువుల పవిత్ర పండుగల్లో ఒకటైన ఈ పర్వదినాన్ని సోమవారం ప్రజలు సంబరంగా నిర్వహించుకోనున్నారు. ఇంటింటా దీపాలు.. లోగిళ్లలో ప్రమిదల వెలుగులు.. వీధుల్లో పటాకుల మోతలతో హోరెత్తించేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. ఇప్పటికే క్రాకర్స్ విక్రయాలు ఊపందుకున్నాయి. మార్కెట్లు కొనుగోలుదారులతో సందడిగా మారాయి. అయితే పటాకులు కాల్చే సమయంలో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా తగిన జాగ్రత్తలతో ఆనందంగా జరుపుకోవాలని అగ్నిమాపక శాఖ అధికారులు సూచించారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

రామా.. కష్టం కనుమా!

- తారకరామా ఎడమ కాలువను 6.6కిలో మీటర్లు మాత్రమే తవ్వి వదిలేసిన వైనం
- అది కూడా వాగుల ప్రవాహానికి అడ్డంగా తవ్వకం
- సైఫన్‌లు సైతం ఏర్పాటు చేయకపోవడంతో ఇబ్బందులు
- వరద సమయంలో ముంపు బారిన పడుతున్న వరి పొలాలు
- కవులూరు, కొత్తూరు తాడేపల్లికి చెందిన రైతులకు తీవ్ర నష్టం

'ఆ ఒక్క కిలోమీటర్' పూర్తి చేస్తే 400 ఎకరాలకు మేలు



వాగుల ప్రవాహానికి అడ్డంగా తవ్విన తారకరామా ఎడమ కాలువ ఇదే

జి.కొండూరు: సాగు నీరందించేందుకు తవ్విన కాలువ రైతుల పాలిట శాపంగా మారింది. పాలకుల నిర్లక్ష్యంతో ప్రకృతి సహజ సిద్ధంగా ఏర్పడిన వాగులకు అడ్డంగా కాలువ తవ్వి, వాగులలో వరద ప్రవాహానికి అడ్డుకట్ట వేయడంతో రైతుల సాగు భూములు ముంపునకు గురవుతున్నాయి. రెండు దశాబ్దాలుగా ముంపు బారిన పడి రైతులు నష్టపోతుంటే ప్రభుత్వాలు, స్థానిక పాలకులు చూసీ చూడనట్లు వదిలేయడంతో తీవ్ర నష్టం జరుగుతోంది. ఎన్టీఆర్ జిల్లా, జి.కొండూరు, విజయవాడ రూరల్ మండలాల పరిధిలోని కవులూరు, కొత్తూరు తాడేపల్లి గ్రామాల పరిధిలో తారకరామా ఎడమ కాలువకు ఆనుకొని ఉన్న రైతులు పడుతున్న కష్టాలు వర్ణనాతీతంగా మారాయి.



వరద ముంపులో ఉన్న కవులూరు గ్రామ శివారులోని వరి పొలాలు

సమస్యే ఇది..

ఇబ్రహీంపట్నంలోని థర్మల్ పవర్ స్టేషన్‌లో వినియోగించిన నీటిని తిరిగి కృష్ణా నదిలోకి వెళ్లకుండా బుడమేరు డైవర్షన్ కెనాల్ ద్వారా ఈలప్రోలు గ్రామం వద్ద కుడి, ఎడమ కాలువకు మళ్లించి తారకరామా ఎత్తిపోతల పథకం ద్వారా రైతులకు సాగునీరందించడం లక్ష్యంగా 1982లో ప్రణాళిక రచించారు. కృష్ణాజిల్లాలోని మెట్ట ప్రాంతాలైన ఇబ్రహీంపట్నం, జి.కొండూరు, విజయవాడరూరల్, మైలవరం, గన్నవరం, ఉంగుటూరు, బాపులపాడు, ఆగిరిపల్లి, మండలాల పరిధిలోని 64 గ్రామాలకు చెందిన 56వేల ఎకరాలకు సాగునీరందించే విధంగా ఎత్తిపోతల పథకానికి శ్రీకారం చుట్టారు. ఈ పథకంలో కుడికాలువ పొడవు 25.74కిలోమీటర్లు, ఎడమకాలువ పొడవు 51.27కిలోమీటర్లుగా నిర్ధారించారు. మొదటి దశ నిర్మాణంలో భాగంగా రూ.24.97కోట్ల అంచనాలతో.. కుడి కాలువ 6.250కిలోమీటర్ల తవ్వి రెండు పంపుహౌస్‌లు, ఎడమ కాలువ 8.079కిలోమీటర్లు తవ్వాల్సి ఉండగా కొత్తూరు తాడేపల్లి శివారులో 6.6కిలో మీటర్ల వరకు తవ్వి ఆపేశారు. ఈ మొదటి దశ పనులు 2004నాటికి పూర్తయ్యాయి. ఆ తర్వాత ఈ ఎత్తిపోతల పథకంలో కుడి కాలువ తవ్వకం, పంపుహౌస్‌ల నిర్మాణం కోసం రెండు దశల్లో పనులు జరిగినప్పటికీ ఎడమ కాలువ తవ్వకాన్ని మాత్రం చేపట్టలేదు. ఇదే ఇప్పుడు సమస్యగా మారింది.

వాగులకు అడ్డంగా ఎడమ కాల్వ

జి.కొండూరు మండల పరిధిలోని కవులూరు, విజయవాడ రూరల్ మండల పరిధిలోని కొత్తూరు తాడేపల్లి గ్రామాలకు ఎగువ నుంచి వచ్చే నల్లవాగు(బుడమేరు వాగు), చిల్లవాగు, తాడేపల్లివాగు, తొమ్మండ్రంవాగుల ప్రవాహానికి అడ్డంగా తారకరామా ఎడమ కాలువను తవ్వారు. అయితే ఈ కాలువను ప్రాజెక్టు ప్రణాళిక ప్రకారం పూర్తి చేస్తే వాగులలో వరద ప్రవాహం తారకరామా ఎడమ కాలువలో కలిసి ముందుకు సాగే వీలుండేది. అలా కాకుండా ఎడమ కాలువను 6.6కిలో మీటర్లు మాత్రమే తవ్వి వదిలేయడంతో పాటు, ఎగువ నుంచి వచ్చే వాగులలో వరద దిగువకు పోయేందుకు అడ్డంగా ఉన్న కాలువకు సైఫన్‌లు ఏర్పాటు చేయకపోవడంతో ఎడమ కాలువకు ఎగువన ఉన్న వరి పొలాలు ముంపునకు గురవుతున్నాయి. ఈ రెండు గ్రామాలకు చెందిన 400ఎకరాల భూమిని సాగు చేసే రైతులు తారకరామా ఎడమ కాలువ తవ్విన నాటి నుంచి అంటే దాదాపు 20ఏళ్లుగా నష్టపోతున్నారు. వరద నీరు పోయే మార్గం లేక నోటికాడకు వచ్చిన పైరు కుళ్లిపోవడం వంటి ఘటనలతో ఇక్కడ రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

సాగు చేయలేక లీజుకిచ్చాం



తారకరామా ఎడమ కాలువను కొంత తవ్వి అసంపూర్తిగా వదిలేయడం వల్ల ఎగువ వాగుల ద్వారా వచ్చే వరద దిగువకు పోయేందుకు కాలువ అడ్డుగా ఉండడంతో పొలాలు మునిగిపోతున్నాయి. ఇరవై ఏళ్లుగా ఇదే సమస్యతో తీవ్ర నష్టాలు వస్తుండడంతో నాకు ఉన్న తొమ్మిది ఎకరాలను ఇటుక బట్టీల ఏర్పాటుకు లీజుకిచ్చాను.

– చెరుకూరి శ్రీనివాసరావు, రైతు, కవులూరు గ్రామం

ఐదు ఎకరాలు పాడైపోయింది



మా గ్రామ శివారులో నేను ఏడు ఎకరాలు కౌలుకి తీసుకొని వరి సాగు చేశాను. తారకరామా ఎడమ కాల్వ వల్ల వరద దిగువకు పోయే అవకాశం లేక పొలం అంతా మునిగిపోయింది. ఐదు ఎకరాలు ఎందుకూ పనికి రాకుండా పోయింది. పై నుంచి వాగులలో వచ్చే వరద పోయేలా చేస్తేనే పొలాలు సాగు చేయగలుగుతాం.

– తమ్మెట శ్రీహరి, రైతు, కవులూరు గ్రామం

ఇలా చేస్తే పరిష్కారం..

- ప్రభుత్వం రైతుల కష్టాలను గుర్తించి కొద్దిపాటి శ్రద్ధ చూపితే తమకు ముంపు కష్టాలు తీరతాయని ఇక్కడి రైతులు కోరుతున్నారు.
- కొత్తూరు తాడేపల్లి గ్రామ శివారులో 6.6కిలోమీటరు వద్ద ఆపేసిన తారకరామా ఎడమ కాలువను ఒక కిలో మీటరు పొడగించి.. ఆ గ్రామ తుమ్మల చెరువులో కలిపితే, కాలువలో నీటి ప్రవాహం ముందుకు సాగి, ఎగువ నుంచి వచ్చే వరద తారకరామా ఎడమ కాలువ ద్వారా దిగువకు పోయే అవకాశం ఉంది.
- లేదంటే ఎగువ నుంచి వచ్చే వాగుల వరద పోయేందుకు తారకరామా ఎడమ కాలువకు కిందగా సైపన్‌లు ఏర్పాటు చేసినా సమస్యకు పరిష్కారం లభిస్తుంది.
- తారకరామా ఎడమ కాలువలో తూడు కాడ లేకుండా ఎప్పటికప్పుడు తొలగించడం వల్ల సమస్య కొంతమేర పరిష్కారమవుతుంది.

సీఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన



పున్నమీఘాట్‌లో బందోబస్త్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న సీపీ రాజశేఖర్‌బాబు, తదితరులు

భవానీపురం(విజయవాడ పశ్చిమ): దీపావళి పండుగ సందర్భంగా ఆదివారం సాయంత్రం గవర్నర్‌పేట పీఎస్ పరిధిలోని బీసెంట్ రోడ్, భవానీపురం పీఎస్ పరిధిలోని పున్నమీ ఘాట్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన నేపథ్యంలో ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖర్‌బాబు ఇతర శాఖల అధికారులతో కలిసి భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. భద్రత పరంగా ఎటువంటి లోపాలు లేకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఆయా ప్రాంతాలలో ప్రయాణించే ప్రజలకు ఇబ్బందులు లేకుండా ఇతర మార్గాలను నిర్దేశించే విధంగా, వాహనాల రద్దీ ఏర్పడకుండా పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్ల గురించి అధికారులకు పలు సూచనలను చేశారు.

వ్యాపారస్తులతో ముఖాముఖీ..

సీపీ రాజశేఖర్ బాబు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు బీసెంట్ రోడ్ ఏరియాలో పర్యటించి వ్యాపారస్తులతో మాట్లాడుతారని తెలిపారు. అనంతరం పున్నమీఘాట్‌లో ఏర్పాటు చేసిన దీపావళి సంబరాల్లో పాల్గొనే కార్యక్రమంలో మంత్రులు, వీవీఐపీలు, ఇతర అధికారులు పాల్గొంటారని వివరించారు. ఆయా ప్రాంతాల్లో పార్కింగ్ ప్రదేశాలు, పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ అంతరాయం కలుగకుండా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో డీసీపీ ఎస్వీడీ ప్రసాద్, ఏడీసీపీ జీ రామకృష్ణ, ఏసీపీలు, ఇనస్పెక్టర్లు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

నేడు 'పీజీఆర్‌ఎస్' రద్దు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): దీపావళి పండుగ సందర్భంగా విజయవాడలోని కలెక్టరేట్‌లో 20వ తేదీ సోమవారం నిర్వహించాల్సిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్) కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని అర్జీదారులు గమనించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

ముసురు.. రైతుల గుండెల్లో గుబులు



పునాదిపాడు వద్ద నేలవాలిన వరి పైరు

కంకిపాడు: భారీ వర్షంతో వరి పైర్లు నేలవాలాయి. అల్పపీడన ప్రభావంతో ముసురు కొనసాగుతుండటంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. అల్పపీడన ప్రభావంతో శనివారం రాత్రి నుంచి వర్షం విడవకుండా కురుస్తోంది. ఆదివారం కూడా మోస్తరు వర్షం పడింది. వర్షానికితోడు తీవ్రమైన చలిగాలులు వీచాయి. దీంతో చిరుపొట్ట దశకు చేరిన వరిపైర్లు నేలవాలాయి. మండలంలోని కంకిపాడు, పునాదిపాడు, ఉప్పలూరు గ్రామాల్లో చాలా చోట్ల వరి పొలాలు నేలవాలి నీటిలో నానుతున్నాయి. వర్షం విడవకుండా కురుస్తుండటంతో చిరుపొట్ట దశలో, సుంకు దశలో ఉన్న పైర్లకు నష్టం జరుగుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

వీడని ముసురు..

వర్షంతో పాటు ముసురు కొనసాగుతోంది. రెండు రోజులుగా వాతావరణం పూర్తిగా మేఘావృతమై ఉంది. మరో రెండు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ హెచ్చరికలు రైతులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. పొలాల్లో నిలిచిన నీటిని పక్కనే ఉన్న పంట బోదెల్లోకి మళ్లించుకుని వరి కంకులు నీటిలో నానకుండా రైతులు జాగ్రత్త వహిస్తున్నారు. కంకి, చిరుపొట్ట దశలో వర్షంతో నష్టం జరుగుతుందని రైతులు చెబుతున్నారు.

దళిత వ్యతిరేకి చంద్రబాబును గద్దె దింపుదాం

- పేదలకు విద్య, వైద్యాన్ని దూరం చేస్తున్న కూటమి ప్రభుత్వం
- వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ 'మాట్లాడుకుందాం.. రండి' కార్యక్రమంలో వక్తలు



రౌండ్ టేబుల్ సమావేశంలో ఐక్యతను చాటుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

మచిలీపట్నంటౌన్: రాష్ట్రంలోని దళితులను అన్ని విధాలుగా విచ్ఛిన్నం చేయడమే లక్ష్యంగా పెట్టుకుని పాలన సాగిస్తున్న చంద్రబాబు నాయుడుకు తగిన బుద్ధి చెప్పేందుకు ఐక్యంగా సన్నద్ధం కావాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటీకరించడాన్ని, నకిలీ మద్యాన్ని వ్యతిరేకిస్తూ వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి కృష్ణా జిల్లా కేంద్రమైన మచిలీపట్నంలో 'మాట్లాడుకుందాం.. రండి..' పేరుతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఆ పార్టీ ఎస్సీ సెల్ కృష్ణాజిల్లా అధ్యక్షుడు మట్టా జాన్ విక్టర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే టి.జె.ఆర్.సుధాకర్ బాబు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కొమ్మూరి కనకరావు, పార్టీ కృష్ణా జిల్లా అధ్యక్షుడు మాజీ మంత్రి పేర్ని వెంకట్రామయ్య (నాని), మచిలీపట్నం, పెడన, పెనమలూరు నియోజకవర్గాల పార్టీ ఇన్‌చార్జిలు పేర్ని కిట్టు, ఉప్పాల రాము, దేవభక్తుని చక్రవర్తి, మచిలీపట్నం పార్లమెంట్ ఇన్‌చార్జి జెట్టి గురునాథం పాల్గొని మాట్లాడారు.

ఎవరిది సంపద సృష్టి..

రాష్ట్రంలోని పేద వర్గాలకు విద్యను, నాణ్యమైన వైద్యం అందుబాటులోకి తేవాలనే లక్ష్యంతో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి 17 ప్రభుత్వ మెడికల్ కళాశాల నిర్మాణం చేపట్టారన్నారు. వాటిలో ఐదు కళాశాలలు ప్రారంభం కాగా, మరో రెండు ప్రారంభానికి సిద్ధమయ్యాయన్నారు. పులివెందుల కళాశాలకు ఎన్ఎంసీ ఎంబీబీఎస్ సీట్లు మంజూరు చేసినా చంద్రబాబు ప్రభుత్వం వద్దని లేఖ రాసి.. పేద విద్యార్థులకు తీరని అన్యాయం చేసిందన్నారు. వైఎస్ జగన్ ప్రభుత్వ ఆస్తులను పెంచితే వాటిని చంద్రబాబు కార్పొరేట్లకు కట్టబెట్టే ప్రయత్నం చేస్తున్నారని, దీన్ని ప్రజలు గమనించాలని పిలుపునిచ్చారు.

10 అంశాలపై తీర్మానం..

నకిలీ మద్యం వ్యవహారంపై నిజానిజాలు బయటకు వచ్చేందుకు ఈ కేసును సీబీఐకి అప్పగించాలని, నకిలీ మద్యం తాగి మరణించిన వారి కుటుంబాలకు ప్రభుత్వం రూ.కోటి చొప్పున పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. 10 డిమాండ్లను ఈ రౌండ్ టేబుల్ సమావేశం తీర్మానించింది. తొలుత భారత రాజ్యాంగ నిర్మాత బి.ఆర్.అంబేడ్కర్, మాజీ ఉప ప్రధాని బాబుజగ్జీవన్‌రామ్ చిత్రపటాలకు, మాజీ సీఎం వైఎస్ రాజశేఖర రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

మళ్లీ జగన్ వస్తేనే మనుగుడ..

మళ్లీ వైఎస్ జగన్ అధికారంలోకి వస్తేనే ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓబీసీ వర్గాలకు మేలు జరుగుతుందని మాజీ ఎమ్మెల్యే సుధాకర్ బాబు పేర్కొన్నారు. అంబేడ్కర్ కలలుగన్న విధంగా విద్యతోనే సమాజ మార్పు జరుగుతుందన్న విషయాన్ని అమ్మఒడి, నాడు–నేడు, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి పథకాలతో జగన్ చేసి చూపించారన్నారు. మరోసారి జగన్‌ను సీఎంను చేసుకునేందుకు ప్రతి ఒక్కరూ ఐక్యంగా ముందుకు సాగాలని సుధాకర్ బాబు పిలుపునిచ్చారు.

జిల్లాలో 37.31 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఎన్టీఆర్ జిల్లాలో శనివారం అర్ధరాత్రి నుంచి ఆదివారం ఉదయం 8.30గంటల మధ్య 37.31 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. జిల్లాలో అత్యధికంగా విజయవాడ రూరల్‌లో 109.2 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. ఈస్ట్‌లో 98.2, నార్త్‌లో 97.8, సెంట్రల్‌లో 97.2, వెస్ట్‌లో 97.2, జి. కొండూరులో 57.8, ఏ కొండూరులో 30.4, విసన్నపేటలో 25.6, వీరులపాడులో 22.2, రెడ్డిగూడెంలో 18.6, చందర్లపాడులో 18.4, కంచికచర్లలో 16.6 మిల్లీమీటర్ల వర్షపాతం రికార్డయింది.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి..

వర్షాలు, వరదలపై క్షేత్రస్థాయి అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ అన్నారు. అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్‌లో 91549 70454 నంబర్‌తో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని చెప్పారు. 24 గంటలూ సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు. డివిజన్ స్థాయిలోనూ కంట్రోల్ రూమ్‌లను క్రియాశీలకం చేయాలన్నారు. కృష్ణా, బుడమేరు, మునేరులో ప్రవాహాలను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.

నడకతో రోగాలు వెనకడుగు!

- శారీరక, మానసిక ఆరోగ్యంతో పాటు కీళ్లకు ప్రయోజనం
- మోకీళ్లలో గుజ్జు తయారయ్యేందుకు నడక అవసరం
- ఎక్కువ నడిస్తే కీళ్లు అరగడం అపోహే



పార్కులో వాకింగ్ చేస్తున్న ప్రజలు

లబ్బీపేట(విజయవాడతూర్పు): కోవిడ్ తర్వాత ప్రజల్లో ఆరోగ్య స్పృహ బాగా పెరిగింది. ఆరోగ్యంగా జీవించేందుకు వాకింగ్ చేసే వాళ్లు కూడా పెరిగారు. నడకతో రోగాలు వెనకడుగు వేస్తాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో నిత్యం ఉదయం సాయంత్రం వేళల్లో కాస్త తీరిక దొరికితే చాలు వాకింగ్ చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. వాకింగ్ చేయడం ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యంతో పాటు కీళ్లకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని వైద్యులు స్పష్టం చేస్తున్నారు. వాకింగ్ విషయంలో పలువురికి అనేక సందేహాలు ఉన్నాయి. వాకింగ్ ఎక్కడ చేయాలి, ఎలా చేయాలి, ఎక్కువ సేపు చేస్తే కీళ్లు అరుగుతాయనే అపోహలు ఉన్నాయి. ఆయా అంశాలను ఎముకలు, కీళ్ల వ్యాధుల నిపుణులు నివృత్తి చేస్తూ పలు సూచనలు సలహాలు ఇచ్చారు. అవి ఏమంటే...

నడకతో అనేక ప్రయోజనాలు....

- ప్రతిరోజూ 45 నిమిషాలు వాకింగ్ చేయడం ద్వారా శారీరక ఆరోగ్యంతో పాటు, మానసిక ప్రశాంతత లభిస్తుంది.
- కీళ్లకు మేలు చేస్తుంది. మోకీళ్ల చుట్టూ ఉన్న కండరాలు యాక్టివ్‌గా కదలికలు ఉంటే, కీళ్ల ఆరోగ్యంగా ఉండటానికి అవసరమైన గుజ్జును ఉత్పత్తి చేస్తాయి.
- ఎక్కువగా వాకింగ్ చేస్తే కీళ్లు అరుగుతాయనేది అపోహ మాత్రమే.
- నడక గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. జీర్ణకోశ సమస్యలున్న వారికి నడక మేలు చేస్తుంది. బీపీ, షుగర్ అదుపులో ఉండేలా చేస్తుంది.

ఎక్కడ నడవాలంటే....

- నగరంలో చాలా మంది సిమెంటు, తారు రోడ్లుపై నడుస్తూ కనిపిస్తున్నారు. వాటిపై నడవడం కీళ్లకు ఆరోగ్యకరం కాదని వైద్యులు అంటున్నారు.
- మట్టి రోడ్డు, ఇసుకలో నడవడం కీళ్లకు మంచిదని పేర్కొన్నారు.
- తారు, సిమెంటు రోడ్డుపై నడిస్తే మోకీళ్ల డ్యామేజ్ అయ్యే అవకాశం ఉందంటున్నారు.
- వాకింగ్ చేసేటప్పుడు మంచి షూస్ వేసుకోవడం కూడా ముఖ్యమేనంటున్నారు.
- ట్రెడ్‌మిల్‌పై వేగంగా పరుగెడుతుంటారని, గంటకు ఆరు కిలోమీటర్లు మాత్రమే నడవాలని వైద్యులు సూచిస్తున్నారు.

ఎవరు వాకింగ్ చేయరాదు.....

- డిస్క్ ప్రాబ్లమ్స్ ఉన్న వారు
- మోకీళ్ల అరుగుదల మూడో స్టేజ్‌లో ఉన్న వారు
- స్మోకింగ్‌తో కాళ్ల రక్తనాళాల్లో బ్లాక్స్ ఏర్పడుతుంటాయి. అలాంటి వారు వాకింగ్ చేయరాదు.
- గుండె సమస్యలున్న వారు, ఆయాసం ఉన్న వారు వైద్యుల సూచనల మేరకు మాత్రమే చేయాలి.

కీళ్లు ఆరోగ్యంగా ఉంటాయి



రోజుకో గంట నడవడం ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యంతో పాటు మోకీళ్లు ఆరోగ్యంగా ఉండేందుకు దోహదపడుతుంది. రోజుకు 45 నిమిషాల నుంచి గంటసేపు నడవాలి. ఎక్కువ సేపు నడిస్తే కీళ్లు అరుగుతాయనేది అపోహ మాత్రమే. సిమెంటు, తారు రోడ్డుపై నడిస్తే మోకీళు డ్యామేజ్ అయ్యే అవకాశం ఉంది. మట్టిపై ఇసుకలో నడిస్తే కీళ్లకు మంచిది. నడకతో మోకీలు చుట్టూ ఉండే కండరాల కదలికల ద్వారా కీళ్లు ఆరోగ్యంగా ఉండేందుకు అవసరమైన గుజ్జు ఉత్పత్తి అవుతుంది.

డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి,
జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్

అభివృద్ధి పేరుతో విధ్వంసం

- కానూరులో పేదల ఇళ్లు తొలగిస్తే సహించం
- ప్రత్యామ్నాయం చూపాలని చక్రవర్తి డిమాండ్



కానూరులో విలేకరులతో మాట్లాడుతున్న దేవభక్తుని చక్రవర్తి



అక్రమంగా డ్రైనేజీ నిర్మాణం చేస్తున్నారని కానూరు మ్యాప్ చూపుతున్న చక్రవర్తి

పెనమలూరు: కానూరులో అభివృద్ధి పేరుతో ఎమ్మెల్యే బోడెప్రసాద్ విధ్వంసం సృష్టిస్తున్నాడని, పేదలకు ప్రత్యామ్నాయం చూపకుండా ఇళ్లు తొలగిస్తే సహించేదిలేదని వైఎస్సార్ సీపీ పెనమలూరు ఇన్‌చార్జి దేవభక్తుని చక్రవర్తి తెలిపారు. ఆయన ఆదివారం కానూరులో పేదల సమక్షంలో విలేకర్లతో మాట్లాడారు. కానూరులో దాదాపు 40 మంది పేదలు కాలువ కట్టలపై చాలా సంవత్సరాలుగా నివాసం ఉంటున్నారని చెప్పారు. గతంలో వీరికి ప్రభుత్వం ఇళ్లు ఖాళీ చేయాలని నోటీసులు ఇచ్చిందని చెప్పారు. ప్రత్యామ్నాయం చూపితే ఇళ్లు ఖాళీ చేస్తామని నివాసితులు స్పష్టం చేశారన్నారు. దరఖాస్తులు కూడా పెట్టారని పేర్కొన్నారు. అయితే దీని పై బోడెప్రసాద్ స్పందించలేదన్నారు. అధికారులు శనివారం అర్ధరాత్రి పొక్లెయిన్‌లతో వచ్చి ఇళ్లు కూల్చడానికి సిద్ధపడ్డారని తెలిపారు. పేదలతో కలిసి ఆందోళనకు దిగటంతో వెనక్కు తగ్గారన్నారు. నిబంధనల ప్రకారం కానూరు ప్రధాన రహదారి 60 అడుగులు ఉండాల్సి ఉండగా కేవలం 30 అడుగుల్లోనే డ్రెయినేజీలు ఎలా నిర్మిస్తారని ప్రశ్నించారు. పేదలకు ఒక న్యాయం పెద్దలకు మరో న్యాయం చేయటం తగదన్నారు. పేదలకు ప్రత్యామ్నాయం చూపితే ఇళ్లు ఖాళీ చేస్తారన్నారు.

దందా చేసేందుకే బైక్‌పై పర్యటనలు.....

ఎమ్మెల్యే బోడెప్రసాద్ దందా చేయటానికి బైక్ పై గ్రామాల్లో పర్యటనలు నిర్వహిస్తున్నాడని చక్రవర్తి ఆరోపించారు. గ్రామాలలో బిల్డర్లు, భవన యజమానులు ఎవరెవరు అదనపు ఫ్లోర్‌లు నిర్మిస్తుంది వివరాలు సేకరిస్తున్నాడని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు పి.రాఘవరావు, వేమూరి బాలకృష్ణ, మండూరు కోటేశ్వరరావు, షేక్.అహ్మద్ అష్రఫ్, మల్లంపల్లి వెంకటేశ్వరరావు, పలువురు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చులకనగా మాట్లాడారు...

ఎమ్మెల్యే బోడెప్రాద్‌ను పట్ల చులకనగా మాట్లాడారని బాధితులు ఆరోపించారు. బాధితులు విలేకరుతో మాట్లాడుతూ ఎమ్మెల్యే శనివారం ఒక్కసారిగా ఇళ్లలోకి రావటంతో భయాందోళన చెందామన్నారు. మురికివాడలో ఎలా ఉంటారని చులకనగా మాట్లాడరని తెలిపారు. ఇల్లు ఖాళీ చేయాలని బెదిరించినట్లు వాపోయారు.

బెట్టింగ్, మొబైల్ వ్యసనాల నుంచి బయటపడాలి



జెండా ఊపి 5 కే రన్ ప్రారంభించిన డీసీపీ కేజీవీ సరిత

- 5కే రన్‌లో స్లేట్ వ్యవస్థాపకులు అమర్‌నాథ్
- రన్ ప్రారంభించిన నగర డీసీపీ కేజీవీ సరిత

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఆధునిక సమాజానికి బెట్టింగ్, జంక్‌ఫుడ్, మొబైల్ అడిక్షన్ వంటివి పంచ మహాపాతకాలుగా తయారయ్యాయని 5కే రన్‌లో వక్తలు పేర్కొన్నారు. సమాజ స్థితిగతులను మార్చి పౌరుల జీవితాలను అస్తవ్యస్తం చేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివారం బీఆర్టీఎస్ రోడ్డులోని శారద కళాశాల జంక్షన్ వద్ద స్లేట్, ది స్కూల్ ఆధ్వర్యంలో స్లేట్ స్మార్ట్ పేరిట 5కే రన్ నిర్వహించారు. ఈ రన్‌ను నగర డీసీపీ కేజీవీ సరిత జెండా ఊపి ప్రారంభించారు. 1572 మంది రన్‌లో పాల్గొన్నారు. బెట్టింగ్, జంక్ ఫుడ్, రోట్ లెర్నింగ్, లోన్ యాప్స్, మొబైల్ అడిక్షన్ వంటి వాటికి వ్యతిరేకంగా స్లేట్ స్కూల్ ఆధ్వర్యంలో రన్ నిర్వహించినట్లు వ్యవస్థాపకులు వాసిరెడ్డి అమర్‌నాథ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేవలం కుటుంబ శ్రేయస్సునే కోరుకుంటే అది స్వార్థమవుతుందని, సమాజ సేవకు నడుబిగించాలని పిలుపునిచ్చారు. డీసీపీ కేజీవీ సరిత మాట్లాడుతూ బెట్టింగ్, లోన్ యాప్స్ వంటి వాటికి దూరంగా ఉండాలని సూచించారు. ఇప్పటికే ఆ అలవాట్లు ఉన్న వారు వాటి నుంచి బయటపడాలని కోరారు. స్వీయ తెలివితేటలు, హార్డ్, స్మార్ట్ వర్క్‌తో ముందుకు సాగాలన్నారు. పొదుపు, సహజ రుచులు, సాంకేతిక పరిజ్ఞానం సక్రమ వాడకం, బట్టీ చదువుల్ని వదిలి, విజ్ఞానం, నైపుణ్యాలను పెంపొందించే చదువులపై దృష్టి పెట్టాలన్నారు. సామాజిక అంశాలపై సరైన అవగాహన కలిగి ఉండాలని కోరారు. 5కే రన్‌లో చిన్నారుల నుంచి వృద్ధుల వరకు ఉత్సాహంగా పాల్గొన్నారు.

కానిస్టేబుళ్ల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో 2004 బ్యాచ్ కానిస్టేబుళ్లు

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ కమిషనరేట్‌కు చెందిన 2004 కానిస్టేబుళ్ల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఆటోనగర్‌లోని ఓ హోటల్లో జరిగింది. 20 ఏళ్ల తర్వాత కలుసుకున్న వారు ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. ఈ సందర్భంగా ట్రైనింగ్ సమయంలో తమ జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. వివిధ కారణాలతో మృతి చెందిన బ్యాచ్ సభ్యులకు నివాళులర్పించారు. ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు రావిశెట్టి సాంబశివరావు మాట్లాడుతూ ట్రైనింగ్‌లో తమ జ్ఞాపకాలను గుర్తుచేసుకునేందుకు ఈ కార్యక్రమం ఏర్పాటు చేశామని చెప్పారు. దైనందన జీవితంలో నిరంతరం ఒత్తిడితో ఉండే తాము తమ స్నేహాన్ని 20 ఏళ్ల తర్వాత గుర్తు చేసుకునేందుకు నిర్వహించిన ఈ కార్యక్రమం చాలా సంతోషాన్ని ఇచ్చిందన్నారు. అనంతరం ఆటపాటలతో గడిపారు. 2004 బ్యాచ్‌కు చెందిన సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదంలో ఇద్దరు మృతి



భవానీపురం(విజయవాడపశ్చిమ): గొల్లపూడి పరిధిలోని రామరాజ్యనగర్‌లో ఆదివారం వేకువజామున మూడు గంటల సమయంలో ఒక కంపెనీలో అగ్ని ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఇద్దరు మృతి చెందగా, మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. రామరాజ్యనగర్‌లో ఒక ఇంట్లో ఆకాష్ అనే వ్యక్తి ఓ కంపెనీ నిర్వహిస్తున్నాడు. పెయింట్స్‌లో కలిపే టిన్నర్‌ను లీటర్, రెండు లీటర్ల చొప్పున ప్యాకింగ్ చేస్తుంటారు. ఈ పనులను ఐదుగురు యువకులు చేస్తుంటారు. ఈ క్రమంలో జోరున వర్షం కురుస్తున్న సమయంలో ప్రమాదవశాత్తూ అగ్ని ప్రమాదం జరిగి పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. ఈ సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. షణ్ముఖ శ్రీనివాస్ (16) మంటల్లో చిక్కుకొని అక్కడికక్కడే చనిపోయాడు. రమణబాబు (19) గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి చనిపోయాడు. భవానీపురం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. దీపావళి పండుగ సందర్భంగా కంపెనీ యజమాని చెన్నై వెళ్లాడు. పీసా పవనసాయి మణికుమార్, మోహన్‌కృష్ణ ఈ ప్రమాదంలో నుంచి బయటపడ్డారని పోలీసులు తెలిపారు.

వ్యక్తి మృతదేహం గుర్తింపు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): కేటీరోడ్డు పరిధిలోని భీమనవారిపేటలో ఓ మెడికల్ షాపు ఎదుట గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని కొత్తపేట పోలీసులు ఆదివారం గుర్తించారు. లంబాడీపేటలోని రాకేష్ మెడికల్ స్టోర్స్ ఎదుట గుర్తు తెలియని వ్యక్తి మృతి చెంది ఉన్నాడంటూ పోలీసులకు సమాచారం అందింది. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులకు మెడికల్ షాపు మెట్లపై ఓ యువకుడు మృతి చెంది ఉండటాన్ని గుర్తించారు. అయితే స్థానికులను ఆరా తీయగా ఆ వ్యక్తి ఏలూరుకు చెందిన కె. శేఖర్‌గా అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

ముగిసిన జిల్లా స్థాయి జిమ్నాస్టిక్స్ టోర్నీ



ప్రశంసాపత్రాలు చూపుతున్న విజేతలతో అతిథులు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): స్థానిక వీర మాచనేని పద్దయ్య సిద్ధార్థ పబ్లిక్ స్కూల్ ఆవరణలో జరుగుతున్న ఎన్టీఆర్ జిల్లా స్థాయి జిమ్నాస్టిక్స్ టోర్నమెంట్-2025 పోటీలు ఆదివారంతో ముగిశాయి. వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో క్రీడాకారులు హాజరై వారిలోని ప్రతిభను ప్రదర్శించారు. మాజీ కార్పొరేటర్ త్రిమూర్తిరాజు, జిమ్నాస్టిక్స్ అసోసియేషన్ ఎన్టీఆర్ జిల్లా కోశాధికారి ఎల్.మురళీకృష్ణ, జాయింట్ సెక్రటరీ ఎల్.శాంతి, స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా మాజీ కోచ్ వై.రామమోహన్ హాజరై విజేతలకు ప్రశంసాపత్రాలను అందజేశారు.

విజేతల వివరాలు..

- అండర్-12 గరల్స్ విభాగంలో ఏరోబిక్స్, భీమ్ బ్యాలన్స్, ఫ్లోర్ ఎక్సర్‌సైజ్, టేబుల్ వాల్ట్, ట్రంప్‌లైన్ విభాగాల్లో పి.అనన్య మొదటి బహుమతిని గెలుపొందింది.
- అండర్-12 బాయ్స్ విభాగంలో ఫ్లోర్ ఎక్సర్‌సైజ్‌లో ఎల్.శ్రీరామ్, ఏరోబిక్స్‌లో ఎం.హిమేష్ మొదటి స్థానంలో నిలిచారు.
- జూనియర్ గరల్స్ విభాగంలో ఫ్లోర్ ఎక్సర్‌సైజ్, భీమ్ ఎక్సర్‌సైజ్, టేబుల్ వాల్ట్, ట్రంప్‌లైన్ అంశాల్లో పి.ధనీషా, ఏరోబిక్స్ విభాగంలో కె.జాహ్నవి మొదటి బహుమతిని పొందారు.
- జూనియర్స్ బాయ్స్ విభాగంలో ఫ్లోర్ ఎక్సర్‌సైజ్‌లో ఎల్.శ్రీరామ్, టేబుల్ వాల్ట్, హైబార్, రోమన్‌రింగ్స్‌లో ఎన్.మోహత మొదటి స్థానంలో నిలిచారు.
- సీనియర్స్ ఏరోబిక్స్ విభాగంలో ఎస్.ఐశ్వర్య, ట్రంప్‌లైన్ విభాగంలో ఎస్.ప్రజ్ఞ మొదటి బహుమతిని గెలుచుకున్నారు. విజేతలకు అతిథులు ప్రశంసాపత్రాలను అందజేసి అభినందించారు.

దుర్గమ్మ సన్నిధిలో మహాలక్ష్మి యాగం



పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న చైర్మన్, ఈవో దంపతులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ధనత్రయోదశిని పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలోని నూతన యాగశాలలో ఆదివారం శ్రీ మహాలక్ష్మి యాగాన్ని నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని యాగశాలలో ఆలయ స్థానాచార్య శివప్రసాద్, వైదిక కమిటీ పర్యవేక్షణలో తొలుత గణపతి పూజ, కలశస్థాపన, పూజా కార్యక్రమాల అనంతరం యాగాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. యాగంలో చైర్మన్ రాధాకృష్ణ, ఈవో శీనానాయక్ దంపతులు పాల్గొన్నారు. అనంతరం అర్చకులు, వేద పండితులు పూర్ణాహుతి కార్యక్రమాన్ని నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో సూర్యోపాసన సేవ..

దుర్గమ్మ సన్నిధిలో ఆదివారం సూర్యోపాసన సేవ నిర్వహించారు. రాజగోపురం వద్ద ఆలయ అర్చకులు సూర్య భగవానుడి చిత్రపటానికి పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం సూర్య నమస్కారాలు, సూర్యోపాసన సేవ జరగ గా, పలువురు భక్తులు, ఉభయదాతలు సేవలో పాల్గొన్నారు. అనంతరం ఉభయదాతలకు ప్రత్యేక క్యూలైన్ ద్వారా అమ్మవారి దర్శనానికి అనుమతించారు.

నేడు ధనలక్ష్మి పూజ..

దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని సోమవారం సాయంత్రం అమ్మవారి ప్రధాన ఆలయంలో ఆలయ అర్చకులు ధనలక్ష్మి పూజ నిర్వహించనున్నారు. సాయంత్రం అమ్మవారి పంచహారతుల సేవ అనంతరం పూజను జరిపిస్తారు. అమ్మవారి ప్రధాన ఆలయం చుట్టూ దీపాలను వెలగించిన అనంతరం రాజగోపురం ఎదుట దీపావళి వేడుకలను నిర్వహించనున్నారు.

క్లుప్తంగా

ప్రజలందరికీ దీపావళి శుభాకాంక్షలు

వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్



లబ్బీపేట(విజయవాడతూర్పు): కులమతాలకతీతంగా ప్రతి ఒక్కరూ ఆనందంగా జరుపుకొనే పండుగ దీపావళి అని వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్ తెలిపారు. చెడు చీకట్లను పారదోలి మంచి అనే వెలుగులు పంచే దీపావళిని, ప్రతి ఇంటా సంతోషంగా జరుపుకోవాలని కోరారు. లక్ష్మీ పూజతో నూతన వ్యాపారాల ఆరంభాలు దిగ్విజయంగా కొనసాగాలని ఆకాంక్షించారు. ఆరోగ్యం, ఆదాయం, ఆనందం ప్రతి ఒక్కరికీ చేకూరాలని తెలిపారు. ఈ పండుగ అందరి జీవితాల్లో సుఖసంతోషాలను నింపాలని శుభాకాంక్షలు తెలియజేసారు.

వైఎస్ జగన్ చొరవతోనే మెడికల్ పీజీ సీట్లు

మధురానగర్(విజయవాడసెంట్రల్): వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవతోనే 60 పీజీ సీట్లు రాష్ట్రానికి లభించాయని వైఎస్సార్ సీపీ వైద్య విభాగం ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ అంబటి నాగరాధాకృష్ణ యాదవ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కూటమి ప్రభుత్వం వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మెడికల్ కాలేజీలు అసలు కట్టనే లేదు అని చెప్పిందనీ.. కానీ ఇప్పుడు అదే ప్రభుత్వం 106 మెడికల్ పీజీ సీట్ల గురించి ఘనంగా ప్రచారం చేసుకుంటుందన్నారు. వాటిలో 60 సీట్లు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రారంభించిన కాలేజీల్లోనే ఉన్నాయన్నారు. ఈ కాలేజీలు మూడు సంవత్సరాల్లోనే 60 పీజీ సీట్లు పొందడం నిజంగా అద్భుతమని చెప్పారు. ప్రజలకు మంచి మెడికల్ విద్య అందించాలని కోరారు. ప్రభుత్వ రంగంలోనే మెడికల్ కాలేజీలు కొనసాగించటం ద్వారా మరింత మెరుగైన వైద్యం అందుతుందన్నారు.

ఉరేసుకొని బీటెక్ విద్యార్థి ఆత్మహత్య

పెనమలూరు: ఉరేసుకొని యనమలకుదురులో బీటెక్ చదువుతున్న విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న ఘటన పై పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. సీఐ వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం... బోసుబొమ్మ సెంటర్‌కు చెందిన నాగం ప్రభావతి, రాంబాబు, ఇద్దరు కుమారులతో ఉంటున్నారు. తల్లి నారాయణ స్కూల్లో ప్రిన్సిపాల్‌గా పని చేస్తుంది. కాగా వారి పెద్ద కుమారుడు రవిప్రకాష్ (19) గంగూరులో బీటెక్ 2వ సంవత్సరం చదువుతున్నాడు. శనివారం తల్లి, సోదరుడు తిరువూరు ప్రార్థనలకు వెళ్లారు. ఇంటి వద్దే ఉన్న రవిప్రకాష్ ఫ్యాన్‌కు ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. రవిప్రకాష్ కోసం స్నేహితుడు సాయిరాం వెళ్లగా ఇంట్లో ఉరేసుకొని కన్పించాడు. వెంటనే ఈ సమాచారాన్ని రవిప్రకాష్ తల్లికి ఫోన్ ద్వారా తెలియజేశాడు. ఆత్మహత్యకు గల కారణం తెలియలేదు. ఈ ఘటన పై తల్లి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

ఉరేసుకుని యువకుడి....

కృష్ణలంక(విజయవాడతూర్పు): ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య చేసుకున్న చెందిన ఘటన చోటుచేసుకుంది. రాణిగారితోట, తమ్మిన పోతురాజు వీధిలో నివాసం ఉంటున్న తమ్మిశెట్టి ఏసుబాబు (20) కూలీ పనులకు వెళ్తుంటాడు. మద్యానికి బానిసవడంతో ఆరోగ్యం క్షీణించింది. గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఆయన సోదరి అంజలి కూడా అనారోగ్యంతో ఉంది. తనతో పాటు తన సోదరి కూడా అనారోగ్యానికి గురైందని తరచూ మనస్తాపం చెందుతుండేవాడు. ఈ క్రమంలో శనివారం రాత్రి 11 గంటల సమయంలో రూమ్‌లోకి వెళ్లి పడుకున్నాడు. ఆదివారం ఉదయం 5 గంటలకు తల్లి రూమ్‌లోకి వెళ్లి చూడగా రేకుల షెడ్డు ఐరన్ రాడ్‌కు చీరతో ఉరేసుకుని వేలాడుతూ కనిపించాడు. కిందకు దించి చూడగా అప్పటికే మృతి చెందాడు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

- **మైనార్టీలు ఉన్నత స్థాయికి చేరుకోవాలి**

భవానీపురం(విజయవాడపశ్చిమ): సమాజంలోని ప్రతి ఒక్కరినీ కలుపుకుని వెళ్లడం ద్వారా ముస్లిం మైనార్టీలు అన్ని రంగాల్లో ఉన్నత స్థాయికి చేరుకోవాలని రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూఖ్ తెలిపారు. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో కంపానియన్‌షిప్ సంస్థ ఆధ్వర్యంలో సీసీసీ అవార్డుల ప్రదానోత్సవం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ మాట్లాడుతూ జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలంటే చదువు ఒక్కటే మార్గమని చెప్పారు. ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయపరంగా ముస్లింలు ముందంజ వేయడానికి వచ్చిన ప్రతి అవకాశాన్ని అందిపుచ్చుకోవాలని కోరారు. ముస్లిం కుటుంబాల్లో ఆర్థిక పరిపుష్టి కోసం ప్రభుత్వం రుణ సదుపాయాలను కల్పిస్తుందని తెలిపారు. నిరుద్యోగులకు ఉద్యోగాల నోటిఫికేషన్లు ప్రభుత్వం విడుదల చేస్తుందని తెలిపారు. మాజీ ఎమ్మెల్సీ టి.డి.జనార్దన్, మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఫారూఖ్ షిబ్లీ, సీసీసీ అవార్డుల నిర్వాహకులు షబ్బీర్, సిరాజ్, మన్సూర్ ఉన్నారు.

- **మీకోసం రద్దు**

కోనేరుసెంటర్: జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక మీకోసం కార్యక్రమాన్ని సోమ వారం రద్దు చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ వి.విద్యాసాగర్‌నాయుడు ఆదివారం తెలిపారు. దీపావళి పండుగను పురస్కరించుకుని కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు చెప్పారు.

సూపర్ సిక్స్ హామీలు వెంటనే అమలు చేయాలి



మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు శ్రీదేవి

కృష్ణలంక(విజయవాడతూర్పు): కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానం మేరకు సూపర్‌సిక్స్ హామీలు వెంటనే అమలు చేయాలని, మహిళలు, పిల్లలపై జరుగుతున్న అత్యాచారాలను అరికట్టేందుకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) రాష్ట్ర 16వ మహాసభ తీర్మానించిందని సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు కె.శ్రీదేవి తెలిపారు. ఇటీవల జరిగిన 16వ రాష్ట్ర మహాసభల్లో చేసిన తీర్మానాలను ఆమె ఆదివారం గవర్నర్‌పేటలోని బాలోత్సవ భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. సరళీకరణ ఆర్థిక విధానాల వలన మహిళా రంగంలో జరుగుతున్న మార్పులపై చర్చించామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలతో వలస మహిళలు అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రభుత్వాలు ఎన్నికలప్పుడు ఇచ్చిన హామీలన్నీ గాలిలో కలిసిపోతున్నాయని చెప్పారు. డ్వాక్రా గ్రూపులలో అవినీతిని అరికట్టాలని, డ్వాక్రా గ్రూపులకు వడ్డీ లేకుండా రు.10 లక్షలు ఇస్తామన్న హామీని నెరవేర్చాలని, మైక్రో ఫైనాన్స్ దోపిడీ నుంచి కుటుంబాలను రక్షించాలని కోరారు. నిత్యావసర సరుకుల ధరలు తగ్గించాలని, ప్రజాపంపిణీ వ్యవస్థను పటిష్టం చేయాలని విన్నవించారు. విశాఖ ఉక్కును ప్రైవేటీకరించే విధానాలను విడనాడాలని డిమాండ్ చేశారు. అలాగే ఉచిత గ్యాస్ కొంతమందికే ఇస్తున్నారని, ఎన్నికల హామీలో ఇచ్చిన విధంగా అందరికీ 3 సిలిండర్లు ఇవ్వాలని, ప్రతి మహిళకు నెలకు రు.1500 ఇస్తామన్న హామీని అమలు చేయాలన్నారు. ఈ డిమాండ్ల సాధన కోసం పోరాడాలని మహాసభ ఏకగ్రీవంగా తీర్మానించిందన్నారు. ఈ సమావేశంలో ఐద్వా కార్యదర్శి వి.సావిత్రి, కోశాధికారి డి.శ్రీనివాసకుమారి, ఉపాధ్యక్షురాలు రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు వీఎంసీ పీజీఆర్ఎస్ రద్దు

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరపాలక సంస్థలో ఈ నెల 20వ తేదీ సోమవారం జరగాల్సిన ప్రజా ఫిర్యాదులు–పరిష్కార(పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని దీపావళి పండుగ సందర్భంగా రద్దు చేస్తున్నట్లు వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సోమవారం వీఎంసీ ప్రధాన కార్యాలయం, జోనల్ కార్యాలయాలు సచివాలయాల్లో జరిగే ఈ కార్యక్రమం జరగదన్నారు. నగర వాసులు గమనించి సహకరించాలని కోరారు.

నలంద విద్యార్థుల సామాజిక సేవ



లబ్బీపేట(విజయవాడతూర్పు): విద్యార్థి దశలోనే నలంద విద్యార్థులు సామాజిక దృక్పథాన్ని ప్రదర్శించారు. ఆ కళాశాలలో ఎన్‌సీసీ 4ఏ బాలికల బెటాలియన్ విద్యార్థులు దీపావళి సందర్భంగా పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మట్టి ప్రమిదలకు రంగులు అలంకరించి, కళాశాలలో ఎగ్జిబిషన్ నిర్వహించారు. వారం రోజుల పాటు వెయ్యికి పైగా వివిధ మోడల్స్‌లో మట్టి ప్రమిదలను అందంగా అలంకరించి, వాటితో ప్రదర్శన ఏర్పాటు చేయగా, విద్యార్థులు, అధ్యాపకులు కొనుగోలు చేశారు. ఆ ప్రమిదలు విక్రయించగా వచ్చిన రూ.41 వేలతో కానూరులోని వృద్ధాశ్రమానికి కంప్యూటర్, దుప్పట్లు, స్వీట్లు, పండ్లు అందజేశారు. ఎన్‌సీసీ కేడెట్‌లతో పాటు అధ్యాపకులు, కానూరులోని వృద్ధాశ్రమంలోని వృద్ధులతో కొంత సమయం గడిపి ఆటపాటలతో వృద్ధులను ఆనందింపజేశారు. అనంతరం దీపాలు వెలిగించి దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎం.అనురాధ, ఎన్‌సీసీ కో ఆర్డినేటర్ రఫియాబేగం, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

24న లయన్స్ కళావైభవం



విజయవాడకల్చరల్: ఐక్యరాజ్య సమితి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా విజయవాడ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఈ నెల 24వ తేదీ శుక్రవారం లయన్స్ కళావైభవం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు లయన్స్ క్లబ్ ఎన్టీఆర్, కృష్ణా జిల్లా గెస్ట్ న్యాయవాది వేముల హజరత్తయ్య గుప్తా తెలిపారు. ఆదివారం సంస్థ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. పీబీ సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో కార్యక్రమాలు జరుగుతాయన్నారు. సంస్థ సభ్యులు కేవీ రామారావు, సంజీవరావు మాట్లాడుతూ.. సందేశాత్మక హాస్య లఘునాటికలు, జానపద గీతాలు, యోగా శాస్త్రీయ, సంప్రదాయ నృత్యాలు, ఏకపాత్రాభినయం అంశాలను లయన్స్‌క్లబ్ సభ్యులు ప్రదర్శిస్తారన్నారు. సమావేశంలో లయన్స్ క్లబ్ బాధ్యులు రాంబాబు, రామచంద్రరావు, శ్రీనివాసరావు, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

అంకమ్మతల్లికి ప్రత్యేక పూజలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్ నేతాజీ కాలనీ శ్రీ అంకమ్మతల్లి శక్తిపీఠంలో ఆదివారం ప్రత్యేక పూజలు, అర్చనలు జరిగాయి. పీఠం వ్యవస్థాపకుడు అన్నాబత్తుల శరాబందీరావు అమ్మవారికి విశేషంగా కుంకుమార్చనలు, శ్రీచక్రార్చన నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేసి మొక్కుబడులు చెల్లించుకున్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

సన్నాల సేవలు వెలకట్టలేనివి




విజయవాడకల్చరల్: చిత్ర, కళారంగాలకు సన్నాల సత్యనారాయణ వరప్రసాద్ సేవలు వెలకట్టలేనివని పోలవరపు సాహితీ సమితి వ్యవస్థాపకుడు గోళ్ల నారాయణరావు అన్నారు. కామ్రేడ్ జీఆర్కే పోలవరపు సాహితీ సమితి, డ్రీమ్ వర్క్స్ ఆర్ట్ గ్యాలరీ ఆధ్వర్యంలో చిత్రకారుడు సన్నాల సంస్మరణ సభను విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. నారాయణరావు మాట్లాడుతూ.. చిత్ర, కళా రంగాలకు సన్నాల జీవితాన్ని అంకితం చేశారన్నారు. వందలాది చిత్రాలను చిత్రించడంతో పాటు అనేక మంది యువ చిత్రకారులకు శిక్షణ ఇచ్చారని తెలిపారు. 50 వేలకు పైగా చిత్రాలను చిత్రీకరించారన్నారు. సన్నాల మృతికి శ్రద్ధాంజలి ఘటించారు. సంస్మరణ సభలో చిత్రకారులు పి.రమేష్, టి.మృత్యుంజయరావు, పీసీ శేఖర్, గాంధీ, రామకృష్ణ, రాంబాబు, వెంకటేష్, శివ, లక్ష్మణ్, ఉదయ్ పాల్గొన్నారు.

నగరంలో అనధికార బాణసంచా దుకాణాలు

- సంగీత కళాశాలలో 15 దుకాణాలకే అధికారుల అనుమతి
- అనధికారకంగా మరో 10 దుకాణాల ఏర్పాటు
- ఒక్కో దుకాణానికి రూ.1.50 లక్షల వరకు వసూలు
- అధికార పార్టీ నేత కనుసన్నల్లోనే దోపిడీ



విజయవాడ ఘంటశాల మ్యూజిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన బాణసంచా దుకాణాలు



15 దుకాణాలకు అనుమతిస్తూ అధికారులు ఇచ్చిన లే అవుట్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): అధికార పార్టీ చోటా మోటా నాయకులు దీపావళి బాణసంచా దుకాణాలను కూడా తమ సంపద సృష్టికి వాడుకుంటున్నారు. నిబంధనలు పక్కన బెట్టి ఇష్టానుసారం షాపులు ఏర్పాటు చేయించి డబ్బులు దండుకుంటున్నారు. దీపావళిని దృష్టిలో పెట్టుకుని గత వారం రోజులుగా జిల్లా కలెక్టర్ నుంచి దిగువ స్థాయి వరకు అధికారులు చేస్తున్న సూచనలు, హెచ్చరికలను ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. నగరంలో మాకినేని బసవపున్నయ్య స్టేడియం, దుర్గాపురంలోని ఘంటశాల సంగీత కళాశాలలో బాణసంచా దుకాణాలకు అధికారులు అనుమతులు జారీ చేశారు. అయితే సంగీత కళాశాలలో కేవలం 15 దుకాణాలకు మాత్రమే అనుమతించారు. దుకాణాలు ఏ విధంగా ఏర్పాటు చేయాలో లే అవుట్ వేసి మరీ అనుమతులు మంజూరు చేశారు. కళాశాలలోని కళావేదికకు ఎడవ వైపు 10 దుకాణాలు, కుడి వైపున 5 దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలని యజమానులకు ఆదేశాలిచ్చారు. అధికారుల నుంచి అనుమతి తీసుకున్న వ్యాపారులు ఆ విధంగానే బాణసంచా దుకాణాలు ఏర్పాటు చేశారు.

కలెక్టర్ ఆదేశాలు బేఖాతరు..

కానీ ప్రజాప్రతినిధి అండతో కొందరు అక్రమ దుకాణాలు ఏర్పాటు చేశారు. అధికారకంగా అనుమతిచ్చిన 15 దుకాణాలు కాకుండా అదనంగా మరో 10 దుకాణాలు ఏర్పాటు చేశారు. అవి ఎక్కడా కూడా నిబంధనలకు అనుగుణంగా లేవు. అనుమతి పొందిన దుకాణదారులు ప్రతి దుకాణం ఎదురుగా ఇసుక, వాటర్ డ్రమ్ములు ఏర్పాటు చేశారు. ఫైర్ సేఫ్టీ సామగ్రిని ఏర్పాటు చేసుకున్నారు. అధికార పార్టీ నాయకుల అండతో అడ్డగోలుగా ఏర్పాటు చేసిన దుకాణాలు ఫైర్ సేఫ్టీ సామగ్రి మచ్చుకు కూడా కనిపించడం లేదు. వీటిని కళాశాల ప్రహరీ పక్కనే ఏర్పాటు చేశారు. గోడకు మరోవైపున నివాస గృహాలు ఉన్నాయి. అనుమతి పొంది ఏర్పాటు చేసిన దుకాణాలకు ఎదురుగా ఏర్పాటు చేశారు. బాణసంచా విక్రయదారులు ప్రభుత్వ నిబంధనలను తప్పకపాటించాలని కలెక్టర్ ఇప్పటికే అనేక పర్యాయాలు హెచ్చరించారు. కానీ ఇక్కడ నిబంధనలు పట్టించుకున్న పాపాన పోలేదు. కళాశాల మైదానంలో పోలీసులు, వివిధ శాఖల అధికారులు ఉన్నా .. అనుమతి ఎన్ని దుకాణాలకు ఇచ్చారు? వాస్తవంగా అక్కడ ఎన్ని దుకాణాలు ఏర్పాటు చేశారు? ఏ దుకాణాలకు అనుమతి ఉంది? ఏ దుకాణాలకు అనుమతి లేదనే విషయాలను పట్టించుకున్న పాపాన పోవడం లేదు. ఒక్కో దుకాణానికి మధ్య 3 మీటర్ల దూరం ఉండాలి. దుకాణాలు ఎదురెదురుగా ఉండకుండా చూడాలని, రెసిడెన్షియల్ ఏరియాకు కనీసం 50 మీ. దూరంలో మాత్రమే దుకాణాలకు అనుమతివ్వాలని నిబంధనలు చెబుతున్నాయి. కానీ సంగీత కళాశాలలో గోడకు వైపు బాణసంచా దుకాణాలు, మరో వైపు నివాస సముదాయలు ఉన్నాయి. షార్ట్ సర్క్యూట్ కాకుండా చూసుకోవాలని నిబంధనలు చెబుతున్నాయి. శనివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి మైదానం పూర్తిగా బురద కయ్యగా మారింది. విద్యుత్ వైర్లు తేమగా ఉన్న నేలపైనే వేశారు. ఏదైనా ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరిదని దుకాణాలకు వచ్చే జనం నిలదీస్తున్నారు.

వ్యాపారుల మధ్య ఘర్షణ..

ఈ దుకాణాల ఏర్పాటుకు అధికార పార్టీకి చెందిన నాయకుడు ఒకరు ఒక్కో దుకాణం నుంచి రూ.1.50 లక్షలు వసూలు చేశారని ప్రచారం జరుగుతోంది. ఎవరితో పనిలేదని అంతా తామే చూసుకుంటామని చెప్పి మరీ అనధికారకంగా దుకాణాలు ఏర్పాటు చేసినట్లు ప్రచారం జరుగుతుంది. అనుమతులు పొంది దుకాణాలు ఏర్పాటు చేసిన వారికి, అనధికార దుకాణదారులకు మధ్య వివాదం కూడా రేగింది. అనుమతి పొందిన వారి దుకాణాలు ముందు గొడవలు చేసి అనధికార దుకాణాలకు వద్దకే జనాలు వెళ్లేలా కుట్ర జరుగుతుందని వ్యాపారులు వాపోతున్నారు. ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని అనధికార దుకాణాలను తొలగించాలని కోరుతున్నారు. అజిత్‌సింగ్‌నగర్‌లోని మాకినేని బసవపున్నయ్య స్టేడియంలో బాణసంచా దుకాణాలు ఏర్పాటుకు అధికార పార్టీ నేత ఒకరు ఒక్కో దుకాణం నుంచి రూ. 80 వేలు వసూలు చేశారని ప్రచారం జరుగుతోంది. ఫైర్, రెవెన్యూ, పోలీసు అంతా తానే చూసుకుంటానని చెప్పి ఈ దందా సాగించినట్లు తెలిసింది. అడిగినంత ఇవ్వకపోతే తెచ్చిన స్టాక్ పాడైపోతుందని నగదు ముట్టజెప్పినట్లు స్టేడియంలో దుకాణం ఏర్పాటు చేసిన ఓ వ్యాపారి తెలిపారు. వీధి పక్కన తోపుడు బండిపై బాణసంచా అమ్మేవారిని కూడా వదిలి పెట్టలేదని చెబుతున్నారు.

సమస్యలపై ఐక్యంగా పోరాటం చేద్దాం



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్

కృష్ణలంక(విజయవాడతూర్పు): కార్మికులు, ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఐక్య ఉద్యమాలకు సన్నద్ధం కావాలని సీఐటీయూ ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌సీహెచ్ శ్రీనివాస్ పిలుపునిచ్చారు. స్థానిక రాణిగారితోటలోని వీఎంసీ కమ్యూనిటీ హాల్‌లో ఆదివారం సీఐటీయూ తూర్పు నగర 16వ మహాసభ జరిగింది. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ఉద్యోగ కార్మికుల హక్కులను, సంక్షేమాన్ని కాలరాస్తోందన్నారు. కార్మిక వ్యతిరేక విధానాలపై రాజీలేని పోరాటం చేయాలని చెప్పారు. కార్పొరేట్ సేవలో మోడీ ప్రభుత్వం తరిస్తూ అడవులు, పోర్టులు, ఖనిజ సంపదను అదానీ, అంబానీలకే కట్టబెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధిస్తున్న పన్నులను నిరసిస్తూ దీపావళి రోజున ట్రంప్ దిష్టిబొమ్మను దహనం చేయాలని పిలుపునిచ్చారు. సీఐటీయూ ఎన్టీఆర్ జిల్లా ఉపాధ్యక్షుడు దోనేపూడి కాశీనాథ్ మాట్లాడుతూ.. అన్ని రంగాల్లో సీఐటీయూ బలంగా ఉండేందుకు పని చేయాలన్నారు. నూతన కమిటీ నాయకత్వం అత్యంత బాధ్యతయుతంగా వ్యవహరిస్తూ నిరంతరం యూనియన్ బలోపేతానికి కృషి చేయాలని చెప్పారు. ఈ సందర్భంగా సీఐటీయూ తూర్పు నగర నూతన కమిటీ అధ్యక్ష, కార్యదర్శులుగా వి.బి.రాజు, ఎస్.నాగేశ్వరరావు, కోశాధికారిగా ఈశ్వరరావు, కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.

సాహిత్యం సమకాలీనమై ఉండాలి



మాట్లాడుతున్న గోళ్ల నారాయణరావు, వేదికపై గుమ్మా సాంబశివరావు తదితరులు

విజయవాడకల్చరల్: సాహిత్యం సమకాలీనమై ఉండాలని సాహితీవేత్త గోళ్ల నారాయణరావు అన్నారు. బహుజన సాహిత్య వేదిక ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని ప్రెస్ క్లబ్‌లో బహుజన సాహిత్యం – సమకాలీనత – సార్వజనీనత అంశంగా ఆదివారం సదస్సును నిర్వహిచారు. నారాయణరావు మాట్లాడుతూ.. సాహిత్యంలో కాలనుగుణమైన మార్పులు సంభవిస్తూ ఉంటాయన్నారు. సమాజంలోని అనేక సమస్యలకు సాహిత్యం పరిష్కారం చూపాలన్నారు. డాక్టర్ అంబేద్కర్ సాహిత్యం సమాజంలో పెనుసంచలనం సృష్టించిందని చెప్పారు. డాక్టర్ గుమ్మా సాంబశివరావు దళిత నాటక సాహిత్యం, జి.లక్ష్మీనరసయ్య దళిత సాహిత్యం తార్కిక దృక్పథం, డాక్టర్ కోయి కోటేశ్వరరావు, తెలుగు కవిత్వంపై అంబేద్కర్ ప్రభావం, డాక్టర్ ఎస్ వెంకటేశ్వరరావు బోయిభీమన్న, జాషువా సాహిత్య విలువలు అంశంగా ప్రసంగించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కవులు స్వీయకవితా గానం చేశారు. కార్యక్రమాన్ని సాహితీవేత్త బోడి ఆంజనేయరాజు, నిర్వాహకుడు మన్మథరావు నిర్వహించారు. కవులను, అతిథులను నిర్వాహకులు సత్కరించారు.

వృద్ధులకు నిత్యావసర సరుకులు పంపిణీ



సరుకులు అందజేస్తున్న చల్లా హరికుమార్, తేజ్‌రాజ్ సోలంకీ తదితరులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): 70 సంవత్సరాలు దాటిన నిరుపేద వృద్ధులు వయోవృద్ధ చారిటబుల్ ట్రస్ట్ సేవలను సద్వినియోగం చేసుకుని ఆరోగ్యకర జీవనం సాగించాలని ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ చల్లా హరికుమార్, వైస్ చైర్మన్ తేజ్‌రాజ్ సోలంకీ తెలిపారు. స్థానిక దుర్గాపురం విజయ్ నర్సింగ్ కళాశాలలో ఆదివారం వయోవృద్ధ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన వృద్ధులకు నిత్యావసర సరుకులు పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తాము దాతలు, ట్రస్టీల సహకారంతో 211 నెలలుగా వృద్ధులకు ప్రతీ నెలా నాణ్యమైన నిత్యావసర సరుకులు అందజేయటంతో పాటు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందజేస్తున్నామన్నారు. వృద్ధులకు అన్ని విషయాల్లో అండగా ఉండి వారి జీవన ప్రమాణం పెంపొందించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరి జీవితంలో వృద్ధాప్యం అనేది ఒక భాగమని, ఎవరికి వారు తమ వంతు బాధ్యతగా వృద్ధులను ఆదరించాలని సూచించారు. తాము చేస్తున్న సేవాకార్యక్రమాలకు సహకరిస్తున్న ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం నిత్యావసర సరుకులు, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్టీలు తట్టి అర్జునరావు, మధుసూదనరావు, వెంకటేష్ గోదావరి తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా దియా మేకింగ్ పోటీలు



చిన్నారులు తయారు చేసి ప్రదర్శించిన దీపాలు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): దీపావళి సందర్భంగా బందరు రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో చిన్నారులకు దియా మేకింగ్ పోటీలు నిర్వహించారు. నగరంలోని వివిధ పాఠశాలలకు చెందిన 50 మంది విద్యార్థులు పోటీల్లో ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను కనబరిచారు. పోటీల్లో చిన్నారులు కొబ్బరి చిప్పలు, పిండి, స్పూన్లు, వివిధ ఆకృతులతో తయారు చేసిన దీపాలు ఆకట్టుకున్నాయి. విద్యార్థులు తమలోని సృజనాత్మకతను ప్రదర్శించారు.

పండుగల ప్రాముఖ్యతను తెలియజేసేందుకు..

కార్యక్రమంలో పాల్గొన్న రచయిత జీవీ పూర్ణచందు చిన్నారులకు దీపావళి ప్రాముఖ్యతను వివరించారు. దీపావళి మహిళా శక్తికి, స్వేచ్ఛకు ప్రతీక అన్నారు. దుష్ట శిక్షణ చేసేది భగవంతుడు అంటే పురుష వాచకంగా ఉందని, స్త్రీలు కూడా శక్తివంతులేనన్నారు. దుష్ట శిక్షణ చేయగలరని నిరూపించడానికి సత్యభామను సృష్టించారన్నారు. నిజమైన మహిళా దినోత్సవంగా దీపావళిని జరుపుకోవాలన్నారు. గ్రంథాలయ అధికారి రమాదేవి మాట్లాడుతూ పిల్లల్లో సృజనాత్మకతను వెలికి తీయడంతో పాటు పండుగల ప్రాముఖ్యతను తెలియజేసేందుకు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం విజేతలకు పూర్ణచంద్, స్వాతి పూర్ణిమ బహుమతులు, మెరిట్ సర్టిఫికెట్స్ అందజేశారు. కార్యక్రమంలో వివిధ స్కూళ్ల విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సూపర్‌స్టార్ కృష్ణకు దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు ప్రకటించాలి



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సినీనటుడు, సూపర్ స్టార్ కృష్ణకు కేంద్ర ప్రభుత్వం దాదాసాహెబ్ ఫాల్కే అవార్డును ప్రకటించాలని ఆయన అభిమానులు డిమాండ్ చేశారు. అవార్డు ప్రకటించాలని కోరుతూ ఆదివారం విజయవాడ లెనిన్ సెంటర్‌లోని ఓం షిర్డీసాయిబాబా, నాగమానసాదేవి ఆలయంలో కృష్ణ అభిమానుల ఆత్మీయ సమావేశం జరిగింది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలు, తమిళనాడు, కర్నాటక, తెలంగాణ రాష్ట్రాల నుంచి అభిమానులు సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలిండియా సూపర్‌స్టార్ కృష్ణ–మహేష్ బాబు ఫ్యాన్స్ రాష్ట్ర అధ్యక్షుడు కె.సుధాస్వామి మాట్లాడుతూ.. కృష్ణ నటుడిగా, నిర్మాతగా తెలుగు చలన చిత్ర పరిశ్రమకు కొత్త సొబగులు అద్దారన్నారు. కోట్లాది మంది అభిమానుల అభిమానాన్ని చూరగొన్న కృష్ణకు కేంద్ర ప్రభుత్వం దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు ప్రకటించడం సముచితమన్నారు. ఆ దిశగా కేంద్రం ఆలోచన చేయాలని కోరారు. రాష్ట్రానికి చెందిన పార్లమెంట్ సభ్యులు కేంద్రంపై ఒత్తిడి తేవాలన్నారు. అనంతరం కృష్ణ అభిమానులను సత్కరించి, వారికి జ్ఞాపికలు అందజేశారు.

ప్రతిభకు ప్రోత్సాహం ఇవ్వాలి



విజయవాడకల్చరల్: ప్రతిభకు ప్రోత్సాహం ఇవ్వాలని తెలుగు కళారత్నాలు– సాంస్కృతిక సేవా సంస్థ నిర్వాహకుడు యూవీ రత్నం అన్నారు. తెలుగు కళారత్నాలు– సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో ఆదివారం సినీ సంగీత విభావరి, గాయనీ గాయకులకు, సామాజిక సేవారంగంలో సేవలను అందిస్తున్న వారికి పురస్కారాల కార్యక్రమం నిర్వహించారు. యూవీ రత్నం మాట్లాడుతూ గాయనీ గాయకులు స్వయం కృషితో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. రచయిత్రి ఉషారాణి మాట్లాడుతూ గాయనీ గాయకులకు వేదికను కళాసంస్థలు కల్పించాలని సూచించారు. తెలుగు కళా రత్నాలు చేస్తున్న కృషిని న్యాయవాది గుప్తా అభినందించారు. గాయనీ గాయకులను, అతిథులను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు.

అసోసియేషన్ అభివృద్ధికి కృషి చేస్తా



నూతన కార్యవర్గ సభ్యులు

ఆటోనగర్(విజయవాడతూర్పు): విజయవాడ టైర్స్ రీ ట్రేడర్స్ అండ్ వల్కనైజర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అభివృద్ధికి కృషి చేస్తానని అసోసియేషన్ నూతన అధ్యక్షుడు ఎస్‌కే ఫఖర్ అహ్మద్(100 ఎఫ్ టీబాబు) పేర్కొన్నారు. ఆటోనగర్‌లోని ఏటీఏ హాలులో అసోసియేషన్ సర్వసభ్య సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడితో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నికల అధికారి ఎస్‌కే సుభాని అధికారికంగా ప్రకటించారు. ఈ సందర్భంగా ఫఖర్ అహ్మద్ మాట్లాడుతూ.. వచ్చే మూడేళ్లలో అసోసియేషన్ సభ్యుల సమస్యలను పరిష్కరించి వారి సంక్షేమానికి కృషి చేస్తామన్నారు. అనంతరం మాజీ అధ్యక్షుడు రిజ్వాన్ మాట్లాడుతూ.. అసోసియేషన్ అభివృద్ధికి అన్ని విధాలుగా కృషి చేస్తామని చెప్పారు. సభ్యుల ఉపాధితో పాటు సంక్షేమానికి, అసోసియేషన్ అభివృద్ధికి ఎనలేని సేవ చేశామన్నారు. పిల్లల చదువుకు ఆర్థిక సహాయం అందించినట్టు తెలిపారు. అంతకు ముందు నూతన కార్యవర్గ సభ్యులను పలువురు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు ఎస్ఎస్ఎస్ హుస్సేని బాబా, కార్యదర్శి ఎండీ ఇస్మాయిల్, కోశాధికారి అబ్దుల్ అజీస్, ఏటీఏ అధ్యక్ష, కార్యదర్శులు రాజనాల వెంకటరమణ, రావి రామచంద్రరావు, అర్జా సత్యనారాయణ, హబీబ్‌ఖాన్‌తో పాటు సభ్యులు పాల్గొన్నారు.

మధురంగా సాగిన సప్త స్వరార్చన



వీణతో దీక్షితార్ కృతులను ఆలపిస్తున్న చిట్టా కార్తీక్

విజయవాడకల్చరల్: శ్రీ సుబ్రహ్మణ్య మహతి సంగీత సమితి ఆధ్వర్యంలో సంగీత మూర్తి త్రయంలో ఒకరైన ముత్తుస్వామి దీక్షితార్ సంగీత మహోత్సవం మధురంగా సాగింది. గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో ఆదివారం 7 గంటల పాటు సాగిన కార్యక్రమంలో ముత్తుస్వామి దీక్షితార్ రచించి స్వరపరచిన కీర్తనలను యువ సంగీత కళాకారులు ఆలపించారు. వీణ కళాకారులు తోట శాంతిశ్రీ, మోపిదేవి హరణి, యడవల్లి చిత్కళ, కోట శాంకరి, వీరుభట్ల సాత్విక, హరిద్రా మ్యూజిక్ అకాడమీ విద్యార్థులతో పాటు సీవీపీ శాస్త్రి, చిట్టా కార్తీక్ ఆలపించిన వాగ్గేయకార కృతులు అలరించాయి.

సంగీత సాహిత్య నిలయాలు

ముత్తుస్వామి దీక్షితార్ కృతులు సంగీత సాహిత్య నిలయాలు అని శ్రీ సుబ్రహ్మణ్య సంగీత సమితి కార్యదర్శి సీవీ రావ్ అన్నారు. సంగీత మూర్తి త్రయంలో ఒకరని నవవిధ భక్తులలో ఒకటైన కీర్తన ద్వారా భగవంతుని చేరుకోవచ్చన్నారు. కర్నాటక సంగీతంలో రచించిన పలు కీర్తనలు తెలుగు సాహిత్య చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయాయని చెప్పారు.

విద్యార్థులు సృజనాత్మకతకు పదును పెట్టాలి

ఎస్‌సీఈఆర్టీ సంస్థ డైరెక్టర్ ఎంవీ కృష్ణారెడ్డి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విద్యార్థులు తమలోని సృజనాత్మకశక్తికి పదును పెట్టాలని స్టేట్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రెనింగ్ (ఎస్‌సీఈఆర్టీ) సంస్థ డైరెక్టర్ ఎంవీ కృష్ణారెడ్డి అన్నారు. ఎస్‌సీఈఆర్టీ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి సైన్స్ సెమినార్ పోటీలు ఆంధ్ర లయోలా కళాశాల ఆవరణలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన విద్యార్థులు పోటీలకు హాజరయ్యారు. క్వాంటమ్ ఏజ్ బిగిన్స్ – పొటెన్షియల్స్ అండ్ ఛాలెంజస్ అంశంపై ఈ సెమినార్ పోటీలను నిర్వహించారు. ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కృష్ణారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు శాస్త్ర సాంకేతిక రంగాల్లో నూతన ఆవిష్కరణలపై దృష్టి సారించాలన్నారు. రాష్ట్ర స్థాయిలో ప్రథమ బహుమతి సాధించిన విద్యార్థి ఈ నెల 30న బెంగుళూర్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీలకు హాజరవుతారని తెలిపారు. విజయనగరం జిల్లాకు చెందిన పి.భానుప్రసాద్ ప్రథమ, ఎన్టీఆర్ జిల్లాకు చెందిన బి.ఉషాకిరణ్మయి ద్వితీయ, ఏలూరు జిల్లాకు చెందిన దివ్యశ్రీ తృతీయ బహుమతిని సాధించారు. కార్యక్రమంలో అధికారులు డాక్టర్ నాగమణి, డాక్టర్ పురుషోత్తమ్ తదితరులు పాల్గొన్నారు.





నగరంలో దీపావళి సందడి





నగరంలో దీపావళి పండుగ సందడి నెలకొంది. ఘంటశాల సంగీత కళాశాల, మాకినేని బసవపున్నయ్య స్టేడియం తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన బాణసంచా దుకాణాలతో పాటు ప్రధాన కూడళ్లలో ప్రమిధలు విక్రయాల వద్ద ఆదివారం కొనుగోలుదారుల సందడి కనిపించింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

క్లుప్తంగా...

బీసీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా డాక్టర్ శ్రీనివాసులు



నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు

నెహ్రూనగర్: ఆంధ్రప్రదేశ్ బీసీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ గుంటూరు జిల్లా డిప్యూటీ కమిషనర్ డాక్టర్ కె.శ్రీనివాసులు ఎన్నికయ్యారు. ఆదివారం గుంటూరులో ఫెడరేషన్ రాష్ట్ర ద్వితీయ మహాసభ, నూతన కార్యవర్గ ఎన్నిక జరిగింది. ఈ కార్యక్రమంలో పలువురిని గౌరవ అధ్యక్షులుగా, వర్కింగ్ ప్రెసిడెంట్లుగా, ఉపాధ్యక్షులుగా, కార్యదర్శులుగా ఎన్నుకున్నారు. శ్రీనివాసులు మాట్లాడుతూ బీసీ ఉద్యోగులకు పదోన్నతులలో రిజర్వేషన్స్ కల్పించాలని, ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు కల్పించడంతోపాటు ఫెడరేషన్‌కు ప్రభుత్వ గుర్తింపుకోసం కృషి చేస్తానన్నారు. బీసీ ఉద్యోగుల ప్రమోషన్లలో రోస్టర్ కమ్ మెరిట్ సీనియార్టీని పాటించాలని కోరారు.

టీటీడీ ట్రస్ట్ బోర్డులో బంజారాలకు స్థానం కల్పించాలి

కల్వకుంట్ల కవిత



తిరుమల: తెలంగాణలో ఈనెల 25 నుంచి నాలుగు నెలలపాటు కొనసాగనున్న 'జాగృతి జనం బాట' విజయవంతం అవ్వాలని కోరుతూ శ్రీవారి ఆశీస్సుల కోసం తిరుమలకు వచ్చినట్టు కల్వకుంట్ల కవిత తెలిపారు. ఆదివారం వీఐపీ బ్రేక్ దర్శన సమయంలో కల్వకుంట్ల కవిత దంపతులు శ్రీవారిని దర్శించుకున్నారు. త్వరలో తెలంగాణలో చేపట్టే కార్యక్రమం విజయవంతం కావాలని, రెండు తెలుగు రాష్ట్రాలు సుభిక్షంగా ఉండాలని శ్రీవారిని కోరినట్టు తెలిపారు. ప్రభుత్వం బంజారాలు, లంబాడీలకు తగిన ప్రాధాన్యతను కల్పించాలని సీఎం చంద్రబాబుకు విజ్ఞప్తి చేశారు. ఆదివారం స్థానిక హథీరాంజీ మఠంలో జరిగిన హథీరాంజీ బావాజీ జీవసమాధి పొందిన రోజుని పురస్కరించుకుని నిర్వహించిన బస్తీ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. శ్రీవారి దర్శనార్థం వివిధ రాష్ట్రాల నుంచి తిరుమలకు వచ్చే బంజారా భక్తులకు హథీరాంజీ మఠంలో తగిన సౌకర్యాలను కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. టీటీడీ ట్రస్టు బోర్డులో బంజారాలకు స్థానం కల్పించాలని, తిరుపతిలోని హథీరాంజీ మఠాన్ని తొలగించి షాపింగ్ కాంప్లెక్స్ కట్టే యోచనను విరమించాలని కోరారు.

ఈడీ అటాచ్ చేసినా.. ఆస్తులను అమ్మేశారు

సాక్షి, హైదరాబాద్: హీరా గ్రూప్ ఆఫ్ కంపెనీస్ పేరుతో వివిధ స్కీమ్‌ల ముసుగులో రూ.6,000 కోట్ల స్కామ్‌కు పాల్పడిన నౌహీరా షేక్ మరో కుంభకోణానికి తెరలేపారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అటాచ్ చేసిన ఆస్తుల్ని వివిధ మార్గాల్లో నకిలీ పత్రాల సాయంతో విక్రయించారు. హైదరాబాద్‌లోని కొన్ని ఆస్తుల్ని అమ్మేయగా.. ముంబైలో విక్రయానికి సేల్ అగ్రిమెంట్ చేసుకున్నారు. ఈ విషయం గుర్తించిన ఈడీ అధికారులు ఆ ప్రయత్నాలు అడ్డుకోవడంతోపాటు ఈ దందాలో నౌహీరా షేక్‌కు సహకరించిన సబ్ రిజిస్ట్రార్లపై చర్యలు తీసుకోవడానికి రంగం సిద్ధం చేస్తున్నారు.

నాడి పట్టుకోవాలి

అల్జీమర్స్, స్ట్రోక్, మూర్ఛ.. ఇలాంటి నాడీ సంబంధ సమస్యలు ప్రపంచంలో 40 శాతానికిపైగా జనాభాను కుంగదీస్తున్నాయి అని ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆందోళన వ్యక్తం చేసింది. ఇవి ఆయా దేశాల ఆర్థిక వ్యవస్థలకు పెనుభారంగా పరిణమిస్తున్నాయని వెల్లడించింది. సంస్థ చరిత్రలో తొలిసారి ఈ వ్యాధులపై 'గ్లోబల్ స్టేటస్ రిపోర్ట్ ఆన్ న్యూరాలజీ' పేరిట నివేదికను విడుదల చేసింది. మొత్తం సభ్య దేశాల్లో కేవలం 32 శాతం (63 దేశాలు) మాత్రమే.. నాడీ సంబంధ సమస్యల నివారణకు జాతీయ విధానం ప్రకటించాయని, ఇందులో భారత్ కూడా ఉందని నివేదికలో ప్రత్యేకంగా ప్రస్తావించింది.

- సాక్షి, స్పెషల్ డెస్క్



పెరుగుతున్న నాడీ సంబంధ రుగ్మతలు	2021 నాటికి 340 కోట్లకుపైగా బాధితులు	ఏటా మరణిస్తున్న వారు 1.1 కోట్ల మంది	జాతీయ విధానం ప్రకటించిన దేశాల్లో భారత్	ప్రముఖంగా ప్రస్తావించిన డబ్ల్యూహెచ్‌వో నివేదిక

ప్రపంచంలోని మూడో వంతు దేశాల్లో కూడా.. పెరుగుతున్న నాడీ సంబంధ సమస్యలపై ఇప్పటికీ నిర్దిష్ట జాతీయ విధానం అంటూ ఒకటి లేదు. 2021 నాటికి ప్రపంచ జనాభాలో సుమారు 42 శాతం మంది (దాదాపు 340 కోట్లకుపైగా) ప్రజలు నాడీ సంబంధ రుగ్మతలతో బాధపడుతున్నారు. వీటివల్ల ఏటా 1.1 కోట్ల మంది మరణిస్తున్నారు అని ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక 'గ్లోబల్ స్టేటస్ రిపోర్ట్ ఆన్ న్యూరాలజీ' వెల్లడించింది.

జాతీయ విధానం 32% దేశాల్లోనే..

ప్రపంచ ఆరోగ్య సంస్థలో ఉన్న మొత్తం 194 సభ్య దేశాల్లో 102 మాత్రమే ఈ సర్వేలో పాల్గొన్నాయి. ఈ జాబితాలో భారతదేశం కూడా ఉంది. ప్రపంచ జనాభాలో 71 శాతం ఈ దేశాల్లోనే ఉంది. మొత్తం సభ్య దేశాల్లో 32 శాతం (63 దేశాలు) మాత్రమే.. నాడీ సంబంధ సమస్యల నివారణకు జాతీయ విధానం ప్రకటించాయి. కేవలం 34 దేశాలే.. ఇందుకోసం నిధులు కేటాయించాయట. 49 దేశాలు (25 శాతం) మాత్రమే.. ఆయా దేశాల్లోని సార్వత్రిక ఆరోగ్య పథకాల్లో నాడీ సంబంధ సమస్యలను చేర్చాయి.

ఒక డాలర్ ఖర్చు.. 10 డాలర్ల రాబడి

నాడీ సంబంధ సమస్యలు.. ముఖ్యంగా మెదడు ఆరోగ్యంపై అన్ని దేశాలూ విస్తృత అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచించింది. నాడీ సంబంధ వ్యాధుల నివారణకు చేపట్టే చర్యలు దీర్ఘకాలంలో ఆర్థికంగా ప్రయోజనకరమైనవేనని తెలిపింది. 'ఉదాహరణకు స్ట్రోక్, హృద్రోగాలపై పెట్టే ఒక డాలర్ ఖర్చు.. 10 డాలర్ల కంటే ఎక్కువ రాబడి ఇస్తుంది. ఇలా ఆలోచిస్తే ఈ సమస్యలన్నింటిపైనా చేసే ఖర్చును వ్యయంలా భావించలేం. అవి భవిష్యత్తులో ఆర్థిక వ్యవస్థలను సుసంపన్నం చేసే పెట్టుబడులే' అని పేర్కొంది.

నివేదికలో మనదేశ ప్రస్తావన

ప్రపంచ ఆరోగ్య సంస్థ ఈ నివేదికలో మనదేశాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించింది. కర్ణాటక రాష్ట్రం 'కర్ణాటక బ్రెయిన్ హెల్త్ ఇనీషియేటివ్ (కభీ)' పేరిట ఆ రాష్ట్రంలో నాడీ సంబంధ రుగ్మతల నివారణకు సమగ్ర కార్యక్రమాన్ని చేపట్టింది. దీని కోసం ప్రత్యేకంగా నిధులు కేటాయించి 2023లో రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేసింది. ఇందులో భాగంగా 32 క్లినిక్‌లు ఏర్పాటుచేసింది. రాష్ట్ర వ్యాప్తంగా స్ట్రోక్, డిమెన్షియా వంటి రుగ్మతలతో బాధపడేవారి వివరాలను డిజిటైజ్ చేసింది. అనేక రూపాల్లో అవగాహనా కార్యక్రమాలు నిర్వహించింది. ఈ కార్యక్రమ స్ఫూర్తితో భారత ప్రభుత్వం 2024లో మెదడు ఆరోగ్యంపై జాతీయ టాస్క్ ఫోర్స్ ఏర్పాటుచేసింది.

2021లో మరణాలు లేదా అంగ వైకల్యానికి కారణమైన ప్రధాన నాడీ సమస్యలు..

స్ట్రోక్, అప్పుడే పుట్టిన పిల్లల్లో మెదడులో సమస్యలు, మైగ్రెయిన్, అల్జీమర్స్, మతిభ్రమణం, డయాబెటిక్ న్యూరోపతి, మెనింజైటిస్ (మెదడు, వెన్నుపాము చుట్టూ ఉండే పొరల వాపు), నెలలు నిండక ముందే పుట్టే పిల్లల్లోని నాడీ సంబంధ సమస్యలు, ఆటిజం సంబంధిత సమస్యలు, నాడీ సంబంధ కేన్సర్లు.



2021 గణాంకాల ప్రకారం చూస్తే.. మైగ్రెయిన్, మల్టిపుల్ స్క్లెరోసిస్ (కేంద్ర నాడీ వ్యవస్థను ప్రభావితం చేసే దీర్ఘకాలిక వ్యాధి) మహిళల్లో ఎక్కువగా ఉంటే.. పార్కిన్సన్స్, స్ట్రోక్ పురుషుల్లో ఎక్కువగా ఉన్నాయి.

ప్రపంచ వ్యాప్తంగా 2021లో మూర్ఛ వ్యాధితో బాధపడుతున్న వారి సంఖ్య 5.17 కోట్లు.

చిన్ని వర్సెస్ కొలికపూడి

ఎంపీ కార్యాలయం నుంచే అవినీతి దందాలంటూ ఆగ్రహం

సాక్షి ప్రతినిధి, విజయవాడ, తిరువూరు: ఎన్టీఆర్ జిల్లా తిరువూరు టీడీపీలో విభేదాలు భగ్గుమంటున్నాయి. ఎంపీ కేశినేని చిన్ని, ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాస్ మధ్య విభేదాలు తారస్థాయికి చేరాయి. శనివారం రాత్రి తిరువూరులో తనను కలిసిన టీడీపీ నేతలతో ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఎంపీ కేశినేని చిన్ని పార్టీ పదవులు అమ్ముకుంటున్నారని, ఎంపీ కార్యాలయం నుంచి అవినీతి దందాలు నడుపుతున్నారని సంచలన ఆరోపణలు చేశారు. 'ఎంపీ కార్యాలయంలో కూర్చుని పార్టీ కమిటీలు వేస్తారు. గతంలో పార్టీ పదవుల కోసం పరిశీలకులు వచ్చి ఎన్నికలు నిర్వహించేవారు. ప్రస్తుతం పార్టీ కార్యాలయంలో కూర్చుని కమిటీలు వేస్తున్నారు. ఇంతకుముందు సూరపనేని రాజా నియోజకవర్గం అంతా తిరిగి పార్టీ పదవులు, నామినేటెడ్ పదవులకు డబ్బులు వసూలు చేశాడు. ఇప్పుడు ఎంపీ కార్యాలయంలో పనిచేసే మూల్పూరి కిశోర్ ఇసుక మాఫియా, రేషన్ మాఫియా నడుపుతూ పార్టీ పదవులు అమ్ముకుంటున్నాడు. కమిటీ నియామకాల్లో పార్టీ నేతలకు అన్యాయం జరుగుతోంది' అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

తాడోపేడో తేల్చుకుందాం

ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాస్ చేసిన వ్యాఖ్యలు కలకలం రేపుతున్నాయి. 'అన్ని విషయాలను పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకెళదాం. ఈ నెల 24న అందరం కలిసి పార్టీ కేంద్ర కార్యాలయానికి వెళదాం. తాడోపేడో తేల్చుకుందాం' అంటూ కొలికపూడి మండిపడ్డారు. ఈ నెల 24న టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును కలిసి తిరువూరులో జరిగే పరిణామాలపై ఫిర్యాదు చేస్తామని పార్టీ కార్యకర్తలతో ఎమ్మెల్యే పేర్కొన్న మాటల వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఎంపీ కేశినేని చిన్నిపై ఫిర్యాదు చేసేందుకు పెద్దఎత్తున నాయకులు, కార్యకర్తలతో పార్టీ రాష్ట్ర కార్యాలయానికి తరలి వెళ్లేందుకు ఎమ్మెల్యే ఏర్పాట్లు చేసుకుంటున్నట్టు సమాచారం.

ఎంపీ చిన్నిపై కారాలు.. మిరియాలు

తిరువూరు టీడీపీలో ముసలం మొదలైంది. ఆదినుంచీ పార్టీ కోసం కష్టపడి పనిచేసిన టీడీపీ సీనియర్ నేత ఎన్టీ వెంకటేశ్వరరావు పార్టీకి దూరంగా ఉంటున్నట్టు ఇప్పటికే ప్రకటించారు.



కార్యకర్తలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాస్

'చీడ పురుగుల వలన పార్టీ నుంచి తప్పుకోవాల్సి వస్తోంది' అని వెంకటేశ్వరరావు సంచలన వ్యాఖ్యలు చేశారు. దీని కారణం ఎంపీ కేశినేని చిన్ని, అతని కార్యాలయంలో పనిచేసే వ్యక్తే కారణమని టీడీపీ నేతలు బహిరంగంగానే విమర్శలు గుప్పిస్తున్నారు. నియోజకవర్గంలో ఎంపీ మితిమీరిన జోక్యంతోపాటు అవినీతి అక్రమాలను ప్రోత్సహిస్తుండటంతో పార్టీ పరువు బజారున పడిందనే భావన వ్యక్తమవుతోంది. ఎమ్మెల్యే కొలికపూడి ఎస్సీ సామాజికవర్గానికి చెందిన వ్యక్తి కావడంతో తిరువూరు నియోజకవర్గంలో పెత్తనమంతా తన గుప్పిట్లోనే ఉండాలనే విధంగా ఎంపీ వ్యవహరిస్తున్నట్టు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఈ కారణంగానే పార్టీ రెండు వర్గాలుగా విడిపోయిందని టీడీపీ శ్రేణులు వ్యాఖ్యానిస్తున్నాయి. ఎంపీ అన్ని విషయాల్లో జోక్యం చేసుకుంటూ ఎమ్మెల్యేని అవమానించే రీతిలో వ్యవహరిస్తున్నారని, తిరువూరులో ఎంపీ ఓ కార్యాలయాన్ని తెరిచి ఎమ్మెల్యేకు సమాంతరంగా రాజకీయాలు నడుపుతూ ఓ వర్గాన్ని ప్రోత్సహించటాన్ని కొలికపూడి, అతని అనుచరులు జీర్ణించుకోలేకపోతున్నారు. ఇసుక, మద్యం, గ్రావెల్, గంజాయి, రేషన్ బియ్యం వంటి అవినీతి వ్యవహారాలను దళారుల సాయంతో ఎంపీ నడిపిస్తున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ఈనేపథ్యంలో టీడీపీ శ్రేణులు ఎంపీ కేశినేని చిన్నిపై కారాలు మిరియాలు నూరుతున్నాయి.

పదవులను రూ.కోట్లకు అమ్ముకుంటూ..

తిరువూరు నియోజకవర్గంలో ఎంపీ పార్టీ కార్యాలయాన్ని ఇటీవల ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాస్ హాజరు కాలేదు. దీంతో వీరి ఇరువురి మధ్య అంతరం మరింత పెరిగింది. దీంతో పాటు ఎమ్మెల్యే ప్రతిపాదించిన అభివృద్ధి పనులకు అడ్డుకట్ట వేయడంలో భాగంగా టీడీపీ కౌన్సిల్ సమావేశానికి పలువురు కౌన్సిలర్‌లు గైర్హాజరయ్యేలా ఎంపీ వర్గం పావులు కదిపింది. దీంతోపాటు ముగ్గురు కౌన్సిలర్లపైన అనర్హత వేటు వేయించేందుకు ప్రయత్నించింది. దీంతో ఎమ్మెల్యే, ఎంపీ మధ్య విభేదాలు మరింత తీవ్రమయ్యాయి. ఎమ్మెల్యేపై పైచేయి సాధించాలన్న ఉద్దేశంతో మాజీమంత్రి కేఎస్ జవహర్ కుమారుడిని ఎంపీ వర్గం రంగంలోకి దించింది. ఎమ్మెల్యే ఉండగానే, మరో నేతను ప్రోత్సహించడం ద్వారా ఎమ్మెల్యేకు చెక్ పెట్టే కుట్ర దాగి ఉందని టీడీపీ వర్గాలు చెబుతున్నాయి. నియోజకవర్గంలో పార్టీ పదవులు, ఆలయ చైర్మన్ పదవులు, నామినేటెడ్ పదవులను బేరం పెట్టి రూ.కోట్లకు అమ్ముకున్నట్టు వచ్చిన ఆరోపణలు నియోజకవర్గంలో కలకలం రేపాయి. ఎంపీ, ఎమ్మెల్యేల మధ్య వివాదం ఎటు దారితీస్తుందోనని పార్టీ శ్రేణులు కలవరపడుతున్నాయి.

ఎమ్మెల్యే కొలికపూడిపై కస్సుమన్న టీడీపీ నేతలు

ప్రశాంతంగా ఉండే తిరువూరు నియోజకవర్గాన్ని టీడీపీ ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు అల్లకల్లోలం చేస్తున్నారని ఆ పార్టీ నాయకులు ధ్వజమెత్తారు. ఇసుక, మట్టి అమ్ముకోవడం, మద్యం దుకాణాల నుంచి నెలవారీ మామూళ్లు వసూలు చేసిన ఆయన విజయవాడ ఎంపీ చిన్నిపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఆదివారం తిరువూరు ఫ్యాక్టరీ సెంటర్‌లోని టీడీపీ కార్యాలయంలో తిరువూరు, విస్సన్నపేట, ఎ.కొండూరు మండలాల టీడీపీ అధ్యక్షులు దుబ్బాకు వెంకటేశ్వరరావు, రాయల సుబ్బారావు, పీక్లా నాయక్ తదితరులు మీడియాతో మాట్లాడుతూ.. ఎమ్మెల్యే కొలికపూడిపై తీవ్ర ఆరోపణలు చేశారు. ఇటీవల ఉద్యోగుల బదిలీలకు కూడా ఎమ్మెల్యే డబ్బు దండుకున్నారని, తిరుమల శ్రీవారి ఆలయ దర్శన సిఫారసు లేఖలను కూడా అమ్ముకుంటున్నారని ఆరోపించారు. ఎమ్మెల్యే అక్రమాలను బహిర్గతం చేయడానికి సిద్ధంగా ఉన్నామని, ఆయన తిరువూరు నియోజకవర్గంలో టీడీపీకి నష్టం కలగజేస్తున్నందున వెంటనే సస్పెండ్ చేయాలని అధిష్టానాన్ని కోరారు.

రేపు బంగాళాఖాతంలో

అల్పపీడనం

రెండు రోజుల్లో వాయుగుండంగా మారే అవకాశం

నాలుగు రోజులపాటు రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు



సాక్షి, అమరావతి: దక్షిణ అండమాన్ సముద్రం, దానికి ఆనుకుని ఉన్న ఆగ్నేయ బంగాళాఖాతంపై ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. దీని ప్రభావంతో ఈనెల 21న ఆగ్నేయ బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. అల్పపీడనం తదుపరి రెండు రోజుల్లో పశ్చిమ, వాయవ్య దిశగా కదులుతూ వాయుగుండంగా బలపడే అవకాశం ఉంది. దీని ప్రభావంతో రానున్న నాలుగు రోజులపాటు రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ప్రస్తుతం తూర్పు గోదావరి, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ, కృష్ణా, గుంటూరు జిల్లాలతో పాటు రాయలసీమలోని కొన్ని ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తున్నాయని వెల్లడించారు. వాయుగుండం ప్రభావం పెరిగే కొద్దీ వర్షాల తీవ్రత కూడా పెరగవచ్చని తెలిపారు. 20న బాపట్ల, ప్రకాశం, శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు పడే అవకాశం ఉంది. మిగతా జిల్లాల్లో పలుచోట్ల పిడుగులతో కూడిన తేలికపాటి వానలు పడొచ్చు. 21న పశ్చిమ గోదావరి, ఏలూరు, కృష్ణా, ప్రకాశం, శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. మిగతా జిల్లాల్లో తేలికపాటి వర్షాలకు ఆస్కారం ఉంది. 22న బాపట్ల, ప్రకాశం, శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు, అనకాపల్లి, కాకినాడ, కోనసీమ, గుంటూరు, కృష్ణా, పల్నాడు, వైఎస్సార్ కడప, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు పడొచ్చని అధికారులు తెలిపారు. 23న కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, కృష్ణా, బాపట్ల, ప్రకాశం, శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో భారీ వర్షాలు పడే అవకాశం ఉంది. కాగా ఆదివారం రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో మోస్తరు వర్షపాతం నమోదైంది. విజయనగరం జిల్లాలోని మెరకముడిదాం, అన్నమయ్య జిల్లా గాలివీడు, విజయనగరం జిల్లా గొల్లపాడులో 4.3 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది.

వారు కోవర్టులు.. విప్లవ ప్రతిఘాతకులు

- విప్లవానికి ద్రోహం చేసిన శత్రువు ముందు మోకరిల్లారు
- లొంగుబాట్లతో జరిగే నష్టం ఎంతటిదైనా అది తాత్కాలికమే
- తాజా పరిణామాలపై మావోయిస్టు పార్టీ లేఖ



సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: పార్టీ విచ్ఛిన్నకులుగా..విప్లవ ప్రతిఘాతకులుగా మారి శత్రువులకు లొంగిపోయిన సోను, సతీశ్, వారి అనుచరులకు తగిన శిక్ష విధించాలని ప్రజలకు భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) పిలుపునిచ్చింది. ఈ మేరకు ఆ పార్టీ కేంద్ర కమిటీ అధికార ప్రతినిధి అభయ్ పేరిట ఈనెల 16న రాసిన లేఖ ఆదివారం వెలుగుచూసింది. లేఖలోని ప్రధానాంశాలివి...

సోను రాజకీయ బలహీనతలు బయటపడుతూ వచ్చాయి

2011 నుంచి దండకారణ్యంలో పార్టీ గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటోంది. దేశవ్యాప్తంగా 2018 నాటికి తాత్కాలిక వెనుకంజకు గురైంది. అప్పటి నుంచే సోనులో రాజకీయ బలహీనతలు బయటపడుతూ వచ్చాయి. 2020 డిసెంబర్‌లో జరిగిన కేంద్ర కమిటీ సమావేశంలో దండకారణ్య విప్లవాచరణలో కొన్ని లోపాలపై సోను ప్రవేశపెట్టిన పత్రాన్ని కేంద్ర కమిటీ తిరస్కరించింది. ఆ తర్వాత జరిగిన కేంద్ర కమిటీ, పొలిట్‌బ్యూరో సమావేశాల్లో సోనులోని తప్పుడు రాజకీయ భావాలను విమర్శించి, సరిదిద్దడానికి పార్టీ కృషి చేసింది. ఆయనలో పొడసూపుతున్న వ్యక్తివాదం, అహంభావం, పెత్తందారీతనాన్ని సరిదిద్దుకోవాలని కోరింది. అయితే 2025 మేలో మా పార్టీ ప్రధాన కార్యదర్శి బసవరాజు మరణం తర్వాత సోనులో దీర్ఘకాలంగా పేరుకుపోయిన సైద్ధాంతిక, రాజకీయ, నిర్మాణాత్మక బలహీనతలు గుణాత్మక మార్పును సంతరించుకొని శత్రువు ముందు మోకరిల్లేలా చేశాయి.

నిజాలు దాచి .. నిందలు మోపుతూ..

ఆపరేషన్ కగార్‌తో ప్రతీరోజు ప్రాణాలు ఎదురొడ్డి విప్లవోద్యమాన్ని ముందుకు నడిపించాల్సిన పరిస్థితి ఎదురైంది. అయితే సోనులో పెరుగుతూ వచ్చిన సుఖలాలస, స్వార్థాలు త్యాగానికి సిద్ధపడని స్థితికి, ప్రాణభీతికి దారి తీశాయి. తన బలహీనత, ప్రాణభీతికి ముసుగు కప్పి, పార్టీ అనుసరిస్తున్న తప్పుడు రాజకీయ సైనిక పంథా (వ్యూహం) ఫలితంగానే భారత విప్లవోద్యమం ఓటమి పాలయ్యే స్థితికి దారితీసిందని, ఈ స్థితిలో ఆయుధాలను శత్రువుకు అప్పగించి, తాత్కాలిక సాయుధ పోరాట విరమణ చేయడం మినహా మరో మార్గం లేదనే మితవాద అవకాశవాద, రివిజనిస్టు వైఖరితో కూడిన లొంగుబాటు ప్రకటన సెప్టెంబరు 15న సోను నుంచి వచ్చింది. తన అభిప్రాయాలపై నమ్మకముంటే సోను వాటిని పార్టీ ముందు పెట్టి చర్చించాల్సింది. కానీ శత్రువు ముందు లొంగిపోయాడు.

బహిష్కరిస్తున్నాం

సోను, అతని అనుచరులు ఆయుధాలు పార్టీకి అప్పగించి లొంగిపోవాలని కేంద్ర కమిటీ సూచించినా, దాన్ని పాటించకుండా ఆయుధాల్ని శత్రువుకు అప్పగించారు. ఇదివిప్లవ ప్రతిఘాతుకత (కౌంటర్ రివల్యూషన్) అవుతుంది. విప్లవ ద్రోహిగా మారిన సోను, అతనితోపాటు లొంగిపోయిన డీకే ఎస్‌జెడ్‌సీ సభ్యుడు వివేక్, దీపలతో పాటు మరో పదిమందిని పార్టీ నుంచి బహిష్కరిస్తున్నాం. ఈ విప్లవ ద్రోహులకు తగిన శిక్ష విధించాల్సిందిగా విప్లవ ప్రజలకు పిలుపునిస్తున్నాం.

భవిష్యత్ కార్యాచరణ

భారీ లొంగుబాట్లు విప్లవోద్యమానికి నష్టమే అయినా ఇవి తాత్కాలిక నష్టాలే. వీటి ప్రభావం దీర్ఘకాలం ఉండొచ్చు. కానీ విప్లవోద్యమం శాశ్వత ఓటమికి గురికాదు. పీడన, సామాజిక అంతరాలు ఉన్నంత వరకు వర్గ పోరాటం ఉంటుంది. మారిన సామాజిక పరిస్థితులు, మారుతున్న విప్లవ స్వాభావిక లక్షణాలకు తగినట్టుగా మన రాజకీయ - సైనిక పంథాను సుసంపన్నం చేసుకొని భారత విప్లవోద్యమాన్ని కొనసాగిద్దామని యావత్ దేశ ప్రజలకు పిలుపునిస్తున్నాం.

గతేడాది నుంచి వారు కాంటాక్ట్‌లో ఉన్నారు..

గతేడాది చివర్లో తన జీవిత సహచరితోపాటు మరికొందరిని మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ సమక్షంలో పోలీసులకు లొంగిపోవడానికి పథకం రూపొందించినప్పటి నుంచే పోలీస్ ఉన్నతాధికారులతో సోను, ఆశన్న కాంటాక్ట్‌లో ఉన్నారు. ఆ తర్వాత కోవర్టుగా మారినట్టు ఈ మధ్య జరిగిన ఘటనల ద్వారా అర్థమవుతోంది. కోవర్టులుగా మారిన సోను, సతీశ్‌లకు నూతన పద్ధతుల్లో భారత విప్లవోద్యమాన్ని నిర్మిస్తాననే నైతిక అర్హత లేదు. ఇకనైనా పార్టీని చీల్చే పనులు మానుకోవాలని సోను, సతీశ్‌లను హెచ్చరిస్తున్నాం.

ఫేక్ న్యూస్ ప్రచారంలో బాబు దిట్ట

ఆయనవి నికృష్ట రాజకీయాలు

మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు మండిపాటు

లండన్‌లో వైఎస్సార్‌సీపీ ఎన్ఆర్ఐ యూకే వింగ్ ఆత్మీయ సమావేశం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ ఎన్ఆర్ఐ యూకే వింగ్ కన్వీనర్లు

సాక్షి, అమరావతి : నకిలీ మద్యం బాగోతంలో తన పాత్రలేదని, అవసరమైతే లై డిటెక్టర్ పరీక్షకైనా సిద్ధమని మాజీమంత్రి జోగి రమేష్ ప్రకటించినా సీఎం చంద్రబాబు ఆయన్ను వేధిస్తున్నారని వైఎస్సార్‌సీపీ మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు విమర్శించారు. ఈ విషయంలో ముఖ్యమంత్రి ఫేక్ న్యూస్ ప్రచారం చేస్తున్నారని.. ఇందులో ఆయన దిట్ట అని ఆరోపించారు. వైఎస్సార్‌సీపీ ఎన్ఆర్ఐ యూకే వింగ్ ఆధ్వర్యంలో ఆదివారం లండన్‌లో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ.. అవసరమైతే చంద్రబాబు ఇంటికైనా వచ్చి భగవద్గీత మీద ప్రమాణం చేయడానికైనా సిద్ధమని జోగి రమేష్ చెప్పారని ఆయన గుర్తుచేశారు. ఇంతకన్నా ఏంకావాలన్నారు. గత ఎన్నికలకు ముందు కూడా ఇలాగే ఐవీఆర్ఎస్ కాల్స్ ద్వారా 'మీ భూమిని జగన్ లాగేసుకుంటున్నారు, మీ భూములకు రక్షణలేదంటూ' ఒక ఫేక్ న్యూస్‌ను విస్తృతంగా ప్రచారంచేసి చంద్రబాబు లబ్ధిపొందారన్నారు. మళ్లీ ఇప్పుడు ఆయన టీడీపీ కార్యాలయం నుంచి ప్రజలకు ఐవీఆర్ఎస్ కాల్స్ చేయిస్తున్నాడని మండిపడ్డారు. నకిలీ మద్యం దందాలో కీలక నిందితుడైన జనార్దనరావు వాయిస్‌తో జోగి రమేష్‌పై ఆరోపణలను చేయిస్తూ, నకిలీ మద్యం అంతా కూడా వైఎస్సార్‌సీపీ వారే చేశారనే ఫేక్ ప్రచారాన్ని కొనసాగిస్తున్నారని కొరముట్ల శ్రీనివాసులు చెప్పారు. చంద్రబాబువి నికృష్ట రాజకీయాలన్నారు.

అన్ని వర్గాల వారికి దగా..: వైఎస్సార్‌సీపీ యూకే కన్వీనర్లు డాక్టర్ ప్రదీప్ చింతా, ఓబుల్‌రెడ్డి పాతకోట మాట్లాడుతూ.. ప్రభుత్వోద్యోగులను చంద్రబాబు మరోసారి దగా చేశారన్నారు. పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలకుగాను ఒక్కటే చెల్లిస్తామని చెప్పారన్నారు. ఈ ఒక్క డీఏ కోసం రెండ్రోజులుగా హైడ్రామా చేశారని ఎద్దేవా చేశారు. చర్చల పేరుతో మంత్రుల సబ్ కమిటీ హంగామా చేసిందన్నారు. రెండు డీఏలు, పీఆర్సీ ప్రకటిస్తారని విపరీతంగా ప్రచారం చేశారని.. కానీ, దీపావళి కానుకంటూ ఒక్క డీఏతో చంద్రబాబు సరిపెట్టారని శ్రీనివాసులు చెప్పారు. ఇలా అన్ని వర్గాల వారిని చంద్రబాబు దగా చేస్తున్నారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యూకే కో-కన్వీనర్ మలిరెడ్డి కిషోర్‌రెడ్డితో పాటు కమిటీ సభ్యులు, యూకే నలుమూలల నుంచి వచ్చిన జగన్ అభిమానులు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పార్వతీపురం బస్టాండ్‌లో

'పార్సిల్' పేలుడు

నలుగురికి తీవ్ర గాయాలు

ఫ్యాన్సీ వస్తువుల పేరుతో విజయనగరం నుంచి ఆర్టీసీ కార్గోలో పార్సిల్ పంపిన వ్యాపారి



పేలుడు సంభవించిన ప్రాంతంలో తీవ్రంగా గాయపడిన హమాలి రెడ్డి రమేష్

పార్వతీపురం రూరల్: ఫ్యాన్సీ వస్తువుల పేరుతో ఆర్టీసీ కార్గోలో ఓ వ్యాపారి పంపిన బాణసంచా పార్సిల్ బస్టాండ్‌లో పేలింది. నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. పార్వతీపురం బస్టాండ్‌లో ఆదివారం జరిగిన ఈ ఘటన సంచలనం సృష్టించింది. విజయనగరం నుంచి మధ్యాహ్నం 12.55 గంటలకు పార్వతీపురం బస్టాండ్‌కు చేరుకున్న ఒక పల్లె వెలుగు బస్సులో ఫ్యాన్సీ వస్తువుల పేరిట 25 కిలోల పార్సిల్ వచ్చింది. దానిని కార్గో కార్యాలయం వద్ద దించే సమయంలో ఒక్కసారిగా పెద్ద శబ్దంతో పేలింది. పార్సిల్ దింపుతున్న హమాలీ రెడ్డి రమేష్‌తోపాటు బస్సు డ్రైవర్ పెర్లి రవి, రిక్షా కార్మికుడు బోనెల సుందరరావు, పార్సిల్ డెలివరీ వ్యాన్ డ్రైవర్ కింతల రమేష్ తీవ్రంగా గాయపడ్డారు. వీరిని వెంటనే ఆటో, 108 అంబులెన్స్‌లో పార్వతీపురం జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం రెడ్డి రమేష్, పెర్లి రవిని విశాఖ కేజీహెచ్‌కు, కింతల రమేష్‌ను విజయనగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఘటనాస్థలాన్ని ఎస్పీ మాధవ్‌రెడ్డి, ఏఎస్పీ అంకితా సురానా, పార్వతీపురం పట్టణ పోలీసులు పరిశీలించారు. విజయనగరానికి చెందిన సాంబయ్య అనే వ్యాపారి కొమరాడ మండలం నిమ్మలపాడు గ్రామానికి చెందిన కొత్తకోట కిషోర్‌కు ఫ్యాన్సీ వస్తువుల పేరుతో దీపావళి టపాసులు పార్సిల్ చేసి పంపినట్లు పోలీసులు గుర్తించారు. కొత్తకోట కిషోర్‌ను పార్వతీపురం టౌన్ పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

క్లుప్తంగా...

ఏకగ్రీవంగా ఏపీపీపీసీఏ కార్యవర్గం ఎన్నిక



మధురానగర్ (విజయవాడసెంట్రల్): ఏపీ పబ్లిక్ ప్రాసిక్యూటర్ క్యాడర్ అసోసియేషన్ (ఏపీపీపీసీఏ) కార్యవర్గం ఎన్నిక ఆదివారం ఏకగ్రీవం అయ్యింది. ఎన్టీఆర్ జిల్లా విజయవాడలో అసోసియేషన్ కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలిగా ఎం.కె.విజయలక్ష్మి, ప్రధాన కార్యదర్శిగా ఆర్.జగదీష్, కోశాధికారిగా సిద్దిక్ అహ్మద్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఎన్.ఆనందరావు, లేడీస్ రిప్రజెంటేటివ్‌గా కె.జయశ్రీ, ఉపాధ్యక్షులుగా ఎస్.మృణాళిని, ఎన్.శారదామణి, ఎస్ఎస్ఎస్ సుకుమార్, కె.ఆదినారాయణమ్మ, జాయింట్ సెక్రటరీలుగా కె.సూర్యకుమార్, వి.కృష్ణవేణి, పి.మురళీకృష్ణ, కె.నిర్మల ఎన్నికయ్యారు.

ఎరువుల ధర పెంచొద్దు

ఏపీ కౌలు రైతులు, రైతు సంఘాల డిమాండ్

సాక్షి, అమరావతి: ఎరువుల సబ్సిడీకి కోత పెట్టి వాటి ధరలు పెంచుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని ఏపీ కౌలు రైతు, రైతు సంఘాల నేతలు వై.రాధాకృష్ణ, ఎం.హరిబాబు, వి.క్రిష్ణయ్య, కె.ప్రభాకరరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కేంద్రం నిర్ణయంతో కాంప్లెక్స్ ఎరువు 50 కేజీల బస్తాపై అదనంగా రూ.100 వరకు భారం పడుతుందన్నారు. పెంచిన ఎరువుల ధరల వల్ల రాష్ట్రంలోని రూ.300 కోట్ల వరకు అదనపు భారం పడుతుందన్నారు. తక్షణమే ఎరువుల ధరలు పెంపు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

శుభాకాంక్షల మాటున సైబర్ మోసాలు

దీపావళి పేరిట ఏపీకే ఫైల్స్ పంపుతున్న సైబర్ కేటుగాళ్లు

సాక్షి, హైదరాబాద్: దీపావళి సందర్భంగా తమ బంధువులు, స్నేహితులకు వినూత్నంగా శుభాకాంక్షలు చెప్పాలన్న తొందరలో కొందరు సైబర్ భద్రత మరుస్తున్నారు. పండుగ శుభాకాంక్షల పేరిట సైబర్ నేరగాళ్లు ఏపీకే (ఆండ్రాయిడ్ ప్యాకేజీ కిట్) ఫైల్స్ పంపుతున్నట్టు సైబర్ భద్రత నిపుణులు హెచ్చరిస్తున్నారు. దీపావళి శుభాకాంక్షలకు సంబంధించిన మోసపూరిత లింక్‌లు పంపుతున్నట్టుగా వారు చెపుతున్నారు. ఏదైనా కంపెనీ తరఫున మీకు పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తున్నట్టుగా పంపే ఈ లింక్‌లలో 'మీ పేరు, ఫొటోతో మీకు తెలిసిన వారికి శుభాకాంక్షలు వినూత్నంగా చెప్పండి'అనే సందేశాన్ని జోడిస్తున్నట్టు తెలిపారు. ఇలాంటి లింక్‌లపై క్లిక్ చేయగానే మన మొబైల్ ఫోన్ సైబర్ నేరగాళ్ల ఆధీనంలోకి వెళ్లడంతోపాటు వారు మన ఫోన్‌లో మాల్వేర్ యాప్‌లు ఇన్‌స్టాల్ చేసి ఆన్‌లైన్ బ్యాంకు ఖాతాల నుంచి డబ్బులు కొల్లగొట్టే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. తెలియనివారి వాట్సాప్ నంబర్ల నుంచి వచ్చే సందేశాల్లోని లింకులపై క్లిక్ చేయవద్దని, ఏపీకే ఫైళ్లను డౌన్‌లోడ్ చేయవద్దని సూచిస్తున్నారు. సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు సమాచారం ఇవ్వాలని అధికారులు సూచిస్తున్నారు.

డూడ్లీ వారియర్స్ కాంటెస్ట్‌కు ఐ4సీ ఆహ్వానం

సాక్షి, హైదరాబాద్: సైబర్ నేరాలపై అవగాహన కోసం కేంద్ర హోంశాఖ పరిధిలో పనిచేసే ఇండియన్ సైబర్ క్రైం కో–ఆర్డినేషన్ సెంటర్ (ఐ4సీ) వినూత్న కార్యక్రమాలు చేపడుతోంది. అందులో భాగంగా 'డూడ్లే వారియర్స్ కాంటెస్ట్' ఏర్పాటు చేసింది. సైబర్ నేరాలపై అవగాహన పెంచేలా ఉండే ఇన్ఫోగ్రాఫిక్స్‌ను తయారు చేయడానికి ఈ పోటీని నిర్వహిస్తోంది. ఔత్సాహికులైన డిజైనర్లు ఈ పోటీలో పాల్గొని తమ క్రియేటివిటీని ప్రదర్శించాలని ఐ4సీ కోరింది. పోటీలో పాల్గొనే వారు. https://www.mygov.in/task/cyber&warriors&doodle&contest&youth&safer&digital&india/ లింక్‌లోకి వెళ్లి వివరాలు నమోదు చేయాలని సూచించారు. ఎంట్రీలు పంపేందుకు తుది గడువును ఈనెల 31గా పేర్కొన్నారు. కాగా, ఐ4సీ సైబర్ నేరాలపై అవగాహన పెంచేందుకు నిరంతరం అలర్ట్‌లను పంపడంతోపాటు, సైబర్ మోసాలను ఎలా ఎదుర్కోవాలన్న అంశంపై సలహాలు, సూచనలను ఎక్స్ ఖాతా ద్వారా వెల్లడిస్తోంది.

స్టేట్ ఎంగేజ్‌మెంట్ అజెండాలో ఏపీని చేర్చండి

ఆస్ట్రేలియా–ఇండియా సీఈవో ఫోరంను కోరిన మంత్రి లోకేశ్

సాక్షి, అమరావతి: పెట్టుబడులకు గమ్యస్థానంగా ఉన్న ఏపీని స్టేట్ ఎంగేజ్‌మెంట్ అజెండాలో చేర్చాలని మంత్రి లోకేశ్ ఆస్ట్రేలియా–ఇండియా సీఈవో ఫోరంను కోరారు. ఆస్ట్రేలియా పర్యటనలో భాగంగా ఫోరం డైరెక్టర్ జోడి మెకేతో లోకేశ్ సిడ్నీలో సమావేశమయ్యారు. ఏపీఈడీబీ, సీఐఐ, బిజినెస్ కౌన్సిల్ ఆఫ్ ఆస్ట్రేలియా సంయుక్తంగా నిర్వహించే ఆస్ట్రేలియా–ఏపీ సీఈవో రౌండ్టేబుల్ సమావేశానికి మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఫోరం వాణిజ్య, పెట్టుబడుల అజెండాలో 'ఇన్వెస్టింగ్ ఇన్ ఆంధ్రప్రదేశ్–గేట్ వే ఈస్ట్ కోస్ట్ ఆఫ్ ఇండియా' అనే అంశంపై ఉమ్మడి నివేదికలకు అవకాశం కల్పించాలన్నారు. నవంబర్ 14, 15 తేదీల్లో విశాఖలో నిర్వహించే పార్టనర్‌షిప్ సమ్మిట్–2025కు ఫోరం నాయకత్వ బృందంతో కలసి హాజరుకావాల్సిందిగా మంత్రి లోకేశ్ ఆహ్వానించారు.

ముమ్మాటికీ ప్రైవేటీకరణే

ప్రభుత్వ కొత్త వైద్య కళాశాలల్లో ఆలిండియా కోటా ఎత్తివేత

పీపీపీ పేరిట ఫీజుల దోపిడీకి చంద్రబాబు సర్కారు కొత్త ఎత్తుగడ

తమవారి ఆదాయం పెంపునకు 110 ఎంబీబీఎస్ సీట్లు యాజమాన్య కోటాగా మార్పు



పులివెందుల ప్రభుత్వ మెడికల్ వైద్య కళాశాల

సాక్షి, అమరావతి: 'పీపీపీకి.. ప్రైవేటీకరణకు చాలా తేడా ఉంది. మేం వైద్య కళాశాలలను పీపీపీలో అభివృద్ధి చేస్తున్నాం. ఈ విధానంలో విద్యార్థులు, సామాన్య ప్రజలకు ఎలాంటి నష్టం ఉండదు' కొత్త వైద్య కళాశాలల విషయంలో చంద్రబాబు ప్రభుత్వం చేస్తున్న ప్రచారం ఇది. చేస్తున్న ప్రచారానికి.. ప్రభుత్వం అవలంభిస్తున్న విధానాలకు ఏ మాత్రం పొంతన లేకుండా పోయింది. విద్యార్థులకు నష్టం ఉండదంటూనే ప్రైవేట్ వైద్య కళాశాలల్లో మాదిరిగా ప్రభుత్వ వైద్య కళాశాలల్లోనూ ఫీజుల దోపిడీకి రెడ్ కార్పెట్ పరుస్తున్నారు. తద్వారా అస్మదీయుల ఆదాయం పెంపునకు ప్రభుత్వ కోటా ఎంబీబీఎస్ సీట్లకు గండికొట్టి విద్యార్థులకు తీవ్ర అన్యాయం తలపెడుతున్నారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాధించిన 17 కొత్త ప్రభుత్వ వైద్య కళాశాలల్లో పదింటిని పీపీపీ పేరిట ప్రభుత్వం ప్రైవేట్‌కు కట్టబెడుతున్న విషయం తెలిసిందే.

ఆలిండియా కోటా సీట్లు యాజమాన్య కోటాకే..

కొత్తగా నిర్మించిన వైద్య కళాశాలలపై ప్రభుత్వానికి ఏమాత్రం అజమాయిషీ లేకుండా ప్రభుత్వ పెద్దలు చేస్తున్నారు. ఆలిండియా కోటా విధానానికి స్వస్తి పలకడం ద్వారా కళాశాలల్లో ప్రభుత్వ అజమాయిషీ అణుమాత్రం కూడా ఉండబోదని బాబు సర్కార్ ఇప్పటికే వెల్లడించింది. అంతేకాకుండా కారుచౌకగా కళాశాలలను కైవసం చేసుకునే వ్యక్తులు వైద్య విద్యా రంగంలోనూ రూ.కోట్లు కొల్లగొట్టేందుకు వీలుగా ప్రభుత్వ కోటాలోని 110 సీట్లను యాజమాన్య కోటాకు మళ్లించి విద్యార్థులకు తీవ్ర అన్యాయం తలపెడుతున్నారు.

ఒక్కో కళాశాలలో 11 చొప్పున..

దేశంలోని అన్ని రాష్ట్ర ప్రభుత్వాల అజమాయిషీలో నడిచే వైద్య కళాశాలల్లో 15 శాతం ఎంబీబీఎస్ సీట్లు ఆలిండియా కోటాకు కేటాయిస్తారు. పీపీపీకి ఇస్తున్న 10 వైద్య కళాశాలల్లో ఆల్ ఇండియా కోటా ఉండబోదని రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే స్పష్టం చేసింది. అంటే ఈ కళాశాలలు వంద శాతం ప్రైవేట్ వ్యక్తుల అజమాయిషీలోనే నడుస్తాయనే విషయాన్ని ప్రభుత్వం చెప్పకనే చెబుతోంది. ఆల్ ఇండియా కోటా ఎత్తేయడం వల్ల మన విద్యార్థులు ఒక్కో కళాశాలలో 11 చొప్పున కన్వీనర్ కోటా సీట్లను నష్టపోనున్నారు. ఒక్కో వైద్య కళాశాలలో 150 చొప్పున ఎంబీబీఎస్ సీట్లు ఉంటాయి. వీటిలో 15 శాతం అంటే 22 సీట్లు ఆలిండియా కోటాకు, మిగిలిన 128 సీట్లలో సగం (64) రాష్ట్ర స్థాయిలో కన్వీనర్ కోటాకు, 45 సెల్ఫ్ ఫైనాన్స్, 19 ఎన్ఆర్ఐ కోటా కింద భర్తీ చేయాల్సి ఉంటుంది. ఈ లెక్కన పరిశీలిస్తే ఆలిండియా, రాష్ట్ర కన్వీనర్ కోటా కలిపి 86 సీట్లు ప్రభుత్వ కోటా కిందకు వస్తాయి. ఈ సీట్లకు రూ.15 వేలు మాత్రమే ఫీజు ఉంటుంది. ఆలిండియా కోటా రద్దుచేసి ప్రైవేట్ వైద్య కళాశాలల తరహాలో 150 సీట్లలో సగం కన్వీనర్ కోటాకు, మిగిలిన సగం యాజమాన్య కోటా (బీ, సీ) కింద భర్తీ అవుతాయని ప్రభుత్వం ఇప్పటికే స్పష్టం చేసింది. అంటే ప్రస్తుత విధానంలో ప్రభుత్వ కోటా కింద 86 సీట్లు కొత్త వైద్య కళాశాలల్లో అందుబాటులో ఉండగా.. వాటిని ప్రైవేట్‌కు కట్టబెట్టడం వల్ల ఒక్కో కళాశాలలో 11 సీట్లకు గండి పడనుంది. 8 బీ కేటగిరీకి, మూడు ఎన్ఆర్ఐ కోటా కిందకు వెళతాయి. తద్వారా ఏడాదికి బీ కేటగిరి సీటుకు రూ.13.20 లక్షలు, సీ కేటగిరి సీటుకు రూ.39.60 లక్షలు చొప్పున ప్రైవేట్ వ్యక్తులకు ఆదాయం సమకూరనుంది. ఈ లెక్కన 10 వైద్య కళాశాలల్లో 110 సీట్లు యాజమాన్య కోటాకు మళ్లించి ఏడాదికి బీ కేటగిరి సీట్ల రూపంలో రూ.10.56 కోట్లు, సీ కేటగిరి సీట్ల రూపంలో రూ.11.88 కోట్ల చొప్పున విద్యార్థుల నుంచి ప్రైవేట్ వ్యక్తులు ముక్కుపిండి వసూలు చేసుకోవడానికి లైసెన్స్ ఇచ్చేస్తున్నారు.

విద్యార్థులకు తీరని ద్రోహం

ఇతర రాష్ట్రాలు, దేశాల్లో ఎంబీబీఎస్ చదివేవారు మెడికల్ పీజీ కోర్సులు చదవాలంటే.. అడ్మిషన్ల సమయంలో స్థానికేతరులుగా మారిపోతున్నారు. ఈ నేపథ్యంలో కొన్నేళ్లుగా విద్యార్థులు, తల్లిదండ్రుల ఆలోచన ధోరణిలో మార్పు వస్తోంది. ఢిల్లీ ఎయిమ్స్, ఇతర ప్రతిష్టాత్మక సంస్థల్లో సీట్లు వస్తే తప్ప.. మిగిలిన సందర్భాల్లో ఇతర రాష్ట్రాల్లో ఎంబీబీఎస్ చదవడానికి ఇష్టపడటం లేదు. నీట్ యూజీలో టాప్ స్కోర్ సాధించిన విద్యార్థులు ఆలిండియా కోటా కింద రాష్ట్ర కళాశాలల్లోనే చేరుతున్నారు. ఈ పోకడ రానురాను ఇంకా పెరగనుంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం వైద్య కళాశాలలను ప్రైవేటీకరిస్తూ విద్యార్థులపై ఫీజుల భారం మోపుతుండటమే కాకుండా.. ఏకంగా 110 సీట్లను యాజమాన్య కోటాకు మళ్లించడంపై విద్యార్థి లోకం మండిపడుతోంది.

నేషనల్ మెడికల్ కమిషన్ సాక్షిగా ప్రభుత్వ తప్పుడు ప్రచారం బట్టబయలు

చంద్రబాబు తీరుపై సీదిరి అప్పలరాజు మండిపాటు



శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) ప్రకటన సాక్షిగా కూటమి ప్రభుత్వం తప్పుడు ప్రచారం బట్టబయలైందని వైఎస్సార్‌సీపీ నేత, మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. శ్రీకాకుళంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆదివారం మీడియాతో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో కొత్తగా నిర్మించిన ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో 60 పీజీ సీట్లను కేటాయించామని ఎన్ఎంసీ ప్రకటించడంతో చంద్రబాబుది అంతా విష ప్రచారమేనని తేలిపోయిందన్నారు. వైఎస్ జగన్ హయాంలో మెడికల్ కాలేజీలే కట్టలేదంటూ మంత్రులు దుష్ప్రచారం చేశారని, ఇప్పుడు ఎన్ఎంసీ ప్రకటనపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అప్పలరాజు ఇంకా ఏమన్నారంటే.. 'ఒకవైపు నకిలీ మద్యం, మరోవైపు మెడికల్ కాలేజీలపై రాష్ట్రవ్యాప్తంగా చర్చ జరుగుతోంది. వీటిపై డైవర్షన్ కోసమే రాష్ట్రానికి గూగుల్ తీసుకువచ్చామంటూ ప్రభుత్వం ప్రకటనలు గుప్పిస్తోంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో 17 మెడికల్ కాలేజీలు మంజూరయ్యాయి. వాటిలో 7 మెడికల్ కాలేజీలు పూర్తి చేయగా.. 5 కాలేజీల్లో తరగతులు కూడా ప్రారంభమయ్యాయి. మరో రెండు కాలేజీల్లో పనులు పూర్తయ్యాయన్న సంగతి ప్రజలందరికీ తెలుసు. భవనాల నిర్మాణాలే పూర్తికాలేదన్న మంత్రుల తప్పుడు ప్రచారాన్ని ప్రజలు పూర్తిగా అర్థం చేసుకున్నారు. అలాంటప్పుడు రాజమండ్రి, నంద్యాలలో 16 చొప్పున పీజీ మెడికల్ సీట్లు, విజయనగరం, మచిలీపట్నంలో 12 పోస్టు గ్రాడ్యుయేట్ సీట్లు చొప్పున, ఏలూరులో 4 సీట్లు ఇలా మొత్తం 60 పీజీ సీట్లు ఎలా వచ్చాయని కూటమి ప్రభుత్వాన్ని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీలు చూస్తే వైఎస్ జగనే గుర్తుకు వస్తారు. అలా రాకూడదనే అక్కసుతోనే కూటమి ప్రభుత్వం వీటిని ప్రైవేటుకు కట్టబెట్టాలని చూస్తోంది. గూగుల్ డేటా సెంటర్ విషయానికి వస్తే, రూ.22 వేల కోట్లు పైచిలుకు రాయితీల రూపంలో ఇస్తున్నారు. ఇక్కడ రాష్ట్రానికి రెవెన్యూ ఎలా పెరుగుతుంది. ఏపీ రీ–ఆర్గనైజేషన్ యాక్ట్‌లో పేర్కొన్న మేరకు రాష్ట్రంలో పెట్రో కెమికల్ అండ్ రిఫైనరీ కాంప్లెక్స్ ఏర్పాటు చేసే దిశగా బాబు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. ప్రైవేటు రియల్ ఎస్టేట్ కంపెనీలకు ఉచితంగా భూములు కట్టబెడుతుండడం దారుణం. వైఎస్ జగన్ హయాంలో రాష్ట్రం పురోగతి బాటన పయనించింది. ఇన్ఫోసిస్ వంటి సంస్థలన్నీ వైఎస్ జగన్ హయాంలోనే వచ్చాయి. అదానీ టెక్ పార్క్, భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం వైఎస్ జగన్ తీసుకువచ్చారు. వైజాగ్‌కు కూటమి ప్రభుత్వం చేసిందేమీ లేదు. రాష్ట్రమంతా నకిలీ మద్యం ఏరులై పారుతోంది. అయినా ఎల్లో మీడియా ప్రభుత్వానికి మద్దతిస్తూ వార్తలు రాయడం రాష్ట్రానికి పట్టిన దురదృష్టకర అంశం' అన్నారు.

యథేచ్ఛగా పచ్చ నేతల ఆక్రమణలు

- నంద్యాల జిల్లా ఆలమూరులో ప్రభుత్వ స్థలం ఆక్రమించి రహదారి మూసివేత
- అదేమని అడిగిన వారిపై టీడీపీ వర్గీయుల దౌర్జన్యం



ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి నిర్మిస్తున్న ఇల్లు

రుద్రవరం: కూటమి ప్రభుత్వంలో టీడీపీ వర్గీయుల దౌర్జన్యాలకు అడ్డూఅదుపు లేకుండాపోతోంది. పది మంది నడిచే దారులు, ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలాలను యథేచ్ఛగా ఆక్రమిస్తున్నారు. అడ్డొచ్చిన వారిపై దాడులకు తెగబడుతున్నారు. చుట్టుపక్క గ్రామాల నుంచి టీడీపీ నాయకులను పిలిపించుకొని తమ బలగాన్ని చూపించి భయాందోళనకు గురిచేస్తున్నారు. నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ నియోజకవర్గం రుద్రవరం మండలం ఆలమూరులో ప్రజలు భయంభయంగా జీవనంగా సాగిస్తున్నారు. గ్రామంలోని కప్పలగుంత కాలనీలో బనగాని వెంకటయ్య అనే వ్యక్తి మరో వ్యక్తి నుంచి కొంత స్థలం కొనుగోలు చేశారు. ఆ స్థలం పక్కన ప్రభుత్వ బయలు స్థలం, తూర్పు పడమర రాక పోకలకు దారి అని స్టాంప్ కాగితాలపై రాసుకున్నారు. ప్రస్తుతం ఆయన వారసులు, టీడీపీ వర్గీయులు ఆ స్థలంలో గృహ నిర్మాణాలు చేపట్టారు. అయితే వారు కొనుగోలు చేసిన స్థలమే కాకుండా చుట్టుపక్కల ఉన్న ప్రభుత్వ స్థలం, దారికి కేటాయించిన స్థలాన్ని కబ్జా చేసి అడ్డుగోడ నిర్మించారు. ఇదేమని అడిగిన కాలనీ వాసులపై దౌర్జన్యానికి దిగారు. వారికి తోడుగా కడప జిల్లా ప్రొద్దుటూరు, దొర్నిపాడు మండలం చాకరాజు వేముల నుంచి పలు వాహనాల్లో టీడీపీ నాయకులు ఇనుప రాడ్లను తీసుకొని ఆలమూరుకు వచ్చారు. దీంతో గ్రామంలో భయానక వాతావరణం నెలకొంది. పలువురు గ్రామస్తులు ఆక్రమణలు, అక్రమ కట్టడాలను నిలిపివేయాలని ఆధారాలతో రుద్రవరం పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు.

వైరల్ ఇన్ఫెక్షన్ సోకిన చిన్నారులకు మెరుగైన వైద్యం

- ఇద్దరు పిల్లలు విజయవాడ జీజీహెచ్‌కు తరలింపు
- పెనుగంచిప్రోలులో ప్రత్యేక వైద్య శిబిరం



వైరల్ ఇన్ఫెక్షన్ వివరాలు తెలుసుకుంటున్న వైద్యులు

సాక్షి ఎఫెక్ట్..

పెనుగంచిప్రోలు(జగ్గయ్యపేట): ఎన్టీఆర్ జిల్లా పెనుగంచిప్రోలు గ్రామంలో వైరల్ ఇన్ఫెక్షన్ సోకిన ఇద్దరు చిన్నారులకు మెరుగైన వైద్యం అందించేందుకు ఆదివారం విజయవాడ ప్రభుత్వాస్పత్రి (జీజీహెచ్)కి తరలించారు. 'చిన్నారుకు వైరల్ ఇన్ఫెక్షన్' శీర్షికన 'సాక్షి' పత్రికలో ఆదివారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి(డీఎంహెచ్‌వో) డాక్టర్ మాచర్ల సుహాసిని ఉదయాన్నే గ్రామానికి చేరుకుని ఇన్ఫెక్షన్‌తో కాళ్లు, చేతులపై బొబ్బలు వచ్చిన పిల్లల ఇళ్లకు వెళ్లి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ... గ్రామంలోని ఓ ఇంట్లో నాలుగేళ్ల వయసు గల ఒక పాపకు, పది నెలల వయసు గల మరో పాపకు ఇన్ఫెక్షన్ వచ్చి శరీరంపై బొబ్బలు వచ్చాయని తెలిపారు. నాలుగేళ్ల వయసు గల పాపకు ఇన్ఫెక్షన్ తగ్గుముఖం పట్టిందని, పది నెలల పాప శరీరంపై ర్యాషెస్‌లా వచ్చాయని వివరించారు. చిన్నారులను విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో పిల్లల వైద్య నిపుణులు వద్దకు పంపించామని చెప్పారు. అక్కడి వైద్యులు పరీక్షలు చేసి వ్యాధి నిర్ధారణ చేసి చికిత్స అందిస్తారని తెలిపారు. గ్రామంలో ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేశామని, ఇంటింటి సర్వే నిర్వహించి వివరాలు సేకరించాలని సిబ్బందిని ఆదేశించామని చెప్పారు.

వేటగాళ్ల ఉచ్చుకు ఫారెస్ట్ ప్రొటెక్షన్ వాచర్ బలి

- మరో నలుగురికి తప్పిన ప్రమాదం
- వన్యప్రాణుల కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ తీగతో దుర్ఘటన



లక్ష్మణ్‌నాయక్ (ఫైల్)

పాములపాడు: వన్యప్రాణుల కోసం వేటగాళ్లు ఏర్పాటు చేసిన విద్యుత్ తీగ ఉచ్చుకు తగిలి ఫారెస్ట్ ప్రొటెక్షన్ వాచర్ మృతి చెందగా.. మరో నలుగురు ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. ఈ దుర్ఘటన నంద్యాల మండలం పాములపాడు మండలం బానకచెర్ల గ్రామ సమీపంలోని అడవిలో ఆదివారం జరిగింది. అటవీ అధికారుల కథనం మేరకు.. ఈ నెల 18న రాత్రి ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, ప్రొటెక్షన్ వాచర్లు రాముడు, రాంభూపాల్, విజయ్‌కుమార్, అరుణ్‌కుమార్, లక్ష్మణ్‌నాయక్ విధుల్లో భాగంగా వాహనంలో బయల్దేరారు. రోడ్డు పక్కన అడవిలో చెట్ల పక్కన ఒక ద్విచక్ర వాహనం కనిపించడంతో అనుమానం వచ్చి అడవిలోకి వెళ్లి చూశారు. దారిలో వేటగాళ్లు ఏర్పాటు చేసిన విద్యుత్ తీగ ఉచ్చు తగలి ప్రొటెక్షన్ వాచర్ లక్ష్మణ్‌నాయక్ (54) కిందపడ్డాడు. మిగతా వారు వస్తుండగా 'విద్యుత్ ఉంది.. రావొద్దు' అంటూ కేక వేసి కుప్పకూలిపోయాడు. అప్పటికే ఇద్దరికి స్వల్పంగా తీగ తగిలింది. లక్ష్మణ్‌నాయక్‌ను వెంటనే ఆత్మకూరు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

వాహనంపై టీడీపీ ఎంపీ శబరి ఫొటో స్టిక్కర్

ఘటనా స్థలంలో లభించిన ద్విచక్ర వాహనం నంద్యాల జిల్లా మిడుతూరు మండలం తలముడిపికి చెందిన వెంకటేశ్వర్లు అనే వ్యక్తికి చెందినదిగా పోలీసులు గుర్తించారు. వాహనంపై టీడీపీ ఎంపీ బైరెడ్డి శబరి, మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖరరెడ్డి ఫొటోతో కూడిన స్టిక్కర్ అతికించి ఉంది. ఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు, అటవీ అధికారులు వేటగాళ్లు ఏర్పాటు చేసిన తీగను స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తాడిపత్రిలో జేసీ గూండాగిరి

- వైఎస్సార్‌సీపీ నాయకుడిపై అనుచరులతో దాడి చేయించిన టీడీపీ నేత
- పోలీసులపై నమ్మకం లేదంటూ కేసు పెట్టేందుకు నిరాకరించిన బాధితుడు



పోలీసులకు దాడి వివరాలు చెబుతున్న బాధితుడు నాగేశ్వరరెడ్డి

తాడిపత్రి టౌన్: అనంతపురం జిల్లా తాడిపత్రి పట్టణంలో టీడీపీ నేత, మునిసిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి మరోసారి వీరంగం సృష్టించారు. పట్టపగలు అందరూ చూస్తుండగా.. వైఎస్సార్‌సీపీ నాయకుడిపై తన అనుచరులతో దాడి చేయించి తీవ్రంగా గాయపరిచారు. బాధితుడు తెలిపిన వివరాలు.. వైఎస్సార్‌సీపీ నాయకుడు యర్రగుంటపల్లి నాగేశ్వరరెడ్డి ఆదివారం తాడిపత్రిలోని ఆనంద్ భవన్ హోటల్ వద్ద టీ తాగుతుండగా.. వాహనంలో అటుగా వెళ్తున్న జేసీ ప్రభాకర్‌రెడ్డి చూశారు. ఆ వెంటనే 'వీణ్ని ఎందుకురా ఇంత వరకు వదిలేశారు' అంటూ అనుచరులను రెచ్చగొట్టారు. దీంతో రవీంద్రారెడ్డి, యాసిన్, బద్రీ, విష్ణు, శేఖర్‌తో పాటు సుమారు పది మంది జేసీ అనుచరులు ఇనుప రాడ్లతో నాగేశ్వరరెడ్డిపైకి దూసుకెళ్లారు. వారి నుంచి తప్పించుకునేందుకు ప్రయత్నించిన నాగేశ్వరరెడ్డిని.. రోడ్డుపై వెంబడిస్తూ దాడి చేశారు. సమీపంలో వైఎస్సార్‌సీపీ నాయకురాలు పేరం స్వర్ణలత ఇల్లు కనిపించడంతో.. నాగేశ్వరరెడ్డి అందులోకి పరుగెత్తుకెళ్లి తలదాచుకున్నాడు. జేసీ అనుచరులు అక్కడి నుంచి వెళ్లిపోగానే.. పేరం అమరనాథ్‌రెడ్డి స్థానికులతో కలిసి బాధితుడిని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించారు. విషయం తెలుసుకున్న పోలీసులు.. ఆస్పత్రి వద్దకు చేరుకుని దాడి వివరాలను ఆరా తీశారు. జేసీ ప్రభాకర్‌రెడ్డిపై పోలీసులు చర్యలు తీసుకుంటారన్న నమ్మకం తనకు లేదంటూ.. కేసు పెట్టడానికి బాధితుడు నిరాకరించారు. కాగా, నాగేశ్వరరెడ్డిని వైఎస్సార్‌సీపీ మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఫోన్‌లో పరామర్శించారు.

కష్టపడకుండా పనిచేస్తే చాలు: సీఎం

భవానీపురం (విజయవాడ పశ్చిమ)/గాంధీనగర్ (విజయవాడ సెంట్రల్): వారానికి ఐదు రోజులపాటు కష్టపడకుండా స్మార్ట్‌గా పనిచేస్తే చాలని, మిగిలిన రెండు రోజులు కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా గడపాచ్చని సీఎం చంద్రబాబు అన్నారు. సొసైటీ ఫర్ వైబ్రెంట్ విజయవాడ ఆధ్వర్యంలో భవానీపురం పున్నమి ఘాట్‌లో ఆదివారం సాయంత్రం నిర్వహించిన దీపోత్సవంలో సతీమణి భువనేశ్వరితో కలిసి చంద్రబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. ఏఐ, గూగుల్ డేటాను ఉపయోగించుకునేందుకు అనేక సంస్థలు ముందుకొస్తున్నాయని చెప్పారు. సూపర్ జీఎస్టీ.. సూపర్ సేవింగ్స్ పేరుతో పున్నమి ఘాట్‌లో ఏర్పాటు చేసిన స్టాల్స్‌కు అవార్డులు అందజేశారు. అనంతరం ఫైర్ క్రాకర్స్‌ను బటన్ నొక్కి లాంచ్ చేశారు. అనంతరం బీసెంట్ రోడ్డులోని వ్యాపారులు, చిరు వ్యాపారులతో సూపర్ జీఎస్టీ–సూపర్ సేవింగ్స్‌లో భాగంగా చంద్రబాబు మాటామంతీ నిర్వహించారు. పలువురు చిరు, వీధి వ్యాపారులు, జనరల్ స్టోర్, చెప్పుల షాపు నిర్వాహకులతో మాట్లాడారు.

190 కిలో మీటర్లు.. రూ.24,790 కోట్లు

- అమరావతి ఓఆర్ఆర్ కోసం డీపీఆర్
- 190 కిలో మీటర్లు 140 మీటర్ల వెడల్పుతో నిర్మాణానికి ప్రణాళిక

సాక్షి, అమరావతి: హైదరాబాద్ అవుటర్ రింగ్ రోడ్డు(ఓఆర్ఆర్) కంటే పెద్దగా అమరావతి ఓఆర్ఆర్ నిర్మించాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. ఇందుకోసం 190 కి.మీ.మేర 140 మీటర్ల వెడల్పులో భూసేకరణకు సిద్ధమవుతోంది. రాష్ట్ర ప్రభుత్వ ప్రణాళిక మేరకు అమరావతి ఓఆర్ఆర్ నిర్మాణం కోసం నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా(ఎన్‌హెచ్ఏఐ) సమగ్ర ప్రాజెక్టు నివేదిక(డీపీఆర్)ను ఢిల్లీలోని ఎన్‌హెచ్ఏఐ ప్రధాన కార్యాలయానికి సమర్పించింది. మొత్తం 190 కి.మీ. మేర నిర్మించాలని ప్రతిపాదించిన ఈ ప్రాజెక్టుకు రూ.24,790 కోట్ల అంచనా వ్యయంతో డీపీఆర్‌ను అందజేసింది.

అమరావతి ఓఆర్ఆర్ డీపీఆర్‌లో ప్రధాన అంశాలు ఇవీ...

- హైదరాబాద్ ఓఆర్ఆర్ పొడవు 158 కి.మీ. కాగా, అమరావతి ఓఆర్ఆర్‌ను 190 కి.మీ. మేర నిర్మించాలని నిర్ణయించారు. ఆరు లేన్లుగా ఓఆర్ఆర్‌ను నిర్మిస్తారు. అందుకోసం అమరావతిలో 190 కి.మీ. పొడవునా 140 మీటర్ల వెడల్పుతో భూసేకరణ చేస్తారు. భూసేకరణ వ్యయంలో రూ.వెయ్యి కోట్లను రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుంది.
- ఓఆర్ఆర్‌లో భాగంగా కృష్ణా నదిపై రెండు వంతెనలు నిర్మిస్తారు. ముప్పలూరు వద్ద 3.15 కి.మీ. మేర మొదటి వంతెన, మున్నంగి వద్ద 4.8 కి.మీ. మేర రెండో వంతెన నిర్మించాలని నిర్ణయించారు. గంగినేనిపాలెం అటవీప్రాంతంలో రెండు టన్నెళ్లు నిర్మించాలని ప్రతిపాదించారు. మొదటి టన్నెల్ 1.64 కి.మీ., రెండో టన్నెల్ 2.68 కి.మీ. మేర నిర్మిస్తారు. ఇందుకోసం పర్యావరణ అనుమతులు తీసుకోవాల్సి ఉంది.
- అమరావతి ప్రాంతాన్ని ఓఆర్ఆర్‌తో అనుసంధానిస్తూ రెండు స్పర్ రోడ్లు నిర్మిస్తారు. తెనాలి నుంచి కాజ టోల్ ప్లాజా వరకు 17.5 కి.మీ. మేర మొదటి స్పర్ రోడ్డు, నారా కోడూరు నుంచి గుంటూరు శివారులోని బుడంపాడు వరకు 5.20 కి.మీ. మేర రెండో స్పర్ రోడ్డు నిర్మిస్తారు.
- అమరావతి ఓఆర్ఆర్ కోసం రూ.24,790 కోట్ల వ్యయం అవుతుందని అంచనా వేశారు. అందులో రాష్ట్ర ప్రభుత్వం రూ.3,117 కోట్లు భరించనుంది. ప్రాజెక్టును 12 ప్యాకేజీలుగా పనులు చేపట్టాలని ప్రతిపాదించారు.

రాజ్‌భవన్ డిజైనర్ హఫీజ్ కాంట్రాక్టర్

- కన్సల్టెన్సీ ఫీజు రూ.8.40 కోట్లు
- 2017లో అసెంబ్లీ, హైకోర్టు, సచివాలయ డిజైన్ బాధ్యతలు ఫోస్టర్ పార్టనర్స్–హఫీజ్ కాంట్రాక్టర్‌కు అప్పగింత
- అప్పట్లో ఆ సంస్థకు రూ.67 కోట్ల మేర చెల్లింపు

సాక్షి, అమరావతి: రాజధాని అమరావతిలో రాజ్‌భవన్ (గవర్నర్ నివాసం, క్యాంపు కార్యాలయం) కోసం సమగ్ర నిర్మాణ పర్యవేక్షణకు (సైట్ ప్లానింగ్, ఆర్కిటెక్చర్, ఇంటీరియర్స్, ల్యాండ్ స్కేప్, ప్రాథమిక సర్వే తదితరాలు) కన్సల్టెంట్‌గా హఫీజ్ కాంట్రాక్టర్‌ను ప్రభుత్వం నియమించింది. ఇందుకు ఆసక్తి వ్యక్తీకరణ ప్రతిపాదన (ఆర్ఎఫ్‌పీ) రూపంలో ఆగస్టు 5న సీఆర్‌డీఏ (రాజధాని ప్రాంత అభివృద్ధి సంస్థ) టెండర్ నోటిఫికేషన్ జారీచేసింది. రూ.8.40 కోట్లకు కన్సల్టెన్సీగా పనిచేసేందుకు ముందుకొచ్చిన ఆర్కిటెక్టు హఫీజ్ కాంట్రాక్టర్‌కు ఆ బాధ్యతలు అప్పగించింది. అమరావతి గవర్నమెంట్ కాంప్లెక్స్ (ఏజీసీ)లో హైకోర్టు, అసెంబ్లీ, సచివాలయ భవనాల నిర్మాణానికి డిజైన్లు రూపొందించడానికి 2017లో సీఆర్‌డీఏ ఆర్ఎఫ్‌పీ జారీచేసింది. జపాన్‌కు చెందిన మకీ అసోసియేట్స్ సంస్థ తక్కువ ధరకు కోట్‌చేసి డిజైన్లు రూపొందించడానికి ముందుకొచ్చింది. ఏజీసీ డిజైన్ బాధ్యతలు అప్పగించాలంటే హఫీజ్ కాంట్రాక్టర్‌ను భాగస్వామిగా చేసుకోవాలని ఏపీ ప్రభుత్వ అధికారులు తమపై ఒత్తిడి తెచ్చినట్లు మకీ అసోసియేట్స్ చైర్మన్ ఫుమిహికో మకీ అప్పట్లో బయటపెట్టారు. హఫీజ్ కాంట్రాక్టర్‌ను భాగస్వామిగా చేసుకోవడానికి నిరాకరించినందుకే తమను డిజైనర్‌గా ఎంపిక చేయలేదని అప్పట్లో మకీ చెప్పడం సంచలనం రేపింది. ఆ తర్వాత యూకే (యునైటెడ్ కింగ్‌డమ్) రాజధాని లండన్ కేంద్రంగా పనిచేసే ఫోస్టర్ పార్టనర్స్ సంస్థను ఏజీసీ డిజైనర్‌గా సీఆర్‌డీఏ ఎంపిక చేసింది. ఏజీసీ డిజైన్ల తయారీలో ఫోస్టర్ పార్టనర్స్‌లో హఫీజ్ కాంట్రాక్టర్‌ను భాగస్వామిగా చేర్చుకోవడాన్ని బట్టి చూస్తే.. మకీ అసోసియేట్స్ చైర్మన్ చెప్పింది అక్షరసత్యమన్నది స్పష్టమవుతోంది. ఏజీసీ డిజైన్లు రూపొందించిన ఫోస్టర్ పార్టనర్స్–హఫీజ్ కాంట్రాక్టర్‌కు అప్పట్లో కన్సల్టెన్సీ ఫీజు కింద రూ.67 కోట్ల మేర చెల్లించారు. హఫీజ్ కాంట్రాక్టర్‌ను భాగస్వామిగా చేర్చుకోవాలని ఏపీ ప్రభుత్వ అధికారులు పట్టుబట్టడం వెనుక కారణాలు ఏమై ఉంటాయన్నది బహిరంగ రహస్యమే.



ప్రపంచ జూనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో తన్వీ శర్మకు రజతం

భారత యువ షట్లర్ తన్వీ శర్మ ప్రపంచ జూనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో రజత పతకం కైవసం చేసుకుంది. గువాహటిలో జరిగిన టోర్నీ మహిళల సింగిల్స్ ఫైనల్లో తన్వీ పరాజయం పాలైంది. ఆదివారం జరిగిన తుదిపోరులో టాప్ సీడ్ తన్వీ శర్మ 7-15, 12-15తో రెండో సీడ్ అన్యాపత్ ఫిచిత్‌ఫోన్ (థాయ్‌లాండ్) చేతిలో ఓడింది. ఈ మెగా ఈవెంట్ చరిత్రలో మహిళల సింగిల్స్‌లో భారత్ నుంచి అపర్ణ పోపట్ (1996లో రజతం), సైనా నెహ్వాల్ (2006లో రజతం, 2008లో స్వర్ణం) మాత్రమే పతకాలు గెలిచారు. మళ్లీ ఇప్పుడు 17 ఏళ్ల తర్వాత తన్వీ శర్మ ఆ జాబితాలో చోటు దక్కించుకుంది. మ్యాచ్ ఆరంభం నుంచే తన్వీ లయ కోల్పోయింది. 'చాలా తప్పులు చేశా. మ్యాచ్ ప్రారంభం నుంచే తడబడ్డా. తొలి గేమ్ తర్వాత తేరుకొని... రెండో గేమ్‌లో గట్టి పోటీ ఇచ్చేందుకు ప్రయత్నించా. 8-5తో ఆధిక్యంలో ఉన్న సమయంలో చేసిన తప్పిదంతో థాయ్ షట్లర్‌కు పట్టుబిగించే అవకాశం దక్కింది. ప్రత్యర్థి నా ఆటతీరును సులువుగా పట్టేసింది' అని తన్వీ పేర్కొంది.



వాన... వైఫల్యం... పరాజయం

టాప్-4 ఘోర వైఫల్యం ● తొలి వన్డేలో ఓడిన టీమిండియా
7 వికెట్ల తేడాతో ఆసీస్ గెలుపు ● 23న రెండో వన్డే







విసుగుతెప్పించిన వాన... టాప్-4 బ్యాటర్ల వైఫల్యం... జోరు లేని స్కోరు... వెరసి టీమిండియా కంగారు-కంగారు! శుబ్‌మన్ గిల్ సారథ్యం, ఆస్ట్రేలియా పర్యటన పరాజయంతో మొదలైంది. పెర్త్‌లో ఆసీస్ ఆటగాళ్ల కంటే కూడా వాతావరణమే ప్రత్యర్థిగా ఎదురుపడింది. దీనికి పిచ్ కూడా జతయ్యింది. భారత్ ఇన్నింగ్స్‌ను సాగనీకుండా, అలా అని ఆట జరగనీకుండా, ఆపుతూ... ఆట మొదలవగానే అడ్డుపడుతూ... వాన అదేపనిగా భారత ఆటగాళ్ల బ్యాటింగ్ ధ్యాసను చెడగొట్టడంతో గిల్ సేన ఈ మ్యాచ్‌లో ఓడిపోయింది.

పెర్త్: పదేపదే వాన... పరుగులు చేయలేక భారత్ పడిన హైరానా... చివరకు ఓటమిని తెచ్చిపెట్టింది. కొత్తగా వన్డే పగ్గాలు చేపట్టిన గిల్ సేన దిగాలుగా పర్యటనను ఆరంభించింది. ఆదివారం ఇక్కడ జరిగిన తొలి వన్డేలో టీమిండియా డక్‌వర్త్ లూయిస్ పద్ధతి ప్రకారం 7 వికెట్లతో ఆస్ట్రేలియా చేతిలో ఓడింది. మూడు మ్యాచ్‌ల సిరీస్ 0-1తో వెనుకబడింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత జట్టు సవరించిన 26 ఓవర్లలో 9 వికెట్లకు 136 పరుగులు చేసింది. రాహుల్ (38; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు), అక్షర్ (38 బంతుల్లో 31; 3 ఫోర్లు) మెరుగ్గా ఆడారంతే! ఈ మ్యాచ్ ద్వారా వన్డే అరంగేట్రం చేసిన ఆంధ్ర ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డి 11 బంతుల్లో 2 సిక్స్‌లతో 19 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. హాజల్‌వుడ్, ఓవెన్, కునెమన్ తలా 2 వికెట్లు తీశారు. అనంతరం ఆస్ట్రేలియా 21.1 ఓవర్లలో మూడే వికెట్లు కోల్పోయి 131 పరుగులు చేసి గెలిచింది. కెప్టెన్ మార్ష్ (46 నాటౌట్; 2 ఫోర్లు, 3 సిక్స్‌లు) రాణించాడు.

రో-కో... 8-0

అంతర్జాతీయ క్రికెట్‌లో ఇప్పుడు కేవలం వన్డే ఫార్మాట్‌కే పరిమితమైన భారత స్టార్లు రోహిత్ (8), కోహ్లి (0) ఈ మ్యాచ్‌లో విఫలమయ్యారు. ఆసీస్ గడ్డపై కోహ్లి తొలిసారి 'డక్ అవుట్'తో ఇన్నింగ్స్ కతప్పించింది. కొత్త కెప్టెన్ గిల్ (10), వైస్ కెప్టెన్ శ్రేయస్ (11)లు అవుటవడంతో భారత్ 45 పరుగులకే 4 ప్రధాన వికెట్లను కోల్పోయింది. రాహుల్, అక్షర్‌లు ఐదో వికెట్‌కు 39 పరుగులు జోడించారు. ఛేదనలో హెడ్ (8), షార్ట్ (8) తక్కువ స్కోరుకే అవుటైనా... మార్ష్, జోష్ ఫిలిప్ (29 బంతుల్లో 37; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు)తో మూడో వికెట్‌కు 55 పరుగులు జోడించడంతో విజయం సులువుగానే దక్కింది. మార్ష్‌తో పాటు, రెన్‌షా (21 నాటౌట్) అజేయంగా నిలిచాడు.



స్కోరు వివరాలు

భారత్ ఇన్నింగ్స్: రోహిత్ (సి) రెన్‌షా (బి) హాజల్‌వుడ్ 8; గిల్ (సి) ఫిలిప్ (బి) ఎలిస్ 10; కోహ్లి (సి) కనోలీ (బి) స్టార్క్ 0; శ్రేయస్ (సి) ఫిలిప్ (బి) హాజల్‌వుడ్ 11; అక్షర్ (సి) రెన్‌షా (బి) కునెమన్ 31; రాహుల్ (సి) రెన్‌షా (బి) ఓవెన్ 38; సుందర్ (బి) కునెమన్ 10; నితీశ్ రెడ్డి (నాటౌట్) 19; హర్షిత్ (సి) ఫిలిప్ (బి) ఓవెన్ 1; అర్ష్‌దీప్ (రనౌట్) 0; సిరాజ్ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 8; **మొత్తం (26 ఓవర్లలో 9 వికెట్లకు) 136. వికెట్ల పతనం:** 1-13, 2-21, 3-25, 4-45, 5-84, 6-115, 7-121, 8-123, 9-124. **బౌలింగ్:** స్టార్క్ 6-1-22-1, హాజల్‌వుడ్ 7-2-20-2, ఎలిస్ 5-1-29-1, ఓవెన్ 3-0-20-2, కునెమన్ 4-0-26-2, షార్ట్ 1-0-17-0. **ఆస్ట్రేలియా ఇన్నింగ్స్:** మార్ష్ (నాటౌట్) 46; హెడ్ (సి) హర్షిత్ (బి) అర్ష్‌దీప్ 8; షార్ట్ (సి) రోహిత్ (బి) అక్షర్ 8; ఫిలిప్ (సి) అర్ష్‌దీప్ (బి) సుందర్ 37; రెన్‌షా (నాటౌట్) 21; ఎక్స్‌ట్రాలు 11; **మొత్తం (21.1 ఓవర్లలో 3 వికెట్లకు) 131. వికెట్ల పతనం:** 1-10, 2-44, 3-99. **బౌలింగ్:** సిరాజ్ 4-1-21-0, అర్ష్‌దీప్ 5-0-31-1, హర్షిత్ రాణా 4-0-27-0, అక్షర్ 4-0-19-1, నితీశ్ రెడ్డి 2.1-0-16-0, వాషింగ్టన్ సుందర్ 2-0-14-1.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

4 పరుగులతో భారత మహిళల ఓటమి

● స్మృతి, హర్మన్, దీప్తిల ఫిఫ్టీలు వృథా
● శతక్కొట్టిన హీథర్‌నైట్

ఆశలు రేపి... ఆఖర్లో కూల్చారు!

లక్ష్యఛేదనలో 253/4 స్కోరు వద్ద భారత్ 30 బంతుల్లో 36 పరుగుల సమీకరణ మపుడు గెలుపే... భారత్‌వైపు తొంగి చూస్తోంది. కానీ తర్వాతి వరుస ఓవర్లలో హిట్టర్ రిచా ఘోష్, ఫిఫ్టీ చేసిన దీప్తిశర్మ అవుటవడంతోనే మహిళల జట్టు గెలుపునకు దూరమైంది. క్రీజులో ఉన్న అమన్‌జోత్, స్నేహ్‌రాణా సింగిల్స్‌కే పరిమితం కావడం... భారీ షాట్లు ఆడలేకపోవడంతో గెలుపు దారితప్పి ఓటమిబాట పట్టింది.



ఇండోర్: ఇక గెలుపు ఖాయమేలే... విజయానికి చేరువయ్యామని అనుకుంటుండగా ఊహించని ఫలితం భారత శిబిరాన్ని ముంచేసింది. విజయం ఆశలు రేపిన మహిళలు ఆఖరికొచ్చేసరికి తమవల్ల కాదంటూ చేతులెత్తేశారు. దీంతో గెలుపుదాకా వచ్చిన భారత్ 4 పరుగుల దూరంలో ఆగిపోయింది. ఇంగ్లండ్ అమ్మాయిల చేతిలో ఓడిపోయింది. ఐసీసీ మహిళల వన్డే ప్రపంచకప్‌లో భారత జట్టు వరుసగా మూడో మ్యాచ్‌లోనూ పరాజయం పాలైంది. ఆదివారం జరిగిన ఈ మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్ మహిళల జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 288 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' హీథర్‌నైట్ (91 బంతుల్లో 109; 15 ఫోర్లు, 1 సిక్స్) సెంచరీ సాధించింది. అమీ జోన్స్ (68 బంతుల్లో 56; 8 ఫోర్లు) అర్ధశతకం చేసింది. దీప్తిశర్మ (4/51) ప్రత్యర్థి బ్యాటింగ్‌కు దెబ్బతీయగా, శ్రీచరణి 2 వికెట్లు పడగొట్టింది. అనంతరం లక్ష్యఛేదనకు దిగిన భారత మహిళల జట్టు 50 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 284 పరుగులు చేసి ఓడింది. స్మృతి మంధానా (94 బంతుల్లో 88; 8 ఫోర్లు), కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (70 బంతుల్లో 70; 10 ఫోర్లు), దీప్తి శర్మ (57 బంతుల్లో 50; 5 ఫోర్లు)ల అర్ధశతకాల మోత బూడిదలో పోసిన పన్నీరైంది. ప్రత్యర్థి బౌలర్లలో నాట్ సీవర్ బ్రంట్ 2 వికెట్లు తీసింది.

కదంతొక్కిన హీథర్‌నైట్

ఓపెనర్ బ్యూమోంట్ (22) తక్కువ స్కోరుకే అవుటైనా... మరో ఓపెనర్ అమీ జోన్స్ ఫిఫ్టీతో, టాపార్డర్ బ్యాటర్ హీథర్‌నైట్ శతకంతో ఇంగ్లండ్ భారీ స్కోరుకు బాటలు వేశారు. కెప్టెన్ నాట్ సీవర్ బ్రంట్ (38; 4 ఫోర్లు), హీథర్‌నైట్ మూడో వికెట్‌కు 113 పరుగులు జోడించారు. దీప్తి శర్మ వరుస విరామాల్లో వికెట్లు తీసి ప్రత్యర్థి స్కోరు మరింత పెరగకుండా చేసింది. 289 పరుగుల లక్ష్యఛేదనలో ప్రతీక (6) వికెట్‌ను కోల్పోయినప్పటికీ స్మృతి, హర్లీన్ (24), కెప్టెన్ హర్మన్, దీప్తిల రాణింపుతో విజయంవైపు అడుగులు వేసింది. అయితే 234 స్కోరు వద్ద మంధాన అవుటవడం మ్యాచ్ ఫలితాన్నే మార్చింది. రిచా, దీప్తిలు అవుటవడంతో పరాజయం ఖాయమైంది.



స్కోరు వివరాలు

ఇంగ్లండ్ మహిళల ఇన్నింగ్స్: బ్యూమోంట్ (బి) దీప్తి 22; అమీ జోన్స్ (సి) మంధాన (బి) దీప్తి 56; హీథర్‌నైట్ (రనౌట్) 109; నాట్ సీవర్ (సి) హర్మన్‌ప్రీత్ (బి) శ్రీచరణి 38; సోఫియా (సి) దీప్తి (బి) శ్రీచరణి 15; ఎమా లంబ్ (సి) మంధాన (బి) దీప్తి 11; అలైస్ క్యాప్సీ (సి) హర్లీన్ (బి) దీప్తి 2; చార్లీ (నాటౌట్) 19; సోఫీ ఎకిల్‌స్టోన్ రనౌట్ 3; లిన్సే స్మిత్ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 13; **మొత్తం (50 ఓవర్లలో 8 వికెట్లకు) 288. వికెట్ల పతనం:** 1-73, 2-98, 3-211, 4-249, 5-254, 6-257, 7-276, 8-280. **బౌలింగ్:** రేణుక 8-0-37-0, క్రాంతి 8-0-46-0, స్నేహ్ రాణా 10-0-56-0, శ్రీచరణి 10-0-68-2, దీప్తిశర్మ 10-0-51-4, అమన్‌జోత్ 4-0-26-0.

భారత మహిళల ఇన్నింగ్స్: ప్రతీక (సి) అమీజోన్స్ (బి) లారెన్ బెల్ 6; స్మృతి (సి) క్యాప్సీ (బి) లిన్సే స్మిత్ 88; హర్లీన్ (ఎల్బీడబ్ల్యూ) (బి) చార్లీ 24; హర్మన్‌ప్రీత్ (సి) ఎమా లంబ్ (బి) నాట్ సీవర్ 70; దీప్తి (సి) సోఫియా (బి) ఎకిల్‌స్టోన్ 50; రిచా (సి) హీథర్‌నైట్ (బి) నాట్ సీవర్ 8; అమన్‌జోత్ (నాటౌట్) 18; స్నేహ్ రాణా (నాటౌట్) 10; ఎక్స్‌ట్రాలు 10; **మొత్తం (50 ఓవర్లలో 6 వికెట్లకు) 284. వికెట్ల పతనం:** 1-13, 2-42, 3-167, 4-234, 5-256, 6-262. **బౌలింగ్:** లారెన్ బెల్ 9-0-52-1, లిన్సే స్మిత్ 10-0-40-1, నాట్ సీవర్ 8-0-47-2, చార్లీ డీన్ 10-0-67-1, సోఫీ ఎకిల్‌స్టోన్ 10-0-58-1, అలైస్ క్యాప్సీ 3-0-20-0.

భవిత

స్పర్ధయా వర్ధతే విద్య

విద్య, ఉద్యోగ సమాచారం

ఓఎన్‌జీసీలో 2,623 అప్రెంటిస్‌లు

ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఓఎన్‌జీసీ).. వివిధ విభాగాల్లో ఐటీఐ, డిప్లొమా, గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌ల ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం ఖాళీల సంఖ్య:** 2,623.
» **సెక్టార్ల వారీగా ఖాళీలు:** నార్తర్న్ సెక్టార్-165, ముంబై సెక్టార్-569, వెస్టర్న్ సెక్టార్-856, ఈస్టర్న్ సెక్టార్-458, సౌతర్న్ సెక్టార్-322, సెంట్రల్ సెక్టార్-253.
» **విభాగాలు:** కంప్యూటర్ ఆపరేటర్ అండ్ ప్రోగ్రామింగ్ అసిస్టెంట్, ఎలక్ట్రీషియన్, ఎలక్ట్రానిక్స్ మెకానిక్, ఫిట్టర్, ఫైర్ సేఫ్టీ టెక్నీషియన్, ల్యాబ్ కెమిస్ట్, అనలిస్ట్, పెట్రోలియం ప్రొడక్ట్స్, డీజిల్ మెకానిక్, సెక్రటేరియల్ అసిస్టెంట్, అకౌంట్స్ ఎగ్జిక్యూటివ్, సివిల్ ఎగ్జిక్యూటివ్, పెట్రోలియం ఎగ్జిక్యూటివ్.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఐటీఐ, డిప్లొమా, డిగ్రీలో ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** 06.11.2025 నాటికి 18 నుంచి 24 ఏళ్లు ఉండాలి.
» **స్టైపెండ్:** నెలకు ఐటీఐ ట్రేడ్ అప్రెంటిస్‌కు రూ.9,600 నుంచి రూ.10,560, డిప్లొమా అప్రెంటిస్‌కు రూ.10,900, గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌కు రూ.12,300
» **ఎంపిక విధానం:** విద్యార్హతల్లో సాధించిన మెరిట్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 16.10.2025.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 06.11.2025.
» **వెబ్‌సైట్:** https://ongcindia.com

డీఆర్‌డీవో-ఎల్ఆర్‌డీఈ, బెంగళూరులో 105 అప్రెంటిస్‌లు

బెంగళూరులోని డీఆర్‌డీవో-ఎలక్ట్రానిక్స్ అండ్ రాడార్ డెవలప్‌మెంట్ ఎస్టాబ్లిష్‌మెంట్(ఎల్ఆర్‌డీఈ)లో గ్రాడ్యుయేట్, డిప్లొమా, ఐటీఐ అప్రెంటిస్‌ల ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం ఖాళీల సంఖ్య:** 105.
» **ఖాళీల వివరాలు:** గ్రాడ్యుయేట్ అప్రెంటిస్ (ఇంజనీరింగ్) -23, గ్రాడ్యుయేట్ అప్రెంటిస్(జనరల్)-25, డిప్లొమా(ఇంజనీరింగ్) అప్రెంటిస్ -27, ఐటీఐ అప్రెంటిస్-30.
» **విభాగాలు:** ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్, బీకాం, బీబీఏ, బీఎస్సీ, సివిల్ ఇంజనీరింగ్, మెకానికల్, ఆటోమొబైల్, కంప్యూటర్ ఆపరేటర్ అండ్ ప్రోగ్రామింగ్ అసిస్టెంట్, ఎలక్ట్రీషియన్, వెల్డర్, పెయింటర్, ఫోటోగ్రాఫర్, ఎలక్ట్రీషియన్ తదితరాలు.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగాలు /ట్రేడులు ఐటీఐ, డిప్లొమా, గ్రాడ్యుయేట్ ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** 18 ఏళ్లు నిండి ఉండాలి.
» **ఎంపిక విధానం:** షార్ట్‌లిస్టింగ్, విద్యార్హత మార్కులు, రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఇంటర్వ్యూ తేది:** 04.11.2025.
» **ఇంటర్వ్యూ వేదిక:** ఎలక్ట్రానిక్స్ అండ్ రాడార్ డెవలప్‌మెంట్ ఎస్టాబ్లిష్‌మెంట్, సీవీ రామన్ నగర్, బెంగళూరు.
» **వెబ్‌సైట్:** https://drdo.gov.in

బీఈఎల్, బెంగళూరులో 162 ఇంజనీరింగ్ అసిస్టెంట్ ట్రైనీ పోస్టులు

భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్(బీఈఎల్) బెంగళూరు యూనిట్‌లోని వివిధ విభాగాల్లో ఇంజనీరింగ్ అసిస్టెంట్, టెక్నీషియన్ సి పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 162.
» **పోస్టుల వివరాలు:** ఇంజనీరింగ్ అసిస్టెంట్ ట్రైనీ-80, టెక్నీషియన్ సి-82.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఇంటర్, ఐటీఐ, డిప్లొమాలో ఉత్తీర్ణులవ్వాలి.
» **వయసు:** 01.10.2025 నాటికి 18 నుంచి 28 ఏళ్లు ఉండాలి.
» **వేతనం:** నెలకు ఇంజనీరింగ్ అసిస్టెంట్ ట్రైనీకి రూ.24,500 నుంచి రూ.90,000, టెక్నీషియన్ -సి పోస్టులకు రూ.21,500 నుంచి 82,000.
» **ఎంపిక విధానం:** కంప్యూటర్ ఆధారిత పరీక్ష ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 04.11.2025.
» **వెబ్‌సైట్:** http://bel-india.in

ఎన్ఎస్‌యూటీ, న్యూఢిల్లీలో 176 ప్రొఫెసర్ పోస్టులు

న్యూఢిల్లీలోని నేతాజీ సుభాష్ యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీ (ఎన్ఎస్‌యూటీ) రెగ్యులర్ ప్రాతిపదికన వివిధ విభాగాల్లో ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 176.
» **పోస్టుల వివరాలు:** అసిస్టెంట్ ప్రొఫెసర్-126, అసోసియేట్ ప్రొఫెసర్-50.
» **విభాగాలు:** కంప్యూటర్ సైన్స్,ఇంజనీరింగ్/ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ(సీఎస్ఈ/ఐటీ), ఎలక్ట్రానిక్స్,కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ (ఈసీఈ), ఇన్‌స్ట్రుమెంటేషన్,కంట్రోల్ ఇంజనీరింగ్(ఐసీఈ), ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్(ఈఈ).
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి బీఈ/బీటెక్, బీఎస్, ఎంఈ/ఎంటెక్/ఎంఎస్, పీహెచ్‌డీలో ఉత్తీర్ణులవ్వాలి. దీనితో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.
» **వయసు:** 11.11.2025 నాటికి 35 నుంచి 50 ఏళ్లు మించకూడదు.
» **వేతనం:** నెలకు అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు రూ.57,700 నుంచి రూ.1,82,400, అసోసియేట్ ప్రొఫెసర్‌కు రూ.1,31,400 నుంచి రూ.2,17,100.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 11.11.2025.
» **ఆఫ్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 26.11.2025.
» **వెబ్‌సైట్:** https://www.nsut.ac.in

ఇండియన్ ఆర్మీలో 10+2 టెక్నికల్ ఎంట్రీ స్కీమ్-55 కోర్సులో ప్రవేశాలు

ఇండియన్ ఆర్మీ జూలై 2026లో ప్రారంభమయ్యే 10+2 టెక్నికల్ ఎంట్రీ స్కీమ్-55 కోర్సు శిక్షణలో ప్రవేశాలకు అవివాహిత పురుష అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం ఖాళీల సంఖ్య:** 90.
» **అర్హత:** గుర్తింపు పొందిన ఎడ్యుకేషన్ బోర్డు నుంచి కనీసం 60 శాతం మార్కులతో 10+2(ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథ్‌మేటిక్స్) లేదా దానికి సమానమైన పరీక్షతో పాటు జేఈఈ మెయిన్స్ -2025 స్కోర్ తప్పనిసరిగా ఉండాలి. నిర్దిష్ట శారీరక ప్రమాణాలు కలిగి ఉండాలి.
» **వయసు:** 01.07.2025 నాటికి 16.5 నుంచి 19.5 ఏళ్ల మధ్య ఉండాలి.
» **వేతనం:** మిలటరీ సర్వీస్ పే కింద స్టైపెండ్ నెలకు రూ.15,500. మూడేళ్ల శిక్షణ అనంతరం మూలవేతనం నెలకు రూ.56,100తో పాటు డీఏ, హెచ్ఆర్ఏ, ప్రోత్సాహకాలు ఉంటాయి.
» **ఎంపిక విధానం:** జేఈఈ(మెయిన్స్) స్కోరు, స్టేజ్-1, స్టేజ్-2 పరీక్షలు, ఇంటర్వ్యూ, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు. ఎంపికైన వారికి బీటెక్ కోర్సు, లెఫ్టినెంట్ ఉద్యోగాలకు ఉచిత శిక్షణ అందుతుంది.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 14.10.2025.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 13.11.2025.
» **వెబ్‌సైట్:** https://joinindianarmy.nic.in

బెల్‌లో ఇంజనీరింగ్ అసిస్టెంట్ ట్రైనీ, టెక్నీషియన్ పోస్టులు

భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్(బీఈఎల్) పంచకుల యూనిట్‌లోని వివిధ విభాగాల్లో ఇంజనీరింగ్ అసిస్టెంట్ ట్రైనీ, టెక్నీషియన్ సీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 15.
» **పోస్టుల వివరాలు:** ఇంజనీరింగ్ అసిస్టెంట్ ట్రైనీ-05, టెక్నీషియన్ సి-10.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఇంటర్, ఐటీఐ, డిప్లొమాలో ఉత్తీర్ణులవ్వాలి.
» **వయసు:** 01.10.2025 నాటికి 28 ఏళ్లు ఉండాలి.
» **వేతనం:** నెలకు ఇంజనీరింగ్ అసిస్టెంట్ ట్రైనీకి రూ.24,500 నుంచి రూ.90,000, టెక్నీషియన్ సి పోస్టులకు రూ.21,500 నుంచి రూ.82,000.
» **ఎంపిక విధానం:** కంప్యూటర్ ఆధారిత పరీక్ష ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 05.11.2025.
» **వెబ్‌సైట్:** https://bel-india.in

ఎయిమ్స్ న్యూఢిల్లీలో ప్రాజెక్ట్ టెక్నికల్ సపోర్ట్-3 పోస్టులు

న్యూఢిల్లీలోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(ఎయిమ్స్) ఒప్పంద ప్రాతిపదికన ప్రాజెక్ట్ టెక్నికల్ సపోర్ట్-3 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 01.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి డిగ్రీ, పీజీ(ప్రజా ఆరోగ్యం/సామాజిక సేవ/సామాజిక శాస్త్రం)లో ఉత్తీర్ణులవ్వాలి. దీనితో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.
» **వయసు:** 18 నుంచి 35 ఏళ్లు మించకూడదు.
» **వేతనం:** నెలకు రూ.28,000.
» **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 22.10.2025.
» **వెబ్‌సైట్:** www.aiims.edu/index.php/en/notices/recruitment/aiims-recruitment

త్రివిధ దళాలకు 'స్కూల్' బాట

» సైనిక్ స్కూల్ 2026-27 ప్రవేశాలకు నోటిఫికేషన్
» ఏఐఎస్ఎస్ఈఈ పరీక్షలో ప్రతిభ ఆధారంగా ఎంపిక
» ఆరు, తొమ్మిదో తరగతిలో ప్రవేశాలు

త్రివిధ దళాలలో పనిచేయాలనే ఆసక్తి ఉన్న విద్యార్థులకు చక్కటి అవకాశం స్వాగతం పలుకుతోంది. పాఠశాల స్థాయి నుంచే సాయుధ బలగాలకు అవసరమైన అధికారులను సిద్ధంచేసే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం సైనిక పాఠశాలను ఏర్పాటు చేసింది. ఈ సైనిక స్కూళ్లల్లో 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించి ఆరు, తొమ్మిది తరగతుల్లో ప్రవేశాలకు ఆలిండియా సైనిక్ స్కూల్స్ ఎంట్రన్స్ ఎగ్జామ్ (ఏఐఎస్ఎస్ఈఈ) నోటిఫికేషన్ విడుదలైంది. ఈ పరీక్షను ఎన్‌టీఏ నిర్వహిస్తుంది. ఈ నేపథ్యంలో.. సైనిక్ స్కూల్స్ ప్రవేశ పరీక్ష పూర్తి వివరాలు..



మొత్తం 33 సైనిక్ స్కూల్స్

ప్రస్తుతం దేశవ్యాప్తంగా 33 సైనిక్ స్కూల్స్ ఉన్నాయి. వీటితోపాటు పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్ విధానంలో మరికొన్ని(ఆరో తరగతికి 69 స్కూల్స్, తొమ్మిదో తరగతికి 19 స్కూళ్లకు) సైనిక్ స్కూల్స్ ఏర్పాటుకు కేంద్ర రక్షణ శాఖ అనుమతిచ్చింది. కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ పరిధిలోని స్వయం ప్రతిపత్తి కలిగిన సంస్థ సైనిక్ స్కూల్ సొసైటీ.. దేశవ్యాప్తంగా ఉన్న సైనిక్ స్కూల్స్‌ను పర్యవేక్షిస్తుంది. సైనిక్ స్కూల్స్‌లో ఇంగ్లిష్ మీడియంలో బోధన ఉంటుంది. వీటిని పూర్తిగా రెసిడెన్షియల్ విధానంలో నిర్వహిస్తున్నారు. ఇవి సీబీఎస్ఈ బోర్డ్‌కు అనుబంధంగా పనిచేస్తాయి. ఖడక్‌వాస్లా(పుణె)లోని నేషనల్ డిఫెన్స్ అకాడెమీ, ఎజిమలలాలోని ఇండియన్ నేవల్ అకాడెమీతోపాటు ఇతర శిక్షణ అకాడెమీలకు క్యాడెట్‌లను ఇక్కడ సిద్ధం చేస్తారు.

అర్హత

ఆరో తరగతికి దరఖాస్తు చేసుకొనే విద్యార్థులు 31.03.2026 నాటికి 10 నుంచి 12 ఏళ్ల మధ్య ఉండాలి. తొమ్మిదో తరగతిలో ప్రవేశాలకు 13 నుంచి 15 ఏళ్ల మధ్య ఉండాలి. ఎనిమిదో తరగతి పాసై ఉండాలి.

ఎంపిక విధానం

ప్రవేశ పరీక్ష ద్వారా ఎంపికచేస్తారు. రాత పరీక్షలో ప్రతిభ ఆధారంగా ప్రవేశం కల్పిస్తారు. బాలికలకు సైతం అడ్మిషన్ లభిస్తుంది. సీట్ల లభ్యత, వయసు, ప్రమాణాలు బాల బాలికలకు ఒకేలా ఉంటాయి. రాత పరీక్షలో మెరిట్ ఆధారంగా ఈ కౌన్సెలింగ్ ద్వారా ప్రవేశం కల్పిస్తారు.

పరీక్ష విధానం

- ఏఐఎస్ఎస్ఈఈ పరీక్ష పెన్-పేపర్(ఓఎంఆర్) విధానంలో ఉంటుంది. ఆబ్జెక్టివ్ విధానంలో మల్టిపుల్ ఛాయిస్ పద్ధతిలో పరీక్ష నిర్వహిస్తారు.
- ఆరో తరగతిలో ప్రవేశాలకు నిర్వహించే పరీక్షలో.. లాంగ్వేజ్ 25 ప్రశ్నలు-50 మార్కులకు, మ్యాథమెటిక్స్ 50 ప్రశ్నలు-150 మార్కులకు, ఇంటెలిజెన్స్ 25 ప్రశ్నలు-50 మార్కులకు, జనరల్ నాలెడ్జ్ 25 ప్రశ్నలు-50 మార్కులకు ఉంటాయి. మొత్తం 125 ప్రశ్నలు-300 మార్కులకు ఉంటుంది. పరీక్ష సమయం 150 నిమిషాలు. ఈ పరీక్షను ఇంగ్లిష్‌తోపాటు స్థానిక భాషల్లోనూ నిర్వహిస్తారు.
- తొమ్మిదో తరగతిలో ప్రవేశాలకు నిర్వహించే పరీక్షలో.. ఇంగ్లిష్ 25 ప్రశ్నలు-50 మార్కులకు, మ్యాథమెటిక్స్ 50 ప్రశ్నలు-200 మార్కులకు, ఇంటెలిజెన్స్ 25 ప్రశ్నలు-50 మార్కులకు, జనరల్ సైన్స్ 25 ప్రశ్నలు-50 మార్కులకు, సోషల్ సైన్స్ 25 ప్రశ్నలు-50 మార్కులకు ఉంటాయి. మొత్తం 150 ప్రశ్నలు-400 మార్కులకు ఉంటుంది. పరీక్ష సమయం 180 నిమిషాలు. పరీక్ష ఇంగ్లిష్ మీడియంలో జరుగుతుంది.

ఏఐఎస్ఎస్ఈఈ 2026

తెలుగు రాష్ట్రాల్లో పరీక్షకేంద్రాలు

- **ఆంధ్రప్రదేశ్:** అనంతపురం, గుంటూరు, కడప, కర్నూలు, నెల్లూరు, ఒంగోలు, రాజమహేంద్రవరం, శ్రీకాకుళం, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం, విజయనగరం.
- **తెలంగాణ:** హైదరాబాద్, కరీంనగర్.

దరఖాస్తు ఫీజు

జనరల్/రక్షణ రంగంలో పనిచేస్తున్న వారి పిల్లలు, ఓబీసీలు(నాన్ క్రీమీలేయర్), ఎక్స్ సర్వీస్‌మెన్ పిల్లలకు రూ.850, ఎస్సీ/ఎస్టీలకు రూ.700.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభ తేది:** 10.10.2025.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 30.10.2025.
- **దరఖాస్తు ఫీజు చెల్లించడానికి చివరితేది:** 31.10.2025.
- **దరఖాస్తు సవరణ తేదీలు:** 02.11.2025 నుంచి 04.11.2025 వరకు
- **సైనిక్ స్కూల్ పరీక్ష తేదీ:** జనవరి-2026.
- **వెబ్‌సైట్:** https://examinationservices.nic.in

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

నేటి భవిత ఈ పేపర్‌లో..
» సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం - తెలంగాణ హిస్టరీ » టెట్/డీఎస్సీ ప్రత్యేకం- ఇంగ్లిష్ లాంగ్వేజ్
» గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం - ఇండియన్ పాలిటీ » బ్యాంక్ ఎగ్జామ్స్ ప్రత్యేకం - రీజనింగ్

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	485	83,952
నిఫ్టీ ▲	125	25,710

విదేశీ సూచీలు			
నాస్‌డాక్	22,680	▲	117
డోజోన్స్	46,198	▲	238
ఎఫ్‌టీఎస్‌ఈ 100	9,355	▽	82
డాక్స్	23,831	▽	441
షాంఘై	3,840	▽	76
నికాయ్	48,582	▽	696

● అమెరికా ● బ్రిటన్ ● జర్మనీ ● చైనా ● జపాన్

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	87.40	88.42
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	116.74	119.70
€	యూరో	ఎస్‌బీఐ	101.54	104.32
¥	జపాన్ యెన్ (100)	ఎస్‌బీఐ	57.56	59.01
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	55.75	57.99
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	65.74	69.15
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	55.59	24.10
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	23.10	24.30
¥	చైనా యువాన్	థామస్‌కుక్	11.48	13.30



దీపావళి స్టాక్స్ పటాకా!

కొత్త సంవత్ 2082లో కొంత ఒడిదుడుకులు ఎదురైనప్పటికీ మార్కెట్లు ముందుకే సాగుతాయనే విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఆదాయాల వృద్ధి వేగం పుంజుకోవడం, మళ్లీ విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల ప్రవాహం మొదలు కావడం, వాణిజ్య విధానాలపై స్పష్టత, భౌగోళిక రాజకీయ స్థిరత్వం వంటి అంశాలు సానుకూలంగా ఉంటాయని భావిస్తున్నారు. దేశీయంగా పాలసీలు స్థిరంగా కొనసాగడం, భారీ పెట్టుబడులు, సానుకూల ద్రవ్యపరపతి విధానాలు మొదలైనవి కీలక చోదకాలుగా నిలుస్తాయనే అంచనాలు ఉన్నాయి. ద్రవ్యోల్బణం నెమ్మదించడం, ఆర్థిక క్రమశిక్షణ, కార్పొరేట్ల రుణ భారం తగ్గడం తదితర అంశాల దన్నుతో కంపెనీల ఆదాయాలు మెరుగుపడొచ్చని నువామా రీసెర్చ్ అభిప్రాయపడింది. 2026 ఆర్థిక సంవత్సరంలో అమెరికా ఫెడ్, ఈసీబీలు వడ్డీ రేట్లను మరికాస్త తగ్గించవచ్చని పేర్కొంది. ద్రవ్యోల్బణం కాస్త అదుపులో ఉన్న నేపథ్యంలో దేశీయంగా ఆర్‌బీఐ కూడా ఇదే బాటలో పయనించవచ్చని తెలిపింది. వేల్యుయేషన్స్ సముచిత స్థాయిలో ఉన్నాయని, అయితే గణనీయంగా పెరిగిన మిడ్–స్మాల్ క్యాప్స్‌లో మాత్రం కన్సాలిడేషన్‌కి ఆస్కారం ఉందని వివరించింది. జీఎస్‌టీ 2.0 సరళీకరణ, ఆదాయపు పన్నుపరమైన ఊరట, పండుగల సీజన్ మొదలైన అంశాల కారణంగా వినియోగం గణనీయంగా రికవర్ అవుతుందని మోతీలాల్ ఓస్వాల్ తెలిపింది. ఆటో, కన్జూమర్ డ్యూరబుల్స్, ట్రావెల్, హోటల్స్, రిటైల్ వంటి రంగాలు మెరుగ్గా ఉండొచ్చని పేర్కొంది. మరోవైపు, ఆటో, బ్యాంకింగ్, క్యాపిటల్ గూడ్స్, రియల్టీ, తదితర రంగాలు ఆకర్షణీయంగా ఉంటాయని సెంట్రమ్ బ్రోకింగ్ తెలిపింది. నిఫ్టీ 28,500కి, సెన్సెక్స్ 95,000కు చేరొచ్చని అంచనా వేస్తున్నట్లు పేర్కొంది. వినియోగ ఆధారిత సంస్థలు, ప్రైవేట్ బ్యాంకులు మెరుగ్గా రాణించవచ్చని ట్రేడ్‌జినీ సీవోవో త్రివేష్ తెలిపారు. వచ్చే ఏడాది కాలానికి వివిధ బ్రోకరేజీ సంస్థలు అందిస్తున్న స్టాక్ సిఫార్సులు సాక్షి పాఠకులకు ప్రత్యేకం!

– సాక్షి, బిజినెస్ డెస్క్

ఒడిదుడుకులున్నా మార్కెట్ ముందుకే..

- కార్పొరేట్ల ఆదాయాలు, పెట్టుబడులపై సానుకూల అంచనాలు
- సంవత్ 2082లో కొత్త గరిష్టాలకు సూచీలు
- నిఫ్టీ @ 28,500, సెన్సెక్స్ @ 95,000
- ఆకర్షణీయంగా బ్యాంకింగ్, ఆటో, క్యాపిటల్ గూడ్స్, రియల్టీ తదితర రంగాలు

బ్రోకరేజ్: జేఎం ఫైనాన్షియల్

మారుతీ సుజుకీ

ప్రస్తుత ధర: రూ. 16,399
టార్గెట్ ధర: రూ. 19,000 (వృద్ధి: 16%)

కార్యకలాపాలు స్థిరపడే కొద్దీ విస్తరణ వ్యయాలు తగ్గుముఖం పట్టడం, ప్రోడక్టుల మేళవింపు సానుకూలంగా ఉండటం మార్జిన్లు మెరుగుపడేందుకు దోహదపడొచ్చు. ఇన్‌హౌస్ బ్యాటరీ ప్లాంటుతో మరిన్ని హైబ్రిడ్ వాహనాలను ప్రవేశపెట్టొచ్చు. హైబ్రిడ్ సెగ్మెంట్‌లో వ్యయాలు తగ్గి, లాభదాయకత పెరుగుతుంది. అయితే, తీవ్రమైన పోటీ, కొత్తగా ప్రవేశపెట్టిన ప్యాసింజర్ వాహనాలకు స్పందన అంతంతమాత్రంగానే ఉండటం వంటివి ప్రతికూలాంశాలుగా ఉండొచ్చు.

యాక్సిస్ బ్యాంక్

ప్రస్తుత ధర: రూ. 1,200
టార్గెట్ ధర: రూ. 1,330 (వృద్ధి: 11%)

ఆకర్షణీయమైన వేల్యుయేషన్, అసెట్ క్వాలిటీ రిస్కులు తక్కువగా ఉండటం, నిర్వహణ వ్యయాలు నెమ్మదించడం వంటివి సానుకూలాంశాలు. రాబోయే త్రైమాసికాల్లో వృద్ధి వేగం మరింత పుంజుకోవచ్చు. నికర వడ్డీ మార్జిన్లు ఊహించిన దానికంటే క్షీణించే అవకాశాలు ప్రతికూలాంశం.

ఐఐఎఫ్ఎల్ ఫైనాన్స్

ప్రస్తుత ధర: రూ. 498
టార్గెట్ ధర: రూ. 600 (వృద్ధి: 20%)

వేల్యుయేషన్ మెరుగ్గా ఉండటం, ఆదాయ రికవరీ వల్ల రీ–రేటింగ్‌కి అవకాశం ఉంది. పసిడి ధరల పరుగు కొనసాగుతుండటమనేది ఆదాయ అంచనాల పెంపునకు, రుణాల పోర్ట్‌ఫోలియో మెరుగుపడేందుకు ఉపయోగపడొచ్చు. అయితే, రుణ సంబంధ వ్యయాలు ఊహించిన దానికన్నా ఎక్కువగా ఉండటం కీలక రిస్కుల్లో ఒకటిగా ఉంటుంది.

ఎల్అండ్‌టీ ఫైనాన్స్

ప్రస్తుత ధర: రూ. 266
టార్గెట్ ధర: రూ. 300 (వృద్ధి: 13%)

మాతృ సంస్థ పటిష్టంగా ఉండటం, వైవిధ్యమైన ప్రోడక్టుల పోర్ట్‌ఫోలియో, లోన్ బుక్‌లో రిటైల్ ఫైనాన్స్ వాటా 90 శాతానికి పెరగడం వంటివి సానుకూలాంశాలు. ద్వితీయార్ధంలో పండగ సీజన్ డిమాండ్‌తో వృద్ధి వేగం పటిష్టంగా ఉండొచ్చు. అసెట్ క్వాలిటీపరమైన రిస్కులు మళ్లీ తలెత్తే అవకాశాలుండటం ప్రతికూలాంశాల్లో ఒకటిగా నిలవొచ్చు.

అపోలో హాస్పిటల్స్

ప్రస్తుత ధర: రూ. 7,909
టార్గెట్ ధర: రూ. 9,000 (వృద్ధి: 14%)

కొత్తగా 1,717 పడకలు జతకానుండటం, ఫార్మసీ ఔట్‌లెట్స్ సంఖ్య 8 శాతం పెరుగుదల, పోటీ సంస్థ మ్యాక్స్ హెల్త్‌కేర్‌తో పోలిస్తే డిస్కౌంటులో ట్రేడవుతుండటం మొదలైనవి పాజిటివ్ అంశాలు. పడకల సామర్థ్యం పెంపు ఊహించిన దానికన్నా నెమ్మదిగా ఉండటం, రెగ్యులేటరీ రిస్కుల్లాంటివి ప్రతికూలాంశాలుగా ఉండొచ్చు.

బ్రోకరేజ్: చాయిస్ ఈక్విటీ బ్రోకింగ్

ఫెడరల్ బ్యాంక్

ప్రస్తుత ధర: రూ. 212
టార్గెట్ ధర: రూ. 245 (వృద్ధి: 16%)

టెక్నికల్‌గా కొన్నాళ్ల నుంచి పటిష్టమైన బేస్ ఏర్పర్చుకుంటోంది. రూ. 195–215 శ్రేణిలో తిరుగాడుతోంది. కరెక్షన్ జరిగిన ప్రతిసారి సపోర్ట్ బలపడుతోంది. 220పై నిలకడగా కొనసాగితే రూ. 245–255 వైపు ర్యాలీ చేయొచ్చు. రూ. 207–205 వరకు తగ్గితే కొనుగోళ్లకు అవకాశంగా భావించవచ్చు. రూ. 195 దిగువకి పడిపోతే బలహీనపడటాన్ని సూచిస్తుంది.

సిప్లా

ప్రస్తుత ధర: రూ. 1,578
టార్గెట్ ధర: రూ. 1,770 (వృద్ధి: 12%)

నిర్దిష్ట శ్రేణిలో కన్సాలిడేట్ అవుతూ షేరు బలపడుతున్న సంకేతాలిస్తోంది. రూ. 1,580 వద్ద తక్షణ రెసిస్టెన్స్ ఉండగా, దీన్ని నిర్ణయాత్మకంగా దాటితే మధ్యకాలికంగా, దీర్ఘకాలికంగా రూ. 1,770–1,850 వైపుగా వెళ్లొచ్చు. తగ్గితే రూ. 1,480 వద్ద సపోర్ట్ లభిస్తుంది. మొమెంటమ్ ఇండికేటర్ల ప్రకారం చూస్తే బులిష్‌గానే కనిపిస్తోంది.

అశోక్ లేల్యాండ్

ప్రస్తుత ధర: రూ. 134
టార్గెట్ ధర: రూ. 151 (వృద్ధి: 13%)

కనిష్ట స్థాయిల్లో కన్సాలిడేట్ అవుతూ, స్థిరంగా రికవర్ అవుతోంది. ప్రస్తుతం వీక్లీ చార్ట్‌లో బులిష్‌గా కనిపిస్తోంది. టెక్నికల్‌గా రూ. 140 తక్షణ రెసిస్టెన్స్‌ని దాటితే మధ్య, దీర్ఘకాలికంగా రూ. 151–రూ. 158 వరకు పెరగవచ్చు. దిగువ వైపున రూ. 131 వరకు కొనుగోలుకు అవకాశం ఉంటుంది. రూ. 126 వద్ద పటిష్టమైన మద్దతు ఉంటుంది. దానికన్నా దిగువకి పడిపోతే ర్యాలీకి స్వల్పకాలిక రిస్కులు ఉంటాయి.

సెయిల్

ప్రస్తుత ధర: రూ. 129
టార్గెట్ ధర: రూ.147 (వృద్ధి: 14%)

టెక్నికల్‌గా పటిష్టమైన బేస్ ఏర్పర్చుకున్న స్టాక్, ప్రస్తుతం నిర్ణయాత్మక బ్రేకవుట్‌కి సిద్ధంగా ఉన్న సంకేతాలు కనిపిస్తున్నాయి. భారీ వాల్యూమ్స్‌తో రూ. 138కి ఎగువన నిలకడగా క్లోజయితే, తదుపరి దశ ర్యాలీకి దారితీయొచ్చు. దిగువన రూ. 125 స్థాయి వరకు మరింతగా షేర్లను మరింతగా కొనుగోలు చేయొచ్చు. రూ. 116 వద్ద సపోర్ట్ ఉంటుంది.

బీడీఎల్

ప్రస్తుత ధర: రూ. 1,540
టార్గెట్ ధర: రూ. 1,700 (వృద్ధి: 10%)

ఫిబోనకీ రిట్రేస్‌మెంట్ లెవెల్‌కి 50 శాతం వద్ద కన్సాలిడేట్ అవుతోంది. ఇదే జోన్‌లో సపోర్ట్ లభిస్తోంది. సాధారణంగా ర్యాలీ చేసే ముందు, ఇలాంటి కన్సాలిడేషన్ కనిపిస్తుంది. తక్షణ రెసిస్టెన్స్ రూ. 1,560 వద్ద ఉంటుంది. దీన్ని నిర్ణయాత్మకంగా దాటితే బులిష్ ధోరణి బలపడి, సమీప భవిష్యత్తులో మరింత ర్యాలీకి దోహదపడొచ్చు. తగ్గితే, రూ. 1,440 వరకు కొనుక్కోవచ్చు. రూ. 1,380 బలమైన సపోర్ట్ జోన్‌గా ఉంటుంది.

బ్రోకరేజ్: మిరే అసెట్ షేర్‌ఖాన్

అంబర్ ఎంటర్‌ప్రైజెస్

ప్రస్తుత ధర: రూ. 8,245
టార్గెట్ ధర: రూ. 9,300 (వృద్ధి: 13%)

ఈ సంస్థ రెసిడెన్షియల్, కమర్షియల్ ఏసీలు, రిఫ్రిజిరేషన్ ఉత్పత్తులను అందిస్తోంది. కన్జూమర్ డ్యూరబుల్స్ విభాగంలో ఏసీలతో పాటు కంపెనీ వాషింగ్ మెషీన్ల మార్కెట్లోకి, అటు ఎలక్ట్రానిక్స్‌లోకి, సెమీకండక్టర్ సబ్‌స్ట్రేట్ పీసీబీలు మొదలైన వాటిల్లోకి ప్రవేశిస్తుండటం ద్వారా మార్కెట్ పరిధిని విస్తరించుకుంటోంది. ఎలక్ట్రానిక్స్‌పై వచ్చే అయిదేళ్లలో రూ. 3,000 కోట్లు ఇన్వెస్ట్ చేయనుంది.

చాలెట్ హోటల్స్

ప్రస్తుత ధర: రూ. 975
టార్గెట్ ధర: రూ. 1,172 (వృద్ధి: 20%)

వ్యూహాత్మక కొనుగోళ్లు, గదుల పెంపు, నిర్వహణ సామర్థ్యాలను మెరుగుపర్చుకోవడం వంటివి సంస్థకు సానుకూలంగా ఉండనున్నాయి. అలాగే, కమర్షియల్ బిజినెస్ వాటా పెరుగుతుండటమనేది వృద్ధికి కీలక చోదకంగా నిలవనుంది. 2027 ఆర్థిక సంవత్సరం నాటికి రూ. 2,000 కోట్ల పెట్టుబడులు పెట్టనుంది. 2025 డిసెంబర్ ఆఖరు నాటికి గదుల సంఖ్యను 4,500కి పెంచుకోనుంది.

కమిన్స్ ఇండియా

ప్రస్తుత ధర: రూ. 3,976
టార్గెట్ ధర: రూ. 4,500 (వృద్ధి: 13%)

హై–హార్స్‌పవర్ (హెచ్‌హెచ్‌పీ) జెన్‌సెట్ల మార్కెట్లో అగ్రగామిగా నిలుస్తోంది. పటిష్టమైన బ్రాండింగ్, డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్ ఉంది. 2025 తొలినాళ్ల నుంచి పవర్‌జెన్ వ్యాపారం పుంజుకుంది. డేటా సెంటర్లు, హాస్పిటల్స్, మొదలైన రంగాల నుంచి హెచ్‌హెచ్‌పీ జెన్‌సెట్లకు డిమాండ్ కొనసాగనుంది. ఎగుమతులు పటిష్టంగా ఉన్నాయి. యూరప్, ఆఫ్రికా, పశ్చిమాసియాలో డిమాండ్ స్థిరంగా ఉంది.

హిందుస్తాన్ ఏరోనాటిక్స్

ప్రస్తుత ధర: రూ. 4,880
టార్గెట్ ధర: రూ. 6,000 (వృద్ధి: 23%)

ఎయిర్‌క్రాఫ్టులు, హెలికాప్టర్లు, ఇంజిన్లు, యాక్సెసరీలు అందించే హెచ్‌ఏఎల్‌కి భారతదేశపు డిఫెన్స్ రంగంలో విశిష్టమైన స్థానం ఉంది. తయారీ సెగ్మెంట్ కార్యకలాపాలు పుంజుకోవడం వల్ల ఆదాయ వృద్ధి మెరుగుపడొచ్చు. రూ. 1.9 లక్షల కోట్ల ఆర్డర్ బ్యాక్‌లాగ్ ఉంది. రాబోయే 1–2 ఏళ్లలో రూ. లక్ష కోట్ల ఆర్డర్లు వచ్చే అవకాశం ఉంది.

హడ్కో

ప్రస్తుత ధర: రూ. 224
టార్గెట్ ధర: రూ. 260 (వృద్ధి: 16%)

సామాజిక హౌసింగ్, అర్బన్ మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించి ప్రభుత్వ నోడల్ ఏజెన్సీగా పని చేస్తోంది. ప్రభుత్వాలతో పటిష్టమైన సంబంధాలు ఉన్నాయి. 2026 ఆర్థిక సంవత్సరం నాటికి ఏయూఎం వార్షికంగా 25 శాతం పైగా, లాభం 23 శాతం పైగా వృద్ధి చెందవచ్చు. వచ్చే 18 నెలల్లో మొండిపద్దుల భారాన్ని పరిష్కరించుకోవాలని కంపెనీ నిర్దేశించుకుంది.

బ్రోకరేజ్: మోతీలాల్ ఓస్వాల్

ఎస్‌బీఐ

ప్రస్తుత ధర: రూ. 889
టార్గెట్ ధర: రూ. 1,000 (వృద్ధి: 12%)

జీఎస్‌టీ 2.0, ఆదాయ పన్ను సంస్కరణలు, ద్రవ్య లభ్యతను పెంచేందుకు ఆర్‌బీఐ తీసుకున్న చర్యలు మొదలైనవి రుణ వృద్ధికి దారి తీయొచ్చని, బీఎఫ్ఎస్ఐ రంగం లాభదాయకతకు తోడ్పడవచ్చని అంచనాలు ఉన్నాయి. రిటైల్, ఎస్ఎంఈ, కార్పొరేట్ సెగ్మెంట్లవ్యాప్తంగా పటిష్టమైన కార్యకలాపాలు ఉండటం బ్యాంకుకు సానుకూలాంశం.

ఎంఅండ్ఎం

ప్రస్తుత ధర: రూ. 3,648
టార్గెట్ ధర: రూ. 4,091 (వృద్ధి: 12%)

2026 క్యాలెండర్ సంవత్సరం నుంచి 2030 నాటికి కంపెనీ 7 ఐసీఈ ఎస్‌యూవీ వాహనాలను, 5 బీఈవీలను, 5 ఎల్‌సీవీలను ప్రవేశపెట్టే ప్రణాళికల్లో ఉంది. తద్వారా ఐసీఈ, ఈవీ సెగ్మెంట్లలో కంపెనీ తన స్థానాన్ని మరింత పటిష్టం చేసుకునే ప్రయత్నాల్లో ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో రికవరీ, కొత్త ఉత్పత్తుల దన్ను, ట్రాక్టర్ల మార్జిన్లు మెరుగుపడటం మొదలైనవి సంస్థకు కలిసి రానున్నాయి.

భారత్ ఎలక్ట్రానిక్స్

ప్రస్తుత ధర: రూ. 413
టార్గెట్ ధర: రూ. 490 (వృద్ధి: 19%)

ఆర్మీ నుంచి రూ. 30,000 కోట్ల అనంత శస్త్ర ప్రాజెక్టు టెండర్లకు సంబంధించి కంపెనీ, లీడ్ ఇంటిగ్రేటరుగా వ్యవహరిస్తుండటం వల్ల కంపెనీ ఆర్డరు బుక్ రూ. లక్ష కోట్ల స్థాయిని దాటే అవకాశముంది. ఇది, వ్యూహాత్మక డిఫెన్స్ ప్రోగ్రాంలలో కంపెనీ నాయకత్వ స్థానాన్ని తెలియజేస్తోంది. ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్‌వ్యాప్తంగా అవకాశాలతో దీర్ఘకాలికంగా కంపెనీ వృద్ధి అవకాశాలు మెరుగ్గా కనిపిస్తున్నాయి.

స్విగ్గీ

ప్రస్తుత ధర: రూ. 432
టార్గెట్ ధర: రూ. 550 (వృద్ధి: 27%)

పోటీ నెమ్మదిస్తుండటం, డార్క్ స్టోర్లను విస్తరణ క్రమంగా స్థిరపడుతుండటం మొదలైన వాటి కారణంగా కంపెనీకి చెందిన ఇన్‌స్టామార్ట్ విభాగం త్వరలో లాభదాయకంగా మారే అవకాశాలు ఉన్నాయి. జీఎస్‌టీ మార్పుల వల్ల వినియోగం మరింత పెరిగే అవకాశాలు ఉన్న నేపథ్యంలో 2026–27 ఆర్థిక సంవత్సరాలకు సంబంధించి వ్యాపార వృద్ధి, గతంలో అంచనా వేసిన 20 శాతానికన్నా మెరుగ్గా 23 శాతం స్థాయిలో ఉంటుందని అంచనా.

ఇండియన్ హోటల్స్

ప్రస్తుత ధర: రూ. 735
టార్గెట్ ధర: రూ. 880 (వృద్ధి: 20%)

ఆక్యుపెన్సీ, ఏఆర్ఆర్ పెరుగుతుండటం వంటి అంశాల కారణంగా దేశీయంగా హాస్పిటాలిటీ పరిశ్రమ 2026 ఆర్థిక సంవత్సరంలో భారీగా వృద్ధి చెందనుంది. అలాగే ఎంఐసీఈ యాక్టివిటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు, ద్వితీయార్ధంలో పెళ్లిళ్ల సీజన్ మొదలైనవి కూడా కంపెనీ వృద్ధికి దోహదపడనున్నాయి.

బ్రోకరేజ్: హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్

అసోసియేటెడ్ ఆల్కహాల్స్ అండ్ బ్రూవరీస్ (ఏఏబీఎల్)

ప్రస్తుత ధర: రూ. 1,058
టార్గెట్ ధర:రూ. 1,182 (వృద్ధి: 12%)

క్రమంగా ప్రీమియం లిక్కర్ బ్రాండ్స్ వైపు మళ్లుతోంది. మధ్యప్రదేశ్‌లో 20–25 శాతం వరకు మార్కెట్ వాటా ఉంది. అలాగే, మహారాష్ట్ర, కర్ణాటక, గోవా, ఉత్తర్‌ప్రదేశ్ మార్కెట్లలోకి కూడా విస్తరిస్తోంది. ఇటీవలే నికోబార్ జిన్, హిల్‌ఫోర్ట్ విస్కీ అనే ప్రీమియం బ్రాండ్లను ప్రవేశపెట్టడంతో పాటు కొత్తగా బ్రాందీ, టెకీలాలో కూడా మరిన్ని ప్రోడక్ట్‌లను ప్రవేశపెట్టబోతోంది. వ్యయాలు తగ్గించుకుని, స్థిరమైన మార్జిన్లను సాధించేందుకు కసరత్తు చేస్తోంది.

భారతి ఎయిర్‌టెల్

ప్రస్తుత ధర: రూ. 2,011
టార్గెట్ ధర: రూ. 2,244 (వృద్ధి: 12%)

ఏఆర్ పీయూ, డిజిటల్ వ్యాపారాలు వృద్ధి చెందుతున్నాయి. 2026 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో ఏఆర్‌పీయూ రూ. 250గా ఉండగా, టారిఫ్‌ల పెంపుతో రూ. 300 సమీపానికి చేరే అవకాశం ఉంది. ఇక గూగుల్, ఒరాకిల్, యాపిల్, హ్యూస్‌లాంటి దిగ్గజాలతో జట్టు కట్టడం ద్వారా మొబైల్ సర్వీసుల పరిధికి మించి ఇతర విభాగాల్లోకి ప్రవేశించడంలో కంపెనీకి తోడ్పడనుంది.

జేఎస్‌డబ్ల్యూ ఎనర్జీ

ప్రస్తుత ధర: రూ. 541
టార్గెట్ ధర: రూ. 639 (వృద్ధి: 18%)

భారతదేశపు ఇంధన పరివర్తన లక్ష్యాలతో కంపెనీకి ప్రయోజనం చేకూరనుంది. కంపెనీ ఇప్పటికే నిర్దేశించుకున్న గడువు కన్నా ముందే 20 గిగావాట్ల స్ట్రాటజీ 2.0 టార్గెట్‌ని సాధించింది. ఇప్పుడు 2030 నాటికి 30 గిగావాట్ల కెపాసిటీ, 40 గిగావాట్‌అవర్ స్టోరేజీని సాధించే దిశగా ముందుకెళ్తోంది. రూ. 1.3 లక్షల కోట్ల భారీ పెట్టుబడుల ప్రణాళికలు ఉన్నప్పటికీ పటిష్టమైన ఆర్థిక క్రమశిక్షణను పాటిస్తోంది.

ఎల్అండ్‌టీ

ప్రస్తుత ధర: రూ. 3,839
టార్గెట్ ధర: రూ. 4,243 (వృద్ధి: 11%)

క్యాపిటల్ గూడ్స్ విభాగానికి చెందిన ఈ సంస్థకు రూ. 6.1 లక్షల కోట్ల ఆర్డర్ బుక్ ఉంది. ఇన్‌ఫ్రా, ఎనర్జీ, హైడ్రోకార్బన్ ప్రాజెక్టులకు సంబంధించి రూ. 14.8 లక్షల కోట్ల ఆర్డర్లు కుదిరే దశలో ఉన్నాయి. ప్రాజెక్టులను సకాలంలో పూర్తి చేయడం ద్వారా కంపెనీ లాభదాయకత మరింత మెరుగుపడనుంది.

ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్

ప్రస్తుత ధర: రూ. 72
టార్గెట్ ధర: రూ. 88.5 (వృద్ధి: 23%)

కాసా డిపాజిట్లు 26 శాతం వృద్ధి చెందాయి. దీంతో కాసా నిష్పత్తి 48 శాతానికి, క్రెడిట్–డిపాజిట్ నిష్పత్తి 93.4 శాతానికి పెరిగాయి. నిధుల సమీకరణ వ్యయాలు తగ్గి, 2025–26 మూడో త్రైమాసికానికి మార్జిన్లు 5.7 శాతానికి చేరే అవకాశముంది. 2024–25లో రూ. 1,525 కోట్లుగా ఉన్న లాభాలు, 2026 కల్లా రూ. 4,560 కోట్లకు ఎగిసే అవకాశాలు ఉన్నాయి.

పసిడి పైపైకే..

అంతర్జాతీయంగా అనిశ్చితి నెలకొన్న తరుణంలో పసిడి, వెండి ధరలు రాకెట్లలాగా దూసుకెళ్తున్నాయి. గత దీపావళి నుంచి చూస్తే పసిడి దాదాపు 63 శాతం, వెండి అంతకు మించి 72 శాతం స్థాయిలో రాబడులిచ్చాయి. గత పదేళ్ల వ్యవధిలో రెండు దీపావళి పండుగల మధ్య మూడేళ్లు మినహా ఏడు సందర్భాల్లో ఈ రెండూ సానుకూల రాబడులనే ఇచ్చాయని మార్కెట్ వర్గాలు తెలిపాయి. కొత్త సంవత్‌లో కూడా ప్రపంచ సెంట్రల్ బ్యాంకులు గోల్డ్ షాపింగ్‌ను కొనసాగిస్తాయని అంచనాలు ఉన్నాయి. 2026 దీపావళి నాటికి అంతర్జాతీయ మార్కెట్లలో 4,500–5,000 డాలర్లకు చేరొచ్చని, దేశీయంగా మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ (ఎంసీఎక్స్)లో రూ.1,40,000 – రూ.1,50,000 స్థాయికి చేరొచ్చని నిపుణులు తెలిపారు. అటు వెండి సైతం అంతర్జాతీయంగా ఔన్సుకు (31.1 గ్రాములు) 60–70 డాలర్లకు, దేశీయంగా ఎంసీఎక్స్‌లో రూ. 1,80,000 – రూ. 2,00,000కు చేరొచ్చని పేర్కొన్నారు. అంతర్జాతీయంగా అనిశ్చితులు తగ్గితే తప్ప, సురక్షితమైన పెట్టుబడి సాధనాలైన పసిడి, వెండి ర్యాలీ ఇకపైనా కొనసాగుతుందని మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ అనలిస్ట్ మానవ్ మోదీ తెలిపారు. రిస్క్ ప్రొఫైల్‌ని బట్టి పోర్ట్‌ఫోలియోల్లో కనీసం 10 శాతం వాటాని పసిడి, వెండికి కేటాయించాలని పేర్కొన్నారు.



'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..

మార్కెట్లపై క్యూ2 ఫలితాల ఎఫెక్ట్	ఐపీవో బాటలో మీషో

ఏఐ వాణిజ్యం ఇంతింతై!



ప్రపంచ దేశాల్లో 20 శాతం పెరుగుదల నమోదు

2024 మొదటి 6 నెలల్లో 1.61 లక్షల కోట్ల డాలర్లు

2025లో జనవరి-జూన్‌లో 1.92 లక్షల కోట్ల డాలర్లు

2024-25లో 13 శాతం పెరిగిన మన దిగుమతులు

కృత్రిమ మేధ (ఏఐ) సంబంధిత ఉత్పత్తులు.. 2025 మొదటి ఆరు నెలల్లో అంతర్జాతీయ వాణిజ్యంలో కీలకపాత్ర పోషించాయని ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీఓ) తన తాజా నివేదికలో పేర్కొంది. సెమీకండక్టర్లు, ప్రాసెసర్లు, సర్వర్లు, టెలికమ్యూనికేషన్ పరికరాలు.. ఇలా ఏఐలో అభివృద్ధి, ఉత్పత్తికి అవసరమయ్యే పరికరాలకు ప్రపంచ వ్యాప్తంగా గిరాకీ పెరుగుతోంది. మనదేశం నుంచి ఏఐ సంబంధిత ఉత్పత్తుల ఎగుమతులు పెరుగుతున్నా.. ఇప్పటికీ దిగుమతులపైనే ఎక్కువగా ఆధారపడుతున్నాం.

- సాక్షి, స్పెషల్ డెస్క్

2024 మొదటి ఆరు నెలల్లో కృత్రిమ మేధ (ఏఐ) సంబంధిత ఉత్పత్తుల వాణిజ్యం విలువ 1.61 లక్షల కోట్ల డాలర్లు కాగా.. 2025లో ఇదే సమయంలో 1.92 లక్షల కోట్ల డాలర్లకు పెరిగింది. అంటే 20 శాతం వృద్ధి అన్నమాట. మన దేశంలో 2023-24తో పోలిస్తే 2024-25లో ఏఐ సంబంధిత దిగుమతులు 13.1 శాతం పెరిగాయి. వీటి మొత్తం విలువ 66.8 బిలియన్ డాలర్లు. ఆసక్తికరమైన విషయం ఏంటంటే.. అత్యాధునిక కంప్యూటింగ్ హార్డ్‌వేర్ కోసం మనం ఇప్పటికీ అమెరికాపైనే ఎక్కువగా ఆధారపడుతున్నాం. మనదేశ మొత్తం దిగుమతుల్లో.. అమెరికా నుంచి వచ్చే 5 ఉత్పత్తులదే ఏకంగా 50 శాతం వాటా ఉందంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. మనదేశం నుంచి బోర్డులు, ప్యానెళ్లు వంటి వాటి ఎగుమతులు 2023-24తో పోలిస్తే అత్యధికంగా 58.5 శాతం పెరిగాయి.

దిగుమతులే అధికం..: కేంద్ర వాణిజ్య శాఖ గణాంకాల ప్రకారం.. భారత్ - అమెరికా ఏఐ ఉత్పత్తుల వాణిజ్యంలో దిగుమతులు 2023-24తో పోలిస్తే 2024-25లో 43 శాతం పెరిగాయి.

(బిలియన్ డాలర్లలో)	2023-24	2024-25
ఎగుమతులు	3.6	4.1
దిగుమతులు	3.2	4.6

టాప్ ఎగుమతులు

ఏఐ వ్యవస్థలకు అత్యవసరమైన విద్యుత్ విషయంలో కీలకమైన స్టాటిక్ కన్వర్టర్ల ఎగుమతులు మనదేశం నుంచి భారీగా పెరిగాయి.

(మిలియన్ డాలర్లలో)

వస్తువు	2023-24	2024-25
స్టాటిక్ కన్వర్టర్లు	647.6	807
ప్లాస్టిక్ వస్తువులు	351.9	397.6
వాల్వులు, ఇతర పరికరాలు	259.4	301.7
వోల్టేజ్ బోర్డులు	165.9	222.6
ప్రాసెసింగ్, ఆడియో సిగ్నళ్లు	148.1	194.3
మార్చే పరికరాలు ఎలక్ట్రిక్ కండక్టర్లు	156.2	173.7
ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు	126.1	162.4
బోర్డులు, ప్యానెళ్లు	90.7	143.8

టాప్ దిగుమతులు

ఏఐ వ్యవస్థల్లో మరో కీలకమైన ఆటోమేటిక్ డేటా ప్రాసెసింగ్ యంత్రాల యూనిట్లు, ప్రాసెసర్లు, కంట్రోలర్లను మనదేశం భారీగా దిగుమతి చేసుకుంటోంది.

(అంకెలు మిలియన్ డాలర్లలో)

వస్తువులు	2023-24	2024-25
ఆటోమేటిక్ డేటా ప్రాసెసింగ్	489.4	833.9
యంత్రాల యూనిట్లు, ప్రాసెసర్లు, కంట్రోలర్లు	52.4	737
ప్రాసెసింగ్, ఆడియో సిగ్నళ్లు	657.2	686.1
మార్చే పరికరాలు, స్టోరేజీ యూనిట్లు	113.3	183.1
వాల్వులు, ఇతర పరికరాలు	100.5	137.1
యంత్ర పరికరాలు	82.1	135.5
ప్లాస్టిక్ వస్తువులు	94.8	103.8

ప్రపంచ దేశాల్లో ఏఐకి సంబంధించి విధానపరమైన చర్యలు చేపట్టిన దేశాలు ఇప్పటికీ తక్కువే ఉన్నాయని డబ్ల్యూటీవో నివేదిక చెబుతోంది. అధిక ఆదాయ దేశాల్లో 68 శాతం దేశాలు ఈ చర్యలు చేపడితే.. ఎగువ మధ్య ఆదాయ దేశాల్లో కేవలం 30 శాతమే ఈ జాబితాలో ఉన్నాయి.

కేకే లైన్‌లో ట్రాక్‌పై బండరాళ్లు



సాక్షి, పాడేరు: కొత్తవలస-కిరండూల్ లైన్‌లో చీమిడిపల్లి రైల్వే స్టేషన్ సమీపంలో ఆదివారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో రైల్వే ట్రాక్‌పై కొండచరియలు, బండరాళ్లు పడిన ఘటనలో గూడ్స్ రైలు పట్టాలు తప్పింది. వర్షాలు కురుస్తుండటంతో కొండపై నుంచి బండరాళ్లు విరిగి ట్రాక్‌పై పడ్డాయి. రైలు ఇంజిన్ మాత్రమే పట్టాలు తప్పడంతో పెద్ద ప్రమాదం తప్పింది. రైల్వే అధికారులు అప్రమత్తమై ఇరువైపులా పలు గూడ్స్ రైళ్ల రాకపోకలు నిలిపివేశారు. బండరాళ్లను తొలగించడంతో పాటు పట్టాలు తప్పిన ఇంజిన్‌ను సరిచేశారు. మధ్యాహ్నం 12గంటల తరువాత లైన్ క్లియర్ అవ్వడంతో రైళ్ల రాకపోకలు యథావిధిగా నడిచాయి.

మూడోవంతు విస్తీర్ణంలోనే నూనెగింజల సాగు



లక్ష్యం 17 లక్షల ఎకరాలు.. సాగైంది 6.5 లక్షల ఎకరాల్లోనే

- ఖరీఫ్‌లో మొత్తం పంటల సాగు లక్ష్యం 86.33 లక్షల ఎకరాలు
- పంటలు సాగైంది 72.90 లక్షల ఎకరాల్లోనే

సాక్షి, అమరావతి: ఖరీఫ్ సీజన్ ముగిసింది. అతివృష్టి, అనావృష్టి పరిస్థితులకు తోడు అడుగడుగునా ప్రభుత్వ నిర్లక్ష్యం అన్నదాతలను కోలుకోలేని దెబ్బతీసింది. సీజన్ ప్రారంభంలో పెట్టుబడికి రుణాలు దొరక్క, అదునుకు విత్తనాలు, ఎరువులు అందక నానా అగచాట్లు పడ్డారు. చరిత్రలో ఎన్నడూలేని విధంగా యూరియా కోసం అన్నదాతలు పడిన పాట్లు వర్ణనాతీతం. ఫలితంగా ఖరీఫ్ పంటల సాగు లక్ష్యానికి ఆమడ దూరంలో నిలిచింది. నూనెగింజల సాగైతే లక్ష్యంలో మూడోవంతుకు మించలేదు. సీజన్‌లో సాధారణ సాగువిస్తీర్ణం 77.87 లక్షల ఎకరాలు కాగా, ఈ ఏడాది 86.33 లక్షల ఎకరాల్లో సాగు లక్ష్యంగా పెట్టుకున్నారు. కానీ చివరికి 72.90 లక్షల ఎకరాల్లోనే పంటలు సాగయ్యాయి. సాధారణ సాగువిస్తీర్ణం కన్నా దాదాపు ఐదు లక్షల ఎకరాలు.. లక్ష్యంగా పెట్టుకున్న దానికన్నా 13.43 లక్షల ఎకరాలు సాగుకు దూరంగా ఉండిపోయాయి. ఈ-క్రాప్ నమోదు పరిస్థితి ఆది నుంచి అయోమయంగానే ఉంది. మరోవైపు ఉల్లి నుంచి పత్తి వరకు ఖరీఫ్ పంట ఉత్పత్తులకు మద్దతు ధర దక్కక, కొనేవారు లేక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

లక్ష్యానికి దూరంగా..

గతేడాది ఖరీఫ్ సీజన్‌లో 85.65 లక్షల ఎకరాల్లో పంటల సాగు లక్ష్యంగా పెట్టుకోగా.. 69.7 లక్షల ఎకరాల్లో సాగయ్యాయి. ఈ ఏడాది ఖరీఫ్‌లో 86.33 లక్షల ఎకరాల్లో సాగు లక్ష్యంగా నిర్దేశించగా, తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో 72.90 లక్షల ఎకరాల్లోనే పంటలు సాగుచేశారు. వరి సాధారణ సాగువిస్తీర్ణం 37 లక్షల ఎకరాలు. ఈ ఏడాది 38.87 లక్షల ఎకరాల్లో సాగు లక్ష్యంగా నిర్దేశించగా 38.97 లక్షల ఎకరాల్లో సాగైంది. అయితే అదునుకు యూరియా దొరక్క వరి రైతులు చెప్పలేనన్ని పాట్లు పడ్డారు. యూరియా సరఫరాలో ప్రభుత్వం చేతులెత్తేయడంతో చేసేది లేక కాంప్లెక్స్ ఎరువులపై ఆధారపడాల్సి వచ్చింది. అది దిగుబడులపై ఎక్కువ ప్రభావం చూపుతుందని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. సీజన్‌లో వరితో పాటు మొక్కజొన్న, సజ్జ, చిరుధాన్యాలు, కందులు, ఆముదం, జూట్ వంటి పంటలు లక్ష్యానికి మించి సాగయ్యాయి. వేరుశనగతో పాటు నూనెగింజల పంటలు లక్ష్యంలో 47 శాతం విస్తీర్ణంలో మాత్రమే సాగయ్యాయి. ఈ ఏడాది 17 లక్షల ఎకరాల్లో నూనెగింజల పంటలు సాగుచేయాలనుకోగా 6.50 లక్షల ఎకరాల్లో మాత్రమే సాగయ్యాయి. 14 లక్షల ఎకరాల్లో పత్తి సాగు లక్ష్యంగా పెట్టుకోగా 11 లక్షల ఎకరాలకే పరిమితమైంది. చెరకు సాగువిస్తీర్ణం బాగా పడిపోయింది. గతంలో దాదాపు లక్ష ఎకరాల్లో సాగైన చెరకు ఈ ఏడాది 30 వేల ఎకరాలకే పరిమితమైపోయింది. జొన్న, మినుము, పెసర తదితర పంటల సాగు లక్ష్యానికి దూరంగా ఉంది. అయితే మొత్తం ఆహారధాన్యాల సాగు లక్ష్యం మేరకు 54.32 లక్షల ఎకరాల్లో జరిగినట్లు వ్యవసాయశాఖ ప్రకటించడం కొసమెరుపు.

రాయలసీమ నుంచి పెరిగిన వలసలు

రాయలసీమ జిల్లాల్లో సాధారణ సాగువిస్తీర్ణం 34 లక్షల ఎకరాలు కాగా ఈ ఏడాది 39.50 లక్షల ఎకరాల్లో సాగు లక్ష్యంగా పెట్టుకున్నారు. చివరికి 28.37 లక్షల ఎకరాల్లో మాత్రమే పంటలు సాగయ్యాయి. సాధారణంగా సీమ జిల్లాల్లో ఖరీఫ్‌లో మూడోవంతు విస్తీర్ణంలో వేరుశనగే సాగవుతుంది. ఈ ఏడాది 14.50 లక్షల ఎకరాల్లో వేరుశనగ సాగు లక్ష్యంగా పెట్టుకున్నా.. ఐదులక్షల ఎకరాలకు మించి సాగవలేదు. వర్షాబావ పరిస్థితుల ప్రభావం వలన అన్నమయ్యలో 35 శాతం, చిత్తూరులో 36 శాతం, శ్రీ సత్యసాయి, వైఎస్సార్ కడప జిల్లాల్లో 57 శాతానికి మించి పంటలు సాగుచేయలేదు. సాగైనచోట కూడా వర్షాభావ పరిస్థితులు, అధిక వర్షాలతో పైరు దెబ్బతింది.

ఇతర పంటల పరిస్థితి కూడా దరిదాపుగా ఇదేవిధంగా ఉంది. సత్యసాయి, అన్నమయ్య, చిత్తూరు, అనంతపురం జిల్లాల్లో పలుచోట్ల బోర్లు ఒట్టిపోయాయి. ఎండిపోతున్న పంటలను కాపాడుకునేందుకు రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. ప్రత్యామ్నాయ పంటల ప్రణాళికను ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో చేసేది లేక రైతులు లక్షల ఎకరాలను ఖాళీగా వదిలేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో పనుల్లేక ఉమ్మడి కర్నూలు జిల్లా నుంచి పొరుగు రాష్ట్రాలకు ఇటీవల కాలంలో వలసలు పెరిగాయి.

ఈ-పంట నమోదు అస్తవ్యస్తం

ఈ-పంట నమోదు అస్తవ్యస్తంగా సాగుతోంది. ప్రస్తుత ఖరీఫ్ సీజన్ నుంచి జాతీయస్థాయిలో డిజిటల్ క్రాప్ సర్వేతో అనుసంధానిస్తూ ఈ-పంటను అమలు చేస్తున్నారు. సాధారణంగా సెప్టెంబర్ 30వ తేదీకి పూర్తికావాల్సిన ఈ-పంట నమోదును విధిలేని పరిస్థితుల్లో అక్టోబర్ 25వ తేదీ వరకు పొడిగించారు. అయినా ఈ-పంట నమోదు 40 శాతం దాటలేదు. ఈసారి వెబ్‌ల్యాండ్ డేటా ప్రకారం నూరు శాతం ల్యాండ్ పార్శిల్స్‌ను నమోదు చేయాల్సి ఉంది. 2.92 కోట్ల ల్యాండ్ పార్శిల్స్ ఉండగా, 1.28 కోట్ల ల్యాండ్ పార్శిల్స్‌లో మాత్రమే పంటల వివరాలు నమోదు చేశారు. ఈసారి వ్యవసాయ, ఉద్యాన, పట్టు సాగు వివరాలతోపాటు ఆక్వా సాగు, వ్యవసాయేతర సాగు భూముల వివరాలను కూడా నమోదు చేయాలి. పైగా 25 సెంట్లలోపు భూముల్లో పంటల వివరాలను కూడా నమోదు చేయాలి. 200 మీటర్ల వరకు మాగాణి, 50 మీటర్ల వరకు మెట్ట పొలాల వద్దకు వెళ్లి పంట ఫొటోలు తీసి అప్‌లోడ్ చేయాలి. లక్ష్యం మేరకు ఈ-పంట నమోదు ముందుకు సాగకపోవడంతో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijayawada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijayawada, NTR District - 520 007 (AP)., EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0866-2547436 Fax: No. 0866-2547433. RNI Reg No. APTEL/2008/23794. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

సోమశిలకు నిర్లక్ష్య గండం


జలాశయం మీదనున్న నూతన రోప్‌లు

సోమశిల: నెల్లూరు జిల్లా రైతాంగానికి తాగు, చెన్నై, తిరుపతి నగరాలకు తాగునీరందించే సోమశిల జలాశయం భద్రతపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి. ప్రాజెక్ట్ నిర్వహణలో అధికారుల నిర్లక్ష్యం గండం పొంచి ఉందని తెలుస్తోంది. ప్రాజెక్ట్ నిర్వహణకు గతంలో సుమారు 30 మంది వరకు సిబ్బంది విధుల్లో ఉండేవారు. అయితే ప్రస్తుతం కేవలం నలుగురికే పరిమితం కావడంతో జలాశయం నిర్వహణ లోపం కనిపిస్తోంది. ప్రాజెక్ట్ పూర్తి సామర్థ్యం 78 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 74 టీఎంసీలు ఉన్నాయి.

ఎందుకీ భయం.. ఏమానుమానాలు?

సోమశిల జలాశయానికి 12 క్రస్ట్ గేట్లు ఉన్నాయి. అన్ని క్రస్ట్ గేట్ల ద్వారా ఒకేసారి నీటిని విడుదల చేస్తే 24 గంటల వ్యవధిలో గరిష్ఠంగా 6 లక్షల నుంచి 6.50 లక్షల నీటి విడుదల చేసే అవకాశం ఉందని ప్రాజెక్ట్ ఇంజినీర్లు చెబుతున్నారు. అయితే ప్రస్తుతం జలాశయంలో 11, 12వ క్రస్ట్ గేట్లు పూర్తిగా బ్లాక్ అయ్యాయి. గేట్లు లిఫ్ట్ చేసే రోప్‌లు పూర్తిగా దెబ్బతినడంతో అవి లిఫ్ట్ అయ్యే సమయంలో తెగిపోయే అవకాశం ఉండడంతో రోప్‌లు మార్చే ప్రక్రియ విషయంలో సంబంధిత అధికార యంత్రాంగం ఆది నుంచి అలవికాని నిర్లక్ష్యం ప్రదర్శించింది. జలాశయంలో నీటి సామర్థ్యం తక్కువగా ఉన్న సమయంలోనే చేయాల్సి ఉన్నా.. వేసవి కాలం అంతా పట్టించుకోలేదు. తాజాగా ఎగువ నుంచి ఇటీవల వరద రావడంతో ప్రాజెక్ట్ పూర్తి సామర్థ్యానికి చేరుకుంది. ఈ క్రమంలో ప్రాజెక్ట్ నుంచి కేవలం 5, 6, 7 క్రస్ట్ గేట్ల నుంచి మాత్రమే నీటిని దిగువకు విడుదల చేయడంతో మిగతా గేట్ల లిఫ్ట్‌పై అనేక అనుమానాలు ఉన్నాయి. 1, 2, 3, 4, 8, 9, 10 గేట్ల రోప్‌లు సైతం తుప్పు పట్టి ఉన్నాయి. దాదాపుగా నాలుగేళ్లుగా ఈ గేట్లను ఎత్తి నీటిని దిగువకు విడుదల చేసిన సందర్భం లేదు. ప్రధానంగా సిబ్బంది కొరత కారణంగా ప్రాజెక్ట్ క్రస్ట్ గేట్ల నిర్వహణలో నిర్లక్ష్యం కనిపిస్తోంది. భారీ స్థాయిలో వరదలు వస్తే పరిస్థితి ఏమిటనే భయం జిల్లా వాసులను వెంటాడుతోంది.

వణికించిన 2021 నవంబర్ వరదలు

సోమశిలకు నాలుగున్నర దశాబ్దాల కాలంలో ఎన్నడూ భారీ స్థాయిలో వరదలు వచ్చిన సందర్భం లేదు. 2021 నవంబర్‌లో ఎగువన అన్నమయ్య డ్యామ్ తెగి ప్రాజెక్ట్‌కు ఊహించని స్థాయిలో వరద వచ్చింది. రాత్రికి రాత్రే ఒక్కసారిగా ప్రాజెక్ట్ 12 క్రస్ట్ గేట్లు ఎత్తి సుమారుగా 6 లక్షల క్యూసెక్కులు విడుదల చేయడంతో దిగువన పెన్నానది తీరం వెంబడి అనేక ప్రాంతాల ముంపునకు గురయ్యాయి. ఎగువ నుంచి వచ్చిన వరదను ఆ స్థాయిలో దిగువకు విడుదల చేయకపోతే ప్రాజెక్ట్ ప్రమాదంలో పడేదని జలవనరుల నిపుణులు అప్పట్లో ఆందోళన వ్యక్తం చేశారు. అప్పట్లో గండం గడిచిపోయింది. ఆ తర్వాత ఆ స్థాయిలో గత మూడేళ్లుగా వరదలు రాలేదు.

నూతన రోప్‌లు వచ్చి నాలుగు నెలలు

రాష్ట్ర జలవనరుల సాంకేతిక సలహాదారు కన్నయ్యనాయుడు పరిశీలించిన రెండు నెలలకు కాంట్రాక్ట్ అప్పగించి నూతన రోప్‌లను ప్రాజెక్ట్ వద్దకు చేర్చారు. అప్పట్నుంచి సుమారు నాలుగు నెలలు అవుతున్న రోప్‌ల మరమ్మతులు చేయలేదు, ఇటీవల ఒకటో నంబర్ క్రస్ట్ గేటుకు స్టాప్ లాక్ అమర్చి మరమ్మతు చేయాలని ముందుకు వచ్చారు. ఈ తరుణంలో వరదలు వచ్చి జలాశయం పూర్తిగా నిండిపోయింది. ప్రస్తుతం నీటిలో రోప్‌లో మార్చేందుకు సంబంధిత వర్కర్లు రావడం లేదని జలాశయ అధికారులే చెబుతున్నారని సమాచారం.




ప్రాజెక్ట్ గేట్ల నిర్వహణలో అలసత్వం

'నెల్లూరు సీమ నీట మునిగేను'.. అంటూ శ్రీపోతులూరు వీరబ్రహ్మంగారు చెప్పిన జోస్యం నిజం కాబోతుందా? అంటే.. సోమశిల జలాశయం నిర్వహణలో నిర్లక్ష్యం అందుకు దర్పణం పడుతోంది. సోమశిల డ్యామ్ వల్లే ఇలాంటి పరిస్థితి ఉత్పన్నం అవుతుందని జిల్లా ప్రజలు చర్చించుకుంటున్నారు. తాజా పరిస్థితి చూస్తే ప్రాజెక్ట్ గేట్ల నిర్వహణలో అధికారుల అలసత్వం కారణంగా గండం పొంచి ఉందనే అభిప్రాయం వెల్లడవుతోంది. ప్రస్తుతం జలాశయం 74 టీఎంసీలతో నిండుకుండగా ఉంది. డ్యామ్‌కు 12 క్రస్ట్‌గేట్లు ఉంటే.. అందులో రెండు గేట్లు పూర్తిగా బ్లాక్ అయిపోయాయి. ఇటీవల వరద దిగువకు మూడు గేట్లు ద్వారానే వదిలారు. మిగతా గేట్ల పరిస్థితిపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈశాన్య రుతుపవనాల నేపథ్యంలో భారీ వరదలు వస్తే ప్రాజెక్ట్ భద్రతపై భయాందోళన నెలకొంది.

నిండు కుండగా జలాశయం

ఈశాన్య రుతుపవనాల రాకతో
- రాబోయే రెండు నెలలు తుఫాన్లు, భారీ వర్షాలు
- వచ్చే ప్రతి క్యూసెక్కునూ దిగువకు వదలాల్సిందే
- ప్రాజెక్ట్ 12 గేట్లలో 11, 12 నంబర్లు పూర్తిగా బ్లాక్
- ఇటీవల వరదలు రావడంతో 5, 6, 7 గేట్లు ద్వారా నీటి విడదల

అత్యవసర పరిస్థితుల్లో
- మిగిలిన విలిఫ్ట్ అవుతాయో లేదో తెలియని పరిస్థితి
- ఇప్పటికీ టెస్ట్ చేయని అధికారులు
- 2021లో ఆకస్మిక వరద రావడంతో 12 గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేయడంతో ప్రాజెక్ట్ భద్రం
- ఇప్పడూ అలాంటి పరిస్థితి వస్తే ఏమౌతుందని ప్రజల ఆందోళన


ఒకటో నంబరు క్రస్ట్ గేట్‌కు స్టాప్‌లాక్ గేటు అమర్చిన దృశ్యం

పొంచి ఉన్న ప్రమాదం

గ్రేటర్ రాయలసీమపై ఈశాన్య రుతుపవనాల ప్రభావం అధికంగా ఉంటుంది. నైరుతి రుతుపవనాలు విస్తరించిన సమయంలో అడపాదడపా వర్షాలు కురిసినా రాయలసీమ జిల్లాలతోపాటు నెల్లూరు, ప్రకాశం జిల్లాలపై పెద్దగా వర్ష ప్రభావం ఉండదు. తాజాగా ఈశాన్య రుతుపవనాలు రాకతో వాతావరణ మార్పులు సంభవించాయి. ప్రస్తుతం ఎక్కడ పడితే అక్కడ ఆకస్మిక వర్షాలు, వరదలు వస్తున్నాయి. ఎప్పుడు ఎక్కడ ఏ స్థాయిలో వర్షాలు పడుతాయో ఎవరూ ఊహించలేని పరిస్థితి. అక్టోబరు నుంచి డిసెంబరు వరకు ఈశాన్య రుతుపవనాల ప్రభావంగా ఎగువ ప్రాంతాల్లో, జలాశయ ప్రాంతంలో కురిసే ప్రతి వర్షపు చుక్క నేరుగా సోమశిల జలాశయానికి చేరుతోంది. ఇప్పటికే నిండుకుండగా ఉన్న జలాశయానికి వచ్చే వరద జలాలను నిల్వ ఉంచేందుకు వీలులేనందున దిగువకు విడుదల చేయాల్సి పరిస్థితి ఉంటుంది. ఈ సమయంలో గతంలో వచ్చిన స్థాయిలో వరద వస్తే.. క్రస్ట్ గేట్లను లిఫ్ట్ చేసి వరద దిగువకు విడుదల చేయాలంటే.. 11, 12 క్రస్ట్ గేట్లు పూర్తిగా బ్లాక్ అయిపోవడంతో మిగిలిన పది గేట్లలో ప్రస్తుతం 5, 6, 7 క్రస్ట్ గేట్లు సేఫ్‌గానే ఉన్నాయని ఇటీవల స్పష్టమైంది. మిగతా గేట్ల విషయంలో జలాశయం అధికారులకే స్పష్టత లేదని సంబంధిత అధికార వర్గాల ద్వారా స్పష్టమవుతోంది.


తుప్పు పట్టిన రెండో క్రస్ట్‌గేట్ రోప్‌లు

'తుంగభద్రకు పట్టిన గతి తప్పదు'

ఎనిమిది నెలల క్రితం రాష్ట్ర జలవనరుల సాంకేతిక సలహాదారు కన్నయ్యనాయుడు జలాశయ స్థితిగతులను తెలుసుకునేందుకు ప్రాజెక్ట్ పరిశీలనకు వచ్చారు. జలాశయ ఎస్ఈ, ఈఈ, డీఈ, సిబ్బందితో కలిసి జలాశయ ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం ఆయన క్రస్ట్ గేట్ల దుస్థితి చూసి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గేట్ల విషయంపై కనీస నిర్వహణ చేయకపోవడంతో ఆయన మండిపడ్డారు. ఆ సమయంలో ఆయన మాట్లాడుతూ ప్రాజెక్ట్ గేట్లకున్న రోప్‌లు పూర్తిగా దెబ్బతిన్నాయి.. ఇలానే మార్చకుండా మరమ్మతులు చేయకుండా వదిలేస్తే గతంలో తుంగభద్రకు పట్టిన గతి ఈ ప్రాజెక్ట్‌కు పడుతుందన్నారు.

ఇప్పట్లో రోప్‌లు మార్చలేము

జలాశయం పూర్తిసామర్థ్యానికి చేరుకోవడంతో క్రస్ట్ గేట్ల రోప్‌లు మార్చలేకున్నాం. నూతన రోప్‌ను ఏర్పాటు చేయాలంటే స్టాప్ లాక్ గేట్లను అమర్చుకున్న తర్వాత సుమారు నాలుగు రోజులు పడుతుంది. ఈలోపు వరద ఉధృతి పెరిగి నీటిని విడుదల చేయాల్సి వస్తే స్టాప్ లాక్ గేట్లు అడ్డొస్తాయి. అందువల్ల రోప్‌ల మార్పిడి పనులను ప్రస్తుతం నిలిపివేశాం. జలాశయంలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది రిటైర్డ్ కావడంతో కొంత సిబ్బంది కొరత ఉంది. కేవలం 11 ,12 గేట్ల రోప్‌లు పూర్తిగా దెబ్బతిన్నాయి. అవి లిఫ్ట్ అయ్యే సమయంలో తెగిపోయే అవకాశం ఉంది. వాటిని ఆపరేట్ చేయవద్దని ఉన్నతాధికారులు ఆదేశాలు ఇచ్చారు. మిగతా గేట్లు బాగానే ఉన్నాయి.

– శ్రీనివాసులు, సోమశిల జలాశయ ఈఈ

ఛీ.. సేవలు బాలేవు!

భారతీయ రైల్వే... దూర ప్రయాణానికి అత్యంత చవకైన, సౌకర్యవంతమైన మార్గం. అయితే కోవిడ్ అనంతర ఆర్థిక సంస్కరణల పేరుతో వృద్ధుల రాయితీలు సహా పలు రాయితీలను రద్దు చేసిన రైల్వే మంత్రిత్వ శాఖ, ప్రయాణికులకు సేవలందించే విషయంలో మాత్రం అదే నిర్లక్ష్యాన్ని కొనసాగిస్తోంది. రైలు ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నా, వాటిని పరిష్కరించి, పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవడంలో రైల్వే బోర్డు అలసత్వం ప్రదర్శిస్తోంది.

రైల్వే సేవలపై దేశవ్యాప్తంగా పెరుగుతున్న ఫిర్యాదులు	2023-24తో పోలిస్తే 2024-25లో 11 శాతం పెరిగిన కంప్లైట్స్
	ప్రతి 4 ఫిర్యాదుల్లో ఒకటి భద్రతపైనే..
2023-24, 24-25లో దాదాపు 61 లక్షల ఫిర్యాదులు	గత ఏడాది రైలు ప్రయాణంలో భద్రతాలోపాలపై అత్యధికంగా 7.50 లక్షల ఫిర్యాదులు
	కోచ్‌లలో అపరిశుభ్ర వాతావరణంపైనా పెదవి విరిచిన 8.44 లక్షల మంది
	ట్రైన్ల సమయపాలనపై 15 శాతం తగ్గిన ఫిర్యాదులు


సాక్షి, విశాఖపట్నం: రెండేళ్ల కాలంలో (2023-24, 2024-25) రైల్వే సేవలపై దేశవ్యాప్తంగా ప్రయాణికులు ఏకంగా 60.96 లక్షలకు పైగా ఫిర్యాదులు చేశారు. 'రైల్ మదద్' హెల్ప్‌లైన్ (139), సోషల్ మీడియా, వెబ్‌సైట్ల ద్వారా ఈ ఫిర్యాదులు నమోదయ్యాయి. ఫిర్యాదులలో అత్యధికంగా భద్రతా లోపాలపై ఉండటం గమనార్హం. గత వార్షిక సంవత్సరంలో (2024-25) భద్రతకు సంబంధించిన ఫిర్యా దులే ఏకంగా 7.50 లక్షల వరకు నమోదయ్యాయి. దీనికి అదనంగా రైళ్లలో పరిశుభ్రత లేమి, విద్యుత్ పరికరాల వైఫల్యాలు, ఆహారం నాణ్యతపైనా ప్రయాణికులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

అప్‌గ్రేడ్ ఒకవైపు.. లోపాలు మరొకవైపు

దేశంలో వందే భారత్, అమృత్ భారత్ వంటి అత్యాధునిక రైళ్లను ప్రవేశపెడుతూ రైల్వే శాఖ అప్‌గ్రేడ్ అవుతున్నా, రైలు ఎక్కిన దగ్గర నుంచి దిగే వరకూ ప్రయాణికులకు అందించే ప్రాథమిక సేవలైన సీటింగ్, శుభ్రత, నాణ్యమైన ఆహారం విషయంలో మాత్రం లోపాలు కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నాయి. ముఖ్యంగా ఆహారం నాణ్యతపై ఫిర్యాదులు వస్తున్నా వాటికి సరైన విధంగా స్పందించకపోవడం విమర్శలకు తావిస్తోంది. రాయితీలను రద్దు చేసి, ఆదాయాన్ని పెంచుకున్న రైల్వే శాఖ, ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంలో, వారి ఫిర్యాదులను పరిష్కరించడంలో ఎందుకు నిర్లక్ష్యం వహిస్తుందనేది ప్రశ్నార్థకంగా మారింది.

ఆహారమంటే.. ఆమడ దూరం.!

రైల్వేలలో నాణ్యత లేని ఆహారం వడ్డించారనే ఫిర్యాదులు ఎప్పటికప్పుడు వస్తూనే ఉన్నాయి. అయినా ఆహారం అందిస్తున్న కాంట్రాక్టు సంస్థలపై చర్యలు మాత్రం.. నామమాత్రంగానే తీసుకుంటున్నారు. ప్రయాణికులకు అవసరమైన శుచి, రుచికరమైన ఆహారం అందించాలన్నదానిపై మాత్రం రైల్వే మంత్రిత్వ శాఖ ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. 2020-21లో 253 ఫిర్యాదులు మాత్రమే అందగా, 2021-22లో 1082కి పెరిగింది. ఫిర్యాదుల సంఖ్య ఏడాదికేడాది పెరుగుతూవస్తోంది. 2022-23లో 4421 ఫిర్యాదులు నమోదు కాగా, 2023-24లో 7026, 2024-25లో 6645కి చేరుకుంది. గత ఐదేళ్లలో ఒక్క ఫిర్యాదుకే తీవ్రంగా స్పందించిన రైల్వే శాఖ.. ఆహారం అందిస్తున్న కాంట్రాక్టు సంస్థ లైసెన్స్‌ని రద్దు చేసింది. 3137 ఫిర్యాదులకు జరిమానాలు విధించగా.. 9627 ఫిర్యాదుల్ని పరిగణనలోకి తీసుకొని సదరు కాంట్రాక్టు సంస్థలకు హెచ్చరికలతో సరిపెట్టింది. ట్రైన్లలో ఆహారం అందించేందుకు దేశ వ్యాప్తంగా 20 సంస్థలతో రైల్వే బోర్డు ఒప్పందాలు కుదుర్చుకుంది. అయినా కఠిన చర్యలు తీసుకోవడంలో మాత్రం రైల్వే మంత్రిత్వ శాఖ మీనమేషాలు లెక్కిస్తూ నాణ్యత లేని ఆహారం సరఫరా చేస్తున్న సంస్థలపై కనీస చర్యలు తీసుకోకపోవడం గమనార్హం.


రిజర్వేషన్ బోగీలో బెర్త్ పరిస్థితి ఇది..


భద్రత శూన్యం.. శుభ్రత మృగ్యం

2023-24లో రైల్వే సేవల్లోని అన్ని ఫిర్యాదులు కలిపి 28.96 లక్షలు వచ్చాయి. 2024-25 సంవత్సరంలో ఏకంగా 11 శాతానికిపైగా పెరిగి 32 లక్షలకు చేరుకుందంటే.. లోపం ఎంతలా ఉందో అర్థం చేసుకోవచ్చు. రైల్వే ప్రయాణంలో భద్రత అనేది ప్రయాణికులకు అతి పెద్ద సమస్యగా మారిందని ఫిర్యాదుల ద్వారా అవగతమవుతోంది. రైళ్లలో భద్రతకు సంబంధించిన ఫిర్యాదులు గతేడాదితో పోలిస్తే.. 64 శాతం వరకూ పెరిగాయి. 2023-24లో 4.57 లక్షల ఫిర్యాదులు భద్రతకు సంబంధించి కాగా.. 2024-25లో 7.50 లక్షలకు చేరుకోవడం బాధాకరం. ప్రతి నాలుగు ఫిర్యాదుల్లో ఒకటి భద్రతకు సంబంధించింది ఉండటం చూస్తే.. రైలు ప్రయాణికులు ఎంతలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారో స్పష్టమవుతోంది. అదేవిధంగా.. తర్వాత లోపం.. కోచ్‌లలో పరిశుభ్రత కరువవ్వడం. ఏడాది కాలంలో వచ్చిన ఫిర్యాదుల్లో కోచ్‌లలో అపరిశుభ్ర వాతావరణంపై 16.5శాతం వరకూ ఉంటున్నాయి. గతేడాదిలో ఏకంగా 8.44 లక్షల ఫిర్యాదులు అందాయి. విద్యుత్ పరికరాల వైఫల్యాలపైనా ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. అయితే.. సమయపాలన గురించి ఫిర్యాదులపై 15 శాతం వరకూ తగ్గడం కాస్తా ఉపశమనం. 2023-24లో సమయపాలనపై 3.25 లక్షల కంప్లెయింట్స్ రాగా.. 2024-25లో 2.77 లక్షలకు తగ్గడం విశేషం. రైల్వే స్టేషన్ల స్థాయి ఫిర్యాదులు కూడా తగ్గుముఖం పట్టాయి. 2023-24లో స్టేషన్ స్థాయి ఫిర్యాదులు 5.55 లక్షలు రాగా.. 2024-25లో 4.39 లక్షలకు తగ్గాయి.


రైలులో అందజేసిన నాసిరకం భోజనం



- 2023-24లో రైలు సేవలపై ఫిర్యాదులు- **28.96** లక్షలు
- 2024-25లో ఫిర్యాదులు **32** లక్షలు
- భద్రతపై 2024-25లో వచ్చిన ఫిర్యాదులు- **7.50** లక్షలు
- అపరిశుభ్రవాతావరణంపై వచ్చిన ఫిర్యాదులు- **8.44** లక్షలు
- సమయపాలనపై 2024-25లో వచ్చిన ఫిర్యాదులు- **2.77** లక్షలు
- 2020-21లో ఆహారంపై వచ్చిన ఫిర్యాదులు- **253**
- 2024-25లో వచ్చిన ఫిర్యాదులు- **6,645**



రైళ్లలో ఫిర్యాదులకు సంబంధించి ప్రయాణికులు అప్‌లోడ్ చేసిన ఫొటోలు

విహంగాల విహారం


పక్షుల కేంద్రంలో గూడబాతులు

దొరవారిసత్రం: ఆసియా ఖండంలోనే విదేశీ శీతాకాలపు వలస విహంగాలకు అతి పెద్ద సంతానోత్పత్తి కేంద్రంగా బాసిల్లుతున్న తిరుపతి జిల్లాలోని నేలపట్టు పక్షుల రక్షిత కేంద్రంలో నాలుగు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు విహంగాల ఆగమనం మొదలైంది. దీంతో పక్షుల కిలకిలరావాలు వినిపిస్తున్నాయి. సకాలంలో వర్షాలు కురిసి చెరువులు నీటితో నిండి ఉంటే ఈ పాటికే అన్ని రకాల పక్షుల విచ్చేసి వాటి పనుల్లో నిమగ్నమై ఉండాలి. కాని ఈ దఫా విహంగాల సీజన్(అక్టోబర్‌లో మొదలై ఏప్రిల్‌లో ముగుస్తుంది) మొదలైనప్పటికీ విదేశీ వలస విహంగాలు సందడి ఆలస్యంగా మొదలైంది. ప్రస్తుతం పక్షుల కేంద్రంలో పదుల సంఖ్యలో పక్షుల్లో రారాజుగా పిలిచే గూడబాతుల(పెలికాన్స్)తోపాటు తెల్లకంకణాయిలు(వైట్ ఐబీస్) వందల సంఖ్యలో నత్తగుళ్లకొంగలు విచ్చేసినట్లు స్థానిక వన్యప్రాణి విభాగం సిబ్బంది తెలియజేశారు.

పక్షుల కేంద్రంలో ఈపాటికే...

వర్షాలు సకాలంలో కురిసి ఉంటే పక్షుల కేంద్రం పరిధిలోని అత్తిగుంట చెరువు, నేరేడుగుంట చెరువు, మారేడుగుంట చెరువుల్లో నీరు చేరి ఉంటే వలస విహంగాల్లో ప్రధాన పక్షులు అన్ని ఈ పాటికే చేరి, చెరువుల్లో ఉన్న కడప చెట్లపై చేరి ఆడ, మగ పక్షులు ఒకదాని ఒక్కటి స్నేహం కుదుర్చుకుని పుల్లలతో గూళ్లు కట్టుకుంటూ ఉండాలి. కాని వానలు సక్రమంగా కురవకపోవడంతో వలస విహంగాల సీజన్ ఆలస్యం కాకతప్పలేదు. ఇప్పుడైన పుష్కలంగా వానలు కురవందే వలస విహంగా పూర్తి స్థాయిలో కేంద్రానికి వచ్చే పరిస్థితి ఉండదు. ఇప్పటి వరకు కురిసిన వానలకు చెరువుల్లోకి అరకొరగానే సాగు నీరు చేరాయి. కేంద్రంలో విదేశీ వలస విహంగాలకు పూర్తి స్థాయిలో వాతవరణం అనుకూలిస్తేనే వేల సంఖ్యలో గూడబాతులు, నత్తగుళ్లకొంగలు, తెల్లకంకణాయిలు, స్వాతికొంగలు, వందల సంఖ్యలో తెడ్డుముక్కుకొంగలు, నీటికాకులు, బాతుజాతికి చెందిన పలు రకాల పక్షుల విచ్చేసి వాటి వాటి సంతానాన్ని అభివృద్ధి చేసుకోలేవు. స్వదేశీ విహంగాలైన నత్తగుళ్లకొంగలు పక్షుల కేంద్రంలోకి గత నెలలోనే వందల సంఖ్యలో విచ్చేశాయి. ఈపక్షుల్లో కొన్ని జత కట్టి పనుల్లో ఉండగా మరి కొన్ని కడప చెట్లపై గూళ్లు కట్టుకునే పనిలో ఉన్నాయి.


తెల్లకంకణాయిలు



అచ్చం మంత్రం వేసినట్లే... మంత్రముగ్ధులను చేస్తుంది!!

1 వ రోజు

హైదరాబాద్ నుంచి గువాహటి మీదుగా షిల్లాంగ్‌కు ప్రయాణం. గువాహటి ఎయిర్‌పోర్ట్‌లో టూర్ నిర్వాహకులు రిసీవ్ చేసుకుని రోడ్డు మార్గాన ప్రయాణం షిల్లాంగ్‌కు సాగుతుంది. షిల్లాంగ్‌లో హోటల్‌లో చెక్ ఇన్. రాత్రి బస.

డిసెంబర్ నెలలో మేఘాలయ విహారం.
షిల్లాంగ్‌లో సేదదీరి...చిరపుంజి జల్లును చూద్దాం.
మంజీరవ సవ్వడి చేసే జలపాతాన్ని వీక్షిద్దాం.
భారత్ -బంగ్లా మధ్య వంతెన మీద అడుగులేద్దాం.
స్వచ్ఛగ్రామంలో శుభ్రత పాఠం నేర్చుకుందాం.
ముక్కు మీద కొమ్ముతో భయపెట్టే ఖడ్గమృగాన్ని చూద్దాం.
కామాఖ్యను దర్శించుకుని బ్రహ్మపుత్రలో విహరిద్దాం.
అసోమ్ కళల సంస్కృతిని మ్యూజియంలో చూద్దాం.
నో డౌట్... మంత్రముగ్ధులను చేసే పర్యటన ఇది.

2 వ రోజు

షిల్లాంగ్ నుంచి చిరపుంజికి ప్రయాణం. షిల్లాంగ్‌లో హోటల్‌లో బ్రేక్‌ఫాస్ట్ తర్వాత చిరపుంజికి చేరుకుని ఎలిఫెంటా ఫాల్స్, నోహ్ కాకి కాయ్ ఫాల్స్, మవాస్మాయ్ కేవ్స్ వీక్షణం తర్వాత తిరిగి షిల్లాంగ్‌కు ప్రయాణం. ఆ రాత్రి బస కూడా షిల్లాంగ్‌లోనే.



జల సోపానం

ఈ వాటర్‌ఫాల్స్ సుతిమెత్తగా మెట్లు దిగుతున్న అందమైన అమ్మాయిలాగ ఉంటుంది. పాద మంజీరాల సవ్వడి వలె చిరుసవ్వడి చేస్తూ జలధార మెట్ల మీద నుంచి ప్రవహించి నేల మీద మడుగుగా మారుతుంది. ఈ జలపాతాన్ని చూస్తే ఎలిఫెంట్ వాటర్ ఫాల్స్ అనే పేరు ఎందుకు వచ్చిందో వెంటనే అర్థం కాదు. ఏనుగంత భారీ జలపాతమూ కాదు, ఏనుగు తొండం వంటి ఆకారం నుంచి నీరు ప్రవహించడం వంటి ప్రకృతి సోయగమూ కనిపించదు. ఇక్కడ ఒక రాయి ఏనుగు ఆకారంలో ఉండడంతో బ్రిటిష్ వాళ్లు ఎలిఫెంట్ ఫాల్స్ అన్నారు. అధికారిక డాక్యుమెంట్‌లలో అదే పేరు కొనసాగింది. స్థానిక ఖాసీ తెగ వాళ్లు తమ ఖాసీ భాషలో దీనికి పెట్టుకున్న పేరు 'కా క్షైద్ లాయ్ పతెంగ్ ఖోసియో'. ఈ పేరు పలకడం సాధ్యం కాకపోవడం కూడా బ్రిటిష్ వారు పెట్టిన పేరే స్థిరపడిపోయింది.

మేఘాలయ బెలుం గుహలు


మవాస్మాయ్ గుహలను ప్రకృతి అద్భుతం అంటే చాలా చిన్న మాట అవుతుంది. ఈ గుహలు ఓ పెద్ద రసాయన గ్రంథం. మన రాష్ట్రంలో బెలుం గుహల్లో ఉన్నట్లే ఇక్కడ కూడా స్టాలగ్‌మైట్, స్టాలగ్‌టైట్ ధారలు కనువిందు చేస్తాయి. ఈ రసాయన ధారల గాఢతను బట్టి శాస్త్రవేత్తలు వాటి వయసును నిర్ధారిస్తారు. ఈ గుహల్లోపల నడుస్తుంటే ఒక గుహ నుంచి మరో గుహకు కనెక్షన్ ఉంటుంది. బౌద్ధ గుహల్లాగ ఎవరో పని గట్టుకుని తొలిచిన గుహలు కావివి. సహజంగా ఏర్పడిన గుహలు. ఇక చిరపుంజి గురించి దేశమంతటికీ తెలిసిన విషయం అత్యధిక వర్షపాతం నమోదయ్యే ప్రదేశం అని. కానీ ఇక్కడ ఇంకా ఎన్నో ప్రకృతి చమత్కారాలున్నాయి. పర్వతాల మీదకు ట్రెకింగ్, అందమైన లోయల వీక్షణం, వ్యూ పాయింట్‌లలో ఫొటో షూట్, వేళ్ల వంతెనలు కూడా. ఐదు వందల ఏళ్ల నాటి వేళ్ల వంతెన చిరపుంజికి మరో రికార్డ్.



సెవెన్ సిస్టర్ ఫాల్స్

నోహ్ కాకికాయ్ జలపాతానికి వ్యవహారనామం సెవెన్ సిస్టర్స్ వాటర్‌ఫాల్స్. ఇది కూడా బ్రిటిష్ అధికారులు చేసిన నామకరణమే. కెనడాలో మనటోబా గ్రామంలోని ఏడుపాయల జలపాతం పేరు సెవెన్ సిస్టర్స్ పాల్స్. మేఘాలయలోని నోహ్ కాకికాయ్ జలపాతానికి కూడా సెవెన్ సిస్టర్స్ ఫాల్స్ అనే పేరు పెట్టడం ప్రభుత్వ రికార్డుల్లో రాయడంతో అది అధికారిక నామం అయింది. ఈ జలపాతం మవాస్మాయ్ గుహలకు దగ్గరలో ఉండడంతో స్థానికులు మవాస్మాయ్ జలపాతం అంటారు. ఇది ఎంత విశాలమైన జలపాతమంటే మొదటి పాయ నుంచి ఏడవ పాయ వరకు దూరం దాదాపు కిలోమీటరు ఉంటుంది. ఎండాకాలంలో సన్నని ధారలుగా ఉంటుంది. వర్షాకాలంలో ఝుమ్మని శబ్దం చేస్తూ ఉరకలెత్తుతున్న గోదావరిని తలపిస్తుంటుంది. ఈ జలపాతాన్ని దూరాన్నుంచి చూడడమే తప్ప జలధారల కింద సేదదీరే అవకాశం లేదు.





3 వ రోజు

ఈ రోజు ప్రయాణం షిల్లాంగ్ నుంచి డాకీకి. బ్రేక్‌ఫాస్ట్ తర్వాత ప్రయాణం డాకీ లేక్‌కు సాగుతుంది. డాకీ లేక్ విహారం తర్వాత మాలిన్నాంగ్ విలేజ్ వీక్షణం. లివింగ్ రూట్స్ బ్రిడ్జి మీద నడక తర్వాత షిల్లాంగ్‌కు తిరుగు ప్రయాణం. ఈ రాత్రి బస కూడా షిల్లాంగ్‌లోనే.

దేశాలను కలిపే వంతెన

ఆ ఒడ్డు ఈ ఒడ్డు నడిమధ్య ఏరడ్డు... అని సినీగేయాలను ఆలపించాం. కానీ ఆ హద్దు ఈ హద్దు సరిహద్దుల మధ్య వంతెన గురించి ఏ పాటా లేదు. మనకు మనమే పాడుకోవాలి. భారత్ – బంగ్లాదేశ్‌ల మధ్య ఉమ్‌న్‌గోట్ నది ప్రవహిస్తుంటుంది. నది మీద మనదేశంలో డాకీ అనే గ్రామం నుంచి బంగ్లాదేశ్‌లోని తమాబిల్‌కు ఉన్న వంతెన పేరే డాకీ బ్రిడ్జి.

వక్కలూరు

మావ్ లిన్నాంగ్ గ్రామంలో వక్క పండిస్తారు. తమలపాకుతోపాటు తినే వక్క ఇక్కడ ప్రధాన పంట. గ్రామస్థులు పరిశుభ్రత పట్ల క్రమశిక్షణతో ఉంటారు. గ్రామంలో వీధులకు రెండు పక్కలా చెట్లు చక్కగా చిక్కగా విస్తరించి ఉంటాయి. కానీ రోడ్డు మీద ఒక్క ఆకు కూడా కనిపించదు. రాలిపడిన ఆకులను ఎత్తి డస్ట్‌బిన్‌లో వేయడం నుంచి అలా సేకరించిన చెత్తను ఎరువుగా మార్చడం వరకు ప్రతిదీ నియమబద్ధంగా చేస్తారు. డస్ట్ బిన్‌కి కూడా ప్లాస్టిక్ వాడరు, అన్నీ వెదురు బుట్టలే. అందుకే మావ్ లిన్నాంగ్ గ్రామం జీరో వేస్ట్ పాలసీని అనుసరిస్తున్న అత్యంత శుభ్రమైన గ్రామంగా రికార్డు సాధించింది. ఈ గ్రామంలో మరో విశిష్టత ఏమిటంటే... ఇక్కడ మాతృస్వామ్యం కొనసాగుతోంది. తల్లి నుంచి ఆస్తి కూతుర్లకు సంక్రమిస్తుంది. అలాగే తల్లి ఇంటి పేరే పిల్లలకు సంక్రమిస్తుంది.





వేళ్ల వంతెన

చెట్ల వేరును వంతెనలా అల్లడం అన్నమాట. భూమిలోపల ఉండే వేళ్లతో ఎలా సాధ్యం అనే సందేహం నిజమే. కానీ రబ్బరు చెట్ల వేళ్లు భూమి లోపల విస్తరించడంతోపాటు కొన్ని వేళ్లు భూమి పైన కూడా ఉంటాయి. వాటిని చెట్టు నుంచి వేరు చేయకనే తాళ్లుగా పేనుతూ వంతెన అల్లుతారు. అల్లిక ఆధారం దొరకడంతో ఆ వేరు అదే దిశలో పెరుగుతూ ఉంటుంది. ఇలా నది మీద ఒక ఒడ్డున ఉన్న చెట్ల నుంచి మరో ఒడ్డున ఉన్న చెట్ల వేళ్లతో కలుపుతూ పూర్తిస్థాయి వంతెన రూపం తీసుకువస్తారు. ఆదివాసీలు తమ జీవనం కోసం ప్రకృతికి విఘాతం కలిగించరు. ఇంటి నిర్మాణానికి అవసరమైన కలపను కూడా ఎండిన చెట్ల నుంచే సేకరిస్తారు. చెట్ల నుంచి వేరును వేరు చేయకుండా వంతెన అల్లే కళ కూడా ప్రకృతి హితమైన జీవనం నుంచి పుట్టిన గొప్ప ఆలోచన అనే చెప్పాలి. ఈ వంతెన మీద నడుస్తున్నప్పుడు లయబద్ధంగా చిన్న కదలికలు వస్తుంటాయి. స్థానికులు ఆ కదలికలకు అనుగుణంగా దేహాన్ని బాలెన్స్ చేసుకుంటూ ఏ మాత్రం తడబడకుండా నడుస్తారు.

4 వ రోజు

షిల్లాంగ్ నుంచి ఖజిరంగాకు ప్రయాణం. బ్రేక్‌ఫాస్ట్ తర్వాత రోడ్డు మార్గాన ఖజిరంగా నేషనల్ పార్క్‌కు సాగిపోవాలి. ఇది దాదాపుగా మూడు వందల కిలోమీటర్ల ప్రయాణం. ఖజిరంగాకు చేరిన తర్వాత హోటల్ గదిలో చెక్ ఇన్ కావడం, రాత్రి బస.

ఈ రాష్ట్రం నుంచి ఆ రాష్ట్రానికి

మేఘాలయ రాజధాని నగరం షిల్లాంగ్ హిల్‌స్టేషన్. ప్రకృతి వరమిచ్చినట్లున్న అందమైన పర్యాటక ప్రదేశం కూడా. 'స్కాట్‌లాండ్ ఆఫ్ ద ఈస్ట్' అనే ప్రశంసను పొందిన నగరం. ఖాసీ, జాంతియా హిల్స్ చిక్కటి పచ్చదనాన్ని వీక్షిస్తూ సాగే ప్రయాణం గొప్ప అనుభూతి. పర్యటనలో ఒక ప్రదేశం నుంచి మరో ప్రదేశానికి సాగే ప్రయానానికి అర్థం గమ్యం కోసం ఎదురు చూడడం కాదు. అడుగడుగునా కనువిందు చేస్తున్న ప్రకృతి రమణీయతను ఆస్వాదించడం. మేఘాలయ రాష్ట్రంలో మొదలైన ప్రయాణం అసోమ్‌కు చేరుతుంది. ఐదువేల అడుగుల ఎత్తులో సాగే ప్రయాణం భౌగోళిక శాస్త్రం పుస్తకాన్ని చదివినట్లే ఉంటుంది.



5 వ రోజు

ఖజిరంగ నుంచి గువాహటికి ప్రయాణం. తెల్లవారు జామున ఖజిరంగా నేషనల్ పార్క్ సఫారీకి బయలుదేరాలి. సఫారీ ఖర్చు ప్యాకేజ్‌లో వర్తించదు. పర్యాటకులు ఎవరికి వారే భరించాలి. నేషనల్ పార్క్ సఫారీ తర్వాత తిరిగి హోటల్‌కు చేరి రిఫ్రెష్ అయి బ్రేక్‌ఫాస్ట్ ముగించుకుని గువాహటి వైపు సాగిపోవాలి. గువాహటిలో హోటల్ చెక్ ఇన్, రాత్రి బస.




కత్తిలాంటి అడవి

అసోమ్ అనగానే ఖడ్గమృగం కళ్ల ముందు మెదలుతుంది. ఖజిరంగా నేషనల్ పార్క్‌లో రెండువేలకు పైగా ఖడ్గమృగాలున్నాయంటే నమ్ముతారా? ఖడ్గమృగాలు మాత్రమే కాదు, పులుల సంఖ్య కూడా ఎక్కువే. వన్యప్రాణి సంరక్షణ చర్యలు పటిష్ఠంగా తీసుకోవడం వల్ల పక్షుల సంఖ్య కూడా బాగా పెరిగింది. ఈ ప్రకృతి వరాన్ని ఆస్వాదించాలంటే ఎలిఫెంట్ సఫారీ చేయాలి. ఎలిఫెంట్ సఫారీకి భయపడేవాళ్లు జీప్ సఫారీ చేయవచ్చు. ఖజిరంగా నేషనల్ పార్క్ సమగ్రత నేపథ్యంలో యునెస్కో ఈ అటవీ ప్రదేశాన్ని హెరిటేజ్ సైట్‌గా గుర్తించింది.

6 వ రోజు

హోటల్‌లో బ్రేక్‌ఫాస్ట్ తరవాత కామాఖ్య ఆలయ దర్శనం. మధ్యాహ్నం బ్రహ్మపుత్ర నదిలో క్రూయిజ్ విహారం. క్రూయిజ్ టికెట్ ప్యాకేజ్‌లో వర్తించదు. పర్యాటకులే టికెట్ కొనుక్కోవాలి. రాత్రి బస గువాహటిలో.



దశమహావిద్యల నిలయం

కామాఖ్య ఆలయం 51 శక్తిపీఠాల్లో ఒకటి. ఇందులో ప్రధాన దైవం కామాఖ్య అమ్మవారు. కామాఖ్య ఆలయం ప్రాంగణంలో దశమహా విద్యల దేవతలు త్రిపుర సుందరి, మాతంగి, కమల, కాళి, తార, భువనేశ్వరి, బగలాముఖి, చిన్న మస్త, భైరవి, ధూమవతి కొలువై ఉన్నారు. ఇక్కడ శివుడు కామేశ్వరుడు, సిద్ధేశ్వరుడు, కేదారేశ్వర, ఆమరకోటేశ్వర, అగోర, కోటిలింగ పేర్లతో పూజలందుకుంటున్నాడు.

బ్రహ్మాండ ప్రయాణం

బ్రహ్మపుత్రలో పడవ ప్రయాణం లైఫ్ టైమ్ ఎక్స్‌పీరియెన్స్. కొండవాలులో విస్తరించిన టీ తోటలను చూస్తూ క్రూయిజ్‌లో ప్రయాణించడం, క్రూయిజ్ ఆగిన చోట దిగి కాలినడకన వెళ్లి స్థానిక నివాస ప్రదేశాలను వీక్షించడం, నడవలేని వాళ్లు రిక్షాలో ప్రయాణిస్తూ చుట్టి రావచ్చు. కాలిబాటల వెంట ఒకరి వెనుక ఒకరు మౌనంగా నడిచి వెళ్లే బౌద్ధ సన్యాసులు కనిపిస్తారు. బౌద్ధ చైత్యాలు, విహారాలు కనిపిస్తాయి. చిన్న పడవల్లో చేపలు పట్టే జాలరులు కనిపిస్తారు. ఈ టూర్‌లో రియల్ ఇండియాని దగ్గర నుంచి చూడవచ్చు. అందుకే ఇది బ్రహ్మాండమైన ప్రయాణం.


7 వ రోజు

గువాహటి నుంచి హైదరాబాద్‌కు ప్రయాణం. బ్రేక్‌ఫాస్ట్ తర్వాత గది చెక్ అవుట్ చేసి లగేజ్‌తో బయలుదేరాలి. అస్సాం స్టేట్ మ్యూజియం వీక్షణం తర్వాత గువాహటి ఎయిర్‌పోర్ట్‌లో డ్రాప్ చేసి నిర్వాహకులు వీడ్కోలు చెబుతారు. హైదరాబాద్ ఫ్లయిట్ ఎక్కి రాత్రికి హైదరాబాద్‌కు చేరడంతో టూర్ పూర్తవుతుంది.



అసోం కళల నిలయం

అస్సాం స్టేట్ మ్యూజియాన్ని 'అస్సాం రీసెర్చ్ సొసైటీ' స్థాపించింది. మ్యూజియంలో ప్రతి ఎగ్జిబిట్ ఈ విషయాన్ని చెబుతూ ఉంటుంది. ప్రాచీన కాలం నాటి ఆయుధాల విభాగం అసోం జానపద జీవనశైలికి, నాటి లోహ శాస్త్ర నైపుణ్యానికి అద్దం పడుతుంది. శిల్ప శాస్త్రం కూడా బాగా అభివృద్ధి చెందిన రోజులవి. రాతి శిల్పాలు, లోహ శిల్పాలతోపాటు దారుశిల్పాలు, మట్టి శిల్పాలను కూడా చూడవచ్చు. పౌరాణిక కథనాల ప్రతిరూపాలవి. అసోం కళలు, సంస్కృతి అవగతమవుతుంది. సాహిత్య విభాగం ఇక్కడ చక్కటి సాహిత్యం వెల్లివిరిసిందనడానికి ప్రతిబింబంగా ఉంటుంది.



ఈ టూర్ ప్యాకేజ్ పేరు 'మెస్మరైజింగ్ మేఘాలయ అండ్ అస్సాం'. ప్యాకేజ్ కోడ్: ఎస్‌హెచ్‌ఏ14. హైదరాబాద్ నుంచి మొదలై హైదరాబాద్ చేరడంతో పూర్తవుతుంది. ఏడు రోజులు సాగే ఈ టూర్‌లో షిల్లాంగ్, చిరపుంజి, ఖజిరంగా, గువాహటి ప్రదేశాలు కవర్ అవుతాయి.

ప్రయాణం ఎప్పుడు?

- 8.12.2025. డిసెంబర్ 8వ తేదీ తెల్లవారు జామున 05.40 గంటలకు 6ఈ 972 ఫ్లయిట్ హైదరాబాద్ నుంచి బయలుదేరి ఉదయం 08.10 నిమిషాలకు గువాహటికి చేరుతుంది.
- డిసెంబర్ 14వ తేదీ 6ఈ 187 ఫ్లయిట్ రాత్రి 19.20 గంటలకు గువాహటి నుంచి బయలుదేరి 22.20 గంటలకు హైదరాబాద్‌కు చేరుతుంది.

టారిఫ్ ఇలా ఉంటుంది!

సింగిల్ ఆక్యుపెన్సీలో 61,100 రూపాయలు.
డబుల్ ఆక్యుపెన్సీలో ఒక్కొక్కరికి 45 వేలు,
ట్రిపుల్ ఆక్యుపెన్సీలో 43, 750 రూపాయలు.

బుకింగ్ కోసం:


ఐఆర్‌సీటీసీ సౌత్ సెంట్రల్ జోన్,9-1-129/1/302, మూడవ ఫ్లోర్, ఆక్స్‌ఫర్డ్ ప్లాజా,ఎస్.డి. రోడ్, సికింద్రాబాద్, తెలంగాణ. ఫోన్ నంబరు: 8287932229



- వాకా మంజులారెడ్డి,
సాక్షి ఫీచర్స్ ప్రతినిధి







విజయం అంటే విఫలమయ్యాక కూడా
నిరాశ చెందకుండా ముందుకు సాగడం.
- విన్‌స్టన్ చర్చిల్, రచయిత, యూకే మాజీ ప్రధాని

బిజినెస్ రీల్

ఐపీవోకు మీషో రెడీ

- సెబీకి ముసాయిదా ప్రాస్పెక్టస్ దాఖలు
- కొత్తగా రూ. 4,250 కోట్ల ఈక్విటీ జారీ



న్యూఢిల్లీ: పీఈ దిగ్గజం సాఫ్ట్‌బ్యాంక్‌కు పెట్టుబడులున్న ఈకామర్స్ కంపెనీ మీషో పబ్లిక్ ఇష్యూకి వస్తోంది. ఇందుకు అనుగుణంగా క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీకి ముసాయిదా ప్రాస్పెక్టస్ దాఖలు చేసింది. దీనిలో భాగంగా రూ. 4,250 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది. అంతేకాకుండా వీటికి జతగా దాదాపు 17.57 కోట్ల షేర్లను ప్రస్తుత వాటాదారులు విక్రయానికి ఉంచనున్నారు. షేర్లను విక్రయించనున్న సంస్థల జాబితాలో ఎలివేషన్, పీక్ 15, వెంచర్ హైవే, వై కాంబినేటర్ తదితరాలున్నాయి. ఈ సంస్థలు 5–7 శాతం ఈక్విటీని ఆఫర్ చేయనున్నట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. వెరసి ఐపీవో ద్వారా రూ. 7,000 కోట్లవరకూ సమీకరించే వీలున్నట్లు అంచనా. ఐపీవోకు ధరల శ్రేణి ప్రకటించాక కంపెనీ మార్కెట్ విలువ మదింపునకు వీలుంటుందని నిపుణులు తెలియజేశారు. ఈక్విటీ జారీ నిధులను మీషో టెక్నాలజీస్‌లో క్లౌడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌పై పెట్టుబడులతోపాటు.. మెషీన్ లెర్నింగ్, ఏఐ, టెక్నాలజీ బృందాల వేతనాలకు వెచ్చించనుంది. గతేడాది(2024–25) నికర మెర్కండైజ్ విలువ(ఎన్ఎంవీ) 29 శాతం జంప్‌చేసి రూ. 29,988 కోట్లను తాకింది. ఈ ఏడాది(2025–26) ఏప్రిల్–జూన్‌లో ఎన్ఎంవీ 36 శాతం జంప్‌చేసి రూ. 8,679 కోట్లకు చేరింది. అయితే గతేడాది రూ. 3,942 కోట్ల నికర నష్టం ప్రకటించింది.

‘59మినిట్స్’లో రూ.2.65 లక్షల ఎంఎస్ఎంఈ రుణాలు



న్యూఢిల్లీ: 59మినిట్స్ ప్లాట్‌ఫామ్ స్కీమ్ కింద గడిచిన ఏడేళ్లలో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పారిశ్రామిక సంస్థ(ఎంఎస్ఎంఈ)లకు ప్రభుత్వ రంగ బ్యాంకులు రూ.2.65 లక్షల కోట్ల రుణాలను పంపిణీ చేశాయి. మొత్తం 30 లక్షల రుణాలను మంజూరు చేసినట్లు ఈ ప్లాట్‌ఫామ్ వెల్లడించింది. ఎంఎస్ఎంఈలకు రూ.10 లక్షల నుంచి రూ. 5 కోట్ల వరకు రుణాలను సాధారణంగా గంటలోపే ఆమోదించే విధంగా 59మినిట్స్ ప్లాట్‌ఫామ్‌ను 2018లో అందుబాటులోకి తీసుకొచ్చారు. జీఎస్‌టీ రిటర్నులు, ఆదాయపు పన్ను ఫైలింగ్స్, బ్యాంక్ స్టేట్‌మెంట్లు, క్రెడిట్ బ్యూరో రిపోర్టుల వంటి పలు రకాల కీలకమైన ఆర్థిక సమాచారాన్ని ఆటోమేటెడ్ ఆల్గోరిథమ్స్‌తో అనుసంధానం చేయడం ద్వారా రుణగ్రహీతల పరపతిని చాలా వేగంగా మదింపు చేయడం 59మినిట్స్ ప్లాట్‌ఫామ్ ప్రత్యేకత. ఇక్కడ ఆమోదం లభించిన వెంటనే బ్యాంకులు తమ సమగ్ర డాక్యుమెంట్ వెరిఫికేషన్‌ను పూర్తి చేసి రుణాలను మంజూరు చేస్తాయి.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

20-10-2025

విశాఖ	545-00
చిత్తూరు	583-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	553-00
విజయవాడ	560-00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	540-00
వరంగల్	542-00
రిటైల్ ధర	6.00

క్యూ2 ఫలితాల ఎఫెక్ట్

జాబితాలో కాల్గేట్, హెచ్‌యూఎల్, డాక్టర్ రెడ్డీస్

- ఈ వారం ట్రేడింగ్ మూడు రోజులకే పరిమితం
- రేపు మధ్యాహ్నం గంటపాటు ముహూరత్ ట్రేడింగ్
- ఆర్ఐఎల్, ఐసీఐసీఐ, హెచ్‌డీఎఫ్‌సీ, పీఎన్‌బీపై దృష్టి
- ఈ వారం మార్కెట్ల కదలికలపై నిపుణుల అంచనా

దేశీ స్టాక్ మార్కెట్లను ఈ వారం ప్రధానంగా జులై–సెప్టెంబర్(క్యూ2) ఫలితాలు ప్రభావితం చేయనున్నాయి. గత వారాంతాన ఆర్ఐఎల్‌తోపాటు బ్యాంకింగ్ దిగ్గజాలు హెచ్‌డీఎఫ్‌సీ, ఐసీఐసీఐ, పీఎన్‌బీ, యస్ బ్యాంక్ క్యూ2 పనితీరు వెల్లడించాయి. అంతేకాకుండా ఈ వారం మరికొన్ని దిగ్గజాలు ఫలితాలు ప్రకటించనున్నాయి. వివరాలు చూద్దాం..
- సాక్షి, బిజినెస్ డెస్క్

దీపావళి సందర్భంగా మంగళవారం(21) నిర్వహించనున్న మూరత్ ట్రేడింగ్‌ను మినహాయిస్తే ఈ వారం మార్కెట్లు మూడు రోజులే పనిచేయనున్నాయి. అయితే క్యూ2 ఫలితాలతోపాటు పలు అంశాలు మార్కెట్లను నడిపించనున్నట్లు విశ్లేషకులు పేర్కొంటున్నారు. గత వారాంతాన మార్కెట్లు ముగిశాక డైవర్సిఫైడ్ దిగ్గజం రిలయన్స్(ఆర్ఐఎల్)సహా.. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, ఫెడరల్ బ్యాంక్, యస్ బ్యాంక్, పంజాబ్ నేషనల్ బ్యాంక్ జులై–సెప్టెంబర్ ఫలితాలు ప్రకటించాయి. దీంతో నేడు(20న) ఈ కౌంటర్లు యాక్టివ్‌గా ట్రేడ్ కానున్నట్లు నిపుణులు తెలియజేశారు. ఈ బాటలో ఈ వారం హిందుస్తాన్ యూనిలీవర్, కాల్గేట్, డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్, ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్, కోఫోర్జ్, ఐటీసీ హోటల్స్, కొటక్ మహీంద్రా బ్యాంక్ క్యూ2 పనితీరు వెల్లడించనున్నాయి. దీంతో నేడు ఫలితాల ప్రభావంతో ట్రెండ్ నిర్దేశితంకానున్నట్లు రెలిగేర్ బ్రోకింగ్ రీసెర్చ్ ఎస్‌వీపీ అజిత్ మిశ్రా అభిప్రాయపడ్డారు. హెచ్‌యూఎల్, డాక్టర్ రెడ్డీస్ కార్పొరేట్ ఫలితాల సీజన్‌కు దారి చూపనున్నట్లు స్వస్తికా ఇన్వెస్ట్‌మార్ట్ సీనియర్ టెక్నికల్ అనలిస్ట్ ప్రవేశ్ గౌర్ అంచనా వేశారు.

కొనుగోళ్లకు ఎఫ్‌పీఐలు సై ఈ నెలలో రూ. 6,480 కోట్లు

గత మూడు నెలలుగా దేశీ స్టాక్స్‌పట్ల విముఖత చూపుతున్న విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు(ఎఫ్‌పీఐలు) అక్టోబర్‌లో కొనుగోళ్ల యూటర్న్ తీసుకున్నారు. తద్వారా ఈ నెలలో ఇప్పటివరకూ నికర పెట్టుబడిదారులుగా నిలిచారు. స్థూల ఆర్థిక పరిస్థితులు పటిష్టపడటంతో కొనుగోళ్లకు ఆసక్తి చూపుతున్నారు. వెరసి ఈ నెల 1–17 మధ్య రూ. 6,480 కోట్లు ఇన్వెస్ట్ చేశారు. అంతక్రితం సెప్టెంబర్‌లో రూ. 23,885 కోట్ల పెట్టుబడులు వెనక్కి తీసుకోగా.. ఆగస్టులో రూ. 34,900 కోట్లు, జులైలో రూ. 17,700 కోట్ల విలువైన స్టాక్స్ విక్రయించిన సంగతి తెలిసిందే.

సంవత్ 2082 షురూ

స్టాక్ మార్కెట్లలో మంగళవారం కొత్త ఏడాది సంవత్ 2082 ప్రారంభంకానుంది. దీపావళి పండుగ సందర్భంగా స్టాక్ ఎక్స్ఛేంజీలు(బీఎస్ఈ, ఎన్ఎస్ఈ) మధ్యాహ్నం 1.45 నుంచి 2.45 వరకూ ప్రత్యేక(ముహూరత్) ట్రేడింగ్‌ను నిర్వహించనున్నాయి. మరుసటి రోజు(22న) బలి ప్రతిపాద సందర్భంగా మార్కెట్లకు సెలవు. ఆపై గురు, శుక్రవారాలు యథావిధిగా పనిచేయనున్నాయి. ఫలితాలు, పండుగ జోష్ సంవత్ 2082 తొలి రోజు సెంటిమెంటుకు బలాన్నివ్వనున్నట్లు మార్కెట్ విశ్లేషకులు అంచనా వేశారు.

గత వారమిలా..

13–17 మధ్య ముగిసిన గత వారం వరుసగా మూడోసారి దేశీ స్టాక్ మార్కెట్లు లాభాలతో నిలిచాయి. బీఎస్ఈ సెన్సెక్స్ 1,625 పాయింట్లు(2 శాతం) ఎగసి 83,952 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ సైతం 483 పాయింట్లు(2 శాతం) బలపడి 25,710 వద్ద స్థిరపడింది. అయితే బీఎస్ఈ మిడ్, స్మాల్ క్యాప్ ఇండెక్సులు స్వల్పంగా 0.2 శాతం పుంజుకున్నాయి.



గణాంకాలు..

దేశీయంగా 21న సెప్టెంబర్ నెలకు మౌలిక రంగ గణాంకాలు వెలువడనున్నాయి. 2025 ఆగస్టులో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఔట్‌పుట్ 6.3 శాతం ఎగసింది. ఇది 13 నెలల గరిష్టంకాగా.. కోల్, స్టీల్, సిమెంట్ తదితరాలు ఇందుకు సహకరించాయి. ఇక 24న అక్టోబర్ తయారీ, సర్వీసులు, కాంపోజిట్ పీఎంఐ గణాంకాలు వెల్లడికానున్నాయి. తయారీ పీఎంఐ సెప్టెంబర్‌లో 57.7కు నీరసించగా.. ఆగస్టులో 59.3కు బలపడింది.

అంతర్జాతీయ అంశాలు

చైనాపై యూఎస్ విధించిన తాజా టారిఫ్‌లు, వీటిపై చైనా స్పందనతోపాటు.. పరిష్కారం వంటి అంశాలు ప్రపంచ మార్కెట్లను ప్రభావితం చేయనున్నట్లు నిపుణులు తెలియజేశారు. యూఎస్, చైనా మధ్య వాణిజ్య ఆందోళనలకు తెరపడితే సెంటిమెంటు పుంజుకోవచ్చని గౌర్ అభిప్రాయపడ్డారు. జులై–సెప్టెంబర్‌కు చైనా జీడీపీ గణాంకాలు 20న విడుదలకానున్నాయి. ఏప్రిల్–జూన్‌లో 5.2 శాతం వృద్ధి చూపింది. 23న యూఎస్ సెప్టెంబర్ గృహ విక్రయ గణాంకాలు వెలువడనున్నాయి. 24న యూఎస్ ద్రవ్యోల్బణ వివరాలు వెల్లడికానున్నాయి. ఇవికాకుండా ముడిచమురు ధరలు, ఆరు ప్రధాన కరెన్సీలతో మారకంలో డాలరు తీరు వంటి అంశాలకూ ప్రాధాన్యత ఉన్నట్లు మిశ్రా, గౌర్ పేర్కొన్నారు.

85% డిజిటల్ చెల్లింపులు యూపీఐ నుంచే

- డీపీపీల విషయంలో భారత్ ఆదర్శనీయం
- ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా



న్యూఢిల్లీ: దేశంలో 85 శాతం డిజిటల్ చెల్లింపులు యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) రూపంలోనే జరుగుతున్నట్లు ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా తెలిపారు. ప్రతి నెలా 20 బిలియన్ యూపీఐ లావాదేవీలు నమోదవుతున్నాయని, వీటి విలువ 280 బిలియన్ డాలర్లుగా ఉన్నట్టు చెప్పారు. సమ్మిళిత, సురక్షిత, విస్తరణకు అనుకూలమైన డిజిటల్ పబ్లిక్ ప్లాట్‌ఫామ్‌ల (డీపీపీలు) విషయంలో భారత్ ప్రపంచానికి ఒక కేసు స్టడీ (అధ్యయనం చేయతగిన) అవుతుందన్నారు. వాషింగ్టన్‌లో ప్రపంచ బ్యాంక్, ఐఎంఎఫ్ వార్షిక సమావేశాల సందర్భంగా ఆర్‌బీఐ నిర్వహించిన ఒక కార్యక్రమంలో భాగంగా మల్హోత్రా మాట్లాడారు. సమ్మిళిత వృద్ధి, ఆవిష్కరణలకు డిజిటల్ పబ్లిక్ ప్లాట్‌ఫామ్‌లు ప్రేరణనిస్తున్నట్టు చెప్పారు. డిజిటల్ గుర్తింపునకు ఉద్దేశించిన ఆధార్, రియల్‌టైమ్ చెల్లింపులకు వీలు కల్పిస్తున్న యూపీఐ ద్వారా.. తక్కువ వ్యయాలతో, ప్రజలకు సమర్థవంతమైన సేవలను అందించే వ్యవస్థలకు ఎలా నిర్మించొచ్చో విజయవంతంగా చూపించినట్టు పేర్కొన్నారు. డిజిటల్ పరివర్తనను మరింత వేగంగా ముందుకు తీసుకెళ్లేందుకు, ‘వసుదైవ కుటుంబం’ స్ఫూర్తితో అంతర్జాతీయ సహకారానికి భారత్ కట్టుబడి ఉన్నట్టు ప్రకటించారు. యూపీఐని ఒక ముఖ్యమైన డిజిటల్ పబ్లిక్ ప్లాట్‌ఫామ్‌గా పేర్కొంటూ, చెల్లింపుల ముఖచిత్రాన్ని ఇది పూర్తిగా మార్చేసినట్టు చెప్పారు.

టాప్ 3లో భారత టెలికం సేవలు

కేంద్ర మంత్రి సింధియా వెల్లడి



న్యూఢిల్లీ: అత్యుత్తమ టెలికం సేవలున్న టాప్ 3 దేశాల జాబితాలో భారత్ కూడా ఒకటని కేంద్ర టెలికం శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా తెలిపారు. సర్వీసులను మెరుగుపర్చేందుకు మరిన్ని చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. నాణ్యతా ప్రమాణాలను పర్యవేక్షించేందుకు అక్టోబర్ 1 నుంచి మరింత కఠినతరమైన నిబంధనలను అమల్లోకి తెచ్చినట్లు మంత్రి చెప్పారు. వీటిపై టెలికం ఆపరేటర్లు ఇప్పటికే తొలి నివేదికలను అందించాయని, సర్వీసుల నాణ్యత సమస్యలేమైనా ఉంటే వాటిని పరిష్కరించడంపై చర్చలు జరుగుతున్నాయని వివరించారు. వైఫై విస్తృతిని పెంచేందుకు 6 గిగాహెట్జ్ బ్యాండ్ స్పెక్ట్రంలో కొన్ని ఫ్రీక్వెన్సీలకు లైసెన్సు నుంచి మినహాయింపునిచ్చినట్లు సింధియా చెప్పారు. దీంతో నిర్దిష్ట ఫ్రీక్వెన్సీలను ఉపయోగించుకునే కంపెనీలు స్పెక్ట్రం ఫీజులేమీ చెల్లించనక్కర్లేదని పేర్కొన్నారు. శాటిలైట్ కమ్యూనికేషన్ సర్వీసులపై టెలికం రంగ నియంత్రణ సంస్థ ట్రాయ్ నుంచి తుది సిఫార్సులు వచ్చిన తర్వాత నిబంధనలను ఖరారు చేయనున్నట్లు మంత్రి చెప్పారు. ఇక టెలికం నెట్‌వర్క్ విస్తరణను మరింత వేగవంతం చేస్తున్నామని, ఫిబ్రవరి నుంచి ఇప్పటివరకు 1,882 సమస్యలను పరిష్కరించామని, మరో 533 అంశాలపై రాష్ట్రాల ప్రభుత్వాలతో సంప్రదింపులు జరుపుతున్నామని పేర్కొన్నారు.

బజాజ్ లైఫ్ సుప్రీమ్ యులిప్ ప్లాన్

పుణె: బజాజ్ లైఫ్ ఇన్సూరెన్స్ కొత్తగా ‘బజాజ్ లైఫ్ సుప్రీమ్’ పేరుతో యూనిట్ లింక్డ్, నాన్ పార్టిసిపేటింగ్ వ్యక్తిగత జీవిత బీమా పొదుపు పథకాన్ని ప్రారంభించింది. సంపద సృష్టికి, స్థిరమైన ఆదాయానికి ఈ ప్లాన్ ఉపకరిస్తుందని తెలిపింది. పరిశ్రమలోనే తొలిసారి గ్యారంటీడ్ వెల్త్ బూస్టర్ ఫీచర్ ఇందులో ఉన్నట్టు తెలిపింది. ప్రీమియం అలోకేషన్‌పై ఏటా 7 శాతం కాంపౌండెడ్ వృద్ధికి హామీ ఇస్తున్నట్టు, ఈ మొత్తం 15వ ఏట చివర్లో పాలసీ ఫండ్‌కు జోడించడం జరుగుతుందని పేర్కొంది. పన్నులేని సంపద బదిలీకి మార్గమని తెలిపింది. మోర్టాలిటీ చార్జీలను వెనక్కివ్వడం, పాలసీ కాల వ్యవధి తర్వాత క్రమానుగతంగా ఉపసంహరించుకునే ఫీచర్లు సైతం ఇందులో ఉన్నాయి.

ఇంకా ఆఫ్‌లైన్‌లోనే 47% భారతీయులు

ఇంటర్నెట్ వినియోగంపై జీఎస్ఎంఏ నివేదిక



న్యూఢిల్లీ: దేశీయంగా 47 శాతం మంది ప్రజలు ఇంకా ఇంటర్నెట్‌కి దూరంగా, ఆఫ్‌లైన్‌లోనే ఉన్నారని గ్లోబల్ టెలికం పరిశ్రమ జీఎస్ఎంఏ ఓ నివేదికలో తెలిపింది. మొబైల్ ఇంటర్నెట్ వినియోగంలో పురుషులతో పోలిస్తే మహిళలు 33 శాతం తక్కువగా ఉంటున్నారని వివరించింది.

హ్యాండ్‌సెట్స్ ధర అధికంగా ఉండటం, సాంకేతిక నైపుణ్యాలు తక్కువగా ఉండటం వంటి అంశాలు కనెక్టివిటీ మధ్య అంతరాలకు కారణమని ఇండియా మొబైల్ కాంగ్రెస్ 2025లో పాల్గొన్న సందర్భంగా జీఎస్ఎంఏ ఆసియా పసిఫిక్ హెడ్ జులియన్ గోర్మన్ తెలిపారు. దీన్ని సత్వరం పరిష్కరించకపోతే సమ్మిళిత వృద్ధికి అవరోధంగా నిల్చే అవకాశం ఉందని పేర్కొన్నారు. దశాబ్దం క్రితం 108 బిలియన్ డాలర్లుగా ఉన్న భారత డిజిటల్ ఎకానమీ 2023లో మూడు రెట్లు పెరిగి 370 బిలియన్ డాలర్లకు చేరిందని, 2030 నాటికి 1 ట్రిలియన్ డాలర్లకు చేరుతుందనే అంచనాలు ఉన్నాయని నివేదిక వివరించింది. అయితే, కీలకమైన ఆవిష్కరణలు, వినియోగం మధ్య అంతరాలను పూడ్చకపోతే ఈ వేగం గతి తప్పే అవకాశం ఉందని, పేర్కొంది. డిజిటల్ పబ్లిక్ మౌలిక సదుపాయాలు, మొబైల్ వినియోగాల్లో భారత్ అగ్రగామిగా ఉన్నప్పటికీ, పరిశోధనలు..అభివృద్ధి కార్యకలాపాలపై పెట్టుబడులు పెట్టడం, ప్రైవేట్ రంగంలో ఆవిష్కరణలు, సుశిక్షితులైన నిపుణులను అట్టే పెట్టుకోవడం వంటి విషయాల్లో వెనుకబడి ఉందని నివేదిక తెలిపింది.

కొత్త చట్టం వస్తోంది కానీ...

ముందుగా అందరికీ దీపావళి శుభాకాంక్షలు.. ఆదాయపన్ను చట్టం 1922, ఆ తరువాత చట్టం 1961 ... ఇప్పుడు కొత్తం చట్టం 2025 పేరుతో వస్తోంది. ఈ ఏడాది ఆగస్టులో రాష్ట్రపతి ఆమోదముద్ర పొందిన ఈ చట్టం 1.4.2026 నుంచి అమల్లోకి రానుంది. కొత్త చట్టం అత్యంత సరళీకృతంగా ఉంది. నిడివి, సెక్షన్లు తగ్గించారు. ‘పన్ను సంవత్సరం’ అనే కొత్త నిర్వచనంతో వర్చువల్ డిజిటల్ ఆస్తులను కూడా కలుపుతూ, సెర్చ్, సీజర్ అధికారాలను విస్తృత పరుస్తూ, ఎన్నో సంస్కరణలతో రూపుదిద్దుకొని ఇది ముస్తాబయింది. ఈ సంవత్సరంలో అన్నీ పూర్తయినా, అమలు మాత్రం 1.4.2026 నుండే ఉంటుంది. అయితే 2025 బడ్జెట్‌లో తెచ్చిన మార్పులు 2025–26 ఆర్థిక సంవత్సరంలో వర్తిస్తాయి. 2026లో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కొన్ని మార్పులు రావడం సహజం. ముఖ్యంగా బేసిక్ లిమిట్, మినహాయింపులు, శ్లాబులు, రేట్లు, ఇవి రావచ్చు. లేదా రాకపోవచ్చు. వచ్చేవి వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి అమల్లోకి వస్తాయి. వాటి గురించి ఇప్పుడు ఆలోచించడం అనవసరం.




కె.సీహెచ్. ఎ.వి.ఎస్.ఎన్ మూర్తి | కె.వి.ఎన్ లావణ్య
ట్యాక్సేషన్ నిపుణులు

- కొత్త విధానాన్ని ప్రతిపాదించినప్పటి నుంచే ప్రభుత్వం దాన్ని సమర్థిస్తూ, వెనకేసుకొస్తోంది. మధ్య తరగతి వర్గాన్ని దృష్టిలో పెట్టుకొని శ్లాబులు, రేట్లు తెచ్చారు. దీని ప్రకారం రూ.12,00,000కు పన్ను ఉండదు. శ్లాబులు మార్చారు. రేట్లు మారాయి.
- రూ.12,00,000 ఆదాయాల విషయంలో శ్లాబులను మార్చకుండా రిబేటును 87 అ ప్రకారం రూ.60వేల వరకు పెంచి ఎంతో ఉపశమనం ఇచ్చారు. నికర ఆదాయం పెరిగితే వైకుంఠపాళి ఆటలో పాము నోట్లో పడినట్లే. శ్లాబుల వారీగా పన్ను కట్టాల్సి వస్తోంది.
- సాండర్డ్ డిడక్షన్‌ని కొత్త విధానంలో రూ.75వేలకు పెంచారు.
- ఈ ఆర్థిక సంవత్సరం నుంచి వ్యక్తులు రెండు సొంత ఇళ్ల మీద పన్ను కట్టాల్సిన అవసరం లేదు. గతంలో ఒక ఇంటికే ఉన్నా.., ఇప్పుడు మినహాయింపుని రెండో ఇంటికీ కల్పించారు.
- కొత్త విధానంలో ఫ్యామిలీ పెన్షను మినహాయింపుని రూ.25వేలకు పెంచారు. గతంలో ఇది రూ.13,000గా ఉండేది. ఈ విధంగా కొత్త విధానాన్ని సమర్థిస్తూ.., ఉపశమనం ఇచ్చారు. కొత్త విధానం కొంగు బంగారం అయ్యింది. ఆర్థికపరంగా ఎందరో చిన్న చిన్న అస్సెస్సీలకు పెద్ద రిలీఫ్ ఇచ్చారు. టాక్స్ ప్లానింగ్ పేరుతో ఎటువంటి అక్రమ మార్గాలకు పాల్పడకుండా రాచమార్గంలో రాజహంసలాగా రాజీ పడకుండా, రాంగ్ రూటు వెళ్లకుండా రైట్‌వే ఇది.
- యూలిప్(య్యూలిప్స్) ద్వారా వచ్చే మొత్తాలను క్యాపిటల్ గెయిన్ పరిధిలోకి తీసుకొచ్చారు. మొదటి రూ.25వేలకు మినహాయింపు ఉంది.
- టీడీఎస్ (టాక్స్ డిడక్షన్ సోర్స్) వర్తించే విషయాల్లో పరిమితిని పెంచారు. దానివల్ల కొంత మంది టీడీఎస్‌కి గురికారు.
- విదేశాల చెల్లింపుల్లో వర్తించే టీసీఎస్(టాక్స్ కలెక్టెడ్ సోర్స్) విషయంలో పరిమితి పెంచారు.
- కొన్ని వస్తువుల అమ్మకపు విషయంలో పరిమితి రూ.50,00,000 ఇక నుంచి లేదు.
- అప్‌డేటెడ్ రిటర్నులను ఫైల్ చేసుకోవడానికి 24 నెలల నుంచి 48 నెలలకు వెనక్కి వెళ్లవచ్చు. ఇది మంచి అవకాశం. అయితే షరతులకు లోబడి మాత్రమే.
- రిటర్నులు వేయనివారిని నాన్‌ఫైలర్స్ అంటారు. గతంలో ఎక్కువ టీడీఎస్/టీసీఎస్ రేట్లు వేసేవారు. ఇప్పుడు ఆ వివక్ష లేదు.
- భాగస్వాములకు చెల్లించే చెల్లింపుల మీద టీడీఎస్ ప్రవేశపెట్టారు.
- నాన్ రెసిడెంట్లకి సంబంధించి కొన్ని డిజిటల్ వ్యవహారాల మీద వేసే పన్ను 6% ఎత్తివేశారు.

ఈ మార్పులను పెట్టుకొని టాక్స్ ప్లానింగ్ వైపు అడుగులు వేయండి.



పన్నుకు సంబంధించిన సందేహాలు ఏవైనా ఉంటే పాఠకులు business@sakshi.comకు ఈ-మెయిల్ పంపించగలరు.

మార్కెట్లు, అపోహలు, పాఠాలు..
దీపావళి కోణంలో పెట్టుబడులు..



రాధికా గుప్తా, ఎండీ
సీఈవో, ఎడెల్వీస్ అసెట్ మేనేజ్‌మెంట్



దీపావళి పండగకి సంబంధించి తినుబండారాల కోణంలో మార్కెట్లను అభివర్ణించాల్సి వస్తే .. జిలేబీగా అభివర్ణించవచ్చు. అవును, మార్కెట్లు కూడా జిలేబీలాగే మెలితిరిగిపోతూ, వంకర్లు తిరుగుతూ, అనూహ్యమైన విధంగా ఉంటాయి. వీటిని అర్థం చేసుకోవాలంటే బోలెడంత సహనం ఉండాల్సిందే. జిలేబీ ఆకారంలాగే ఈ ఏడాదంతా అంతర్జాతీయంగా ఒడిదుడుకులు, వడ్డీ రేట్ల అంచనాల్లో మార్పులు, భౌగోళికరాజకీయపరంగా ఆశ్చర్యపర్చే పరిణామాలు, సోషల్ మీడియా ప్లాట్‌ఫాంలలో రణగొణ ధ్వనులతో గడిచింది. అయినప్పటికీ ప్రశాంతంగా, పెట్టుబడులను కొనసాగించిన ఇన్వెస్టర్లకు చాలా తియ్యని అనుభవాలే ఎదురయ్యాయి. స్పెక్యులేషన్‌కి పోకుండా క్రమశిక్షణతో ఉంటూ, ఓర్పు వహించినందుకు బహుమతిగా చిన్న చిన్న విజయాలు, నేర్చుకునే అవకాశాలు లభించాయి.

ఈ ఏడాది బంగారం, వెండి టపాసుల్లాగా పేలాయి. సంప్రదాయ సిద్ధంగా సురక్షిత పెట్టుబడి సాధనంగా పసిడి తన పాత్రను చక్కగా పోషించింది. అనిశ్చితి నెలకొన్న తరుణంలో స్థిరత్వాన్ని అందించింది. ఒక్కసారిగా ఎగిసిన వెండి దీనికి మరింత హంగులు దిద్దింది. పాతతరం వివేకం, కొత్త తరపు ఉత్సాహం రెండూ కూడా కలిసి మెరిసేందుకు అవకాశం ఉందని ఇవి తెలియజేశాయి. అవకాశం, భద్రత మధ్య సమతుల్యతను పాటించడమే పోర్ట్‌ఫోలియో పటిష్టతకు కీలకమని తెలియజేశాయి.

ఒకవేళ దీపావళి బహుమతులను తనదైన ప్రత్యేకత ఉన్న అసెట్ క్లాస్‌గా వర్ణించాల్సి వస్తే బంగారాన్ని వారసత్వ నెక్లెస్‌గా అభివర్ణించవచ్చు. కాలాతీతమైనదై, భావోద్వేగాలతో కూడుకున్నదై, తరతరాలుగా తన విలువను కాపాడుకుంటూ వస్తోంది పసిడి. ఇక బాండ్లను డ్రై ఫ్రూట్ బాక్సుగా అభివర్ణించవచ్చు. ఆకట్టుకునే మెరుపులు ఉండకపోయినా, ఇవి నమ్మకమైనవిగా, నిశ్శబ్దంగా అండగా నిలుస్తాయి. ఈక్విటీల విషయానికొస్తే.. ఇంట్లో తయారు చేసిన స్వీట్లలాంటి. చాలా ఓపిగ్గా, నమ్మకంతో, ఆశాభావంతో ఇవి తయారవుతాయి. అప్పుడప్పుడు గందరగోళంగా అనిపించినా ఆ తర్వాత చాలా సంతృప్తిని కలిగిస్తాయి. మరి క్రిప్టో విషయమేంటి? ఇవి పక్కింటివాళ్ల డ్రోన్ షో లాంటివి. చాలా ఆర్భాటంగా, పట్టించుకోకుండా ఉండలేని విధంగా ఉంటాయి. కానీ వీటిని కాస్త సురక్షితమైన దూరం నుంచే ఆస్వాదించడం మేలు.

సంక్షోభ సమయాల్లోనే పసిడి రాణిస్తుందనే అపోహ ఒకటుంది. ఈ పండుగ సీజన్‌లో దాన్నుంచి బైటపడాలి. వాస్తవానికి బంగారమంటే, మార్కెట్లు బాగా లేనప్పుడు నీడనిచ్చే సాధనం మాత్రమే కాదు. ఎలాంటి పరిస్థితుల్లోనైనా పోర్ట్‌ఫోలియోకు స్థిరత్వాన్నికూడా అందిస్తుంది.

పర్ఫెక్ట్ దీపావళి పోర్ట్‌ఫోలియో ఎలా ఉంటుందంటే.. సమతూకంగా గల మల్టీ-అసెట్ థాలీలాగా ఉంటుంది. వృద్ధి కోసం ఈక్విటీలు .. స్థిరత్వం కోసం పసిడి .. క్రమశిక్షణ కోసం బాండ్లు .. ఇక సమర్థత, డైవర్సిఫికేషన్, ప్రొఫెషనల్ మేనేజ్‌మెంట్ కోసం మ్యుచువల్ ఫండ్‌లో చక్కగా చుట్టచుట్టినట్లుగా ఉంటుంది.

సాధారణంగా పండుగల సందర్భంలో మార్కెట్ సెంటిమెంటు ఉత్సాహంగా ఉంటుంది. కానీ, ఊదరగొట్టే అన్‌లిస్టెడ్ ఐడియాలు, సైక్లికల్ థీమ్‌లు ఇక ముగింపు దశకొస్తున్నాయనే వార్తలు, ‘దీపావళి టిప్’ స్టాక్‌లు మొదలైన వాటి విషయంలో ఇన్వెస్టర్లు అప్రమత్తంగా ఉండాలి. మార్కెట్లు ఉత్సాహభరిత వాతావరణాన్ని ప్రతిబింబించవచ్చు కానీ అంతిమంగా మాత్రం ఎమోషన్లను కాకుండా ఆదాయాలనే ఫాలో అవుతాయి.

వచ్చే దశాబ్దకాలం కోసం పోర్ట్‌ఫోలియోను రూపొందించుకోవడమే ఈ దీపావళికి మీకు మీరు ఇచ్చుకునే అత్యుత్తమ బహుమతి అవుతుంది. ఎందుకంటే సిసలైన సంపద కూడా, అందమైన రంగవల్లిలాంటిదే. ఓ లక్ష్యం పెట్టుకుని, ఎంతో ఓపిగ్గా, సమతూకాన్ని పాటిస్తూ డిజైన్ చేసుకోవాల్సి ఉంటుంది. కొన్నాళ్లకి దీపం కొండెక్కినా, ఈ సుగుణాలే దీర్ఘకాలం పాటు నిలిచి ఉంటాయి.

సీవీ ఆనంద్ సూపర్ సెంచరీ



సాక్షి, హైదరాబాద్: నిత్యం విధుల్లో బిజీగా ఉండే స్పెషల్ చీఫ్ సెక్రటరీ సీవీ ఆనంద్... ఆదివారం క్రికెట్ మైదానంలో అదరగొట్టారు. హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) 'సి' డివిజన్ వన్డే లీగ్ చాంపియన్‌షిప్‌లో సెంచరీతో సత్తాచాటారు. ఈ లీగ్‌లో సికింద్రాబాద్ క్లబ్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న సీవీ ఆనంద్... తారకరామ క్లబ్‌పై ఓపెనర్‌గా బరిలోకి దిగి 94 బంతుల్లో 12 ఫోర్లు, 2 సిక్స్‌ల సాయంతో 108 పరుగులు చేశారు. సీవీ ఆనంద్ దూకుడుకు బౌలర్ల క్రమశిక్షణ తోడవడంతో ఈ మ్యాచ్‌లో సికింద్రాబాద్ క్లబ్ జట్టు 36 పరుగుల తేడాతో విజయం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన సికింద్రాబాద్ క్లబ్ 35 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 260 పరుగులు చేసింది. సీవీ ఆనంద్ 'శత'క్కొట్టగా... కెప్టెన్ అంకిత్ అగర్వాల్ (56; 8 ఫోర్లు) అర్ధశతకం సాధించాడు. చివర్లో ఖలీల్ (10 బంతుల్లో 26 నాటౌట్; 4 ఫోర్లు, 1 సిక్స్), మెరుపులు మెరిపించాడు. ప్రత్యర్థి బౌలర్లలో మొయినుద్దీన్ 3 వికెట్లు తీశాడు. అనంతరం లక్ష్యఛేదనలో తారకరామ జట్టు 34.3 ఓవర్లలో 225 పరుగుల వద్ద ఆలౌటైంది. కెప్టెన్ మురళి (35 బంతుల్లో 52; 6 ఫోర్లు, 1 సిక్స్), మొయినుద్దీన్ (29 బంతుల్లో 39; 3 ఫోర్లు, 3 సిక్స్‌లు) రాణించారు. ఆఖర్లో పవన్ కుమార్ (29; 1 ఫోర్, 3 సిక్స్‌లు), సాకేత్ (26 నాటౌట్; 3 ఫోర్లు) పోరాడినా ఫలితం లేకపోయింది. సికింద్రాబాద్ క్లబ్ బౌలర్లలో నరేందర్ 3 వికెట్లు పడగొట్టగా... పియూశ్, ఖలీల్ చెరో 2 వికెట్లు తీశారు.

సోదరా... అతడికి పాప్‌కార్న్ ఇవ్వకు!



పెర్త్: భారత్, ఆస్ట్రేలియా మధ్య తొలి వన్డే సందర్భంగా జరిగిన ఓ సంఘటన చర్చనీయాంశమైంది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా ఆదివారం జరిగిన తొలి వన్డేలో శుబ్‌మన్ గిల్ సారథ్యంలోని భారత జట్టు 7 వికెట్ల తేడాతో ఓటమిపాలైంది. వర్షం కారణంగా మ్యాచ్‌కు పలుమార్లు అంతరాయం వాటిల్లగా... చివరకు 26 ఓవర్లకు కుదించాల్సి వచ్చింది. అయితే మ్యాచ్‌కు పదేపదే వర్షం ఆటంకం కల్పించినప్పుడు ప్లేయర్లు డ్రెస్సింగ్ రూమ్‌లో సేదతీరుతూ కనిపించారు. ఆ సమయంలో వ్యాఖ్యాతగా ఉన్న టీమిండియా మాజీ అసిస్టెంట్ కోచ్ అభిషేక్ నాయర్ తన స్నేహితుడైన రోహిత్ శర్మపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. కెప్టెన్ శుబ్‌మన్ గిల్‌తో కలిసి పాప్‌కార్న్ తింటున్న రోహిత్‌ను చూస్తూ... 'అరే భాయ్ ఉసే పాప్‌కార్న్ మత్ దే' (సోదరా అతడికి పాప్‌కార్న్ ఇవ్వకు) అంటూ కామెంట్ చేశాడు. టెస్టు, టి20 ఫార్మాట్‌లకు వీడ్కోలు పలికిన రోహిత్ శర్మ... ప్రస్తుతం వన్డే ఫార్మాట్‌లో మాత్రమే టీమిండియాకు ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. 2027 వన్డే ప్రపంచకప్ వరకు జట్టులో కొనసాగాలని భావిస్తున్న హిట్‌మ్యాన్... ఇటీవల ఫిట్‌నెస్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాడు. **చాంపియన్స్ ట్రోఫీ విజయం అనంతరం వచ్చిన విరామంలో... ఏకంగా 11 కేజీల బరువు తగ్గాడు. దీనిపై మ్యాచ్‌కు ముందు అభిషేక్ మాట్లాడుతూ... 'రోహిత్ పూర్తిగా మారిపోయాడు. మరింత ఫిట్‌గా, మరింత దృఢంగా మారాడు. ఫిట్‌నెస్ పెంపొందించుకుంటే... నైపుణ్యం దానంతటదే పెరుగుతుంది. ఈ విషయంలో రోహిత్ చాలా కష్టపడ్డాడు. ఇదంతా 2027 వన్డే ప్రపంచకప్‌ను దృష్టిలో పెట్టుకునే కావచ్చు. అప్పటి వరకు ఆటలో కొనసాగాలంటే మొదట తన బరువు తగ్గించుకోవాలని రోహిత్ బలంగా అనుకున్నాడు. దాని వల్లే ఇదంతా సాధ్యమైంది. ఇప్పుడతడు నవ యువకుడిలా కనిపిస్తున్నాడు' అని అన్నాడు.**

గోవా గార్డియన్స్ గెలుపు



సాక్షి, హైదరాబాద్: ప్రైమ్ వాలీబాల్ లీగ్ (పీవీఎల్) నాలుగో సీజన్‌లో గోవా గార్డియన్స్ మూడో విజయంతో సెమీఫైనల్ రేసులో నిలిచింది. ఆదివారం గచ్చిబౌలీ ఇండోర్ స్టేడియంలో జరిగిన గ్రూప్ దశ ఆఖరి మ్యాచ్‌లో గోవా గార్డియన్స్ 3-2 (14-16, 11-15, 15-11, 16-13, 15-11)తో ఢిల్లీ తుఫాన్స్‌పై గెలుపొందింది. తొలి రెండు గేమ్‌లను కోల్పోయిన అనంతరం తిరిగి పుంజుకున్న గోవా వరుసగా మూడు గేమ్‌లు కైవసం చేసుకుంది. 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' ప్రిన్స్ గోవా విజయంలో కీలక పాత్ర పోషించాడు. గ్రూప్ దశలో 7 మ్యాచ్‌లు ఆడిన గోవా 3 విజయాలు, 4 పరాజయాలతో 10 పాయింట్లు ఖాతాలో వేసుకొని పట్టిక నాలుగో స్థానంలో నిలిచింది. ఇతర మ్యాచ్‌ల ఫలితాల ఆధారంగా గోవా ముందంజ వేసే అవకాశాలున్నాయి. మరో మ్యాచ్‌లో కొచ్చీ బ్లూ స్పైకర్స్ 3-1 (15-13, 9-15, 15-8, 15-13) తేడాతో కాలికట్ హీరోస్‌పై గెలుపొందింది. తాజా సీజన్‌లో 6 మ్యాచ్‌లు ఆడిన కొచ్చీ బ్లూ స్పైకర్స్ 2 విజయాలు, 4 పరాజయాలతో 7 పాయింట్లు ఖాతాలో వేసుకొని పట్టికలో ఎనిమిదో స్థానంలో ఉండగా... కాలికట్ హీరోస్ 7 మ్యాచ్‌ల్లో ఒకే విజయంతో 4 పాయింట్లతో అట్టడుగున పదో స్థానంలో నిలిచింది.



నితీశ్ రెడ్డి

ఆల్ ఫార్మాట్ రౌండర్

- వన్డేల్లో అరంగేట్రం చేసిన నితీశ్ కుమార్ రెడ్డి
- ఏడాదిలో టీమిండియా తరఫున మూడు ఫార్మాట్లలో ఆడిన ఆంధ్ర ప్లేయర్

సాక్షి, హైదరాబాద్: ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో మెరుపులు మెరిపించి జాతీయ సెలక్టర్ల దృష్టిలో పడ్డ నితీశ్ కుమార్ రెడ్డి... ఏడాది తిరిగేలోపు జాతీయ జట్టు తరఫున మూడు ఫార్మాట్లలో అరంగేట్రం చేశాడు. గతేడాది అక్టోబర్‌లో టీమిండియా తరఫున తొలి అంతర్జాతీయ టి20 మ్యాచ్ ఆడిన నితీశ్ రెడ్డి... ఆ తర్వాత ఆస్ట్రేలియా పర్యటనలో అదరగొట్టాడు. 'బోర్డర్-గావస్కర్' సిరీస్‌లో భాగంగా పెర్త్ వేదికగా జరిగిన తొలి టెస్టు ద్వారా సుదీర్ఘ ఫార్మాట్ బరిలోకి దిగిన ఈ ఆంధ్ర ఆల్‌రౌండర్... ఆ సిరీస్‌లో జరిగిన ఐదు మ్యాచ్‌ల్లోనూ ఆడాడు. లోయర్ ఆర్డర్‌లో బ్యాటింగ్‌కు వచ్చి ధాటిగా షాట్లు ఆడగల సత్తా... ఉపయుక్తమైన మీడియం పేస్ బౌలింగ్ అతడికి వరుసగా అవకాశాలు కల్పించింది. హార్దిక్ పాండ్యా టెస్టు ఫార్మాట్‌కు దూరం కావడంతో... సుదీర్ఘ ఫార్మాట్‌లో భారత జట్టు చాలా కాలంగా పేస్ ఆల్‌రౌండర్ కోసం నిరీక్షిస్తోంది. అందివచ్చిన అవకాశాలను వినియోగించుకున్న నితీశ్ ఇప్పుడు తాజాగా వన్డే ఫార్మాట్‌లో సైతం అవకాశం దక్కించుకున్నాడు. పాండ్యా గైర్హాజరీలో పేస్ బౌలింగ్ ఆల్‌రౌండర్‌గా ఆస్ట్రేలియాతో వన్డే సిరీస్‌కు ఎంపికయ్యాడు. పెర్త్ వేదికగా ఆదివారం జరిగిన పోరులో ఆఖర్లో బ్యాటింగ్‌కు వచ్చిన ఈ ఆల్‌రౌండర్ 11 బంతులెదుర్కొని 2 సిక్సర్లతో 19 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. వర్షం కారణంగా మ్యాచ్ పూర్తిగా సాగకపోవడంతో అతడికి క్రీజులో ఎక్కువ సమయం గడిపే అవకాశం దక్కలేదు. బౌలింగ్‌లో మాత్రం 2.1 ఓవర్లు వేసిన నితీశ్ 16 పరుగులిచ్చాడు. వికెట్ తీయలేకపోయాడు.



టెస్టు అరంగేట్రం చేసిన చోటే...

ఆస్ట్రేలియా పర్యటనలో భాగంగా పెర్త్ టెస్టు ద్వారానే తొలి టెస్టు ఆడిన 23 ఏళ్ల నితీశ్ రెడ్డి... మళ్లీ ఇప్పుడు అక్కడే వన్డేల్లోనూ అరంగేట్రం చేశాడు. తొలి ఇన్నింగ్స్‌లో టాపార్డర్ మొత్తం విఫలమైన చోట... ధనాధన్ బ్యాటింగ్‌తో 41 పరుగులు చేసిన నితీశ్... రెండో ఇన్నింగ్స్‌లో అయితే ఏకంగా టి20 మ్యాచ్ ఆడాడు. 27 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లతో అజేయంగా 38 పరుగులు చేసి భారత జట్టు భారీ స్కోరు చేయడంలో కీలక పాత్ర పోషించాడు. మిచెల్ స్టార్క్, జోష్ హాజల్‌వుడ్, ప్యాట్ కమిన్స్ వంటి ప్రపంచ స్థాయి బౌలర్లను ఎదుర్కొంటూ అతడు చూపిన తెగువ ప్రతి ఒక్కరినీ ఆకట్టుకుంది. దీంతో టీమ్ మేనేజ్‌మెంట్ సైతం నితీశ్‌కు విరివిగా అవకాశాలు ఇచ్చింది. వాటిని అతడు సద్వినియోగం చేసుకున్నాడు. ప్రతిష్ఠాత్మక మెల్‌బోర్న్ మైదానంలో జరిగిన పోరులో నితీశ్ వీరవిహారం చేశాడు. ఎనిమిదో స్థానంలో క్రీజులోకి వచ్చిన అతను ఆసీస్ బౌలింగ్‌ను ఓ ఆటాడుకొని సెంచరీతో అదరగొట్టాడు. దీంతో ఒక్కసారిగా అతడి పేరు మార్మోగిపోయింది. ఆ తర్వాత మరో నాలుగు టెస్టులు మాత్రమే ఆడిన అతడు ఆశించిన స్థాయిలో రాణించలేకపోవడంతో పాటు... గాయాల బారిన పడి కాస్త వెనుకబడ్డాడు. అయితే క్లిష్టమైన విదేశీ పర్యటనల్లో సత్తాచాటిన నితీశ్‌పై సెలెక్టర్లు నమ్మకముంచారు.

గాయం నుంచి కోలుకొని...

ఇంగ్లండ్ పర్యటనలో భాగంగా మాంచెస్టర్‌లో **ప్రాక్టీస్ చేస్తూ గాయపడిన నితీశ్** జట్టుకు దూరమ**య్యాడు. గాయానికి శస్త్రచి**కిత్స చేయించుకున్న **అనంతరం బెంగళూరులోని** బీసీసీఐ సెంటర్ ఆఫ్ **ఎక్సలెన్స్‌లో ప్రత్యేక శిక్షణ తీ**సుకున్నాడు. ఇంగ్లండ్ **నుంచి తిరిగొచ్చాక అతడు** పూర్తిగా మారిపో**యాడు. సమయపాలన, క్రమ**శిక్షణ మొదటి నుంచే **ఉన్న నితీశ్ రెడ్డి... వాటిని** మరింత కఠినతరం **చేశాడు. సరదాలు, షికార్లు ప**క్కనపెట్టి పూర్తిగా క్రికె**ట్‌పై దృష్టి పెట్టాడు. అదే** సమయంలో తండ్రికి **మోకాలి శస్త్రచికిత్స జరిగినా** ఇంటికి వెళ్లకుండా **పూర్తిగా సాధనకే పరిమితమ**య్యాడు. విశాఖపట**్నంలో ఉన్నన్ని రోజులు... జి**మ్ లేదంటే మైదానం**లోనే** గడిపేవాడని **అతడి** తండ్రి ముత్యాల రెడ్డి **పేర్కొన్నారు. అలా గంటల** తరబడి శిక్షణ సాగిస్తూ **మరింత రాటుదేలాడు.** మోకాలి శస్త్రచికిత్స అనం**తరం అతడి ఫిట్‌నెస్ ము**నుపటికంటే రెట్టింపు **అయింది. అది ఇటీవల వెస్టిం**డీస్‌తో టెస్టు సిరీస్‌లో **ప్రస్ఫుటమైంది.**

సూపర్ క్యాచ్

వెస్టిండీస్‌తో స్వదేశంలో జరిగిన టెస్టు సిరీస్‌లో నితీశ్ ఫర్వాలేదనిపించాడు. స్పిన్‌కు సహకరించే భారత పిచ్‌లపై పేస్ ఆల్‌రౌండర్‌గా ఎక్కువ ఓవర్లు వేసే అవకాశం దక్కని ఆంధ్ర ప్లేయర్... బ్యాటింగ్‌లో రాణించాడు. వెస్టిండీస్‌తో అహ్మదాబాద్ వేదికగా జరిగిన తొలి టెస్టు రెండో ఇన్నింగ్స్‌లో నితీశ్ పట్టిన క్యాచ్ చూస్తే... అతడి ఫిట్‌నెస్ స్థాయి ఏంటో అర్థమవుతుంది. స్క్వేర్ లెగ్‌లో విండీస్ బ్యాటర్ ఇచ్చిన క్యాచ్‌ను చిరుతలా దూకుతూ అందుకున్న తీరు చూసి తీరాల్సిందే. ప్రస్తుతం జట్టులో ఉన్న ఫిటెస్ట్ ప్లేయర్‌లలో అతడు ఒకడు అనడంలో సందేహం లేదు. యో-యో టెస్టు, బ్రంకో టెస్టుల్లో టీమిండియాలో అందరికంటే మెరుగైన స్కోరు నితీశ్ రెడ్డిదే అని సమాచారం. విండీస్‌తో టెస్టు సిరీస్‌లో ఎక్కువ బౌలింగ్ చేసే అవకాశం రాకున్నా... హెడ్ కోచ్ గంభీర్ మాత్రం నితీశ్‌పై నమ్మకముందని అతడికి అండగా ఉంటామని స్పష్టంచేశాడు. 'నితీశ్ ఎన్ని ఓవర్లు వేశాడనేది ముఖ్యం కాదు. జట్టుతో ఉండటమే ప్రధానం. అది ఎంతో నేర్చుకునే అవకాశం కల్పిస్తుంది. 23 ఏళ్ల కుర్రాడిని కేవలం విదేశీ పిచ్‌లపైనే పరీక్షించాలనే ఆలోచన మాకు లేదు. అవకాశం ఉన్నప్పుడల్లా స్వదేశంలో సైతం అతడికి చాన్స్‌లు ఇస్తాం. ప్రస్తుతం పేస్ ఆల్‌రౌండర్లు చాలా తక్కువ మంది అందుబాటులో ఉన్నారు. అందుకే నితీశ్‌కు అండగా ఉంటాం' అని గంభీర్ అన్నాడు. వన్డే, టి20 ఫార్మాట్‌లలో హార్దిక్ పాండ్యా వంటి నిఖార్సైన పేస్ ఆల్‌రౌండర్ అందుబాటులో ఉండగా... టెస్టుల్లో ఆ స్థానాన్ని భర్తీ చేయడంతో పాటు... పరిమిత ఓవర్లలోనూ తనదైన ముద్ర వేయాలని నితీశ్ భావిస్తున్నాడు.

దస్ కా దమ్

ఆసియా రోయింగ్ చాంపియన్‌షిప్‌లో భారత్‌కు 10 పతకాలు



న్యూఢిల్లీ: ఆసియా రోయింగ్ చాంపియన్‌షిప్‌లో భారత రోయర్లు సత్తాచాటారు. వియత్నాం వేదికగా జరిగిన టోర్నమెంట్‌లో ఒలింపియన్ బాల్‌రాజ్ పన్వర్ నేతృత్వంలోని భారత బృందం 10 పతకాల (3 స్వర్ణాలు, 5 రజతాలు, 2 కాంస్యాలు)తో మెరిసింది. పురుషుల సింగిల్స్ స్కల్ (ఎమ్1ఎక్స్) విభాగంలో బాల్‌రాజ్ పసిడి పతకం కైవసం చేసుకున్నాడు. లైట్ వెయిట్ డబుల్ స్కల్ (ఎల్ఎమ్2ఎక్స్) ఈవెంట్‌లో లక్ష్య, అజయ్ త్యాగి స్వర్ణ పతకం గెలుచుకోగా... పురుషుల క్వాడ్రపుల్ స్కల్ (ఎమ్4ఎక్స్) ఈవెంట్‌లో కుల్విందర్ సింగ్, నవ్‌దీప్ సింగ్, సత్‌నామ్ సింగ్, జకర్ ఖాన్‌తో కూడిన భారత బృందం బంగారు పతకం నెగ్గింది. ఇక మహిళల లైట్ వెయిట్ డబుల్స్ (ఎల్‌డబ్ల్యూ2) విభాగంలో గుర్బానీకౌర్-దిల్‌జ్యోత్ కౌర్ జంట రజత పతకం గెలుచుకుంది. తద్వారా ఆసియా చాంపియన్‌షిప్‌లో 15 ఏళ్ల భారత పతక నిరీక్షణకు ఈ జోడీ తెరదించింది. పురుషుల టీమ్ (ఎమ్8) విభాగంలో నితిన్ డియోల్, పర్విందర్ సింగ్, లఖ్‌వీర్ సింగ్, రవి, గుర్‌ప్రతాప్ సింగ్, భీమ్ సింగ్, జస్‌విందర్ సింగ్, కుల్‌బీర్, కిరణ్ సింగ్‌తో కూడిన భారత బృందం రజత పతకం ఖాతాలో వేసుకుంది. పురుషుల డబుల్ స్కల్ (ఎమ్2ఎక్స్)లో జస్‌పిందర్ సింగ్-సల్మాన్ ఖాన్ జంట రజతం గెలుచుకోగా... పురుషుల లైట్ వెయిట్ క్వాడ్రపుల్ స్కల్ (ఎల్ఎమ్4ఎక్స్)లో రోహిత్, ఉజ్వల్ కుమార్ సింగ్, లక్ష్య, అజయ్ త్యాగీతో కూడిన భారత బృందం రజతం చేజిక్కించుకుంది. లైట్‌వెయిట్ పురుషుల ఫోర్ (ఎల్ఎమ్4) ఈవెంట్‌లో సానీ కుమార్, ఇక్బాల్ సింగ్, బాబులాల్ యాదవ్, యోగేశ్ కుమార్‌తో కూడిన భారత జట్టు వెండి వెలుగులు విరజిమ్మింది. పురుషుల లైట్ వెయిట్ (ఎల్ఎమ్2)లో నితిన్ డియోల, పర్విందర్ సింగ్ కాంస్యం కైవసం చేసుకోగా... మహిళల టీమ్ (డబ్ల్యూ8) విభాగంలో గుర్బానీ కౌర్, దిల్‌జ్యోత్ కౌర్, సుమన్ దేవి, అలెనా ఆంటో, కిరణ్, పూనమ్, హౌబిజామ్ దేవితో కూడిన భారత జట్టు కాంస్యం నెగ్గింది. ఈ టోర్నమెంట్‌లో భారత్ నుంచి మొత్తం 37 మంది పోటీపడ్డారు. ఇందులో 25 మంది పురుష రోయర్లు కాగా, 12 మంది మహిళలున్నారు.

గుజరాత్‌పై తెలుగు టైటాన్స్ గెలుపు



న్యూఢిల్లీ: ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్) ఆఖరి దశ పోటీల్లో తెలుగు టైటాన్స్ నిలకడగా రాణిస్తోంది. ఆదివారం జరిగిన తొలి మ్యాచ్‌లో టైటాన్స్ జట్టు 30-25 గుజరాత్ జెయింట్స్‌పై విజయం సాధించింది. టైటాన్స్ జట్టులో కెప్టెన్ విజయ్ మాలిక్ (8), భరత్ (7) పోటీపడి రాణించారు. ఇద్దరు ఆల్‌రౌండర్లు క్రమం తప్పకుండా పాయింట్లు తెచ్చిపెట్టారు. డిఫెండర్లు అజిత్ పవార్ (4), అంకిత్ (4)లు మెరుగ్గా ఆడారు. గుజరాత్ తరఫున రెయిడింగ్‌లో హిమాన్షు సింగ్ (6), కెప్టెన్ రాకేశ్ (5) రాణించగా, డిఫెండర్ లక్కీ శర్మ 4 పాయింట్లు సాధించాడు. మిగతా వారిలో ఆల్‌రౌండర్ మొహమ్మద్ రెజా (3), విశ్వనాథ్, నితిన్ పన్వార్ చెరో 2 పాయింట్లు చేశారు. 12వ సీజన్‌లో ఆరంభం నుంచే పట్టుదలగా ఆడుతున్న తెలుగు టైటాన్స్ 17 మ్యాచ్‌లాడి పదో విజయాన్ని నమోదు చేసింది. నేడు మ్యాచ్‌లకు విశ్రాంతి రోజు. రేపు జరిగే పోటీల్లో బెంగాల్ వారియర్స్‌తో తమిళ్ తలైవాస్ పోటీపడుతుంది. యూ ముంబాను జైపూర్ పింక్‌పాంథర్స్ ఢీకొంటుంది. హరియాణా స్టీలర్స్‌తో గుజరాత్ జెయంట్స్ తలపడుతుంది.

ప్లేఆఫ్స్ చేరిన యూ ముంబా

లీగ్‌లో మరో జట్టు యూ ముంబా కూడా ప్లే ఆఫ్స్ చేరింది. హరియాణా స్టీలర్స్‌తో హోరాహోరీగా సాగిన మ్యాచ్‌లో యూ ముంబా టైబ్రేకర్‌లో గెలిచి ముందంజ వేసింది. నిర్ణీత సమయం ముగిసే సరికి ఇరు జట్లు 37-37 స్కోరుతో సమంగా నిలిచాయి. దీంతో టైబ్రేక్ అనివార్యం కాగా యూ ముంబా రెయిడర్లు జట్టును గెలిపించారు. సందీప్ (9) అదరగొట్టాడు. 21 సార్లు కూతకెళ్లిన అతను 9 సార్లు విజయవంతంగా పాయింట్లు తెచ్చాడు. సహచరుల్లో అజిత్ చౌహాన్ (6), అమిర్ మొహమ్మద్ (6), సునీల్ కుమార్ (4), విజయ్ కుమార్ (3) రాణించారు. హరియాణా జట్టులో జైదీప్ (9) కడదాకా శ్రమించాడు. మిగతావారిలో సాహిల్ నర్వాల్ (6), శివమ్ పతారే (4), వినయ్ (3), రాహుల్ (3) మెరుగ్గా ఆడారు. ఆఖరి మూడో మ్యాచ్‌లో పట్నా పైరేట్స్ 38-27తో పుణేరి పల్టన్‌పై గెలుపొందింది.



ఉత్తరప్రదేశ్ రాష్ట్రం మధురలోని కేశవదేవ్ మందిరంలో ఆదివారం రాత్రి పెద్ద సంఖ్యలో దీపాలను వెలిగిస్తున్న భక్తులు



పశ్చిమబెంగాల్‌లోని నడియాలో దీపావళి సందర్భంగా వేసిన భారీ ముగ్గును దీపాలతో అందంగా అలంకరిస్తున్న మహిళలు



అయోధ్యలో ఆదివారం రాత్రి దీపోత్సవం సందర్భంగా ప్రదర్శించిన రామాయణంలోని వివిధ సన్నివేశాల శకటాలు

అమ్మాయిలకు విద్య..అందని ద్రాక్షే!

ప్రపంచవ్యాప్తంగా పాఠశాల విద్యకు దూరమైన 13 కోట్ల మంది బాలికలు

- బీజింగ్ డిక్లరేషన్ చేసి 3 దశాబ్దాలు గడచినా నెరవేరని లక్ష్యం
- యునెస్కో పరిశోధనలో వెల్లడైన చేదు నిజాలు



న్యూఢిల్లీ: అమ్మాయిలకు అన్యాయం జరిగినప్పుడల్లా వినిపించే ఒకే ఒక మాట లింగసమానత్వం. దశాబ్దాలుగా లింగసమానత్వం కోసం ప్రపంచదేశాలు పోరాడుతున్నా ఏదో ఒక రంగంలో లింగఅసమానతలు పెచ్చరిల్లుతున్నాయి. వీటికితోడు అమ్మాయిలు పాఠశాల విద్యకు దూరమవుతున్న ధోరణిలో ఏమాత్రం మార్పురావట్లేదని తాజాగా యునెస్కో ప్రపంచ విద్యా పర్యవేక్షణ(జెమ్) బృంద పరిశోధనలో తేలింది. విద్యసహా అన్ని రంగాల్లో లింగసమానత్వ సాధనే ధ్యేయంగా 1995లో చేసిన బీజింగ్ డిక్లరేషన్ ఇంకా లక్ష్యాన్ని చేరుకోలేదని యునెస్కో ఆవేదన వ్యక్తంచేసింది. దశాబ్దాలుగా కోట్లాది మంది అమ్మాయిలు ఇంకా కనీసం పాఠశాల విద్యకు కూడా నోచుకోవట్లేదని యునెస్కో జెమ్ బృందం వెల్లడించింది.

మారని పరిస్థితి

''1995 ఏడాది నుంచి చూస్తే నేటి ఆధునిక ప్రపంచంలో విద్యావ్యవస్థలో లింగసమానత్వ సాధనకు కృషి అధికమైంది. ఇప్పుడు ప్రాథమిక, దిగువ, ఎగువ మాధ్యమిక పాఠశాలల్లో బాలురతో సమానంగా బాలికలు విద్యనభ్యసిస్తున్నారు. మూడు దశాబ్దాల క్రితంతో పోలిస్తే ఇప్పుడు అన్ని దేశాల్లో 9.1 కోట్ల మంది అమ్మాయిలు ప్రాథమిక విద్య చదువుతున్నారు. కానీ మాధ్యమిక విద్య విషయానికి వచ్చేసరికి ఏకంగా 13.3 కోట్ల మంది అమ్మాయిలు పాఠశాలలకు దూరంగా ఉండిపోతున్నారు. ఈ వైరుధ్యం అంతటా ఒకేలా లేదు. ప్రాంతాల వారీగా చూస్తే మధ్యాసియా, దక్షిణాసియా దేశాల్లో బాలికలు విద్యలో రాణిస్తుండగా సహారా ఆఫ్రికా ప్రాంతంలో బాలికలకు పాఠశాల విద్య అనేది అందని ద్రాక్షలా మిగిలిపోతోంది''అని జెమ్ బృంద సభ్యులు ఒకరు మీడియాతో చెప్పారు.

లాటిన్ అమెరికాలో మరోలా..

''ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, వేలాది పాలినేసియా, మైక్రోనేసియా, మెలనేసియా దీవుల సమాహారమైన 'ఓషేనియా'లో గతంలో విద్యలో లింగసమానత్వం ఉండేది. ఇప్పుడది కరువైంది. ఇక లాటిన్ అమెరికా, కరేబియన్ దీవుల్లో మాధ్యమిక విద్యలో అబ్బాయిల కంటే అమ్మాయిలే అధికంగా రాణిస్తుండటం విశేషం. అయితే గినియా, మాలీ లాంటి దేశాల్లో పరిస్థితి అమ్మాయిల విషయంలో అధ్వాన్నంగా ఉంది. కొన్ని పాఠశాలల్లో అసలు విద్యార్థినులే లేరు. కడు పేదరికం, బాల్య వివాహాలు, సౌకర్యాల లేమి, అనారోగ్యం వంటి కారణాలతో అమ్మాయిలకు పాఠశాల విద్య అనేది సుదూర స్వప్నంగా మారింది''అని జెమ్ బృందసభ్యుడు వెల్లడించారు.

మహిళా టీచర్ల ప్రాతినిధ్యం పెరగాలి

విద్యలో నాయకత్వ స్థాయిలో మహిళల ప్రాతినిధ్యం సైతం తక్కువగా ఉంటోంది. పురుష టీచర్లతో పోలిస్తే మహిళా టీచర్ల సంఖ్య సైతం చాలా తక్కువగా ఉంది. ఉన్నత విద్యలో ఇంకా మహిళా టీచర్ల సంఖ్య 30 శాతమే. ఇలాంటి వ్యవస్థాగత అసమానతలు సైతం విద్యలో సమానత్వ సాధనకు ప్రతిబంధకాలుగా పరిణమిస్తున్నాయి. బాలికలు, అమ్మాయిల విద్యావకాశాలు మెరుగుపడేలా విద్యా వ్యవస్థలో సమూల మార్పులు తెస్తూ ప్రపంచం సంస్కరణ పథంలో దూసుకుపోవాలని బీజింగ్ డిక్లరేషన్ చాటుతోంది. సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్,మ్యాథమేటిక్స్(స్టెమ్) కోర్సుల్లో అమ్మాయిల ప్రాతినిధ్యం పెరగాలని ఆనాడు ప్రపంచదేశాలు ఆకాంక్షించాయి. బాలికావిద్య అనేది కేవలం వాళ్ల హక్కు కాదు. అది మహిళల, చిన్నారుల, సమాజ భవిష్యత్తు. నాటి బాసలను నిలబెట్టుకున్ననాడే భవిష్యత్తుకు భరోసా ఉంటుంది''అని నివేదిక హెచ్చరించింది.

నెరవేరని ఆశయాలు, ఆకాంక్షలు

''ప్రపంచవ్యాప్తంగా పాఠశాల్లో అమ్మాయిల చేరికలు అధికంగా ఉండాలని, ఆమేరకు అన్ని దేశప్రభుత్వాలు కృషి చేయాలని బీజింగ్ డిక్లరేషన్ ఉద్ఘాటించింది. కానీ ఆ లక్ష్యం ఇంకా నెరవేరలేదు. పాఠశాలల్లో లైంగిక విద్య సైతం ఖచ్చితంగా బోధించాలి. లేదంటే అదే లైంగిక అంశాలను చిన్నారులు పాఠశాల విద్యకు ఆవల తప్పుడు కోణంలో తెల్సుకుంటారు. బ్యాడ్ టచ్, గుడ్ టచ్ వంటి అంశాలను చిన్నారులకు ప్రపంచంలో మూడింట రెండొంతుల దేశాల్లో ప్రాథమిక స్థాయిలోనే నేర్పించాలి. మాధ్యమిక విద్య స్థాయిలో నాలుగింట మూడొంతుల దేశాల్లో నేర్పించాలి''అని నివేదిక అభిప్రాయపడింది.

బిహార్‌లో హోరాహోరీ

- నవంబర్ 6న తొలి దశ పోలింగ్
- లాలు, నితీశ్‌లకే అసలు పరీక్ష
- తొలి విడతలో 121 స్థానాలకు ఎన్నికలు..
- అత్యధిక సీట్లలో ఆర్జేడీ, జేడీయూ పోటీ
- బరిలో తేజస్వి, ఇద్దరు డిప్యూటీ సీఎంలు

సాక్షి, న్యూఢిల్లీ: బిహార్ అసెంబ్లీ ఎన్నికల సంగ్రామానికి రంగం సిద్ధమైంది. మొత్తం రెండు దశల్లో జరగనున్న ఎన్నికల్లో తొలి అంకానికి తెరలేచింది. నవంబర్ 6వ తేదీన మొదటి దశ పోలింగ్ జరగనుంది. ఈ దశలో 18 జిల్లాల పరిధిలోని 121 శాసనసభ స్థానాలకు ఓటింగ్ నిర్వహించనున్నారు. తొలి విడత పోరు ముఖ్యంగా అధికార, విపక్ష కూటముల్లోని ప్రధాన పార్టీలైన ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ నేతృత్వంలోని జనతాదళ్ యునైటెడ్ (జేడీయూ), లాలు ప్రసాద్ యాదవ్ సారథ్యంలోని రాష్ట్రీయ జనతాదళ్ (ఆర్జేడీ)లకే అగ్నిపరీక్షగా మారింది. తొలి దశలోని అత్యధిక స్థానాల్లో ఈ రెండు పార్టీలే పోటీ పడుతుండటంతో సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

బరిలో ఎవరెవరు?

తొలి దశ ఎన్నికల బరిలో వివిధ పార్టీల తరఫున, స్వతంత్రులు కలిపి మొత్తం 1698 మంది నామినేషన్లు దాఖలు చేశారు. సోమవారం నామినేషన్ల ఉపసంహరణకు తుది గడువు. ఎన్డీయే, మహాఘట్‌బంధన్ కూటముల మధ్యే తీవ్ర పోటీ నెలకొంది. మహాఘట్‌బంధన్ కూటమి నుంచి ఆర్జేడీ ఏకంగా 71 స్థానాల్లో పోటీ చేస్తుండగా, కాంగ్రెస్ 25, సీపీఐ (ఎంఎల్) 13 చోట్ల బరిలో ఉన్నాయి. ఎన్డీయే తరఫున జేడీయూ 57 సీట్లలో, బీజేపీ 48, చిరాగ్ పాశ్వాన్ నేతృత్వంలోని లోక్‌జనశక్తి (రామ్ విలాస్) పార్టీ 14 స్థానాల్లో పోటీ చేస్తున్నాయి.

ముఖాముఖి పోరు.. హోరాహోరీ!

ఈ 121 స్థానాల్లో అనేక చోట్ల నువ్వా-నేనా అన్నట్లుగా పోటీ ఉంది. ముఖ్యంగా 36 కీలక స్థానాల్లో ఆర్జేడీ, జేడీయూ అభ్యర్థులు నేరుగా తలపడుతున్నారు. మరో 23 స్థానాల్లో ఆర్జేడీకి బీజేపీ గట్టి పోటీ ఇస్తుండగా, ఇంకో 23 సీట్లలో కాంగ్రెస్-బీజేపీ మధ్య ముఖాముఖి పోరు జరగనుంది.

దిగ్గజాల భవితవ్యం.. పరువు కోసం పోరు!

తొలి దశ ఎన్నికలు పలువురు రాజకీయ దిగ్గజాలు, ప్రముఖుల భవితవ్యాన్ని తేల్చనున్నాయి. ప్రతిపక్ష నేత, ఆర్జేడీ అగ్రనేత తేజస్వీ యాదవ్ రాఘోపూర్ నుంచి పోటీ చేస్తున్నారు. ఇద్దరు ఉప ముఖ్యమంత్రులు, బీజేపీ నేతలు సామ్రాట్ చౌదరి (తారాపూర్), విజయ్ కుమార్ సిన్హా (లఖిసరాయ్) భవితవ్యం కూడా ఈ దశలోనే తేలనుంది. వీరితో పాటు భోజ్‌పురి సూపర్‌స్టార్ పవన్ సింగ్ (చప్రా నుంచి), జానపద గాయని మైథిలీ ఠాకూర్ (అలీనగర్ నుంచి) వంటి సెలబ్రిటీ అభ్యర్థులు కూడా బరిలో ఉండటం ఆసక్తిని రేపుతోంది. వీరే కాకుండా పలువురు మంత్రులు, సీనియర్ నేతలు సైతం తొలి విడతలోనే తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. దీంతో మొదటి దశ ఫలితాలు తదుపరి దశలపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

చెట్టుకు వేలాడదీసిన మంచంపై కూర్చుని నిరాహారదీక్ష

బంజారాలను ఎస్టీల్లో చేర్చాలని మహారాష్ట్రలో వినూత్న నిరసన

జల్నా/థానే: తమ హక్కులు సాధించుకునేందుకు శాంతియుత మార్గంలో చేపట్టే నిరసనల్లో ప్రధానమైనది నిరాహారదీక్ష. సాధారణంగా ఓ ప్రాంతంలో టెంటు వేసుకొని నిరాహారదీక్షలు చేయటం మనం చూస్తుంటాం. కానీ, మహారాష్ట్రలో ఓ వ్యక్తి ఒక చెట్టుకు నులక మంచాన్ని వేలాడదీసి, అందులో కూర్చొని ఆమరణ నిరాహార దీక్షకు పూనుకున్నాడు. మహారాష్ట్రలో బంజారాలను ఎస్టీలుగా పరిగణించరు. వారిని విముక్త, సంచార జాతుల (వీజేఎన్టీ) జాబితాలో చేర్చారు. అయితే, హైదరాబాద్ గెజిట్ ప్రకారం తమను ఎస్టీల్లో చేర్చాలని వారు ఎంతోకాలంగా డిమాండ్ చేస్తున్నారు. ఆ డిమాండ్ సాధనకోసం మహారాష్ట్రలోని జల్నా పట్టణానికి సమీపంలో ఉన్న అంబడ్ చౌపుల్లీ ప్రాంతంలో విజయ్ చవాన్ అనే వ్యక్తి ఇలా మంచాన్ని చెట్టుకు వేలాడదీసి శనివారం నుంచి ఆమరణ నిరాహార దీక్ష ప్రారంభించాడు. పూర్వపు హైదరాబాద్ స్టేట్‌లో తమ జాతిని ఎస్టీల్లో చేర్చి రిజర్వేషన్లు ఇచ్చారని, మండల్ కమిషన్ సమయంలో మహారాష్ట్రలోని బంజారాలను వీజేఎన్టీలుగా వర్గీకరించటంతో ఆ హోదా కోల్పోయామని ఆగ్రహం వ్యక్తంచేశాడు. తిరిగి ఎస్టీ హోదా సాధనకోసమే తాను నిరాహార దీక్షకు పూనుకున్నట్లు వెల్లడించాడు. నిజానికి జిల్లా కలెక్టర్ ఆఫీస్ వద్దే దీక్షకు ప్రయత్నించినప్పటికీ అధికారులు అనుమతి ఇవ్వలేదని తెలిపాడు. ఎస్టీ హోదా కోసం మహారాష్ట్రలో బంజారాలు ఎప్పటి నుంచో డిమాండ్ చేస్తున్నారు. ఇటీవల మరాఠాలను ఓబీసీల్లో చేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం సూత్రప్రాయంగా అంగీకరించటంతో ఇతర వర్గాలు కూడా తమ రిజర్వేషన్ల సాధన కోసం పోరాటాలు ఉధృతం చేశాయి. ఎస్టీ హోదా కోసం నవంబర్ 9న ముంబైలోని శివాజీ పార్కులో నిరసన చేపట్టనున్నట్లు మాజీ ఎంపీ హరిభావ్ రాథోడ్ ప్రకటించారు.

టపాసుల గోదాములో పేలుడు.. నలుగురు మృతి

చెన్నై: తమిళనాడు రాజధాని చెన్నైలోని తండురైలో ఆదివారం బాణసంచా గోదాములో సంభవించిన భారీ పేలుడులో నలుగురు ప్రాణాలు కోల్పోయారు. పేలుడు తీవ్రతకు నివాస సముదాయానికి తీవ్ర నష్టం వాటిల్లిందని పోలీసులు తెలిపారు. బాణసంచాను నిల్వ ఉండటంతోపాటు ఇందులోనే విక్రయాలు కూడా జరుపుతున్నట్లు తెలిసిందన్నారు. ఘటనకు దారి తీసిన కారణాలపై దర్యాప్తు చేపట్టామని ఆవడి పోలీస్ కమిషనరేట్ తెలిపింది.

బాణసంచా మార్కెట్‌లో భారీ అగ్ని ప్రమాదం

కాన్పూర్: ఉత్తరప్రదేశ్‌లోని ఫతేపూర్‌లోని ఎంజీ కాలేజీ గ్రౌండ్‌లో తాత్కాలికంగా ఏర్పాటైన బాణసంచా మార్కెట్‌లో భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. ఓ దుకాణంలో మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో మొదలైన మంటలు శరవేగంగా పక్కలున్న దుకాణాలకు వ్యాపించాయి. మొత్తం 15, 20 నిమిషాల వ్యవధిలోనే అక్కడున్న 70 వరకు దుకాణాలు అగ్నికీలల్లో చిక్కుకున్నాయి. పెద్ద ఎత్తున పేలుళ్లు సైతం చోటుచేసుకున్నాయి. భయకంపితులైన వ్యాపారులు, వినియోగదారులు ప్రాణభయంతో తలోదిక్కుకు పరుగులు తీశారు. విద్యుత్ షార్ట్ సర్క్యూటే ఘటనకు కారణమని అనుమానాలున్నాయి. ప్రమాదంలో ఎవరూ చనిపోలేదని ఎస్పీ అనూప్ కుమార్ సింగ్ చెప్పారు. ఇరవై నిమిషాల్లో ఘటనాస్థలికి చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలను అదుపు చేశారన్నారు. సుమారుగా 12 గంటల సమయంలో మార్కెట్‌లో విక్రయాలు మొదలయ్యాయని, 15 నిమిషాల్లోనే అంతా బూడిదయ్యిందని వ్యాపారులు తెలిపారు. కేవలం 200 మీటర్ల దూరంలో ఉన్న ఫైర్ స్టేషన్ నుంచి ఫైర్ సిబ్బంది చేరుకోవడానికి 20 నిమిషాలు పట్టిందని ఆరోపించారు.

కొడుకును వెళ్లగొట్టినా.. కోడలికి హక్కుంటది

- అత్తగారింట్లో నుంచి కోడలిని వెళ్లగొట్టలేరు
- ఉమ్మడి నివాసంలో ఆమెకు నివసించే హక్కుంటుంది
- ఢిల్లీ హైకోర్టు కీలక తీర్పు

న్యూఢిల్లీ: కుటుంబ కలహాల కారణంగా తమ ఆస్తిపై కుమారుడికు హక్కు ఇవ్వకుండా నిర్ణయం తీసుకున్నప్పటికీ.. వారి ఉమ్మడి ఇంట్లో నివసించే హక్కు కోడలికి (కుమారుడి భార్యకు) ఉంటుందని ఢిల్లీ హైకోర్టు కీలక తీర్పు ఇచ్చింది. వివాహ బంధంతో అత్తగారింట్లోకి అడుగుపెట్టి కాపురం ఉన్న కోడలికి ఆ ఇంట్లో నివసించే హక్కును తిరస్కరించటం గృహహింసా చట్టం ప్రకారం సాధ్యం కాదని ఈ నెల 16న జస్టిస్ సంజీవ్‌నారుల్ స్పష్టంచేశారు. ఆ ఇంట్లో నుంచి కోడలిని వెళ్లగొట్టాలంటే చట్టప్రకారం మాత్రమే చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని తేల్చి చెప్పారు.

ఇదీ కేసు..

ఢిల్లీకి చెందిన ఓ కుటుంబం తమ కుమారుడికి 2010లో వివాహం జరిపించింది. అప్పటినుంచి అత్త, మా, కొడుకు, కోడలు ఒకే ఇంట్లో ఉన్నారు. అయితే, 2011 నుంచి తల్లిదండ్రులతో కుమారుడికి గొడవలు మొదలు కావటంతో కొంతకాలం కొడుకు, కోడలు తమ సొంత ఇంటిని వదిలి అద్దె ఇంట్లో ఉన్నారు. ఈ నేపథ్యంలో తమ ఆస్తిపై కొడుక్కు ఎలాంటి హక్కులు లేవని తల్లిదండ్రి ప్రకటించారు. ఆ ఆస్తి తమ స్వార్జితమని, దానిపై తమకే పూర్తి హక్కులు ఉంటాయని పేర్కొన్నారు. కానీ, ఆ తర్వాత కొంతకాలానికి కోడలు తిరిగి అత్తగారింటికి రావాలని నిర్ణయించుకుంది. కానీ, అప్పటికే ఆమె వస్తువులన్నీ ఆ ఇంట్లో నుంచి తీసివేశారు. అయినా, ఆమె ఆంట్లోకి తిరిగి వచ్చింది. ఈ చర్యను వ్యతిరేకిస్తూ అత్తమామ హైకోర్టును ఆశ్రయించారు. తమ కుమారుడినే త్యజించామని, అలాంటప్పుడు కోడలికి తమ ఇంట్లో నివసించే హక్కు లేదని వాదించారు. ఈ వాదనను ధర్మాసనం తిరస్కరించింది. కోడలిగా అత్తగారింట్లోకి అడుగు పెట్టిన తర్వాత ఆమెకు ఆ ఇంట్లో నివసించే హక్కు ఉంటుందని స్పష్టంచేసింది. అత్తమామలు తన భర్తకు హక్కులు నిరాకరించినా, ఆమె హక్కులను కాదనలేరని తేల్చి చెప్పింది. అత్తమామ ఇంట్లో మొదటి అంతస్తులో, కోడలు గ్రౌండ్‌ఫ్లోర్‌లో నివసించాలని సూచించింది. గృహహింసా చట్టంలోని సెక్షన్ 17(1) ప్రకారం కుటుంబసభ్యురాలిగా ఉన్న మహిళలకు వారి ఉమ్మడి ఇంట్లో నివసించే అధికారం, హక్కు ఉంటాయని తెలిపింది. సెక్షన్ 17(2) ప్రకారం ఆ మహిళలను ఉమ్మడి ఇంట్లో నుంచి ఖాళీ చేయించాలంటే కచ్చితంగా చట్టప్రకారమే వెళ్లాలని స్పష్టంచేసింది. కొడుకు కోడలు తమ ఉమ్మడి కుటుంబ వాతావరణాన్ని నాశనం చేశారన్న పిటిషనర్ల వాదనను తోసిపుచ్చింది. కొడుకు, కోడలు ఇంట్లో నుంచి వెళ్లిపోయినంత మాత్రాన ఉమ్మడి కుటుంబ వాతావరణం చెడిపోయినట్లు కాదని వివరణ ఇచ్చింది.

'అణు' వాణిజ్య నౌక తయారీలో భారత్ బిజీ

న్యూఢిల్లీ: వాణిజ్య నౌకల విద్యుత్ అవసరాలు తీర్చేలా 200 మెగావాట్ల అణువిద్యుత్ రియాక్టర్లను భారత్ అభివృద్ధిచేస్తోంది. చిన్న ప్రదేశంలో ఇమిడిపోయే ఈ అణు రియాక్టర్లను వాణిజ్యనౌకలో అమర్చాలని భావిస్తోంది. ''సిమెంట్ కర్మాగారాలకు విద్యుత్ అవసరాలు చాలా ఎక్కువ. సిమెంట్ ప్లాంట్ సమీపంలోనే విద్యుద్ ఉత్పత్తి కర్మాగారాన్ని నెలకొల్పి స్వీయ అవసరాల కోసం వినియోగించుకునేందుకు వీలుగా భాభా అణుపరిశోధన కేంద్రం(బార్క్) ప్రయత్నిస్తోంది. ఇందుకోసం 55 మెగావాట్లు, 200 మెగావాట్ల సామర్థ్యంతో రెండు అణువిద్యుత్ కేంద్రాలను అభివృద్ధిచేస్తోంది. ఈ తరహా వాటిని వాణిజ్య నౌకల్లోనూ ఏర్పాటుచేయవచ్చు. ఈ భారత్ స్మాల్ మాడ్యూల్ రియాక్టర్(బీఎస్ఎంఆర్)లు దేశీయ విద్యుత్‌రంగంలో అణుఇంధన వాటాను మరింత పెంచుతాయి''అని ఓ అధికారి ఆశాభావం వ్యక్తంచేశారు. ప్రస్తుతం భారత్ వద్ద కేవలం రెండు అణు జలాంతర్గాములు ఉన్నాయి. 83 మెగావాట్ల సామర్థ్యమున్న రియాక్టర్‌లతో ఐఎన్ఎస్ అరిహంత్, ఐఎన్ఎస్ అరిఘాత్ జలాంతర్గాములు సేవలందిస్తున్నాయి.

నువ్వో డ్రగ్ డీలర్

కొలంబియా దేశాధ్యక్షుడిపై ట్రంప్ అనుచిత వ్యాఖ్యలు

పామ్ బీచ్(అమెరికా): అగ్రరాజ్యాధినేతననే అహంకారంతో తనకు నచ్చని ప్రతి దేశంపై ఆంక్షలు, నిషేధాజ్ఞల కొరడా ఝుళిపిస్తున్న డొనాల్డ్ ట్రంప్ ఈసారి కొలంబియా అధ్యక్షుడు గుస్తావో పెట్రోను లక్ష్యంగా చేసుకున్నారు. కొలంబియాలో తయారైన మాదకద్రవ్యాలు అమెరికాలోకి పోటెత్తుతున్నాయని, ఇందుకు గుస్తావోనే కారణమని ఆయనపై అంతెత్తున లేచారు. ఈ మేరకు ట్రంప్ తన సొంత సామాజిక మాధ్యమం 'ట్రూత్ సోషల్'లో ఆదివారం ఒక పోస్ట్ చేశారు. ''గుస్తావో ఒక పెద్ద అక్రమ మాదకద్రవ్యాల డీలర్. పేరు ప్రఖ్యాతలు లేని, అసలు ప్రాముఖ్యతే లేని రాజకీయనేత. కొలంబియా డ్రగ్స్ దందాను వెంటనే ఆపేయాలి. లేదంటే మిమ్మల్ని బాధపెడుతూ మేమే బలవంతంగా ఆపుతాం. కొలంబియా వ్యాప్తంగా చిన్న, మధ్యతరహా పరిశ్రమ స్థాయిలో మాదకద్రవ్యాల తయారీని గుస్తావో పరోక్షంగా ప్రోత్సహిస్తున్నారు. దేశీయంగా డ్రగ్స్‌ను ఆయన అరికట్టడంలో పూర్తిగా విఫలమయ్యారు. అమెరికా నుంచి భారీస్థాయిలో నగదు సబ్సిడీలు, వెసులుబాట్లు పొందుతూ కూడా గుస్తావో డ్రగ్స్ ఉరవడికి అమెరికాలోకి రాకుండా ఆపలేకపోతున్నారు. ఇది నిజంగా అమెరికాను మోసంచేయడమే. ఇకపై కొలంబియాకు అమెరికా చేసే సాయం ఆపేస్తా''అని ట్రంప్ హెచ్చరించారు.

మహారాష్ట్రలో కోటి బోగస్ ఓట్లు

ఆరోపించిన ప్రతిపక్షాలు

- ఒకటిన నిరసన ర్యాలీ

ముంబై: మహారాష్ట్ర ఓటర్ల జాబితాలో కనీసం కోటి బోగస్ ఓట్లున్నాయని ప్రతిపక్ష పార్టీలు ఆరోపించాయి. ఈ ఓట్లను ఎన్నికల కమిషన్‌ను డిమాండ్ చేస్తూ నవంబర్ ఒకటో తేదీన ముంబైలో ఉమ్మడిగా ర్యాలీ చేపడతామని ప్రకటించాయి. ఆదివారం మహారాష్ట్ర నవనిర్మాణ్ సేన(ఎంఎన్ఎస్)నేత బాల నంద్‌గావోంకర్, శివసేన (యూబీటీ) నేత సంజయ్ రౌత్, కాంగ్రెస్ నేత సచిన్ సావంత్, ఎన్సీపీ(ఎస్పీ)నేత జయంత్ పాటిల్‌లు మీడియాకు ఈ విషయం తెలిపారు. త్వరలో గ్రామీణ, పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలను నకిలీ ఓటర్లను తొలగించాకే నిర్వహించాలని వారు ఈసీని కోరారు. అంతకుముందు, ఎంఎన్ఎస్ చీఫ్ రాజ్ ఠాక్రే కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ..స్థానిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకునే 96 లక్షల ఫేక్ ఓటర్లను జాబితాల్లో చేర్చారని ఆరోపించారు. ఒక్క ముంబైలోనే సుమారు 10 లక్షల నకిలీ ఓట్లున్నాయన్నారు. నకిలీ ఓట్లతో ఎన్నికలు జరపడం ఓటర్లను అవమానించడమేనన్నారు.

ఢిల్లీ పేరును ఇంద్రప్రస్థగా మార్చాలి: వీహెచ్‌పీ

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీ పేరును మన ప్రాచీన చరిత్ర, సంస్కృతులతో ముడిపడి ఉన్న ఇంద్రప్రస్థగా మార్చాలని విశ్వహిందూ పరిషత్(వీహెచ్‌పీ) డిమాండ్ చేసింది. వీహెచ్‌పీ విభాగం ఈ మేరకు ఢిల్లీ సాంస్కృతిక శాఖ మంత్రికి ఒక లేఖ రాసింది. ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం పేరును కూడా ఇంద్రప్రస్థ అంతర్జాతీయ విమానాశ్రయంగా, ఢిల్లీ రైల్వే స్టేషన్‌ను ఇంద్రప్రస్థ రైల్వే స్టేషన్‌గా, షాజహానాబాద్ డెవలప్‌మెంట్ బోర్డు పేరును ఇంద్రప్రస్థ డెవలప్‌మెంట్ బోర్డుగా మార్చాలని ఆ లేఖలో కోరింది.

ప్రయాణికుడి పవర్ బ్యాంకులో మంటలు ఇండిగో విమానంలో కలకలం

న్యూఢిల్లీ: ఢిల్లీ- దిమాపూర్(నాగాలాండ్) ఇండిగో విమానంలో ప్రయాణికుడి పవర్ బ్యాంకులో మంటలు రావడం తీవ్ర కలకలం రేపింది. ఢిల్లీ విమానాశ్రయంలో ఆదివారం మధ్యాహ్నం ఈ ఘటన చోటుచేసుకుంది. ప్రయాణికుడి సీటు బ్యాక్ ప్యాకెట్‌లో ఉంచిన పవర్ బ్యాంకులో మంటలు రావడం గమనించిన సిబ్బంది అప్రమత్తమై సెకన్ల వ్యవధిలోనే మంటలను ఆర్పివేశారు. ఘటన అనంతరం ట్యాక్సీయింగ్ ప్రాంతం నుంచి తిరిగి విమానం బేకు వచ్చింది. దీంతో, 12.25 గంటలకు బదులుగా విమానం 14.33 గంటలకు టేకాఫ్ తీసుకుంది. ఘటనలో ఎవరికీ ఎటువంటి ప్రమాదం, నష్టం కలగలేదని ఇండిగో తెలిపింది. రెండు రోజుల క్రితం హాంగ్‌ఝు-సియోల్ ఎయిర్ చైనా విమానంలోని ఓవర్‌హెడ్ కంపార్టుమెంట్‌లో లిథియం బ్యాటరీలో మంటలు రావడం తెల్సిందే.

అభ్యర్థులను ప్రకటించిన ఎంఐఎం

పట్నా: బిహార్ అసెంబ్లీ ఎన్నికలకు ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ సారథ్యంలోని ఏఐఎంఐఎం పార్టీ 25 మంది అభ్యర్థుల పేర్లను ప్రకటించింది. తమను కూడా భాగస్వామిగా చేర్చుకోవాలంటూ ఎంఐఎం ఇచ్చిన ఆఫర్‌పై ప్రతిపక్ష ఇండియా కూటమి నుంచి స్పందన కనిపించకపోవడంతో సొంతంగా అభ్యర్థులను బరిలోకి దించింది. తాజాగా ప్రకటించిన 25 మందిలో ఇద్దరు ముస్లిమేతరులు కూడా ఉండటం గమనార్హం. బిహార్ ఎంఐఎం చీఫ్, ఆ పార్టీ ఏకైక ఎమ్మెల్యే అఖ్తరుల్ ఇమాన్ ఆదివారం ఎక్స్‌లో అభ్యర్థుల పేర్లను వెల్లడించారు. సమాజంలోని అణగారిన వర్గాలకు తాము గొంతుకగా ఉంటామన్నారు. ఇమాన్ మరోసారి అమౌర్ నుంచే బరిలోకి దిగనున్నారు. అధికార జేడీయూ మాజీ రాజ్యసభ ఎంపీ సబిర్ అలీని ఇక్కడ పోటీకి నిలిపింది. ముస్లిం జనాభా ఎక్కువగా ఉన్న సీమాంచల్‌లోనే ఎంఐఎం అభ్యర్థులను బరిలోకి దించుతోంది. గత ఎన్నికల్లో ఈ ప్రాంతంలో 19 చోట్ల పోటీ చేసిన ఎంఐఎం ఐదింటిని గెలుచుకుంది. ఐదుగురు ఎమ్మెల్యేల్లో నలుగురు ఆ తర్వాత ఆర్జేడీలో చేరారు.

24న బిహార్‌లో ప్రధాని మోదీ ఎన్నికల ర్యాలీలు

పట్నా: బిహార్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వచ్చే వారం ప్రారంభించనున్నారు. అక్టోబర్ 24వ తేదీన సమస్తీపూర్, బెగుసరాయ్‌లలో జరిగే రెండు ర్యాలీల్లో ఆయన పాల్గొంటారని రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు దిలీప్ జైశ్వాల్ చెప్పారు. ఆయన తిరిగి 30వ తేదీన ముజఫర్‌పూర్‌తోపాటు, సరన్ జిల్లా కేంద్రం ఛాప్రాల్ జరిగే సభల్లో పర్యటిస్తారన్నారు. నవంబర్ 2, 3, 6, 7వ తేదీల్లోనూ ప్రధాని మోదీ సారథ్యంలో ర్యాలీలుంటాయని జైశ్వాల్ తెలిపారు. ప్రాంతాలను ఖరారు చేయాల్సి ఉందన్నారు. బిహార్ అసెంబ్లీకి నవంబర్ 6, 11వ తేదీల్లో రెండు విడతల్లో పోలింగ్ జరగనుండటం తెల్సిందే.

గాజాపై మళ్లీ ఇజ్రాయెల్ దాడులు

టెల్ అవీవ్: గాజాలో రెండు సంవత్సరాల వినాశకర యుద్ధం తర్వాత అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పట్టుబట్టి కుదిర్చిన కాల్పుల విరమణ ఒప్పందానికి ఇటు ఇజ్రాయెల్- అటు హమాస్ తూట్లు పొడిచే చర్యలకు పాల్పడుతున్నాయి. ఆదివారం గాజాలోని పలు ప్రాంతాల్లో దాడులు చేసినట్లు ఇజ్రాయెల్ ప్రకటించింది. వైమానిక దాడులతోపాటు భారీ ఆయుధాలతో కాల్పులు జరిపినట్లు వెల్లడించింది. గాజాలో ఇప్పటికీ ఇజ్రాయెల్ అధీనంలో ఉన్న ప్రాంతంలో విధుల్లో ఉన్న తమ సైనికులపై హమాస్ తీవ్రవాదులు కాల్పులు జరిపారని, అందుకు తాము ప్రతిస్పందించామని పేర్కొంది. వారం క్రితం కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందానికి ఈ ఘటన పరీక్షలాంటిదని తెలిపింది. అయితే, దక్షిణ గాజాలోని రఫాలో జరుగుతున్న ఘర్షణలతో ఈ ఘటనకు సంబంధం లేదని హమాస్ ప్రకటించింది. రెండోదఫా కాల్పుల విరమణ ఒప్పందానికి చర్చలు ప్రారంభమయ్యాయని వెల్లడించింది. తాజా కాల్పులపై ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ స్పందించారు. హమాస్ కవ్వింపు చర్యలకు పాల్పడితే కఠినంగా బదులివ్వాలని తన సైనిక బలగాలకు ఆదేశాలిచ్చారు. కాగా, శనివారం రాత్రి ఇద్దరు బందీల అస్తికలను ఇజ్రాయెల్‌కు హమాస్ అందించింది. 150 మంది పాలస్తీనియన్ల మృతదేహాలను హమాస్‌కు ఇజ్రాయెల్ అందించింది.

హమాస్ దాడులు.. ఉల్లంఘనే: అమెరికా

ఫ్లోరిడా: గాజాలోని పాలస్తీనియన్లపై దాడులకు హమాస్ ప్రణాళికలు వేస్తోందంటూ తమకు విశ్వసనీయ సమాచారం ఉందని అమెరికా విదేశాంగ శాఖ తెలిపింది. ఇలాంటి దాడులను కాల్పుల విరమణ ఉల్లంఘనగానే పరిగణించాల్సి ఉంటుందని పేర్కొంది. ఒక వేళ దాడి జరిగితే, అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సారథ్యంలో జరిగిన ఒప్పందాన్ని ప్రత్యక్షంగా, తీవ్రంగా ఉల్లంఘించడమేనని తెలిపింది. అలాంటప్పుడు గాజా ప్రజలను కాపాడేందుకు, శాంతి ఒప్పందం సమగ్రతను పరిరక్షించేందుకు తగు చర్యలు తీసుకోక తప్పదని హెచ్చరించింది. దాడి గురించిన వివరాలను మాత్రం విదేశాంగ శాఖ వెల్లడించలేదు. అధ్యక్షుడు ట్రంప్ సైతం తన సొంత ట్రూత్ సోషల్ మీడియాలో..'ఒప్పందానికి వ్యతిరేకంగా గాజాలోని ప్రజలను హమాస్ చంపడం కొనసాగించిన పక్షంలో వాళ్లను చంపడం మినహా మాకు మరో మార్గం లేదు. అయితే, మా బలగాలు మాత్రం అక్కడికి వెళ్లవు. అక్కడే వారికి అత్యంత సమీపంలో, దగ్గర్లోనే ఉండే వారే ఈ పనిని అత్యంత సులువుగా పూర్తి చేసేస్తారు. అది కూడా మా పర్యవేక్షణలోనే..'అని వ్యాఖ్యానించడం గమనార్హం.గాజాలోని ప్రత్యర్థి వర్గానికి చెందిన కనీసం 50 మందిని హమాస్ శ్రేణులు మట్టుబెట్టినట్లు వస్తున్న వార్తలపై ట్రంప్ ఈ మేరకు స్పందించారు.

ఐరాస సిబ్బందిని నిర్బంధించిన హౌతీలు

కైరో: యెమెన్‌లోని హౌతీ తిరుగుబాటుదార్లు రాజధాని సనాలో ఐరాసకు చెందిన 20 మంది సిబ్బందిని నిర్బంధించారు. సనాలోని హడా ప్రాంతంలో ఉన్న ఐరాస ఆఫీసుపై దాడి చేసిన హౌతీలు సిబ్బంది ఫోన్లతోపాటు అక్కడున్న కంప్యూటర్లు, సర్వర్లను వెంట తీసుకెళ్లారు. సుమారు 30 మంది సిబ్బందిని నిర్బంధించారు. వీరిలో 11 మందిని ప్రశ్నించిన మీదట వదిలేశారు. వారి వద్ద ఇంకా ఐదుగురు యెమెన్ వాసులు, 15 మంది అంతర్జాతీయ సిబ్బంది ఉన్నారని ఐరాస రెసిడెంట్ కోఆర్డినేటర్ జీన్ అలామ్ చెప్పారు. బందీలైన వారిలో ఐరాసకు చెందిన యునిసెఫ్, ఫుడ్ ప్రోగ్రాం, హ్యూమానిటేరియన్ అఫైర్స్ విభాగాల వారున్నారు. హౌతీలు తమ ఆధీనంలో ఉన్న రాజధాని సనా, తీరప్రాంత నగరం హొడైడా, సదా ప్రావిన్స్‌లలో పనిచేసే ఐరాస సిబ్బందిని గూఢచారులుగా అనుమానిస్తూ వేధింపులకు గురి చేస్తున్నారని జీన్ అలామ్ వివరించారు.

పీఎం శ్రీ పథకంలో చేరుతాం

కేరళ మంత్రి శివకుట్టి ప్రకటన

తిరువనంతపురం: కేంద్రం నుంచి తమ రాష్ట్రానికి రావాల్సిన నిధులను పొందేందుకు 'పీఎం శ్రీ'పథకంలో చేరుతామని కేరళ విద్యామంత్రి వి.శివకుట్టి ప్రకటించారు. కేంద్రం నుంచి బకాయి ఉన్న రూ.1,466 కోట్ల నిధులను పొందేందుకు ఇదొక్కటే సరైన విధానమని భావిస్తున్నామన్నారు. ఆరోగ్యం, ఉన్నతవిద్య, వ్యవసాయ రంగాల్లో కేంద్రం నిధులను పొందుతున్నప్పుడు, విద్యారంగం మాత్రం ఎందుకు వెనుకడుగు వేయాలని ప్రశ్నించారు. అయితే, రాష్ట్ర ప్రభుత్వ ప్రస్తుత విద్యావిధానం యథాప్రకారం కొనసాగుతుందని, కేంద్రం అభ్యంతరం చెప్పినా మార్చుకునేందుకు ఒప్పుకునేది లేదని మంత్రి స్పష్టం చేశారు. అయితే, 'పీఎం శ్రీ'పథకంలో చేరేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన విషయం తమకు తెలియదని అధికార ఎల్డీఎఫ్ కూటమిలోని కీలక భాగస్వామ్య పక్షం సీపీఐ తెలిపింది. ఈ విధానానికి తాము వ్యతిరేకమని స్పష్టం చేసింది. కాగా, రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని బీజేపీ స్వాగతించింది. రెండేళ్లుగా అహంకారంతో ఈ పథకంలో చేరకుండా దూరంగా ఉన్న వామపక్ష ప్రభుత్వం ఇప్పటికైనా వాస్తవం తెల్సుకుందని వ్యాఖ్యానించింది. దేశవ్యాప్తంగా ఎంపిక చేసిన స్కూళ్లను నవీకరించేందుకు, బలోపేతం చేసేందుకు కేంద్రం చేపట్టిన పథకమే పీఎం స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా(పీఎంశ్రీ).

విష్ణుకుండిన వంశ స్థాపకుడు ఎవరు?

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

తెలంగాణ హిస్టరీ



శాతవాహన అనంతర యుగం

1. కీసర సమీపంలో 'ఘటకేశ్వరం' అనే ఘటికా స్థానాన్ని నెలకొల్పిందెవరు?
   1) మాధవవర్మ
   2) ఇంద్రభట్టారకవర్మ
   3) విక్రమేంద్రవర్మ
   4) విక్రమేంద్ర భట్టారకవర్మ
2. ఇంద్రభట్టారక వర్మ తన కూతురు ఇంద్ర భట్టారికను ఎవరికిచ్చి వివాహం చేశాడు?
   1) ఈశాన్యవర్మ 2) మొదటి అరికేసరి
   3) మొదటి కీర్తివర్మ 4) శర్వవర్మ
3. గోవిందవర్మ భార్య పేరుపై నిర్మించిన మహా దేవ విహారానికి విక్రమేంద్ర భట్టారక వర్మ అగ్రహారంగా ఇచ్చిన గ్రామం ఏది?
   1) పేణ్కపర 2) ఇరుణ్డెరో
   3) రాయగిరి 4) భువనగిరి
4. 'జనాశ్రయుడు' అనే బిరుదున్న విష్ణుకుండిన రాజు ఎవరు?
   1) ఇంద్రభట్టారకవర్మ
   2) విక్రమేంద్రవర్మ
   3) రెండో గోవిందవర్మ
   4) నాలుగో మాధవవర్మ
5. పొలమూరు శాసనం వేయించింది?
   1) ఇంద్రభట్టారకవర్మ
   2) నాలుగో మాధవవర్మ
   3) రెండో గోవిందవర్మ
   4) విక్రమేంద్రవర్మ
6. నాలుగో మాధవవర్మ వేయించిన పొలమూరు శాసన కాలం?
   1) క్రీ.శ. 619 2) క్రీ.శ. 620
   3) క్రీ.శ. 621 4) క్రీ.శ. 622
7. విష్ణుకుండిన వంశ చివరి రాజు ఎవరు?
   1) మంచన భట్టారకుడు
   2) రెండో గోవిందవర్మ
   3) మూడో మాధవవర్మ
   4) ఇంద్రభట్టారక
8. నాలుగో మాధవవర్మ ఏ కాలంలో రాజ్యానికి వచ్చాడని బి.ఎస్. శాస్త్రి అభిప్రాయం?
   1) క్రీ.శ. 560 2) క్రీ.శ. 570
   3) క్రీ.శ. 563 4) క్రీ.శ. 573
9. మొదటి గోవిందవర్మ పృథ్వీమూలుడి సహాయంతో ఎవరిని తుదముట్టించాడు?
   1) శాలంకాయనులు
   2) ఆనందగోత్రికులు
   3) రెడ్డి రాజులు
   4) బాదామీ చాళుక్యులు
10. మొదటి గోవిందవర్మ భార్య మహాదేవి ఏ మతానికి చెందింది?
    1) జైనం 2) శైవం
    3) బౌద్ధం 4) వైష్ణవం
11. ఇంద్రపురిలో బౌద్ధ మహా విహారానికి మొదటి గోవిందవర్మ అగ్రహారంగా ఇచ్చిన గ్రామం ఏది?
    1) భువనగిరి 2) పేణ్కపర
    3) మోత్కూర్ 4) కొలనుపాక
12. పేణ్కపర అగ్రహారాన్ని ప్రస్తుతం ఏ పేరుతో పిలుస్తున్నారు?
    1) మోత్కూర్ 2) రాములబండ
    3) రాయగిరి 4) పనకబండ
13. పదకొండు అశ్వమేధ యాగాలు, వేయి క్రతువులను చేసినవారు?
    1) మొదటి గోవిందవర్మ 2) విక్రమేంద్రవర్మ
    3) రెండో మాధవవర్మ 4) దేవవర్మ
14. ఇంద్రపాలనగరం నుంచి అమరావతికి రాజధానిని మార్చిన విష్ణుకుండిన రాజు?
    1) మొదటి మాధవవర్మ
    2) రెండో మాధవవర్మ
    3) మొదటి గోవిందవర్మ
    4) రెండో గోవిందవర్మ
15. కీసరలోని రామలింగేశ్వరాలయం ఎవరి కాలం నాటిది?
    1) బాదామీ చాళుక్యులు
    2) రాష్ట్రకూటులు 3) విష్ణుకుండినులు
    4) వేములవాడ చాళుక్యులు
16. వాకాటక రాజ్యం ఎవరి పాలన తర్వాత విష్ణుకుండిన సామ్రాజ్యంలో చేరింది?
    1) రెండో పృథ్వీసేనుడు
    2) దామోదరసేనుడు
    3) రెండో రుద్రదేవుడు
    4) దివాకరసేనుడు
17. కీసర రామలింగేశ్వర, చెరువుగట్టు జడల రామలింగేశ్వర, ఇంద్రపాలనగర అమరేశ్వర ఆలయాలను నిర్మించింది ఎవరు?
    1) మొదటి గోవిందవర్మ
    2) మొదటి మాధవవర్మ
    3) రెండో మాధవవర్మ 4) కీర్తివర్మ
18. ఇంద్రపాలనగర తామ్రశాసనాన్ని వేయించినవారు?
    1) విక్రమేంద్రవర్మ
    2) విక్రమేంద్రభట్టారకవర్మ
    3) ఇంద్రభట్టారక వర్మ 4) మాధవర్మ
19. 'ధర్మామృతం' ఏ మతానికి సంబంధించిన కావ్యం?
    1) బౌద్ధం 2) హిందూ
    3) శైవం 4) జైనం
20. ఇక్ష్వాకులను తుదముట్టించి కృష్ణానది దక్షిణ ప్రాంతాన్ని వశపరుచుకున్నవారు?
    1) వాకాటకులు 2) విష్ణుకుండినులు
    3) పల్లవులు 4) రెండో పులోమావి
21. ఇక్ష్వాకులు, విష్ణుకుండినుల మధ్య కాలంలో తెలంగాణ ప్రాంతాన్ని పాలించిన రాజవంశం ఏది?
    1) వాకాటకులు 2) పల్లవులు
    3) బృహత్పలాయనులు
    4) ఆనందగోత్రికులు
22. వాకాటకుల రాజధాని ఏది?
    1) విదర్భ 2) పురికా
    3) విజయపురి 4) కోటిలింగాల
23. వాకాటక రాజ్య స్థాపకుడు ఎవరు?
    1) మొదటి ప్రవరసేనుడు
    2) మొదటి రుద్రసేనుడు
    3) మొదటి పృథ్వీసేనుడు 4) వింధ్యశక్తి
24. వాకాటకులు ఉత్తర భారతదేశానికి చెందిన వారని పేర్కొన్నదెవరు?
    1) వి.వి.మిరాసి 2) డాక్టర్ జైస్వాల్
    3) ఆర్.సి. మజుందార్ 4) బి.ఎస్.శాస్త్రి
25. వాకాటకులు దక్షిణ భారతదేశానికి చెందిన వారని అభిప్రాయపడినవారు?
    1) వి.వి.మిరాసి 2) జైస్వాల్
    3) ఆర్.సి. మజుందార్ 4) బి.ఎస్.శాస్త్రి
26. ప్రభావతి ఎవరి భార్య?
    1) రెండో రుద్రసేనుడు
    2) మొదటి ప్రవరసేనుడు
    3) వింధ్యశక్తి 4) రెండో చంద్రగుప్తుడు
27. శాతవాహనుల తర్వాత దక్కన్ ప్రాంతాన్ని ఐక్యం చేసి పాలించిన రాజు?
    1) వింధ్యశక్తి 2) రెండో చంద్రగుప్తుడు
    3) ఒకటో ప్రవరసేనుడు
    4) రెండో ప్రవరసేనుడు
28. వాకాటకులపై విస్తృత పరిశోధన చేసినవారు?
    1) కె.సి. చౌదరి 2) ఎ.ఎస్. అల్టేకర్
    3) ఆర్.సి. మజుందార్ 4) జైస్వాల్
29. తెలంగాణ ప్రాంతాన్ని పాలించిన ఏ రాజుల చరిత్ర మరుగునపడింది?
    1) శాతవాహనులు 2) వాకాటకులు
    3) ఇక్ష్వాకులు 4) విష్ణుకుండినులు
30. సముద్రగుప్తుడికి సమకాలీకుడైన వాకాటక రాజు ఎవరు?
    1) మొదటి పృథ్వీసేనుడు
    2) మొదటి ప్రవరసేనుడు
    3) హరిసేనుడు
    4) మొదటి రుద్రసేనుడు
31. వాకాటక మహాదేవి ఎవరి కుమార్తె?
    1) మొదటి పృథ్వీసేనుడు
    2) రెండో పృథ్వీసేనుడు
    3) రెండో రుద్రసేనుడు
    4) దామోదరుడు
32. వాకాటక మహాదేవిని వివాహమాడిన విష్ణుకుండిన రాజు?
    1) రెండో మాధవవర్మ
    2) గోవిందవర్మ
    3) విక్రమేంద్రవర్మ
    4) రెండో రుద్రసేనుడు
33. వాకాటక రాజవంశంలో పరాక్రమవంతుడిగా ప్రసిద్ధి పొందిన రాజు ఎవరు?
    1) విక్రమేంద్రవర్మ
    2) రెండో మాధవవర్మ
    3) గోవిందవర్మ 4) హరిసేనుడు
34. వాకాటకులు ఏ వర్ణానికి చెందినవారు?
    1) క్షత్రియులు 2) బ్రాహ్మణులు
    3) వైశ్యులు 4) శూద్రులు
35. 'మేఘదూతం' కావ్య రచయిత ఎవరు?
    1) రెండో ప్రవరసేనుడు 2) సర్వసేనుడు
    3) కాళిదాసు 4) సేతుబంధు
36. 'యాజ్ఞవల్క్య', 'నారదీయకాత్యాయన' అనే స్మృతులను ఎవరి కాలంలో రచించారు?
    1) విష్ణుకుండినులు 2) వాకాటకులు
    3) ఇక్ష్వాకులు 4) పల్లవులు
37. ప్రాకృతంలో 'సేతుబంధం' అనే కావ్యం రాసింది ఎవరు?
    1) కాళిదాసు 2) సర్వసేనుడు
    3) భవభూతి 4) రెండో ప్రవరసేనుడు
38. ప్రాకృత భాషలో 'హరివిజయం' అనే కావ్యాన్ని రాసినవారెవరు?
    1) కాళిదాసు 2) సేతుబంధు
    3) భవభూతి 4) సర్వసేనుడు
39. వాకాటకుల కాలం నాటి గొప్ప సాంస్కృతిక కేంద్రం ఏది?
    1) రామగిరి 2) రాంటేక్
    3) వత్సగుల్మ 4) కొండాపురం
40. అజంతా, ఎల్లోరా గుహల్లో వాకాటకుల విహార గుహలేవి?
    1) 16, 17వ గుహలు
    2) 16, 15వ గుహలు
    3) 16, 18వ గుహలు
    4) 18, 19వ గుహలు
41. సర్వసేనుడు దేన్ని రాజధానిగా చేసుకొని పాలించాడు?
    1) రాంటేక్ 2) వత్సగుల్మ
    3) రాయగిరి 4) పిల్లలమర్రి
42. విష్ణుకుండినులపై లోతైన పరిశోధన చేసిన వారెవరు?
    1) డాక్టర్ బిరుదురాజు రామరాజు
    2) రాపాక ఏకాంబరాచార్యులు
    3) పి. శ్రీరామశర్మ 4) బి.ఎస్. శాస్త్రి
43. కింది వాటిలో విష్ణుకుండినుల కాలం నాటి నాణేలు దొరికిన ప్రాంతం ఏది?
    1) కీసరగుట్ట 2) నార్కట్‌పల్లి
    3) మౌలాలి 4) ఏలేశ్వరం
44. విష్ణుకుండినులు తెలంగాణ ప్రాంతంలో రాజ్యానికి వచ్చిన కాలం?
    1) క్రీ.శ. 4వ శతాబ్దం చివర
    2) క్రీ.శ. 5వ శతాబ్దం చివర
    3) క్రీ.శ. 6వ శతాబ్దం
    4) క్రీ.శ. 3వ శతాబ్దం
45. విష్ణుకుండిన వంశ స్థాపకుడు ఎవరు?
    1) గోవిందవర్మ 2) విక్రమేంద్రవర్మ
    3) మహారాజేంద్రవర్మ
    4) మాధవవర్మ
46. విష్ణుకుండినుల తొలి రాజధాని వినుకొండ కాదని చరిత్రకారులు తేల్చారు. అయితే వారి తొలి రాజధాని ఏది?
    1) భువనగిరి 2) ఇంద్రపాలనగరం
    3) ఏలేశ్వరం 4) విజయపురి
47. విష్ణుకుండినుల తొలి రాజుల్లో అగ్రగణ్యుడు ఎవరు?
    1) మహారాజేంద్రవర్మ
    2) మొదటి మాధవవర్మ
    3) మొదటి గోవిందవర్మ
    4) రెండో మాధవవర్మ
48. మూలరాజు వంశస్థుడైన పృథ్వీమూలుడి కుమార్తె 'మహాదేవి'ని ఎవరు వివాహం చేసుకున్నారు?
    1) మహారాజేంద్రవర్మ
    2) మొదటి మాధవవర్మ
    3) రెండో మాధవవర్మ
    4) మొదటి గోవిందవర్మ
49. ఇంద్రపాలనగర తామ్రశాసనంలో 'మహాకవి'గా ఎవరిని పేర్కొన్నారు?
    1) మాధవవర్మ
    2) ఇంద్రభట్టారకవర్మ
    3) విక్రమేంద్ర భట్టారకుడు
    4) విక్రమేంద్రవర్మ
50. ఈశాన్యవర్మ చేతిలో ఓడిపోయిన విష్ణుకుండిన రాజు?
    1) విక్రమేంద్రభట్టారక
    2) ఇంద్రభట్టారక వర్మ
    3) మాధవవర్మ 4) విక్రమేంద్రవర్మ
51. విష్ణుకుండినుల అనంతరం తెలంగాణ ప్రాంతం ఎవరి పాలనలోకి వెళ్లింది?
    1) రాష్ట్రకూటులు 2) వేంగీ చాళుక్యులు
    3) బాదామీ చాళుక్యులు
    4) వేములవాడ చాళుక్యులు
52. తెలంగాణలో అతి ప్రాచీన శాసనం ఏ ప్రాంతంలో ఉందని చరిత్రకారుల అభిప్రాయం?
    1) ఏలేశ్వరం 2) ఇంద్రపురి
    3) రాయగిరి 4) భువనగిరి

సమాధానాలు

1) 2; 2) 4; 3) 2; 4) 4; 5) 2;
6) 3; 7) 1; 8) 4; 9) 1; 10) 3;
11) 2; 12) 4; 13) 3; 14) 2; 15) 3;
16) 1; 17) 3; 18) 2; 19) 4; 20) 3;
21) 1; 22) 2; 23) 4; 24) 2; 25) 1;
26) 1; 27) 3; 28) 2; 29) 2; 30) 4;
31) 2; 32) 1; 33) 4; 34) 2; 35) 3;
36) 2; 37) 4; 38) 4; 39) 3; 40) 1;
41) 2; 42) 4; 43) 1; 44) 1; 45) 3;
46) 2; 47) 3; 48) 4; 49) 4; 50) 2;
51) 3; 52) 1.

Spelling వేరైనా Pronunciation ఒకేలా!

టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

ఇంగ్లిష్ లాంగ్వేజ్

Homophones

Two or more words that have different spellings, different meanings but the same pronunciations are called 'Homophones'. (Homophones అనగా వేర్వేరు spelling, వేర్వేరు meaning ఉన్నప్పటికీ, ఒకేలా pronunciation గల పదాలు.)

i) Lead is the heaviest metal.
ii) The teacher led me to the principal's cabin.

పై రెండు వాక్యాలలోని lead, led అనే పదాలను గమనిస్తే, రెండిటినీ ఒకే రకంగా పలుకుతున్నప్పటికీ, వీటి స్పెల్లింగ్, అర్థం రెండు వేర్వేరుగా ఉన్నాయి. మొదటి వాక్యంలోని 'lead' కి 'సీసం' అనే అర్థం, రెండో వాక్యంలోని led కి 'తీసుకొనిపోవు' అనే అర్థాలు ఉన్నాయి. కాబట్టి, ఈ రెండు పదాలని Homophones అంటాం.

ఇప్పుడు ఇలాంటి కొన్ని Homophonesని తెలుసుకుందాం.

1. » Incite (verb) = kindle/ encourage (ప్రేరేపించు)
   » Insight (Noun) = intuition, awareness (అంతర్దృష్టి/ అవగాహన)
   Eg: The leader was arrested for trying to incite violence.
   Eg: Srinivas has a good insight into the syllabus of this exam.
2. » aid (Noun) = help/assistance (సహాయం)
   » Aide (Noun) = a person who helps (సహాయకుడు)
   Eg: During every Ramzan, Saber gives aid to those who are less fortunate.
   Eg: Saber worked as a tourists' aide in Mecca.
3. » Council = an assembly (సమావేశం/సభ)
   » Counsel = advice (సలహా)
   Eg: He was a member of the Legislative Council.
   Eg: He gave me a very sane counsel.
4. » Born = given birth to. (జన్మించిన)
   » Borne = carried (మోయడం, భరించడం)
   Eg: Srinivas was born on the eleventh of December.
   Eg: Rani's stomachache had to be borne until it finally went away.
5. » aisle (N) = space between rows (మధ్య దారి)
   » isle (N) = island (దీవి)
   Eg: The aisle was crowded with people looking for seats.
   Eg: The British Isles are a great place to visit.



6. » adapt (V) = to make suitable (అనుకులంగా చేయు)
   » adept (Adj) = skilled (నైపుణ్యం గల)
   » adopt (V) = accept as your own (స్వీకరించు, దత్తత తీసుకొను)
   Eg: I quickly adapted to living away from home.
   Eg: Sheela is adept at speaking languages.
   Eg: It was difficult to adopt only one puppy from the animal shelter.
7. » all ways = by every means or method (అన్ని విధాలుగా)
   » always (Adverb) = forever (ఎల్లప్పుడూ)
   Eg: Lavanya tried all ways to convince me.
   Eg: I always responded calmly during emergency situations.
8. » Cite (V) = quote (ఉదాహరణగా చూపించు)
   » Site (N) = local position (స్థలం, ప్రదేశం)
   » Sight (N) = view; scene (దృశ్యం)
   Eg: I can cite a parallel stanza.
   Eg: This is an ideal site for building a house.
   Eg: It was a horrible sight.
9. » Apposite (Adj) = proper; suitable (సరైనది)
   » Opposite (Preposition) = standing in front of (ఎదురుగా, వ్యతిరేకంగా)
   Eg: He made some very apposite observations on our system of education in his speech.
   Eg: Our school is opposite the church.
10. » Advice (Noun) = recommendation/suggestion (సలహా)
    » Advise (Verb) = to recommend/ to suggest (సలహా ఇవ్వడం)
    Eg: I need your advice on this matter.
    Eg: I advise my students to get first rank.
11. » Complement (Noun) = that which completes (పూరక)
    » Compliment (Noun) = salute; regards (అభినందన, పొగడ్త)
    Eg: This verb must take a complement after it.
    Eg: I offer my sincere compliments to you.
12. » Canvas(N) =a kind of rough cloth (ఒక రకమైన గుడ్డ)
    » Canvass(V) = to solicit votes (ప్రచారం)
    Eg: The tent is made of white canvas.
    Eg: I shall not canvass for any political party.
13. » Brake (N) = a lever; an instrument to stop a wheel (వాహనాలను ఆపునది)
    » Break (v) = to make apart (పగలగొట్టు)
    Eg: The brakes of my scooter are loose.
    Eg: Don't break the mirror.
14. » Bough(N) = a branch of a tree (చెట్టు కొమ్మ)
    » Bow (V) = bend a contrivance to shoot arrows (విల్లు)
    Eg: The monkey sits on the bough of a tree.
    Eg: He came with a bow and arrows.
15. » Duel (N) = a fight between two (ఇద్దరి మధ్య జరిగే పోరాటం)
    » Dual (Adj) = double (రెండు)
    Eg: There was a duel between the two combatants.
    Eg: This machine serves a dual purpose.
16. » Desert = a waste tract of sandy land (ఎడారి)
    » Desert = to leave (వదిలిపెట్టు)
    » Dessert = sweet served after dinner
    Eg: There is little rain in a desert.
    Eg: He deserted his family.
    Eg: There must be a course desserts after dinner.
17. » Eminent = distinguished (ప్రముఖ)
    » Imminent = impending; approaching (జరగబోవు)
    Eg: Many eminent personalities were there.
    Eg: There is imminent danger of war.
18. » Hart = a male deer
    » Heart = an organ of the body
    Eg: He has been arrested for shooting the hart.
    Eg: His heart beat is normal.
19. » Ingenious = clever (తెలివైన)
    » Ingenuous = frank and simple (దాపరికం లేని)
    Eg: He is a very ingenious teacher.
    Eg: I like her for her ingenuous nature
20. » Lightening (V) = making lighter, reducing (తేలిక చేయుట/ బరువు తక్కువ చేయు)
    » Lightning(N) = electric discharge or flash in clouds. (మెరుపు)
    Eg: He has appealed to the High Court for lightening the sentence.
    Eg: There was fierce lightning and thunder.
21. Cease = stop, discontinue, (ఆపు)
    Seize = catch; hold tightly (స్వాధీన పరుచుకొను)
    Siege = state of being surrounded (ముట్టడి)
    Eg: He ceases to be a Government counsel.
    Eg: He seized the first opportunity.
    Eg: The fort lay in siege for.
22. » ate (verb) = తినెను
    » eight (noun) = ఎనిమిది
    Eg: I ate entire biryani.
    Eg: I will wake up at eight o'clock tomorrow morning.
23. » bare (verb) = ఓర్చుకొను
    » bear (noun) = A large mammal (ఎలుగుబంటి)
    Eg: I can't bear the pain of the wound.
24. » to buy (verb) = కొనుట "to purchase."
    » by (preposition) = చేత
    » bye (exclamation) = short form of "goodbye.
    Eg: I went to a shop to buy a pair of shoes.
    Eg: The food is served by him.
    Eg: I've got to go now, so bye! See you on Sunday!
25. » stationary = standing still (స్థిరమైన/కదలిక లేని)
    » stationery = writing paper (లేఖన సామగ్రి)
26. » capital = major city (రాజధాని)
    » capitol = government building (ప్రభుత్వ భవనం)
27. » board = piece of wood (చెక్క బల్ల)
    » bored = uninterested (అనాసక్తి)
28. » coarse = rough (మోటుగా వుండే)
    » course = path (మార్గము); series of lectures (ఉపన్యాసాలు)
29. » corps = regulated group (పటాలం, దండు)
    » corpse = dead body (మృతదేహం)
30. » dairy = place where milk products are processed (పాల ఉత్పత్తి క్షేత్రం)
    » diary = personal journal (దినచర్య పుస్తకము)
31. » descent =downward movement (దిగడము)
    » dissent = disagreement (విరోధం, భిన్నాభిప్రాయము)
32. » discreet = modest, prudent
    » behavior (వివేకనగల, తెలివిగల)
    » discrete = a separate thing, distinct (విలక్షణ, ప్రత్యేక)
33. » die = to lose life; (చనిపోవడం)
    » dye = to change or add color (రంగులు అద్దడం)
34. » dyeing = changing or adding color (రంగులు అద్దడం)
    » dying = losing life (చనిపోవడం)
35. » envelop = to surround (verb) (చుట్టుట, కప్పుట)
    » envelope = container for a letter (noun) (letters పంపుటకు ఉపయోగించు కవర్)
37. » forth = forward (ముందుకు)
    » fourth = number four in a list (నాలుగవ)
38. » hoard = a hidden fund or supply, a cache (పోగుచేయు, కూడబెట్టు)
    » horde = a large group or crowd, swarm (అల్లరిమూక, గుంపు)
39. » knew = past tense of "know" (తెలుసు)
    » new = fresh, not yet old (కొత్త)
40. » know = to comprehend (తెలుసు)
    » no = negative (లేదు /కాదు)
41. » loose = unbound, not tightly fastened (వదులుగా వుండే)
    » lose = to misplace (కోల్పోవు, పోగొట్టుకొను)
42. » meat = animal flesh (జంతుమాంసం)
    » meet = to encounter (కలయిక)
    » mete = to measure; to distribute (కొలత, లేదా పంచియిచ్చు)
43. » miner = a worker in a mine (గని తవ్వేవాడు)
    » minor = underage person (noun) (18 సంవత్సరములు నిండనివాడు); less important (adj.) (అప్రధానమైన)
44. » peace = absence of war (శాంతి)
    » piece = part of a whole; (చిన్న ముక్క)
45. » peak = point, pinnacle, maximum (పర్వతశిఖరం, అత్యున్నతి, ఆధిక్యం, కొన, అగ్రం)
    » peek = to peer through or look furtively (దొంగతనముగా లేదా రహస్యంగా చూచుట)
46. » personal = intimate; owned by a person (వ్యక్తిగతమైన)
    » personnel = employees (ఉద్యోగులు)
47. » plain = simple, unadorned (స్పష్టమైన/అలంకారములేని/సాధారణమైన)
    » plane = to shave wood; aircraft (noun) (చదును/విమానం)
48. » right = correct; opposite of left (సరైన /కుడి)
    » rite = ritual or ceremony (ఆచారసంబంధమైన)
    » write = to put words on paper (రాయడం)
49. » road = way, path (దారి /మార్గం)
    » rode = past tense of "to ride" (స్వారిచేసెను)
50. » scene = place of an action; segment of a play (ఒక పని జరిగిన ప్రదేశం /నాటకంలో ఒక దృశ్యం)
    » seen = viewed; past participle of "to see" (చూసెను)

Practice Questions

1. Fill in the blanks with the correct words.You need to pay the ____ to go to the ____
   1) fare, fair 2) Fare,fear
   3) Fair, fire 4) Fair, fare
2. Please ______the newspaper over the table.
   1) Lay 2) Lie
   3) Lain 4) laid
3. Fill in the blank with a suitable word. They had dates for.____
   1) desert 2) Desart
   3) Dessert 4) Deserrt
4. Before the bell rang, the class was ____ to go home.
   1) Already 2) All ready
   3) Allredy 4) Allready
5. The student received a wonderful____ after his speech.
   1) complement 2) Compliment
   3) Compiyment
   4) Camplemant

Answers

1) 1 2) 1 3) 3 4) 2 5) 2

ముఖ్యమంత్రిగా అతి తక్కువ కాలం పనిచేసిన వారు?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ పాలిటీ



మాదిరి ప్రశ్నలు

1. జతపరచండి.
జాబితా - I
a) ముస్లింలకు ప్రత్యేక నియోజకవర్గాల కేటాయింపు
b) రాష్ట్రాల్లో ద్వంద్వ పాలన
c) పూర్తి బాధ్యతాయుత ప్రభుత్వం
d) మొదటి లా కమిషన్ ఏర్పాటు
జాబితా- II
i) భారత ప్రభుత్వ చట్టం - 1935
ii) భారత భారత కౌన్సిళ్ల చట్టం - 1909
iii) భారత ప్రభుత్వ చట్టం - 1919
iv) చార్టర్ చట్టం - 1883
ఎ) a-iv, b-ii, c-iii, d-i
బి) a-ii, b-iii, c-i, d-iv
సి) a-ii, b-iv, c-iii, d-i
డి) a-i, b-ii, c-iv, d-iii

2. కింది వాటిలో సరికానిది ఏది?
1) భారత రాజ్యాంగం 1935 చట్టం జిరాక్స్ కాపీ - కె.టి. షా
2) భారత రాజ్యాంగం ఒక అందమైన అతుకుల బొంత - మారిస్ జోన్స్
3) భారత రాజ్యాంగం ఐరావతం లాంటిది - హెచ్.వి. కామత్
4) భారత రాజ్యాంగ పరిషత్ ఒక హిందువుల సభ - చర్చిల్
ఎ) 1, 3 బి) 1, 4
సి) 1, 2, 4 డి) 2, 4

3. కింది వారిలో రాజ్యాంగ పరిషత్ చైర్మన్‌గా పనిచేసిన వారెవరు?
ఎ) జవహర్ లాల్ నెహ్రూ
బి) బి.ఆర్. అంబేడ్కర్
సి) గోపాలస్వామి అయ్యంగార్
డి) గణేశ్ వాసుదేవ మావళంకర్

4. జతపరచండి.
జాబితా - I
a) రాష్ట్రపతి ఎన్నిక విధానం
b) రాజ్యాంగ సవరణ విధానం
c) ఉమ్మడి జాబితా
d) అవశిష్ట అధికారాలు
జాబితా- II
i) కెనడా ii) ఆస్ట్రేలియా
iii) దక్షిణాఫ్రికా iv) ఐర్లాండ్
ఎ) a-iv, b-ii, c-iii, d-i
బి) a-ii, b-iii, c-i, d-iv
సి) a-iv, b-iii, c-ii, d-i
డి) a-i, b-ii, c-iv, d-iii

5. కింది వాటిలో సరైనవి ఏవి?
1) సమాఖ్య ప్రభుత్వ ప్రధాన లక్షణం - కేంద్ర, రాష్ట్రాల మధ్య అధికార విభజన
2) పార్లమెంట్ ప్రధాన లక్షణం- శాసన నిర్మాణ శాఖకు కార్య నిర్వాహక బాధ్యత వహించడం
3) పార్లమెంటరీ విధానంలో మంత్రి మండలి సమష్టి బాధ్యత, వ్యక్తిగత బాధ్యత అనే సూత్రాలతో పని చేస్తుంది
4) అధ్యక్ష తరహా ప్రభుత్వం సుస్థిర కాలం ఉంటుంది
ఎ) 1, 2 బి) 3, 4
సి) 1, 2, 3 డి) 1, 2, 3, 4

6. రాజ్యాంగ ప్రవేశికకు సంబంధించి కింది వాటిలో సరైనవి ఏవి?
1) ఇప్పటి వరకు ఒకేసారి సవరించారు
2) రాజ్యాంగానికి ఉపోద్ఘాతం
3) ప్రవేశికకు మూలం నెహ్రూ ప్రవేశపెట్టిన లక్ష్యాలు, ఆశయాల తీర్మానం
4) రాజ్యాంగ ఆశయాలు - న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం
ఎ) 1, 2 బి) 1, 4
సి) 1, 2, 4 డి) 1, 2, 3, 4

7. 'రాజ్యాంగంలో పొందుపరచిన ప్రాథమిక హక్కులను సవరించడానికి గానీ, కుదించడానికి గానీ పార్లమెంటుకు ఎలాంటి అధికారం లేదు' అని సుప్రీంకోర్టు ఏ కేసులో తీర్పు వెలువరించింది?
ఎ) గోలక్ నాథ్ Vs స్టేట్ ఆఫ్ పంజాబ్
బి) కేశవానంద భారతి Vs స్టేట్ ఆఫ్ కేరళ
సి) ఎస్.ఆర్. బొమ్మై Vs భారత ప్రభుత్వం
డి) సరళ ముద్గల్ Vs భారత ప్రభుత్వం

8. పౌరులు ప్రాథమిక హక్కులను వదులుకోవడానికి న్యాయస్థానం అనుమతించదు. ఈ ప్రక్రియను న్యాయ పరిభాషలో ఏమని పేర్కొంటారు?
ఎ) డాక్ట్రిన్ ఆఫ్ సెవరబిలిటీ
బి) డాక్ట్రిన్ ఆఫ్ వేవర్ సి) డాక్ట్రిన్ ఆఫ్ ఎక్లిప్స్
డి) డాక్ట్రిన్ ఆఫ్ పిత్ అండ్ సబ్‌స్టాన్స్

9. ప్రాథమిక విద్యను నిర్బంధ విద్యగా గుర్తించాలని సుప్రీంకోర్టు ఏ కేసులో తీర్పు వెలువరించింది?
1) ఉన్నికృష్ణన్ Vs ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
2) మోహినీ జైన్ Vs కర్ణాటక ప్రభుత్వం
ఎ) 1 మాత్రమే బి) 2 మాత్రమే
సి) 1, 2 డి) ఏదీకాదు

10. ఆదేశిక సూత్రాలకు సంబంధించి కింది వాటిలో సరైనవి ఏవి?
1) అంబేడ్కర్ ఆదేశిక సూత్రాలను 1935 చట్టం ద్వారా వెలువడిన Instruments of Instructionsతో పోల్చాడు
2) ఆదేశిక సూత్రాలను సరిగా అమలు చేస్తే భారతదేశం భూతల స్వర్గం అవుతుంది - ఎం.సి. చాగ్లా
3) ఆదేశిక సూత్రాల అమలులో ప్రభుత్వాలు వైఫల్యం చెందితే రాబోయే ఎన్నికల్లో ఓట్లు అడిగే నైతిక హక్కు కోల్పోయినట్లే - బి.ఆర్. అంబేడ్కర్
4) ఆదేశిక సూత్రాలు..ఒక బ్యాంకు తనకు అనుగుణంగా చెల్లించే చెక్కు లాంటివి - కె.టి. షా
ఎ) 1, 4 బి) 1, 3, 4
సి) 2, 3, 4 డి) 1, 2, 3, 4

11. జతపరచండి.
జాబితా - I
a) రామ రాజ్య, గ్రామ స్వరాజ్య స్థాపన
b) సంపద వికేంద్రీకరణ
c) పని హక్కు, నిరుద్యోగ భృతి
d) భారత సంస్కృతి, వారసత్వ పరిరక్షణ
జాబితా- II
i) అధికరణ - 49 ii) అధికరణ - 41
iii) అధికరణ - 39 iv) అధికరణ - 40
ఎ) a-i, b-ii, c-iii, d-iv
బి) a-iv, b-iii, c-ii, d-i
సి) a-ii, b-iv, c-iii, d-i
డి) a-i, b-ii, c-iv, d-iii

12. కింది వారిలో ఉప రాష్ట్రపతి కాకుండా రాష్ట్రపతి అయిన మొదటి వ్యక్తి ఎవరు?
ఎ) వి.వి. గిరి బి) జాకిర్ హుస్సేన్
సి) నీలం సంజీవ రెడ్డి డి) ఫకృద్దీన్ అలీ అహ్మద్

13. రాష్ట్రపతి ఎన్నికకు సంబంధించి కింది వాటిలో సరైనవి?
1) ఎన్నికల గణంలో పార్లమెంట్ సభ్యులు, విధాన సభ సభ్యులు ఉంటారు
2) ఎన్నికల గణంలో పార్లమెంట్ సభ్యులు, రాష్ట్రాల, కేంద్ర పాలిత ప్రాంతాల విధాన సభ సభ్యులు ఉంటారు
3) ఎన్నికల గణంలో ఎన్నికైన పార్లమెంట్ సభ్యులు, అన్ని రాష్ట్రాల, కేంద్ర పాలిత ప్రాంతాల విధాన సభ సభ్యులు ఉంటారు.
4) 16వ రాష్ట్రపతి ఎన్నిక రిటర్నింగ్ అధికారిగా లోక్‌సభ సెక్రటరీ జనరల్ అనూప్ మిశ్రా కొనసాగాడు
ఎ) 1, 2 బి) 3, 4
సి) 1, 3, 4 డి) 3

14. జతపరచండి.
జాబితా - I
a) లోక్‌సభ రద్దు వాయిదా
b) పార్లమెంట్ ఉమ్మడి సభల సమావేశం
c) రాష్ట్రపతి అత్యాదేశాల (ఆర్డినెన్స్) జారీ
d) రాష్ట్రపతి సుప్రీంకోర్టు సలహా కోరడం
జాబితా- II
i) అధికరణ - 85 ii) అధికరణ - 123
iii) అధికరణ - 143 iv) అధికరణ - 108
ఎ) a-i, b-ii, c-iii, d-iv
బి) a-i, b-iv, c-ii, d-iii
సి) a-ii, b-iv, c-iii, d-i
డి) a-i, b-ii, c-iv, d-iii

15. కింది వారిలో సభలో సభ్యుడు కాకపోయినప్పటికీ సభాధ్యక్షుడిగా కొనసాగేదెవరు?
ఎ) లోక్‌సభ స్పీకర్ బి) విధాన పరిషత్ చైర్మన్
సి) రాజ్యసభ డిప్యూటీ చైర్మన్
డి) రాజ్యసభ చైర్మన్

16. జతపరచండి.
జాబితా - I
a) మైనార్టీ ప్రభుత్వం
b) జాతీయ ప్రభుత్వం
c) సంకీర్ణ ప్రభుత్వం
d) అత్యధిక మెజార్టీ ప్రభుత్వం
జాబితా- II
i) జవహర్ లాల్ నెహ్రూ
ii) మొరార్జీ దేశాయ్
iii) పి.వి. నరసింహా రావు
iv) రాజీవ్ గాంధీ
ఎ) a-i, b-ii, c-iii, d-iv
బి) a-iii, b-i, c-ii, d-iv
సి) a-ii, b-iv, c-iii, d-i
డి) a-i, b-ii, c-iv, d-iii

17. మంత్రి మండలికి సంబంధించి కింది వాటిలో సరైనవి ఏవి?
1) మంత్రి మండలి సంఖ్యపై 91వ సవరణ ద్వారా పరిమితి విధించారు
2) సమష్టి నిర్ణయాన్ని వ్యతిరేకించి రాజీనామా చేసిన మొదటి మంత్రి బి.ఆర్. అంబేడ్కర్
3) మంత్రి మండలి సమష్టిగా రాష్ట్రపతికి, వ్యక్తిగతంగా పార్లమెంట్‌కు బాధ్యత వహిస్తుంది
4) రాజ్యాంగం ప్రకారం మంత్రి మండలిని ఏర్పాటు చేసేది, శాఖలు కేటాయించేది ప్రధాన మంత్రి
ఎ) 1, 4 బి) 1, 2, 3,
సి) 2, 3, 4 డి) 1, 2

18. కింది వారిలో 1947లో నెహ్రూ మంత్రివర్గంలో కాంగ్రెస్ పార్టీకి చెందని వారు?
ఎ) అంబేద్కర్ బి) శ్యామా ప్రసాద్ ముఖర్జీ
సి) షణ్ముగం శెట్టి
డి) పై వారందరూ

19. 'అటార్నీ జనరల్‌కు పార్లమెంట్‌లో సభ్యత్వం లేకపోయినా చర్చల్లో, సమావేశాల్లో పాల్గొనే అధికారం ఉంటుంది' అని తెలిపే అధికరణ ఏది?
ఎ) అధికరణ - 76 బి) అధికరణ - 88
సి) అధికరణ - 165 డి) అధికరణ - 78

20. భారత పార్లమెంట్‌కు సంబంధించి కింది వాటిలో సరైనవి ఏవి?
1) భారత పార్లమెంట్ పితామహుడిగా ఇంద్రజిత్ గుప్తాను పేర్కొంటారు
2) మొదటి మధ్యంతర ఎన్నికల ద్వారా 5వ లోక్‌సభ ఏర్పడింది
3) లోక్‌సభ 3వ స్పీకర్ - హుకుం సింగ్
4) రెండు దశాబ్దాల తర్వాత పూర్తి మెజార్టీతో నరేంద్ర మోదీ నాయకత్వంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటైంది
ఎ) 1, 4 బి) 1, 3, 4
సి) 2, 3, 4 డి) 1, 2, 3, 4

21. జతపరచండి.
జాబితా - I
a) ప్రభుత్వ ఖాతాల సంఘం
b) ప్రభుత్వ అంచనాల సంఘం
c) సభా వ్యవహారాల సంఘం
d) ఆర్జీలపై కమిటీ
జాబితా- II
i) మంత్రులకు కూడా సభ్యత్వం ఉంటుంది
ii) అతిపెద్ద పార్లమెంటరీ కమిటీ
iii) సమావేశాల అజెండా రూపకల్పన
iv) అతి ప్రాచీన పార్లమెంటరీ కమిటీ
ఎ) a-iv, b-ii, c-iii, d-i
బి) a-iv, b-iii, c-ii, d-i
సి) a-ii, b-iv, c-iii, d-i
డి) a-i, b-ii, c-iv, d-iii

22. ఆర్థిక బిల్లుకు సంబంధించి కింది వాటిలో సరైంది ఏది?
1) రాష్ట్రపతి పూర్వ సమ్మతితో లోక్‌సభలో ప్రవేశ పెట్టాలి
2) లోక్‌సభలో ఆమోదం పొందకపోతే ప్రభుత్వం కూలి పోతుంది
3) లోక్‌సభ ఆమోదం తర్వాత రాజ్యసభకు పంపితే, ఆమోదించి లేదా వ్యతిరేకించి 14 రోజుల్లోగా తిప్పి పంపాలి
4) రెండు సభల ఆమోదం తర్వాత రాష్ట్రపతి ఆమోదిస్తే శాసనం అవుతుంది
ఎ) 1, 2 బి) 3, 4
సి) 1, 2, 3 డి) 1, 2, 3, 4

23. అవిశ్వాస తీర్మానానికి సంబంధించి కింది వాటిలో సరికానిది ఏది?
1) ప్రవేశ పెట్టేందుకు లోక్‌సభలో 50 మంది సభ్యుల మద్దతు ఉండాలి
2) తీర్మానం నెగ్గేందుకు లోక్‌సభలో సాధారణ మెజార్టీ ఆమోదించాలి
3) లోక్‌సభకు హాజరై, ఓటు వేసిన సభ్యుల్లో సాధారణ మెజార్టీ ఆమోదించాలి
4) హాజరైన సభ్యుల్లో ప్రత్యేక మెజార్టీ ఆమోదించాలి
ఎ) 2, 4 బి) 1, 3
సి) 2, 3 డి) 1, 4

24. లోక్‌సభ స్పీకర్‌గా అతి తక్కువ కాలం పనిచేసిన వారెవరు?
ఎ) నీలం సంజీవ రెడ్డి బి) బలిరాం భగత్
సి) బలరాం జాకర్
డి) సర్దార్ హుకుం సింగ్

25. జతపరచండి.
జాబితా - I
a) అమరేశ్వరీ దేవి b) లీలా సేత్
c) ఫాతిమా బీవీ d) అన్నా చాందీ
జాబితా- II
i) సుప్రీంకోర్టు మొదటి మహిళా న్యాయమూర్తి
ii) హైకోర్టు మొదటి మహిళా న్యాయమూర్తి
iii) ఆంధ్ర ప్రదేశ్ హైకోర్టు మొదటి మహిళా న్యాయమూర్తి
iv) హైకోర్టు మొదటి మహిళా ప్రధాన న్యాయమూర్తి
ఎ) a-iii, b-iv, c-i, d-ii
బి) a-iv, b-iii, c-ii, d-i
సి) a-ii, b-iv, c-iii, d-i
డి) a-i, b-ii, c-iv, d-iii

26. కేంద్ర రాష్ట్రాల మధ్య వివాదాల పరిష్కారం సుప్రీంకోర్టు ఏ అధికార పరిధిలోనిది?
ఎ) ప్రారంభ అధికార పరిధి
బి) అప్పీళ్ల విచారణ పరిధి
సి) సలహాపూర్వక పరిధి
డి) పైవేవీ కాదు

27. ముఖ్యమంత్రిగా అతి తక్కువ కాలం పనిచేసిన వారెవరు?
ఎ) యడ్యూరప్ప
బి) జగదాంబిక పాల్
సి) నాదెండ్ల భాస్కర్
డి) జానకీ రామచంద్రన్

28. రాజ్యసభలో అన్ని రాష్ట్రాలకు సమానంగా సీట్లు కేటాయించాలని సిఫారసు చేసిన కమిటీ?
ఎ) సర్కారియా కమిటీ
బి)రాజమన్నార్ కమిటీ
సి) సంతానం కమిటీ
డి) పైవేవీ కావు

29. ప్రణాళికలు, సాంఘిక సంక్షేమం ఏ జాబితాలోకి వస్తాయి?
ఎ) కేంద్ర జాబితా
బి) రాష్ట్ర జాబితా
సి) ఉమ్మడి జాబితా
డి) అవశిష్ట అంశాలు

30. కేంద్ర రాష్ట్రాల మధ్య వివాదాల పరిష్కారం కోసం సూచనలు చేయడానికి ప్రత్యేకంగా నియమించిన తొలి కమిటీ ఏది?
ఎ) పరిపాలన సంస్కరణల సంఘం
బి) రాజమన్నార్ కమిటీ
సి) రంజిత్ సింగ్ సర్కారియా కమిటీ
డి) ఎం.ఎం. పూంఛీ కమిటీ

31. భారతీయ జనతా పార్టీని ఎప్పుడు స్థాపించారు?
ఎ) 1951 బి) 1976
సి) 1980 డి) 1984

సమాధానాలు

1) బి	2) డి	3) డి	4) సి	5) డి
6) డి	7) ఎ	8) బి	9) సి	10) డి
11) బి	12) డి	13) బి	14) బి	15) డి
16) బి	17) డి	18) డి	19) బి	20) డి
21) ఎ	22) సి	23) ఎ	24) బి	25) ఎ
26) ఎ	27) బి	28) బి	29) సి	30) సి
31) సి				

MODEL QUESTIONS

How many floors are there between..



BANK EXAMS

REASONING

Directions (Q.No. 1-5): Study the information and answer the given questions:

There are eight persons A,B,C,D,E, F, G and H seated in a circle all facing away from the centre but not necessarily in the same order. F is third to the left of D. G is immediate neighbour of D. A is second to the right of B. C is immediate neighbour of neither A nor B. There are three persons between E and G. E is immediate neighbour of B. F is not the neighbour of B.

1. Who is second to the left of B?
1) F 2) E 3) C
4) D 5) None of these

2. Who is between E and H?
1) F 2) B 3) C
4) D 5) None of these

3. If F and G interchange their positions, then who will be second to the right of E?
1) F 2) G 3) C
4) D 5) None of these

4. In which of the following pairs is the second person to the immediate left of first person?
1) CF 2) EG 3) BA
4) GD 5) None of these

5. How many persons are seated between F and H?
1) Three 2) Two 3) One
4) None 5) None of these

Directions (Q.No.6 -10): In these questions, the relationship between different elements is shown in the statements.

Give answer
1) If only conclusion I follows.
2) If only conclusion II follows
3) If either conclusion I or II follows.
4) If neither conclusion nor II follows.
5) If both conclusion I and II follow.

6. Statements: $D < M > P, B \le D, Q \le P$
Conclusion: I. $Q < B$
II. $Q = B$

7. Statements: $K > L \ge P \le S, Q < P, L < O$
Conclusion: I. $O > K$ II. $L > Q$

8. Statements: $X=P \ge C < Z, B > X$
Conclusion: I. $B > C$ II. $B < Z$

9. Statements: $Q > Y \ge D, P = Q, P \le C$
Conclusion: I. $C > D$ II. $D < Q$

10. Statements: $M \le L < D, M \ge N, P = N$
Conclusion:I. $M \ge P$
II. $N < D$

Directions(Q.No. 11-16): Read the questions carefully and answer them.

There are eight persons M, N, O, P, Q, R, S and T stay in a same building that has eight floors numbered one to eight (the ground floor is numbered 1, the floor above it is numbered 2 , and so on, and the top most floor is numbered 8). But these people do not necessarily stay in the same order given. Each one has a different occupation - Doctor, Professor, School Teacher, Musician, Business Person, Bank Manager, Accountant and Engineer, again not in the same order. Each one plays a different game - hockey, volleyball, basketball, badminton, chess, cricket, football and tennis.

There are two floors between the floors of R and Q. R does not play volleyball and does not live on even numbered floor.

There is one floor between the floor of Accountant and the one who plays football.

Accountant plays badminton and lives on even numbered floor, but not on the top floor.

Professor plays basketball and lives on third floor.

R is not professor. S does not play either football or basketball. S does not live on a floor immediately above or immediately below the floor on which P lives. P is not bank manager and he does not play tennis, volleyball or hockey

M, a school teacher, lives just above the floor of business person and just below the floor in which accountant lives. T, a musician, who plays chess, lives on the floor above the R's floor but not on the Top floor. There is only one floor above the floor in which Engineer lives. Business person plays cricket and lives on fourth floor. M does not play volleyball or hockey. O is not an Engineer and neither plays badminton nor plays football.

11. Which of the following games School Teacher plays?
1) Volleyball 2) Tennis 3) Hockey
4) Football 5) None of these

12. On which of the following floors does S live?
1) 1.8th 2) 3rd 3) 6th
4) 5th 5) None of these

13. Which of the following games Engineer plays?
1) Volleyball 2) Tennis 3) Hocke
4) Football 5) None of these

14. Who among the following lives on the topmost floor, i.e floor number 8?
1) N 2) P 3) S
4) O 5) None of these

15. How many floors are there between the floors on which P & O live?
1) One 2) Two 3) Three
4) Four 5) None of these

16. Who among the following is Bank Manager?
1) N 2) P 3) R
4) O 5) None of these

Directions (Q.No. 17-22): Study the information and answer the given questions:

There are ten persons A, B, C, D, E, F, G, H, I and J seated in a line all facing north direction, but not necessarily in the same order.

J is fourth from the right end . B is third to the left of D who is second to the left of J. There are two persons between E and G. There is only one between F and D.

There are two persons between A and C. G and E are not the neighbours of I. C is not the neighbour of J. B is not seated next to G. H is eighth from the left end.

17. Who is seated between G and A?
1) None 2) D 3) H
4) G 5) J

18. What is C's position with respect to D?
1) Second to the left
2) Fourth to the right
3) Fourth to the left
4) Third to the left 5) Fifh to the left

19. Four of the following five are alike in a certain way based on their seating position in the line and so form a group. Which is the one that does not belong to the group?
1) BE 2) HC 3) JA
4) DG 5) AI

20. Who is fourth to the right to the one who is immediate left of B?
1) None 2) D 3) A
4) G 5) J

21. Who is as away from A as A is placed from I?
1) J 2) D 3) G
4) F 5) B

22. Which of the following pair sits at the extreme corners of the row?
1) D, E 2) E, A 3) A, C
4) E, I 5) None of these

Directions (Q.No. 23-27): Read the information carefully and answer the following questions.

Seven members D, G, A, E, C, F and B represent different places viz, Hyderabad, Guntur, Kurnool, Visakhapatnam, Suryapet, Vijayawada and Siddipet; each one competing for a different sport, viz. Volleyball, Archery, Rifle Shooting, Tennis, Boxing, Basketball and Football. The order of persons, places and games is not necessarily the same.

D represents Guntur for Archery.

G represents Hyderabad but not for Volleyball or Rifle Shooting.

E represents Vijayawada for Basketball.

A competes for Volleyball but not from Kurnool.

F competes for Rifle Shooting.

The one who represents Siddipet competes for Boxing. The one who represents Suryapet competes for Tennis. C does not represent Kurnool or Siddipet.

23. Which of the following combinations is correct?
1) B-Boxing-Visakhapatnam
2) F-Tennis-Suryapet
3) A-Tennis-Visakhapatnam
4) C-Tennis-Suryapet
5) None of these

24. Which of the following combination is correct?
1) A - Suryapet 2) F-Visakhapatnam
3) C- Kurnool 4) B-Siddipet
5) None of these


25. 'A' represents which place?
1) Visakhapatnam
2) Suryapet 3) Siddipet
4) Kurnool 5) None of these

26. The one who competes for Rifle Shooting, represents which place?
1) Visakhapatnam
2) Kurnool 3) Siddipet
4) Hyderabad 5) None of these

27. For which game does G compete?
1) Boxing 2) Football
3) Tennis
4) Cannot be determined
5) None of these

Key with Solutions

(1 - 5):



1) 4; 2) 2; 3)2;
4) 1; 5) 1;

(6-10):

6) 4; $B \le D < M > P \ge Q$
B and Q cannot be compared. Hence, neither I nor II follows.

7) 2; $K > L < O$. Hence, K and O cannot be compared.
$L \ge P > Q \Rightarrow L > Q$. Hence, Conclusion II is true.

8) 1; $B > X = P \ge C < Z$
Hence, $B > C$. So, conclusion I is true. B and Z cannot be compared. So, conclusion II is not true.

9) 5; $C \ge P = Q > Y \ge D$
Hence, $C > D$. Conclusion I is true.
Hence, $Q > D$. Conclusion II is also true.

10) 5; $M \ge N = P$. Hence, conclusion I is true.
$D > L \ge M \ge N$. Hence, conclusion II is also true.

(11-16):

Floor	Person	Profession	Game
8	P	Doctor	Football
7	N	Engineer	Volleyball
6	S	Accountant	Badminton
5	M	Teacher	Tennis
4	Q	Business person	Cricket
3	O	Professor	Basketball
2	T	Musician	Chess
1	R	Bank manager	Hockey

11) 2; 12) 3; 13) 1;
14) 2; 15) 4; 16) 3;

(17 -22):

E B F G D A J H C I

17) 2; 18) 2; 19) 5;
20) 2; 21) 5; 22) 4;

(23 - 27):

Person	Place	Game
A	Visakhapatnam	Volleyball X Kurnool
B	Siddipet	Boxing
C	Suryapet	Tennis X Kurnool/Siddi
D	Guntur	Archery
E	Vijayawada	Basketball
F	Kurnool	Rifle
G	Hyderabad	Football X VB/Rifle

23) 4; 24) 4; 25) 1;
26) 2; 27) 2.